UNIVERSAL
LIBRARY
OU_204423
UNIVERSAL
LIBRARY

OUP—552—7-7-66—10,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T 85 Accession No. T 4218

Author V 855 సంజీవరాలరంగారావు.

Title శ్రీ వివేకానందస్వామి.

This book should be returned on or before the date last marked below.

సందేశతరంగిణి

(శ్రీ వివేకానందస్వామి కొలంబో-ఆల్మోరా ఉపన్యాసములు)

మొదటి భాగము

కీ॥ శే॥ శ్రీ తత్త్వానందస్వాములవారిచే
అనువాదితము.

శ్రీ రామకృష్ణ మఠము
మైలాపూరు : : చెన్నపురి - 4
1955

చెన్నపురి శ్రీరామకృష్ణ మఠాధ్యక్షునిచే ప్రకటింపబడినది.

సర్వస్వామ్య సంకలితము

ద్వితీయ ముద్రణము

XXII—4—1955

వెల: రూ. 3-0 0

The Jupiter Press, Ltd., Madras-18.

ప్ర కా శ క వి జ్ఞ ప్తి

శ్రీమద్వివేకానందస్వాములవారు 1893-వ సంవత్సరమున అమెరికాలో జరిగిన ప్రపంచమతమహాసభలో వేదాంతోపన్యాసములొసగి అసదృశదిగ్విజయము నొంది, పాశ్చాత్యఖండములను హైందవమతప్రచారముచే ఊట్లూత లూగించిన పిదప భారతదేశమునకు తిరిగి వచ్చి, ప్రప్రథముగా భారతసోదరులంగూర్చి యొసగిన సందేశామృతసాగరమునందలి ఉత్తుంగతరంగరాశియే యీ యుపన్యాస సంపుటము.

స్వస్వరూపజ్ఞానములేక నిద్రాణమైయున్న భారతజాతిని తట్టి మేల్కొల్పుటకై ఆసేతుహిమాచలము ముక్తకంఠముతో జాగ్రద్గీతముల నాలపించిన నవ్యవైతాళికుడు శ్రీ స్వామివారు. మహనీయమగు ప్రాచీన హైందవతత్త్వవైభవమును ప్రదర్శించి భారతీయులకు ఆత్మవిశ్వాసమును, నూతనోజ్జీవమును గలిగించిన దివ్యవాణి యీ గ్రంథము.

ఈ యుపన్యాసములందు నిర్భరమగు ఆవేదన, ఉత్సాహము, ఆత్మవిశ్వాసము, దేశభక్తి, ఉద్వేగము, శక్తి కొన్పించును. ఈ యుగములో భారతీయులకు నవచైతన్యము కలిగించిన మహాగ్రంథములలో ఇది యొక్కటి అనుటకు సందియము లేదు.

శ్రీ తత్త్వానందస్వాములవారు అనువదించిన ఈ యుపన్యాసముల సంపుటమును శ్రీరామకృష్ణదేవుని శతవార్షిక స్మారకచిహ్నముగా 1936 లో మేము ప్రకటించితిమి. కారణాంతరములవలన పునర్ముద్రణము మిక్కిలి ఆలస్యమైనది. మరల ఇంతకాలమునకు ఈ పరిష్కృతరూపమున దీనిని ప్రకటించు నవకాశము మాకు కలిగినందులకు మేము సంతసించుచున్నాము.

ప్రస్తుతము కావలికళాశాలలో ఆంధ్రభాషోపన్యాసకులుగా పని చేయుచున్న శ్రీ శ్రీరాం వేంకట భుజంగరాయ శర్మగారు ఎమ్. ఏ., యీ గ్రంథమును పరిష్కరించుటలో మాకు యథాశక్తి తోడ్పడిరి. వారికి మా కృతజ్ఞతాపూర్వకవందనములు.

ఆంధ్రపాఠకలోకము దీనిని సమాదరించు నని మేము విశ్వసించు చున్నాము.

శ్రీరామకృష్ణమఠము,
మదరాసు - 4
25-4-'55

ప్రకాశకులు.



సందేశతరంగిణి

ప్రాచ్యభూమియందు శ్రీ వివేకానందస్వాములవారొసగిన ప్రప్రథమోపన్యాసము

(కొలంబో నగరము)

పాశ్చాత్యఖండములందు మతప్రచారముచేసి విఖ్యాతి గడించినపిమ్మట శ్రీ వివేకానందస్వాములవారు 1897-వ సంవత్సరము జాన్యువరి 15 తేది మధ్యాహ్నవేళ కొలంబో నగరమున ఓడదిగిరి. అప్పుడు ఆ నగరమందలి హిందువులు శ్రీవారికి ఘనమగు స్వాగత మిచ్చిరి. ఆసందర్భమున ఈక్రింది స్వాగతపత్రము శ్రీవారి కర్పింపబడినది.

శ్రీమత్ వివేకానందస్వాములవారికి—

పూజ్యులగు నోస్వామీ!

ఈ కొలంబోనగరమందలి హిందువులు బహిరంగ సభలో చేసిన తీర్మానము ననుసరించి మీకు హృదయ పూర్వకముగా ఈ ద్వీపమున స్వాగత మొసంగుచున్నారము. పాశ్చాత్యదేశములందు మహాప్రచారము కావించి స్వదేశ మునకు తిరిగివచ్చు సమయమున మీకు స్వాగతమర్పించు టలో ప్రథముల మగుట మాకు గొప్పగౌరవముగా భావించు చున్నారము.

మీరు కావించిన ప్రచారము ఈశ్వరానుగ్రహము వలన ఎటుల విజయవంత మయ్యెనో మేము ఆనందము తోడను కృతజ్ఞతతోడను కనుపెట్టి చూచుచుంటిమి సమస్త మత సంప్రదాయములకును సామరస్యమున కూర్చుచు, ప్రతిజీవికిని వానియవసరములనుబట్టి ఆధ్యాత్మికాహారమును పెట్టుచు, వాత్సల్యపూర్వకముగ భగవంతుని దాపునకు నడపునట్టి హిందూవిశ్వమతాదర్శమును యూరపు అమెరికాఖండ జాతుల వారికి ప్రకటించి తెలిపితిరి. అతిపురాతనకాలమునుండి ఋషిపరంపరలు వారి పావన పదస్పర్శచే భారతభూమిని పవిత్రము గావించి యుండిరి. వారు తమదర్శనము చేతను. ప్రబోధము చేతను సమస్త అవస్థాంతరములందును భారతభూమిని లోకమునకు జ్ఞానదాయినిగ నొనర్చియుండిరి. ఆ మహనీయుల చేత నుపదేశింపబడిన సత్యధర్మమును మోక్షమార్గమును మీరలు ప్రచారముగావించితిరి.

శ్రీ శ్రీ శ్రీ రామకృష్ణపరమహంసదేవునివంటి సద్గురుని దివ్యాదేశము మూలముననను, మీనిర్హేతుకజాయమానకటాక్షమువలననను, పాశ్చాత్య జాతులు భారతదేశపు ఆధ్యాత్మిక ప్రతిభతోడి అనుసంధానము పడయునట్టి అమూల్య వరప్రసాదమునకు పాత్రులు కాగలిగిరి. మన దేశీయులలో పాశ్చాత్యనాగరికతయొక్క వ్యామోహమునంబడి తెప్పిరిలిన అనేకులు మన ప్రాచీన సంప్రదాయముల మహిమను గ్రహింపగల్గిరి.

మహనీయమగు మీకృషివలనను, మీ ధర్మ కర్తృత్వమువలనను, మానవజాతిని తీరకానీరీతిని కృతజ్ఞతా బద్ధుల గావించితిరి. మన మాతృభూమిని అపూర్వ తేజో విరాజమానముగా నొనర్చితిరి. భగవదనుగ్రహము వలన మీరు ఇటులనే శ్రేయస్సుల పడయుచు, మీపూనిన మహోద్యమమును కొనసాగింపగల్గుచుండు గాకయని ప్రార్థించు చున్నారము.

ఇట్లు మీ కృపాపాత్రమగు హిందూసంఘమునకు
పి. కుమారస్వామి,
సింహళ శాసనసభా సభ్యుడు, సమాజాధ్యక్షుడు,
ఏ. కులవీరసింహము,
కార్యదర్శి.

కొలంబో
ఫాల్గుణ 1897

శ్రీస్వాములవారు తమకర్పించిన యీస్వాగతమును గూర్చి తమ సంతసమును వెలిబుచ్చుచు, సంగ్రహముగ ప్రత్యుత్తర మొసగిరి. నాటియుత్సాహమంతయు ఒక రాజకీయపరిజ్ఞానమునుగాని, ఒక మహారణవీరుని గాని, ఒక కోటీశ్వరునిగాని, కీర్తించుటకుగాక, బిచ్చమెత్తుకొను ఒక సన్న్యాసిని గౌరవించుటకై నది కావున, అది హిందువుల మనస్సు నందు మతమునెడ ఎట్టి ఆదరణ గలదో తెలుపుచుండెనని చాటుటకు శ్రీవారు ఆ అవకాశమును వినియోగించుకొనిరి. హిందూజాతి సజీవమై నిలిచియుండ గోరునేని, ఆజాతియొక్క జీవనమునకు మతము బ్రహ్మదండమై నిలుచు మెంతయు అగత్యమని నొక్కి చెప్పిరి. తాము అందుకొనిన స్వాగత మునకు వ్యక్తిత్వేన తమకర్హత యేమియు లేదనియు,

అద్దానిని ఒక సంప్రదాయమునెడ మన్ననచూపుటగ ఎంచ వలయుననియు పలికిరి.

16-వ తేదీ సాయంత్రము, ఫ్లోరల్ హాలులో (శ్రీ) స్వాముల వారిక్రిందిరీతిని ఉపన్యసించిరి :—

నేను చేసిన యీ అల్పకార్యము నాలో స్వతస్సిద్ధ ముగనున్న శక్తివలన జరిగినదికాదు. ఈ నాప్రియతమమును పరమపవిత్రమును అగు మాతృభూమినుండి వెడలి పాశ్చాత్యదేశములందు నన్ను సదా అనుగమించుచు వచ్చిన ప్రోత్సాహమును, అభిమానమును, ఆశీస్సులును, కారణముగా జరిగినదే! ఈ పర్యటనవలన కొంత మంచి పనియే జరిగినది, నిజమే. కాని, దానివలన నాకే ముఖ్య ముగా ఉపకారము జరిగినదని చెప్పవలయును. ఏలయనగా ఇదివఱకు బహుశః నాకు నైజమగు చిత్తోద్రేకమువలన కలిగిన అభిమానము ఇప్పుడు నిశ్చితాభిప్రాయముయొక్క స్థిరత్వమును, ప్రత్యక్షానుభవమువలని పటుత్వమును, బల మును పడసినది.

గౌరవనీయుడగు ఈ అధ్యక్షుడు తెలిపినటులే—ప్రతి హైందవుడును తలంచుతీరున నే—ఈ దేశము కర్మక్షేత్రమును, పుణ్యభూమియు నని పూర్వమునుండి నేనును తలంచుచుంటిని. ఈ నాడు ఇచ్చట నిలిచి ఆమాట యెంతయు సత్యమేయని యథార్థమగు నిశ్చితాభిప్రాయముతోచాటుచున్నాను. ధన్య పుణ్యభూమియని పిలువబడుటకు అర్హతగల దేశమేదైన

భూలోకమున గలదేని, కర్మపరిపాకముం గూర్చుకొనుటకై సకలజీవులును చేరవలసిన స్థలమేదైన భూతలమునగలదేని, భగవత్సాన్నిధ్యమును పొందుటకై యాత్రలుసాగించుచు, ఆ పరమపదమును బొందుసమయమున, ప్రతిజీవాత్మయు విధిగా చేరవలసిన తావు పుడమిని ఎచ్చటనైన యుండునేని, మానవ సంఘము సాధుశీలమును ఔదార్యమును పవిత్రతను శాంతి జీవనమును అలవఱచుకొనుటలో పరమోన్నత పథమును అందికొనజాలెడి దివ్యక్షేత్ర మెచ్చటనైన కలదేని, అది మన భారతదేశమే! అంతేకాదు. అన్నిటికంటెను దివ్య దృష్టిని ఆధ్యాత్మసిద్ధిని ప్రసాదించు పుణ్యతీర్థము ఈ భారత దేశమే అనక తప్పదు. ఇట అత్యంతపురాణకాలమునుండి మహామతకర్తలు బయలుదేఱి యున్నారు. పెక్కుతడవలు వారీ భూలోకమునెల్ల వినిర్మలములును శాశ్వతములు నగు ఆధ్యాత్మిక ధర్మప్రవాహజలములతోనింపి పవిత్రీభూతము చేసియున్నారు. తూర్పు పడమర ఉత్తరము దక్షిణము నలుదిశలసంతట పుడమిని ముంచివేసిన వేదాంతసాగర తరంగరాశి ఈ దేశమునుండియే వెలువడినది. భౌతికమును అనిశ్వరమును అగు నేటి ప్రాపంచికనాగరికతను మరల ఈశ్వరోన్ముఖము గావింపనున్న ఆధ్యాత్మిక మహాప్రవాహము ఇక్కడనుండియే ఉద్భవము కావలసియున్నది! ఇతర దేశములంపు వేలకొలది మానవహృదయములను కాల్చి నాశనము చేయుచున్న నాస్తికవాద భీకరజ్వాలలను చల్లార్ప వలసిన జీవజలనిధి ఇచ్చోటనే కలదు. మిత్రులారా! నామాట నమ్ముడు. ఇది జరిగితీరును.

ఇదంతయు నేను స్పష్టముగ గ్రహించియున్నాను. మీలో వివిధజాతిచరిత్రల పఠించిన వారుకూడ ఈ విషయము గ్రహించియే యుందురు. ఈ ఉపకారమున్నచో లోకము మనమాతృభూమికి మిక్కిలిగ ఋణపడి యున్నది. వేఱువేఱుగ ఒక్కొక్క దేశమును తీసికొని విచారించునెడల లోకము ఈ హిందవునెడల ఋణపడి యున్నంతగా మఱేజాతికిని ఋణపడి యుండలేదు. హిందవునిలోని యీ మెత్తదనము అతని అప్రయోజకత్వముగా కొన్నిసమయములందు హేళనచేయబడుటయు కలదు. కాని యెందేని హేళనయందును మహాద్భుతసత్యము గర్భితమై యుండునేని అది దేవుని ముద్దులబిడ్డడగు ఈ తనిని 'అప్రయోజకహిందువు' అనుటయందే యున్నది. ప్రపంచమందలి యితరభాగములందును నాగరికతలు వెలసినవి. ప్రాచీనకాలమందేకాక, ఆధునికకాలమందు సైతము, శక్తిమంతములగు గొప్పగొప్ప జాతులయందు మహోన్నత భావములు వెలువడియున్నవి. నాడును నేడును కూడ అద్భుతభావరాశి ఒక జాతినుండి మఱొకజాతికి ప్రసరించియే యున్నది. పురాతనకాలములందును, ఈ దినములందును కూడ పరదేశములపైకి దాడులు వెడలు బలవంతములగు జాతులు మహోధర్మములయొక్కయు దివ్యమహిమల యొక్కయు అంకురములను దూరప్రదేశములందు నాటుచు వచ్చినమాటసత్యమే. కాని ప్రియమిత్రులారా! నాపలుకులు గుర్తుపెట్టుకొనుడు. ఆ ప్రచారము సర్వమును రణభేరుల ఘోషతోడను, యుద్ధభటవ్యూహముల అట్టహాసముల

తోడను సాగినది. ఒక్కొక్క ధర్మభావము నెత్తుటి వెల్లువలలో మునిగి తేలుచు వెడలినది. ప్రతిదివ్య సంకల్పమును లక్షలకొలది సోదరుల రక్తప్రవాహముల మీద తేలియాడుచు నడచినది. ప్రతి మహావాక్కును వెంబడించి కోట్లకొలంది ప్రజల ఆర్తనాదములును, పసిబిడ్డల ఏడ్పులును, వితంతువుల కన్నీటివెల్లువలను చెలరేగవలసి వచ్చెను. దాదాపుగా ఇతరజాతుల ధర్మప్రచారమంతయు ఇట్లేయున్నది. కాని భారతభూమియే యుగయుగములనుండి శాంతిమయ జీవనమును సాగించుచున్నది. గ్రీకు దేశము తల యెత్తకపూర్వమే, రోమునగరము ఊహాక్షేత్రమున పొడ సూపకమునుపే, నేటియూరపుజాతుల పూర్వపురుషులు ఒడలెల్ల పచ్చల పొడిపించుకొని అడవుల తిరుగాడుచుండిన కాలమునసే, ఈ భారతదేశమునుండి ధర్మప్రచారములు సాగినవి. అంతకు పూర్వమునుండి—అనగా చారిత్రక గ్రంథ యోచనయే లేనికాలమునుండి — దుర్జేయ ప్రాచీనాంధ కారములలోనికి పురాణగాథలు తొంగిచూడ సాహసింపజాలని కాలమునుండి—నేటివఱకును, దివ్యభావపరంపర లెన్నియో ఈ దేశమునుండి ప్రచారమై వెడలియున్నవి. కాని ఆ ప్రతి పలుకునకును ముందు శాంతియు, వెనుక దీవనయు, సహ చరులుగా ప్రవర్తిల్లినవి. ప్రపంచమందలి అన్నిజాతుల లోను, మనము మాత్రమే ఎన్నడును పదులమీదికి దాడి వెడలి యెఱుగము! అట్టి మహాభాగ్యము తాల్చుటం జేసియే మనము సజీవులమైయున్నాము.

గ్రీసుదేశపు పటాలములదాడివలన పుడమి వడక పోయిన కాలముకలదు. ఆ పురాతనగ్రీకుల సామ్రాజ్యము— అట్టివీరభూమి—నేడు నామరూపములులేకుండ తుడిచిపెట్టు కొని పోయినది. తుదకు—దానింగూర్చి చెప్పుకొనుటకు నేటికొక పిట్టకథకూడ మిగులలేదు. లోకమున కొంచెము పచ్చపచ్చగనున్న ప్రాంతముపై నెల్ల రోమనుపతాకము ఎగిరిన కాలముకలదు. చతుస్సముద్రపర్యంతము వారు తమ కబంధహస్తములు చాచిరి. వారి అధికారదుర్మదాంధత మానవజాతిశిరముపై తాండవమాడినది. రోమునామము వినినమాత్రాన పుడమి గజగజలాడినది. కాని ఇప్పుడో! ఒకప్పుడు రాజప్రాసాదములతో కళకళలాడిన క్యాపిటోలీన్ పర్వతమిప్పుడు జాడయెఱుంగరాక పాడుపడియున్నది. వారి సీజరుబిరుదాంకితి ప్రభువులు రాజ్యమేలినచోటుల సాధా పురుగులు బూజుపెట్టి గూడులల్లుచున్నవి. ఇటులనే, తళుక్కు మనిమెఱసి చనిన ఇతరవిఖ్యాతజాతులును కొన్ని కలవు. కాని, ఏదోకొన్నాళ్ళపాటు విజయగర్వముతో ఒడలు తెలియక మిడిసిపడి నీటిపైని చెఱలాడు చిన్నిఅలలతీరున అవి యన్నియు మటుమాయమై పోయినవి. ఆ జాతులీ రీతిగ నర లోకమున తమజాడలను మాత్రము చూచాయగా నిలుపు కొని చనినవి. కాని మనమో, సజీవులమైయున్నాము. మనువు మఱల ఈనాడు దిగివచ్చెనేని ఆతడు వెఱగుపడి క్రొత్త ప్రదేశమునకు వచ్చినటుల ఎంచబోడు. వేలకొలంది సంవత్సరములు జిజ్ఞాసచేసి కూర్చిన ఆ శాసనములే ఈ నాడును ఉన్నవి. తరతరములనుండి ఆచారముగ వచ్చిన

వివేక ఫలములుగా, అనేకశతాబ్దముల అనుభవసారమును తమలో జీర్ణించుకొని, నిత్యములై సనాతనములై చూపట్టు ఆ సిద్ధాంతములే నేటికిని గోచరించును. దినములుగడచిన కొలదిని ప్రతిబంధములు దెబ్బమీదదెబ్బ తీసినకొలదిని అన్నియు ఒకే ఉద్దేశ్యమును నెరవేర్చినటుల, అనగా ఆ ఆచారమర్యాదలనే పటుతరములుగను సుస్థిరములుగను బనర్చినటుల తోచుచున్నది. దీనికంతకును కేంద్రమేదియో, సమస్తరక్తనాళములకును మూలమా హృదయమేదియో, మనజాతీయజీవితమునకు మూలకందమేదియో, కనుగొనుట ఈ దేశమునకే సాధ్యమగునని స్వానుభవముచేత చెప్పుచున్నాను; నామాటనమ్ముడు.

ప్రపంచమున ఇతరజాతులవారికి మతము అనేక జీవనవ్యావృత్తులలో ఒకానొకటిగా నున్నది. వారికి రాజకీయములున్నవి. సాంఘికసౌభాగ్యములున్నవి. ఐశ్వర్యము సమకూర్చి పెట్టగలిగినవన్నియు నున్నవి. అధికారముచే సాధించుకొనగలవి కూడ అన్నియు నున్నవి. ఇక ఇంద్రియభోగములకు కొదువలేదు. ఈ వివిధజీవనవ్యావృత్తులలోలతచే చొక్కిన తమ ఇంద్రియములకు ఇంకను కొంత ఉద్రేకము గొలుపజాలున దేదేని కలదాయనుదేవులాటల నుధ్య బహుశః మతము అనునదియు ఒకస్వల్పాంశమై యుండి నోపును. కాని ఇక్కడ హిందూదేశమున నన్నినో మతము విశిష్టమగు ఏకైకపురుషార్థమై పఱగుచున్నది. చైనా జపాను యుద్ధము సంభవిల్లినదని మీలో ఎవరైన ఎఱుంగుదురా? ఎఱిగినవారున్నను ఏకొలదిమందియో యుందురు.

పాశ్చాత్యఖండములందు సంఘమును పరివర్తనము గావింప జూచు భయంకర రాజకీయప్రచారములును సాంఘికోద్యమములును పెక్కులు కలవు. అవి మీలో ఎంతమందికి తెలియును? 'బహు కొలది'మందికే తెలిసియుండును. అయినను అమెరికాలో సర్వమతపరిషత్తు ఒకటి జరిగెనయి, అక్కడికి ఒక హిందూసన్న్యాసిని పంపిరనియు ఇచ్చటి కూలివానికి సయితము తెలిసిపోవుట గాంచి నేను వింతపడితిని. మన సహజవాసనలు ఎటుల నడచునో మన జాతీయ జీవనగతి ఎటులున్నదో ఇందువలన గుర్తింపవచ్చును. ప్రాచ్యఖండ వాసుల అజ్ఞానమును గూర్చి జాలిచెందు లోకసంచారులు— అందును ముఖ్యముగా విదేశీయులు— వ్రాసిన పుస్తకములను నేను చదువుచుండెడివాడను. ఒకదృష్టితో చూచిన వారి వ్రాతలు కొంతవఱకు సత్యములేయైనను వేరొక దృష్టితో తిలకించిన అవి వట్టి అసత్యములని నాకు తోచినది. ఇంగ్లాండులోగాని, అమెరికాలోగాని, ఫ్రాన్స్‌లోగాని, జర్మనీలోగాని మామూలుగా తెలుసు పిలిచి 'నీవు ఏపార్టీవాడవు?' అని అడిగినతోడనే తనది రాడికల్ పార్టీ అనియో లేక కన్సర్వేటివ్ పార్టీ అనియో తెలిపి తాను ఆ పార్టీవారికే 'ఓటు' నిచ్చెదననియు చెప్పివేయును. అమెరికాలోనిగా తాను రిపబ్లికన్ పార్టీ, డెమోక్రాటిక్ పార్టీలలో దేనికి చెందినది వక్కాణించును. వెండివ్యాపారపుసమస్య మొదలైన వానిని గురించికూడ కొంత వివరించి చెప్పగలుగును. కాని వాని మతమేదో అడిగిచూడుము. తాను చర్చికి పోవుదుననియు, ఏదోసంప్రదాయమునకు చెందినవాడననియు మాత్రము

చెప్పను. వానికి తెలిసినదంతయు అంతే. అంతేచాలునని ఆతడు తలంచును.

ఇక మనరైతును పిలిచి "నీకు రాజకీయము లేమైన తెలియునా?" అని అడుగుము. అతడు "రాజకీయములా? అవేమిటిబాబూ" అని తిరిగి మనలనే అడుగును. వానికి సామ్యవాదమేమిటో తెలియదు. పెట్టుబడికిని పరిశ్రమకును గల సంబంధము తెలియదు. అతడు అట్టివంటి విషయములను గురించి తనజన్మలో ఎన్నడు వినియుండడు. అతడు పొట్ట కూటికై చెమటోడ్చి కష్టించుటమాత్రమె మెఱుగును. అయినను 'నీమతమే'మని వానినడుగుము. అతడు "బాబూ, ఇదిగో ఇటు చూడు; దానిని నా ముఖముమీదనే ముద్రవేసియుంచినాను" అని చూపును. మతవిషయమున గురించి ఆతడు ఒకటి రెండు ధర్మవాక్కులనుకూడ చెప్పగలడు. ఇది నా అనుభవవిషయము. మనజాతీయ జీవనము ఆ తీరున నడచుచున్నది. మనకు కర్మసిద్ధాంతముపై గాఢమగు విశ్వాసము కలదు. మానసుల చిత్తవృత్తులను పరికింపుడు. ఎవనితీరు వానిది. అట్లే ఎవని ఆత్మపరిణతిమార్గము వానిది. అనంతమగు పూర్వజన్మపరంపర నలనను పురాకృతకర్మవిశేషము నలనను మానవుని ప్రస్తుతజీవితవైఖరి నిర్ణయింపబడియుండును. ప్రతివాడును తన పురాభవఫలమును తలదాల్చి ఈ లోకములోనికి వచ్చుచుననియు, అనంతములగు తన పూర్వజన్మలు ఇప్పటిజన్మకు మూలమనియు, ఈ జన్మను తాను వినియోగించుకొను విధము ననుసరించియే రాబోవుజన్మ నిర్ణయింపబడుననియు ప్రతిహిందువు తలంచును. ఈ రీతిగా

ఈ ప్రపంచమున పుట్టిడి ప్రతిమానవుడును నిర్వహింపవలసిన ధర్మమును, జీవితమున అనుసరింపవలసిన నిర్ణీత మార్గమును ఉండును. ఈ సూత్రము వ్యక్తులవిషయమున ఎటులసత్యమో జాతివిషయమునను అంతే. ప్రతిజాతికిని ఒక విభిన్నజీవన వైఖరి. ఒక ప్రత్యేకజీవనోపపత్తి, ప్రపంచజీవనమున అది నిర్వహింపవలసిన ఒక విశిష్టకర్తవ్యము కలదు. ప్రతిజాతియు దాని జీవనఫలితార్థమును అనుభవించును. అది తన నిర్ణీత కర్మను నిర్వహించితీరవలెను. రాజకీయోద్ధతిగాని సైనిక బలోన్నతిగాని సాధించుట మన జాతికి నైజధర్మముకాదు. ఎన్నడును అది అట్లుండి యెఱుగదు. నామాటను మనస్సున పెట్టుకొనుము, అట్టిది మనకెన్నడును నైజము కాబోదు. ఏనను వేఱొకకర్తవ్యము మనపాలిట నున్నది. మనలోని ఆధ్యాత్మికశక్తి నంతను చక్కగా సంఘటితపఱచి సంరక్షించి, పోషించి, భారతజాతిని ఒక ఆధ్యాత్మికమహాశక్తిస్వరూపముగ తీర్చి దిద్దవలసియున్నది. ఇట్టి దుర్వారమహాశక్తి, పరిస్థితులు అనుకూలముగా నున్నప్పుడెల్ల ప్రపంచమును ముంచెత్తివేయవలయును. పరిషియనులలో, గ్రీకులలో, రోమనులలో, అరబ్బులలో, ఆంగ్లులలో, ఎవరైనసరే, తమ సేనలతో దాడివెడలి ప్రపంచమును జయించి వివిధజాతులను ఏకము చేయుచుండగాక, హైందవుల వేదాంతము, ఆధ్యాత్మిక విద్య, అప్పుడు నూతనావకాశమును పురస్కరించుకొని ప్రపంచజాతుల రక్తనాళములలోనికి ప్రవేశించును. సమష్టిమానవజాతి అభ్యున్నతికై భారతీయుని శాంతిమయ ధీశక్తి తనవంతు తాను సమర్పణము చేయవలసి యున్నది.

హిందూదేశము ప్రపంచమునకు ఒసగనున్న కానుక ఈ ఆధ్యాత్మిక తేజమే!

ఈతీరున పూర్వము ఒక్కొకజాతి మహోద్ధతముగా విజృంభించి ప్రపంచమందలి వివిధజాతులను ఏకముచేయుచు వచ్చెను. సహజముగా ఏకాంతవాసము నిచ్చగించు భారత దేశమునకు ఆయాసందర్భములందెల్ల, ఇతర జాతులతోడి సంసర్గము కలిగెను. అయినను ఈ భారతిజాతి మరల ఇతర ప్రపంచజాతులనుండి విడివడి ఏకాంతములోనికి పోవుచుండుటే పెక్కుమాఱులు జరిగినది. కాని భారతీయులకు ఇతర జాతులతోడి సంసర్గము కల్గినప్పుడుమాత్రము తత్ఫలితాగ్ధముగ భారతీయుల ఆధ్యాత్మికధర్మప్రవాహములు ప్రపంచమంతటను వ్యాపించుచు వచ్చినవి. వేదములకు పురాతనమగు పారశీకభాషానువాద మొకటి కలదు. అది అంత నిర్దుష్టమైనది కాదు. దానినే మరల నొక పరాసు యువకుడు లాటినుభాషలోనికి అనువదించినాడు. జర్మనీదేశపు మహాతత్త్వవేత్తలలో నొకడగు 'స్కొపెన్హాడు' దానిని ఈ శతాబ్దారంభకాలమున (అనగా క్రీస్తుశకము 1800 సం॥ ప్రాంతమున) చదివి "ఉపనిషత్తుల అధ్యయనమువంటి ఉదాత్తవిద్య, ఆత్మవికాసమునుకలిగించు వ్యావృత్తి ఈలోకమున మఱియొకటిలేదు. అది నాజీవితమున చిత్తశాంతిని ప్రసాదించినది. నామరణకాలమునందును అయ్యది నిరవధికమగు శాంతినే ప్రసాదింపగలదు" అని నుడివెను. అంతే కాదు. "పూర్వపు గ్రీకుల విజ్ఞానపునరుద్ధరణమహోద్యమమునకన్న శతాధికముగ విశాలమై శక్తిమంతమై మానవుని

మానసికవ్యాపారమును పూర్తిగా మార్చివైచు అత్యద్భుత పరిణామములను ప్రపంచము చూడనున్నది" అని ఆ జర్మను తత్త్వవేత్త జోస్యముకూడ చెప్పియున్నాడు. ఈనాడు వాని జోస్యము ఫలించుచున్నది. నెమ్మదినెమ్మదిగ నిరంతరము వ్యాప్తినొందుచున్న హైందవతత్త్వము వలన, ప్రపంచము యొక్క జీవకళయందును, గమనమునందును, ఆచారములందును, సారస్వతమునందును ఎంతటి మహాపరివర్తనము జరుగుచున్నదో, యోచనాపరులైన ప్రపంచచారిత్ర పరిశీలకులకును, కండ్లు తెఱచి ఆయా పాశ్చాత్యజాతులవారి మనస్సులలో జరుగు సంచలనమును పరికించువారికిని, తెలియవచ్చును. నే నిదివఱకే సూచించినటుల ఇంకొక విశేషముకూడ గలదు. మనమెన్నడును అగ్నిని ప్రయోగించియు, ఖడ్గమును ఝళిపించియు, ధర్మప్రచారము చేసియుండలేదు. భారతదేశము ప్రపంచమునకు ఒసగిన ఈ వరప్రసాదమును వర్ణించుటకు ఆంగ్లభాషలో ఏదేని శబ్దము ఉన్నయెడల, భారతవాఙ్మయము మానవజాతియందు కల్పించిన పరివర్తనమును తెలుపుటకు ఆంగ్లభాషలో అనువగు పదము కలదేని, అది 'ఫాసినేషన్' (సమ్మోహనము) అనునదే. దీని అర్థము ఆకస్మికముగా నిపైని ఏదేని వచ్చిపడి భ్రాంతుని చేయుట అనికాదు. నీకు తెలియరాకుండ మెల్లమెల్లగా నిన్ను ఆకర్షించివేయుట అనిదాని కర్థము. చాలమందికి మొట్ట మొదట భారతీయుల భావములన్నను, భారతీయుల మర్యాదలన్నను, భారతీయుల ఆచారములన్నను, భారతీయుల వేదాంతమన్నను, భారతీయుల వాఙ్మయమన్నను, వెగటు

గనేయుండును. కాని వారు ఓపికపట్టి మన గ్రంథములను చదువవలయును, మనభావములకు మూలాధారములగు మహాసూత్రముల పరిచయము చేసికొనవలెను; అప్పుడు నూటికి తొంబదితొమ్మిదిమందిమీద ఈ సమ్మోహనము చక్కగ పారును. ఇంక ఫలితార్థమో. సారవశ్యమే. వేగు జామున కంటికి కానరాకుండ చెవికి వినరాకుండ నర్షించి. తెల్లవారునరికి మెలమెల్లగా గోదసినెల్ల ఆవరించు కోమల తుషారమునలె, పరమశాంతిమును, నిరాడంబరమును, సహనశీలమును, అధ్యాత్మపరాయణమును అగు భారతజాతి ప్రపంచప్రజల మనోలోకముపై తన ప్రభావమును ప్రసరింపజేసినది.

చరిత్రయంను లోగడజరిగినదే మరలమరల జరుగనున్నది. ఈనాటి ఆధునికశాస్త్రములవలన గాఢములును, సుస్థిరములును అనుకొనిన పురాతనవిశ్వాసములు పూర్తిగ హతమై పోవుచున్నవి. మానవజాతియంతయు లొంగి మన్ననచేసితీరవలయునని ఆశించిన సాంప్రదాయక గౌరవాధిక్యములు నలినలిగా చితుకకొట్టబడి గాలిలో కానరాకుండ ఎగిరిపోవుచున్నవి. ఈనాటి ప్రాచీనవస్తుపరిశోధన లనెడు పెద్దసమ్మెటపోటులకు తాళజాలక పురాతనాచార విశ్వాసములు గాజుముక్కలవలె పొడిపొడియైపోవుచున్నవి. మతము పాశ్చాత్యదేశములందు పామరులచేతులలో చిక్కుకొని పోయినది. పండితులు మతసంబంధమగు ప్రతిదానిని చీదరించుకొనుచున్నారు. ఇట్టిపట్టున భారతీయుల వేదాంతము నందలి ఆధ్యాత్మికమహాశయములు భారతహృదయము

ముందునకు సాగివచ్చుచున్నవి. అత్యున్నత వేదాంతధర్మములు సామాన్య భారతప్రజలకు నిత్యానుష్ఠానమర్యాదలు. ఈసర్వమును ఒకే పదార్థమనెడు అద్వైతమార్గము, వేదాంతముబోధించు నిర్గుణత్వభావము, నరుని ఆత్మ అనశ్వరమనెడుఅద్భుతసిద్ధాంతము, జీవయాత్ర తెగిపోక సర్వకాలము సాగివచ్చు మహాప్రస్థానమనెడు తలంపు, ఈజగము అనంతమను విశ్వాసము, నేటి ప్రపంచమును గొప్ప ఆపదనుండి రక్షింపబూనినవి. ఈ ప్రపంచము ఒక మురికికూపమనియు, కాలమనునదే నిన్ననో మొన్ననో ప్రారంభమైనదనియు ప్రాచీన విదేశసంప్రదాయులు భావనచేసిరి. మన గ్రంథములలో—అసలు మన గ్రంథములలోమాత్రమే—అసంతమై పరగు దేశ, కాల, నిమిత్త భావనకాన్పించుచున్నది. మన గ్రంథములలోమాత్రమే నరునిఆత్మయొక్క అఖండవిభూతి మతాన్వేషణకెల్ల పరమగమ్యమని ప్రకటితమగుచున్నది. ఆధునికకాలమున—పరిణామసిద్ధాంతము, అత్యుశక్తిసిద్ధాంతము మున్నగునవి బయలుదేఱి, నానావిధతుచ్ఛదేవతారాధనలను రూపుమాపుచున్న ఈ సమయమున—నరుని ఆత్మాన్వేషణఫలమును, భగవంతుని అద్భుతవాణియునగు వేదాంతము బోధించు ఉదాత్తమహితములును, ఉదార పావనములును అగు దివ్యభావములుగాక మఱెయ్యది ప్రాజ్ఞులకు సంసేవ్యమై నిలువగలదు?

ఇక్కడ నేనొక విషయమును వివరించి చెప్పవలసియున్నది. అన్యజాతుల పరివర్తనమునకు హేతుభూతమగు 'మన మతము' అనినప్పుడు, మన హైందవమతమునకు

పునాదులగు మూలసిద్ధాంతములనియే నా అభిప్రాయము. అనేకశతాబ్దములుగా, సంఘానసరములను పురస్కరించుకొని ఈ మతమునందు నచ్చి చేరిన ఆచారములకును, ఇతర స్వల్పవిషయములకును, మతముయొక్క మూలసూత్రములతోపాటు అర్హస్థానమిచ్చి గౌరవింపజాలము. అది న్యాయ్యమేగదా! మన గ్రంథములందు రెండువిధములగు ధర్మములు ప్రతిపాదింపబడియున్నవి. వాని విభేదమునుకూడ స్పష్టీకరింపబడియున్నది. అందొక విధమగునవి సనాతనములు; అవి నదుని గుణముల ననుసరించియు, ఆత్మలక్షణముల ననుసరించియు, జీవపరమాత్మల సంబంధము ననుసరించియు, భగవంతుని లక్షణముల ననుసరించియు, జీవుని పరమగమ్యము ననుసరించియు నిర్మింపబడినవి. సృష్టిక్రమము, సృష్టియొక్క ఆద్యంతరహితత్వము (అనగా శూన్యమునుండి ఈ ప్రపంచము సృజింపబడలేదనియు, నిరాకారనిర్గుణ బ్రహ్మమునుండి ఆవిష్కరింపబడినదనియు చెప్పెడుసిద్ధాంతము) మున్నగునవి ఈ మొదటిరకపు ధర్మములలో చేరును. ఇవి ప్రకృతిలోని సనాతనధర్మములపైని ఆధారపడి నిర్మింపబడిన శాశ్వతసూత్రములు. ఇక రెండవ వర్గమునకు చెందినవి అనుదిన జీవయాత్రను గూర్చిన సాధారణసూత్రములు. అవి పురాణములకు. స్మృతులకు సంబంధించినవికావు. వీనికి మొదటిరకపు సిద్ధాంతములతో సంబంధము లేదు. మన జ్ఞానోదయంబుకూడ ఇవి ఆయాకాలములందు మారుచు వచ్చినవి. ఒక యుగపుటాచారములు మఱొక యుగమునందు లేవు. యుగములు గతించుచున్నకొలది. అవి ఇంకను

మారుచుండును. మహాఋషులు పుట్టి క్రొత్త పరిస్థితులకు అనుకూలములగు ఆచారమర్యాదలు నెలకొల్పి మనలను నడుపుచుందురు.

జీవుడు, బ్రహ్మము, జగత్తు: వీనినిగూర్చి అద్భుతములును, అనంతములును, ఉదాత్తములును, ఉదారములునగు ధర్మసూత్రములను ఈ పవిత్రభారతదేశము రచించినది. "నా దేవుడు సత్యము; నీ దేవుడు వట్టిబూటకము. కాదందువా, రమ్ము, నీవాలుచేయుచున్నాను. కత్తిదూసి నిలబడుము. నీవో నేనో ఒక్కరే మిగులవలెను" అనుచు ఆయూకుల దేవతలపైని దురభిమానము పూని దెబ్బలాటలకు దిగుట హిందూదేశమున లేదు. ఏకచ్ఛత్ర దేవతలకై తగవులాడ వలయునను ఉద్రేకము ప్రబలినది ఈ ఒక్కదేశమునందే. మానవుని పరాప్రకృతిమీద ఆధారపడి రూపొందిన ఈ మహాధర్మసిద్ధాంతములు, విశ్వమానవశ్రేయమునకు వెయ్యేండ్లైనా డెబ్భై ఉపయోగపడెనో, నేడును అట్లే ఉపయోగపడుచున్నవి. నేడేకాదు, ఈ పుడమి నిలుచునంత కాలమును అవి అటులనే యుండగలవు. కర్మసిద్ధాంతము పాటింపబడునంతకాలము, మనము వ్యష్టిజీవులమై పుట్టుచు స్వశక్తిపైని ఆధారపడి మన తరణోపాయమును మనము చూచుకొనుచుండునంత కాలము, అవి చెక్కుచెదరక అటులనే నిలిచియుండును.

అన్నిటిని మించి భారతదేశము లోకమునకు ముఖ్యముగా ప్రసాదింపవలసినది ఇది: ఆయాజాతుల మతముల

యొక్క ఉత్పత్తి వృద్ధిపరిణామములను కనుపెట్టి నూచిన యెడల, ప్రతిశాఖకును మొట్టమొదట ఒక్కొక్క దేవత యుండునని తెలియవచ్చును. అంతశాఖలు ఒకదానితో నొకటి మైత్రినెఱపునెడల, ఈ దేవతలందఱును ఒక్క సామాన్య జాతీయ నామముతో వ్యవహరింపబడుదురు. ఉదాహరణగ బాబిలోనియనుల దేవతల పేరులను చూడుడు. బాబిలోనియను చాతివారు వేర్వేఱు ఉపజాతులుగ అనగా వేర్వేఱు శాఖలుగా విడివడియున్నను, వారి దేవతలకు "బాల్" అను సామాన్యజాతీయనామము వాడబడుచుండెడిది. యూదియా జాతిలోని ఉపజాతులవారి దేవతలకును "మోలోక్" అను సామాన్యనామముండెడిది. ఇట్లుండ ఆ ఉపజాతులలో ఏదోఒకటి తక్కినవానిపై ఆధిపత్యమును సాధించి, తమ రాజే అందఱికిని రారాజని చాటును. అంతట సహజముగా తమ దేవుడే తక్కిన ఉపజాతుల దేవుడనియు వాదనచేయును. 'బాల్—మెరోడాక్' అత్యధిక సుహృన్మోస్నతుడనియు, తక్కినదేవతలందఱును వానికంటె తక్కువ వారనియు బాబిలోనియనులలో ఒకశాఖవారు చెప్పుదురు. అన్ని "మోలోకు"లలోను 'మోలోక్ యూవా' అత్యధికుడని యూదులలో ఒకతెగవారు వాదింతురు. ఈవివాదములను యుద్ధముచేసి తేల్చుకొందురు. ఇట్టి తగవులు పూర్వమిచ్చటను ఉండెడివే. ఇచ్చటకూడ దేవతలు పోటీపడి, ఆధిక్యతకొఱకు పోరాటములు సాగించియుండిరి. కాని ఈ దేశపు అదృష్టమువలనను, ప్రపంచపు అదృష్టమువలనను, ఈ రణగుణధ్వనినుండియే—ఈ గందరగోళమునుండియే—

''ఏకం సత్ విప్రా బహుధావదన్తి'' (ఉండునది ఒక్కడే, వానిని ప్రాజ్ఞులు అనేక నామములతో పిలుతురు) అను దివ్యవాణి వెలువడినది. 'శివుడు విష్ణునికంటె ఘనుడు'అనుట గాదు; 'విష్ణువే మహా ఘనుడు, శివుడు కొఱగానివాడు'అనుటయు కాదు. ఉన్నది ఒక్కడే దేవుడు. వానిని శివుడనుడు, విష్ణుడనుడు, లేక లక్ష పేరులు పెట్టి పిలుచుకొనుడు. పేరులు భిన్నములుగ నుండుగాక, ఉన్నది ఒక్కదేవుడే. భారతదేశ చరిత్రయొక్క పర్యవసానమంతయు ఈ రెండుముక్కలలో ఇమిడియున్నది. చరిత్రయంతయు ఈ ఒక్క ప్రధానసూత్రమునే, అద్భుతశక్తితో—గంభీరభాషతో—కథనముచేయుచున్నది. దేశమంతటను ఈకథనము సాగినది. ఫలితార్థమేమి? ఈభానము భారతీయులరక్తనాళములలో ప్రవహించు ప్రతి నెత్తుటిబొట్టునందును నిండినది; వారి ప్రతి రక్తకణమునందును జీర్ణించిపోయినది; వారిజీవితములో కలిసిపోయినది; వారి స్వరూపోపాధియందేకమై యిమిడిపోయినది. అందువలన, ఈదేశము సహనమునకు పెట్టినపేరై వివిధమతములను వివిధజాతులను ఆహ్వానించి, కౌగిట గదించి తన హృదయమునకు హత్తుకొనినది.

ఒకదానికొకటి కేవలము భిన్నముగ గోచరించు అనేకజాతులు, అనేక మతములు, పరస్పరసౌహార్దముతో భారతదేశమున కలిసిమెలిసి జీవింపగల్గుట ఎట్లు సాధ్యమయ్యెనో ఇందువలన తెలియగలదు. 'నీవు ద్వైతివి కావచ్చును; నేను అద్వైతిని కావచ్చును; నీవు దేవుని నిత్యసేవకుడవని విశ్వసింపవచ్చును, నేను భగవంతునితో

అభిన్నుడనని వాకొనవచ్చును. అయినను ఇరువురము ఉత్తమ హిందువులమే.' ఇదెట్లు సాధ్యము? ''ఏకంసత్ - విప్రా బహుధావదన్తి'' (ఉండు దైవము ఒక్కడే. వానిని ఋషులు బహునామములతో పేరొక్కింపరు) అను వేదవాక్యమును పఠించిన తెలియును. భారతీయసోదరులారా? అన్నిటి కన్న ముఖ్యముగ ఈ దివ్యభావమునే మనము లోకమునకు ఉపదేశింప వలసియున్నది. ఇతర దేశములలో మహావిద్యాధికులు సైతము ముఖములు చిట్లించుకొని మనమతము వట్టి ''బొమ్మలకొలువు'' అని వెక్కసముగా మాటాడుచుందురు. నేనది కాంచియున్నాను. కాని శమ తలలలో ఎంతటి మూఢభావము పేరుకొనియున్నదో వారు తెలిసికొనుటే లేదు. ప్రతిదానును ఇట్లే యున్నది: స్వమతదురభిమానము! క్షుద్రసంకుచితభావన!! కటా! తనకుగల ఐహికభాగ్యమే, జన్మమెత్తినంతలకు మానవుడు సాధింపదగిన యోగ్యవస్తువట! డబ్బును దుడ్డును పూజించు అతని వ్యర్థజీవనమే ఉత్తమ జీవనమట! వానికున్న సంపదయే గడింపదగిన సంపదయట! ఇంక నేదైనను కొఱగానిదే! అత డేదేని ఒక పిచ్చి మట్టి బొమ్మనుచేసెనా, లేక ఒకయంత్రమును నిర్మించెనా, మహోత్తమ సంపదలను మించి అదియే మిగుల గణనీయమగుచున్నది!! ఎంత చదువున్నను, ఎంతవిద్య యున్నను, ప్రపంచమంతటను ఇదేస్థితి కాన్పించుచున్నది. కాని సత్యమగు విద్య యింకను తలసూపలేదు; నాగరికతయందుమా, సత్యమగు నాగరికత ఇంకను ప్రారంభము కావలసియేయున్నది. మానవజాతిలో వేయింటికి తొమ్మిదివందల తొంబదితొమ్మిది

మంది. యీనాటికిని పశువులుగనే యున్నారు. ధర్మములను ఎసము పుస్తకములందు చదువవచ్చును. సహనమునుగూర్చి మతబోధలందు వినియుండవచ్చును. కాని లోకమునందు ఈ ధర్మముగాని సహనముగాని తరచుగా కానవచ్చుటలేదు. ఈ విషయములో నా అనుభవము చెప్పుచున్నాను మొదటికి తొందరపడిపోయి దానిని తలపెట్టనైన తలపెట్టరు. నేను వెళ్ళినచ్చిన ప్రతిదేశమునందును, మతమునపేరి ఇంకను ఘోరహింసలు జరుగుచునే యున్నవి. క్రొత్తవిషయముల నేర్చుకొనుటకు, పురాతనపు తొత్తులనాటి ఆక్షేపణలనే ఇప్పటికిని వాడు వాడుచున్నారు. అన్యమత ములయెడ సహనము. పారలౌకిక చింతనమున్నపై ఆసక్తి అంతో యింతో ఈ ప్రపంచములోనికెల్ల సుఖ ఆర్యభూమి యందే కనుపట్టును. ఇంకెక్కడను లేదు. ఎహూమ్మదీయుల కొఱకును, క్రైస్తవుల కొఱకును హైందవులు ప్రార్థనాలయములు కట్టుట ఇక్కడనే: మతెచ్చటను కానరాదు. మీరు ఇతర దేశములకు పోయి, మహమ్మదీయులను గాని, మరే యితరమతస్థులను గాని మీకొరకై దేవాలయమును కట్టి పెట్టుడని కోరిచూడుడు. సాయముచేయుట అటుంచి వారు మీకున్న దేవళములతో సహా మిమ్ము నైతము త్రుంగి వేయజూతురు. కాబట్టి హిందూదేశము వలన ప్రపంచము నేడు నేర్చుకొనవలసిన గొప్ప గుణపాఠము కేవలము సహన భావమే కాదు, సానుభూతికూడ. మహమ్మస్తోత్రములోని ఈ భావమును గమనింపుడు. అయా పర్వతములనుండి బయలు దేఱి నదులన్నియు తిన్నగనో వంకరగనో పోయి పోయి

తుదకు సముద్రమునకే కలియు రీతి, శంభో! తమ తమ సంస్కారముల ననుసరించి నరులు అవలంబించు సాధనలు భిన్నభిన్నములుగా కాన్పించినను, వక్రముగనో నిర్వక్రముగనో సాగి సాగి, తుదకు నిన్నే ప్రాపించును. వేర్వేఱు త్రోవల నడచినను, అందఱును నిమార్గమునకే చనున్నారు. కొందఱు కొంచెము చుట్టు తిరిగిపోవుదురు. మఱికొందఱు సూటిగా పరువెత్తుదురు. కాని తుదకు ఎల్లరును ఒక్క సదాశివుని దాపునకే చేరుదురు. ఆ దేవదేవుని నీవు లింగము నందు దర్శించుటకేగాక, సర్వత్ర చూడజాలినప్పుడే—అప్పుడు మాత్రమే—ని ఈశ్వరభక్తి ధన్యము కాగలదు! శ్రీహరిని ఎల్లతావులందు ఎల్లరియందును చూడజాలిన వాడే హరిభక్తుడు! అతడే విజయము ముష్!! నీవు సత్యముగ శివభక్తుడ వైనయెడల, ప్రతిదానియందును. ప్రతివాని యందును. నీకు శివుడు ప్రత్యక్షమై గోచరింపవలయును. నామములు రూపములు ఎట్టివైనను సరియే. సమస్తపూజలును శివునికే చెల్లునని నీవు గ్రహింపవలయును. 'కాబా' నైపు తిరిగి చేయు నమాజులును క్రైస్తవచర్చిలోని మోకరింపులును. బౌద్ధాలయమందలి ప్రణతులును. శివుని గురించియే. వారికి ఆ మాట తెలియనచ్చును, తెలియకపోవచ్చును; వారి కా భావము ఉండవచ్చును, ఉండకపోవచ్చును. ఏ రూపము పెట్టి, ఏ నామము చెప్పి, అర్పణ చేసినను ఆ పువ్వులన్నియు ఈశ్వరుని పాదములకు అంకితమైనవే. ఏలయందువా? ఆయనయే సర్వేశ్వరుడు, ఆయనయే పరమాత్మ. నీకంటెను నాకంటెను బాగుగ

ఈలోకమునకు ఏది అవసరమో ఆయన ఎఱుంగును. భిన్నత్వమెల్ల అంతరించిపోవుట అసంభవము. అది ఉండియే తీరవలెను. నానాత్వములేనిది అసలు ప్రపంచమే లేదు. ఈసంఘర్షణమే, ఈభిన్నభిన్న భావనయే, సమగ్ర విజ్ఞానమునకును, సమస్త సంచలనమునకును, సర్వ శ్రేయమునకును దారి జూపుచున్నది. పరస్పర విరుద్ధములగు భిన్నభావనలు ఉండియే తీరవలెను. కాని భిన్నత్వమున్నంత మాత్రాన మనము ఒకరినొకరము ద్వేషించుకొనవలసినపని లేదు. ఈ ఏకైకసత్యమును మనమందఱమును మఱుల గ్రహింప వలయును. ఈ మహాధర్మము ఇక్కడనే—మన మాతృదేశమునందు మాత్రమే—అనుష్ఠింపబడి ప్రచారము గాంచినది. అది ఇంకొకసారి ఈ భారతదేశమునుండియే ప్రపంచమునకెల్ల ప్రసారము కావలసి యున్నది. ఈమహాకార్యమును చేయగలిగినది ఒక్క భారతదేశమే. ఆ ధర్మరహస్యము మన వేదములయందున్నది, మన వాఙ్మయమందున్నది, మన జాతీయ జీవితమునందెల్ల నిండియున్నది. ఇక్కడనే—ఇక్కడమాత్రమే—అగ్ని అనుదినమును ఆచరింపబడుచుండుట! కండ్లు తెఱచి చూచు ప్రతివానికిని ఈ విషయము రుజువుకాగలదు. కావున లోకమునకు మనము మతధర్మములను బోధింపవలసియున్నది. మనము బోధింపవలసినవి ఇంతకన్న మించిన ఉత్తమధర్మములుకూడ కలవు. కాని అవి విద్యావంతులకు మాత్రమే అక్కఱకు వచ్చును. పురుషుడు గాని, స్త్రీగాని, పసిబిడ్డగాని, చదువు వచ్చినను చదువు రాకున్నను, జాతివర్ణసంప్రదాయ భేదములు లేక,

సౌజన్యము, సమ్రమత, ఓరిమి, సహనము, సానుభూతి, సోదర భావము మున్నగు ధర్మములు మాత్రము ప్రతివారును నేర్చుకొనవచ్చును. "తత్త్వజ్ఞులు నిన్ను అనేక నామములతో సంబోధింతురు గాక! కాని నీవు ఒక్కడుడవే!"



వేదాంతమతము

జాఫ్నానగరమునందలి హిందువులు (శ్రీ వివేకానంద స్వాములవారికి సమర్పించిన స్వాగతపత్రము.

శ్రీమత్ వివేకానందస్వాములవారికి

పూజ్యులగుస్వామీ!

హిందూమతమును అవలంబించు జాఫ్నానివాసులమగు మేము, ఈ సింహళద్వీపమున హిందూమతమునకు ప్రధాన స్థానమగు మా పురమునకు హృదయపూర్వకముగా మిమ్ము ఆహ్వానించుచున్నాము. లంకలోని ఈ ప్రాంతమున దర్శన మీయ దయతో మా ఆహ్వానమును అంగీకరించినందులకు మీయెడ మే మెంతయు కృతజ్ఞులము.

రెండువేల సంవత్సరములకు పూర్వము మా పూర్వులు దక్షిణభారతదేశమునుండి వచ్చి యిక్కడ నివా

సముల నేర్పఱచుకొనిరి. వారితోడ వారిమతముకూడ వచ్చినది. అప్పటి జాఫ్నానగరపు తమిళరాజులు ఆ మతమును అదరించిరి. వారిరాజ్యము పోయి పోర్చుగీసు, డచ్చివారల ప్రభుత్వములు రాగానే మా మతధర్మాచరణమునకు అవరోధము కల్గినది. బహిరంగపూజలు బహిష్కరింపబడినవి. మహాప్రఖ్యాతములగు రెండుమఠములతోపాటు అనేక పవిత్ర దేవాలయములు నేలమట్టము గావింపబడినవి. ఆ రాజుల వారు క్రైస్తవమతములోనికి మమ్ము పూర్తిగా బలాత్కారముగా లాగికొనవలెనని ఎంతో పట్టుపట్టిరిను, వారు చలింపక హైందవమత సంప్రదాయమును నిలబెట్టిరి. అంతేకాదు. పరమపూజ్యమగు పితార్జితసంపదగా దాచిన వారు మాకొసగిపోయిరి. ఇప్పుడు బ్రిటిషువారి పరిపాలనమున, చక్కని సమగ్ర మతపునరుద్ధారణము జరుగుటేగాక, పూర్వపు పవిత్రదేవాలయములు తిరిగి నిర్మింపబడినవి; ఇంకను నిర్మింపబడుచున్నవి.

వేదప్రతిపాదితమగు సత్యతేజమును సర్వమతపరిషత్తునందు ప్రపంచజాతులకెల్ల ప్రదర్శించుటకును, భారతీయుల దివ్య వేదాంతధర్మములను ఇంగ్లండులో ప్రచారము చేయుటకును, పశ్చిమప్రపంచమునకు హిందూమతధర్మముతోడ పరిచయముకలిగించుటకును, తద్ద్వారా ప్రాక్పశ్చిమ ఖండములకు సౌహార్దము కలిగించుటకును. మీరు కావించిన మహనీయమగు అవ్యాజపరిశ్రమను గుఱించి మా హృదయపూర్వక కృతజ్ఞతాభినందనములను తెలుపుచున్నాము. భక్తి వశించి పారలౌకికచింతపై నిరసన మేర్పడిన యీ కలి

కాలమున, మన ప్రాచీనమతమును పునరుద్ధరించుకొనుకు మీ రొక మహోద్యమమును బయలుదేఱదీసితిరి. అందుకై మా వందనములను అర్పించుచున్నారము.

మనమతము విశ్వశరణ్యమని మీరు పాశ్చాత్య ప్రజలకు తెలిపితిరి. పాశ్చాత్యతత్త్వశాస్త్రములు చివరకు ఊహింపనైన ఊహింపజాలని అనేకనిగూఢరహస్యములు హైందవ వేదాంతమునందు కలవని పాశ్చాత్యధర్మవిచార పరుల మనస్సులందు నాటుసినుల ఉద్ఘోషించితిరి. అందులకు మాకృతజ్ఞతను తగురీతిని తెలుపజాలకున్నాము.

పశ్చిమఖండమున మీమహోద్యమముగావించుచున్న పురోగమనమును జాగరూకులమై కనిపట్టుచున్నామనియు, మీధర్మపరాయణతకును, మీ విరింతరకృషికిని, మీ విజయ పరంపరలకును, మేము పరమానందమును పొందుచున్నామనియు మీకు వేఱుగా చెప్పవలయునా? పాశ్చాత్యదేశములందు విద్యావ్యాసంగమునకును, ధర్మప్రచారమునకును, మతవిచారణకును, ప్రసిద్ధిగాంచిన ప్రధానసంగతులందలి వార్తాపత్రికలెల్ల మిమ్ములగుఱించియు, మనమతవాఙ్మయ ప్రదర్శనమున మీరుగావించిన అమ్మితి ప్రచారమును గుఱించియు, వ్రాసిన స్తోత్రవాక్యములే మహనీయములగు మీ ఉదాత్తకృషికి ప్రబలసాక్ష్యములైయున్నవి.

మీరు మాప్రాంతమున ధర్మసమిచ్చినందులకు, హృదయపూర్వకముగ ధన్యవాదములను అర్పించుచున్నాము. మీతోపాటు సత్యమగు పారమార్థికవిజ్ఞానము

నకు వేదములు మూలాధారములని విశ్వసించు మేము; మిమ్మలను మామధ్యమున దర్శించు అవకాశములు మరల మరల లభించుగాకయని ఆశించుచున్నాము.

ఇంతవఱకును మీఘనతరోద్యమమునకు అద్భుత విజయమునొసగి ధన్యముచేసిన పరమేశ్వరుడు. మీ ఈ మహోద్యమమును ఇంకను సాగించుకొనుటకై మీకు చిరాయువును జవసత్త్వములను సంపూర్ణముగనిచ్చి ప్రోచుగాత మని ప్రార్థించుచున్నాము.

చిత్తగింపుడు,

ఇట్లు

మద్రాసునగర హైందవ సంఘము.

శ్రీ స్వాములవారు ఈ అభినందనపత్రమునకు ఉచిత రీతిని ప్రత్యుత్తరమిచ్చుచు, ఆమఱునాటిదినము సాయంతన కాలమున **'వేదాంతమతము'** ను గుఱించి ఈ క్రింది తీరున ఉపన్యసించిరి.

విషయమూ చాలపెద్దది; సమయమూ చాలకొద్ది. హిందుమతముల మతమును గుఱించిన పూర్తివివరములను తెలుపుట ఈ ఒక్క ఉపన్యాసములో సాధ్యముకాదు. కాబట్టి మన మతమునొక్క ప్రధానవిషయములను మాత్రము నాచేతనైనంత తేలికభాషలో మీకు నివేదింతును. మనము హిందువులమని చెప్పుకొనుట ఆచారమై పోయినది. కాని 'హిందువు' అనుమాట ఈ నాడు కేవలము అర్థహీనమైనది. ఏలయన, ''సింధునదికి ఆవలిబడ్డున నివ

సించువారు'' అనియే ఈ మాటకు అర్థము. 'సింధు' అను సంస్కృతపదమును పాడుచేసి పారసీకులు 'ఇందు' గా మార్చిరి. వారున్న తావునుండి సింధూనదికి ఆవలియొడ్డున నివసించు ప్రజలను వారు 'హిందువులు' అని పిలుచుచుండిరి. ఆ పిమ్మట ఈ మాట పరంపరగా వాడుకలోనికి వచ్చినది. మహమ్మదీయుల పరిపాలనకాలమున ఈ మాట చివరకు మన వ్యవహారములోనికికూడ ప్రాకినది. ఈ పదమును ఉప యోగించుటవలన హానిలేదు. కాని నేను చెప్పినటుల అది అర్థహీనమైపోయినది. ఏలయందురా, సింధునదికి ఈవలి ఒడ్డున నివసించుప్రజలందఱును పూర్వకాలమునందువలె ఈ నాడు ఒకేమతమును అవలంబించువారుకారు. కావున ఈ మాట కేవలము హిందువులకేకాక ఇండియాలోనివసించు మహమ్మదీయులు, క్రైస్తవులు, జైనులు, మున్నగు సర్వ మతములవారికిని చెల్లును. కాబట్టి 'హిందువు' అను పద మును నేను వాడను. మఱి ఏపదమును వాడవలయును? మనము ఉపయోగించుకొనదగిన పదము లనేకములున్నవి. వేదధర్మములను అనుసరించువారు అను అర్థమిచ్చు ''వైదికులు'' అను పదమునుగాని, లేక వేదాంతమును అనుష్ఠించు వారు అను అర్థమిచ్చు ''వేదాంతులు'' అనుపదమునుగాని ప్రయోగింపవచ్చును. కొన్ని గ్రంథములను భగవంతుని పలుకులనియో, లేక యే మహాపురుషుని సూక్తులనియో, చెప్పుచు వానిని తమమతములకు పరమ ప్రమాణములు గను పునాదులుగను తలదాల్చుట సాధారణముగా ప్రపంచములోని అన్ని మతములవారికిని పరిపాటి. ఇట్టిపుస్తక

ములు అన్నిటిలో, నవీనపాశ్చాత్యపండితుల అభిప్రాయము ప్రకారము, హిందువుల వేదములు అత్యంతప్రాచీనములు. కావున వేదములను గుఱించి కొంత తెలిసికొనుట ఆవశ్యకము.

వేదములు అపౌరుషేయములు. అవి మానవప్రోక్తములుకావు. వాని కాలము ఇంతవఱకు నిర్ణయింపబడలేదు. ఇక ఎన్నటికిని నిర్ణయింపబడజాలదు. వేదములు అనాదులని మన సమ్మకము. ఒక్కముఖ్య విషయము మీరందఱు జ్ఞప్తియందుంచుకొనవలయునని కోరుచున్నాను. ప్రపంచమున గల యితర మతములన్నియు, ఒక సాకారదైవతమో, కొందఱు మహాత్ములో, దేవదూతలో, లేక భగవంతుడు ప్రత్యేకముగ పంపిన ప్రవక్తలో, అనుగ్రహించి ఎవరో కొందఱు వ్యక్తులకు ప్రసాదించినవే. ఆ ప్రసాదించిన వారి గొప్పదనమునుబట్టి తమతమ మతములు ప్రమాణములని ఇతరులు చెప్పుకొనుచున్నాడు. ఇక హిందువులకో వేదములే పరమప్రమాణములు. ఆవేదములు ఎవని ప్రామాణ్యమునైనను ఆధారపడుట లేదు. అవి సనాతనములై, బ్రహ్మజ్ఞాననిలయములగుటచేత వాని కవియే ప్రమాణములు. అవి ఎన్నడును ఎవరిచేతను రచింపబడలేదు. అవి అనాదికాలమునుండి యుండినవే. ఆద్యంతములులేక ఈ సృష్టి శాశ్వతమై సనాతనమై యుండువిధమున, ఈశ్వరజ్ఞానముకూడ, తుది మొదలులేనిదై పఱగుచున్నది. వేదమనగా ఈ జ్ఞానరాశియే, 'విద్' అనగా తెలిసికొనుట లేక ఎఱుగుట అని యర్థము. వేదాంత మనబడెడు ఈ జ్ఞానపుంజ

మును మహాపురుషులగు ఋషులు ప్రకాశమునకు తెచ్చిరి. 'ఋషి' అనగా మంత్రద్రష్ట, భావమునెఱిగినవాడు, అని యర్థము. భావమును తెలియుటే ఆతడు చేసినది; భావము మాత్ర మాతనిదికాదు. ఏదేని ఒక వేదవాక్యము ఒకానొక ఋషినలన లభించినది అని మీరు వినినప్పుడు, దానిని ఆయన ప్రాణెనెనిగాని. సంస్కృలోనుండి సృష్టించెనని గాని, తలపకుడు; అదినఱకే ఉండియున్న భావమును ఆయన దర్శించెను. అంతే. అది అనాదిగా జగమున ఉండినదే. ఈ ఋషి దానిని కనిపట్టెను. మహర్షులు పరమార్థసత్యములను కనిపట్టుచుండిరి.

వేదమునెడు ఈ మహాగ్రంథరాశి ముఖ్యముగా 'కర్మ కాండ', 'జ్ఞానకాండ' అని రెండు భాగములుగా విభజింపబడి యున్నది. కర్మకాండ కార్యకలాప సంబంధమైనది. జ్ఞాన కాండ అధ్యాత్మికవిచార సంబంధమైనది. కర్మకాండ అనేక యజ్ఞములను గుఱించి తెలుపును. వానిలో అనేక ములు ఇప్పటి పరిస్థితులలో సాధ్యము కావని వదలివేయ బడినవి. అయినను తక్కువి యేదో యొకరూపమున నిలిచి యున్నవి. బ్రహ్మచారి (విద్యార్థి) ధర్మములు, గృహస్థుని ధర్మములు, సన్న్యాసిధర్మములు ఈవివిధ జీవితదశలయొక్క భిన్న భిన్న ధర్మములు కర్మకాండయందు ముఖ్యముగా తెలుపబడును. అవి నేటివఱకును కొంచెము హెచ్చు తగ్గుగా ఆచరణములోనే యున్నవి. కాని మన మతమునొక్క ఆధ్యాత్మభాగము జ్ఞానకాండము లేక వేదాంతము అను రెండవభాగమునందు కలదు. వేదాంత మనగా వేదముల

యొక్క అంతము లేక సారాంశము లేక పరమావధి అని భావము. వేదములలోని జ్ఞానసారమునకు వేదాంతమని పేరు. ఇది ఉపనిషత్తులయం దున్నది. భారతదేశములోని అన్ని సంప్రదాయములవారు—ద్వైతులు, విశిష్టాద్వైతులు, అద్వైతులు, శైవులు, వైష్ణవులు, శాక్తేయులు, సూర్యోపాసకులు, గాణాపత్యులు, ఇంతేల, హిందూమతావరణములోనికి రా సాహసించు ప్రతి సంప్రదాయమును—వేదములందలి ఉపనిషత్తులను ఒప్పుకొనియే తీరవలెను. వానికి స్వంతవ్యాఖ్యానములను చేసికోవచ్చును; తమ తమ సంప్రదాయములను అనుసరించి అర్థము చెప్పుకోవచ్చును. కాని వాని అధికారమునకు లోబడియే తీరవలయును. ఈ కారణము చేతనే, హిందువు అను మాటకు బదులుగా వేదాంతి అను మాటను మనము ఉపయోగించుకొనగోరుట. సనాతనులగు హైందవతాత్వికులందఱును వేదాంతము పరమ ప్రమాణమని అంగీకరించిరి. ఈ నాటి మన మతములన్నియు, అవి ఎంతమోటుగ కనబడినను, వాని ఆదర్శములు ఎంత గూఢముగానున్నను, జాగరూకతతో పరిశీలించి అర్థముచేసికొన్నచో, అవి అన్నియు ఉపనిషద్ధర్మముల పైననే ఆధారపడియున్నట్లు విశదమగును. చివరకు హిందువులలోని అతిమూర్ఖసంప్రదాయముల యొక్క ప్రతీకములను లేక విగ్రహములను పరిశీలించినను, ఈ ఉపనిషత్తుల భావములు మన జాతిలో ఎంతలోతుగ నాటుకొనిపోయినవో తెలిసికొనవచ్చును. ఈ ఉపనిషత్తులు కొంతకాలమునకు విగ్రహములు మొదలగు వానిరూపమున సాంకేతిక చిహ్న

ములుగ ఏర్పడినవి. ఉపనిషత్తులలోని పారమార్థిక తాత్త్విక మహాభావములు నేటి మనఇండ్లలోని విగ్రహపూజారూప ములుదాల్చి కనుపట్టుచుండును. ఇట్లు మనము ఉపయోగించుకొను వివిధములగు సాంకేతికచిహ్నములు అన్నియు వేదాంతమునుండియే వచ్చియున్నవి. ఏలయన వేదాంత మందు అవి భాషాలంకారములుగా వాడబడినవి. ఆ భావము లన్నియు జాతి యందు వ్యాపించి, మన ఆరాధ్యదేవతా రూపములను పొంది నిత్యజీవితమునందు కలిసిపోయినవి.

ఈ వేదాంతమునకు పిమ్మట స్మృతులు వచ్చును. ఇవియు ఋషులు వ్రాసిన పుస్తకములే; కాని వీని ప్రామాణికత వేదాంతముయొక్క ప్రామాణికతకన్న తక్కువ. ఇతర మతస్థులకు వారి వారి మతగ్రంథములతో ఎట్టి సంబంధముగలదో, ఈ స్మృతులతో మనకును అట్టి సంబంధమే కలదు. ఈ స్మృతులు ఆయా ఋషులచేత వ్రాయబడినట్లు మనము ఒప్పుకొందుము. ఆ అర్థమున అవి యితరుల మతగ్రంథములవంటివే; కాని యీస్మృతులు పరమప్రమాణములుకావు. వేదాంతమునకు విరుద్ధమగునది ఏదేని ఒక స్మృతియందుండిన యెడల, ఆ స్మృతిని త్రోసివేయవలసినదే. దాని ప్రామాణికత అంతరించును. ఈ స్మృతులు ఆయా కాలములందు మారుచుండునని మన మెఱుగుదుము. కొన్ని కొన్ని స్మృతులు సత్యయుగమునందును, కొన్ని కొన్ని త్రేతాయుగమునందును, కొన్ని ద్వాపరయుగమునందును, మఱికొన్ని కలియుగమందును ప్రమాణములుగ నుండుచు వచ్చెనని మనకు తెలియును. కాలముమారి కాలముతో

బాటు పరిస్థితులు మారినపుడెల్ల ఆచారమర్యాదలును మార వలసి యుండును. జాతియొక్క ఈ ఆచారమర్యాదలను సంస్కరించు స్మృతులును ఆ యా సమయములందు మారి తీరవలయును. ఈ విషయమును మీరు ముఖ్యముగా జ్ఞాపినుంచుకొనవలయునని కోరుచున్నాను. వేదాంతిమందలి మతధర్మములు మారునవికావు. ఏలయన, అవి ప్రకృతి పురుషులందుగల సనాతనధర్మములపైని ఆధారపడినవి. జీవుడు స్వర్గమునకు పోవుట మొదలగు భావములు ఎన్న డును మారజాలవు. వేలకొలది సంవత్సరములకు పూర్వము అవి ఎట్లుండెనో యీనాడును అట్లేయున్నవి. కొన్ని వేలయేండ్లు గడచినను, అవి అటులనే యుండును. కాని పూర్తిగా మన సంఘస్థితిగతులపై ఆధారపడియుండు మతాచారములు, సంఘ మునందు గలుగు మార్పులతో బాటు మారవలసి యుండును. ఒక శాసనము ఒకానొక కాలమునందు క్షేమకరమయి ధర్మమయి యుండును; మఱియొక కాలమునందు అది అటుల నుండదు. ఒక విధమగు ఆహారము ఒక కాలమునందు సరిపడి వేఱొక కాలమునందు సరిపడదు. ఏమన, ఆ ఆహా రము ఆకాలమునకుమాత్రమే యోగ్యమైనది. శీతోష్ణ స్థితులును ఇతరవిషయములును మారినప్పుడు ఆయాసంద ర్భమును అనుసరించి ఆహారమును మారుచుండును. కావున ఆహారాదివిషయములందు కూడ ఆ యా కాలములందు స్మృతిధర్మములు మారుచున్నవి. ఈ విధముగా నవీన కాలమునను సంఘమునందు మార్పు లవసరమేని, వానిని అంగీకరించి తీరవలయును. వానిని మార్చువిధానమును

ఋషులు ఏర్పడి మనకు చూపుదురు. కాని మన పరమార్థ ధర్మములలో ఒక్క లేశమైనను మారుటకు వీలులేదు. ఆ ధర్మములు చెక్కు చెదరక అటుల ఉండవలసినవే.

ఇక పురాణములున్నవి. 'పురాణం పఞ్చలక్షణమ్' అని పురాణములు అయిదులక్షణములు కలవిగా నున్నవి. చరిత్ర, సృష్టిక్రమము, వేదాంతధర్మములు, ఆదర్శ సంకేతములు మొదలగువానిని పురాణములు తెల్పును. ఇవి వేదములందలి మతధర్మములను ప్రజాసామాన్యమునకు బోధించుట కొఱకయి వ్రాయబడినవి. వేదములలోని భాష చాల పురాతనమయినది. పండితులంగు నైతము బహు కొలదిమంది మాత్రమే వేదము లెప్పుడు వెలువడినవో, ఆ భాష ఎట్టిదో, గ్రహింపగలరు. పురాణములన్ననో, ఆకాలపు ప్రజలభాషలో వ్రాయబడినవి. దానినే యిప్పుడు సంస్కృత మనుచున్నాము. కావున ఈ పురాణములు పండితులకొఱకు గాక సామాన్యప్రజలకొఱకు ఉద్దేశింపబడినవి. ఈ ప్రజాసామాన్యమునకు తత్త్వశాస్త్రము అర్థముకాదు. అట్టి తత్త్వవిషయములు ఋషులయొక్కయు, రాజులయొక్కయు, మహాపురుషులయొక్కయు జీవితముల సాహాయ్యమునను, జాతికి సంభవించిన చారిత్రిక సంఘటనల సాహాయ్యమునను, స్థూలరూపమున ప్రజలకు బోధింప బడుచున్నవి. మతములయొక్క సనాతనధర్మములను నిదర్శన పూర్వకముగా తెలుపుటకు అట్టి విషయములను ఋషులు పురాణములందు ఉపయోగించుచు వచ్చిరి.

తంత్రములు అను ఇతర గ్రంథములు కూడ కొన్ని కలవు. కొన్ని విషయములలో వీనికిని పురాణములకును చాల పోలిక గలదు. కొన్ని తంత్రములలో కర్మకాండకు సంబంధించిన యజ్ఞయాగాదుల ఆచారములను పునరుద్ధరింప వలెనను ప్రయత్నము చూపట్టును.

ఈ గ్రంథములన్నియు హిందువుల శాస్త్ర సముదాయము. తత్త్వవిచారణ యందును, ఆత్మశోధన యందును, తమ శక్తిలో అత్యధికభాగమును వినియోగము చేసిన జాతియందు ఇట్టి శాస్త్రగ్రంథ సముదాయము పెరుగుచు వచ్చును. ఇటుల ఎన్ని వేల సంవత్సరములు జరిగెనో ఎవరి కెఱుక! అట్టి హిందూజాతియందు అనేక శాఖాసంప్రదాయము లుండుట సహజమే. ఇంకను కొన్ని వేల శాఖలు బయలుదేరకుండుటయే విచిత్ర విషయము! కొన్ని కొన్ని అంశములందు ఈ శాఖలు మిక్కిలి భిన్నములుగ నున్నవి. ఈ శాఖాసంప్రదాయములందును, వాని ఆధ్యాత్మిక భావములందును, గలభేదములు విచారించుటకు మనకు కాలము చాలదు. కాబట్టి యీ శాఖలవా రందఱును ఒప్పుకొను సామాన్యప్రమాణములను, ప్రధానధర్మములను విచారింతము. వీనిని ప్రతిహిందువు తప్పక విశ్వసించును.

మొట్టమొదట సృష్టిక్రమమును తీసికొందము. ఈ సృష్టి, లేక ప్రకృతి, మాయ, అనంతమును అనాదియునై ఉన్నది. ఈ ప్రపంచము నిన్న మొన్న సృష్టింపబడినది కాదు. దేవుడు వచ్చి యీ లోకమును సృజించి, పోయి

పడుండి నిద్రపోవుచున్నాడనుట కేవలము అసంబద్ధము. సృజన శక్తి సదా పనిచేయుచునే యున్నది. భగవంతుడు నిరంతరము సృష్టిచేయుచునే ఉన్నాడు. ఎన్నడును విశ్రాంతి తీసికొనడు. ''నేను ఒక్కక్షణము కర్మచేయక ఊరకుందునేని ఈజగత్తు సర్వనాశనమై పోవును''అని గీతయందు శ్రీకృష్ణుడు పలికిన వాక్కులను జ్ఞప్తినుంచుకొనుడు. మనచుట్టును రేయుం బవళ్ళు పనిచేయుచున్న సృష్టిశక్తి ఒక్క నిమిష మూరకుండినయెడల, సమస్తమును నేలకూలిపోవును. ఈ విశాల జగత్తులో సర్వత్ర, సర్వదా, ఈ శక్తి పనిచేయుచునేయున్నది. కాని కల్ప, విలయ, నియమముకలదు గదా. సంస్కృతభాషలో 'సృష్టి' అను మాటకు 'శూన్యములోనుండి కల్పన' అని అర్థము కాదు, 'ఆవిష్కరణము' అని మాత్రమే అర్థము. ఆంగ్లభాషలో క్రియేషన్ అను పదము 'ఏమియు లేని దాని నుండి కల్పించుట' అనెడు భయంకర మూఢభావమును సూచించును. శూన్యమునుండి కల్పనజరుగుట, అభావమునుండి భావమువచ్చుట, అనుదానిని విశ్వసింపుడని కోరుట మిమ్ము అనమానించుట యగును. / నేను చేయజాలను. కావున 'క్రియేషన్' అనుమాటకు 'ఆవిష్కరణము' అనియే అర్థము చెప్పుకొందము. ఈ జగమంతయు ఎప్పుడును ఉండునదే; కాని అది ఒకప్పుడు సూక్ష్మరూపము తాల్చి అవ్యక్తమై అణగియుండును. విశ్రాంతి తీసికొనుచున్నదో యన్నట్లు కొంతకాలము అటుల అణగియుండి, సమస్తమును దాని నుండి ఆవిష్కరణమగును; అనగా ఊబికి పైకివచ్చి గోచరించును. పూర్వపుసంఘటనలే, పూర్వపు పరిణామములే,

పూర్వపు ఆకృతులే, మరల కలుగును. కాని కొంతకాలము ఈ ఆట సాగి, మరల అంతయు విచ్ఛిన్నమై, నలిగియై, ధూళియై, సూక్ష్మదశనుపొంది, అదృశ్యమై అణగిపోవును. ఆ అణగిపోవుట తిరిగి మఱొకసారి ఆవిష్కరణము పొందుటకే! ఈ విధమున తరంగగతితో ముందుకు, వెనుకకు, ఇది అనంత కాలమును సడచుచునే యుండును. 'కాలము' 'దేశము' 'నిమిత్తము' అనున వన్నియు ఈసృష్టిలోనివే. కాబట్టి వీని కొక ఆది కలదనుట వట్టి వెఱ్ఱిమాట. వీని ఆదిని గుఱించి గాని, అంతమును గుఱించిగాని, ప్రశ్నించుటకే వీలులేదు. కాబట్టి మన శాస్త్రములలో ఆది, అంతము అనుపదములు ఉపయోగించుసప్పుడు అవి ఒక్క ప్రత్యేక కల్పమును గుఱించి వాడబడినవే యని గ్రహింపనలయును. అంతకు మించినవ్యాప్తి వానికి లేదు.

సరే, సృష్టిని చేయునది ఎవరు? 'గాడ్' (ఈ ప్రసంగము ఆంగ్లములోగదా.) 'గాడ్' అను ఈ ఇంగ్లీషుమాటను నే నేయర్థమున వాడుచున్నాను? ఇంగ్లీషులో మామూలుగా వాడు అర్థమ్ కాదు. రెంటికిని చాల భేదముకలదు. నా భావమును సరిగా తెలుపుపదము ఆంగ్లభాషలో లేదు. కావున 'బ్రహ్మము' అను సంస్కృతపదమును వాడుటనాకు ఇష్టము. అతడు ఈసమస్తదృశ్యవస్తుజాలమునకును మూలకారణము. బ్రహ్మము అనగా ఎట్టివాడు? ఆతడు నిత్యుడు, నిత్య పవిత్రుడు, నిత్యజాగరూకుడు, సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, కృపాళుడు, నిరాకారుడు, నిరవయవుడు. ఆతడు ఈ జగమును సృష్టించును. ఆతడు ఈ జగత్తును నిరంతరము

సృష్టిచేయుచు రక్షించుచునే యుండును సనుటలో రెండు చిక్కులు తటస్థించును. ఈ జగమున ద్వంద్వము లున్నవని మనకు తెలియును. ఒకడు సుఖించుచుండ వేఱొకడు దుఃఖించు చుండును. ఒకడు ధనికుడు, ఇంకొకడు దరిద్రుడు. ఇది పక్షపాతమును చూపుచున్నది. మఱియు ఇంచు క్రూరత్వమును కలదు. ఒకదాని ప్రాణముకొనుటకు మఱొకదాని మరణము ఆధారముగ నున్నది. ఒకజంతువు ఇంకొక జంతువును ముక్కలు ముక్కలుగ చీల్చి వేయుచున్నది. ప్రతి నరుడును తన సోదరుని అణచివేసి తాను మించిపోవలయునని చూచు చుండును. ఇట్లు స్పర్ధ, క్రౌర్యము, భయము, నిట్టూర్పులు, హృదయవేదనలు. ప్రపంచమున సర్వత్ర అనుదినమును కనబడుచునేయున్నవి. ఇదంతయు ఒక దేవుని సృష్టియగు నెడల, ఆ దేవుడు క్రూరుడే కాని, మహా క్రూరరాక్షసుని కంటెను కూడ అధముడు అనవలయును. సరే, వేదాంతము చెప్పునదేమి? ఈ భిన్నత్వము, ఈస్పర్ధ ఉండుట భగవంతుని దోషము కాదు. ఇక వీనిని కల్పించునది ఎవరు? మనమే. మేఘము పొలము లన్నింటిమీదను సమానముగనే వర్షించును. అయినను బాగుగ దున్నిన పొలమే ఆ వర్షము యొక్క లాభమును పొందును; దున్నక నిర్లక్ష్యముచేయ బడిన పొలము ఆ లాభమును పొందజాలదు. అది మేఘము యొక్క దోషముకాదు. భగవంతుని కరుణ నిత్యము, నిర్వికారము. మనమే భేదమును కల్పనచేయుచున్నాము. అయితే కొందఱు సుఖవంతులుగను కొందఱు దుఃఖవంతులుగను ఉండుట యను భేదమునకు సమాధాన మేమి? వారు

ఈ భేదములకు ఎంతమాత్రమును కారకులుకారే, ఏపాప మును ఎఱుగరే అనిన, ఈ జన్మలోకాదు; కాని గతజన్మలో కారకులైరి అనవలయును. పూర్వజన్మములందలి కర్మ ఈ భేదమునకు సమాధానము కూర్చుచున్నది.

ఇక రెండవసూత్రమును గుఱించి విచారింతము. ఈ విషయమున హిందువులేగాక బౌద్ధులును, జైనులును, అందఱును ఏకాభిప్రాయులగుచున్నారు. జీవము నిత్యమని అందఱమును అంగీకరింతుము. అది శూన్యమునుండి కలిగినది అనుట తగదు; అట్లగుట పొసగదు. అటువంటి జీవము ఎంచనకును కొఱగాదు. కాలములో దేనికి ఆది కలదో, కాలములో దానికి తుదియును ఉండును. జీవము నిన్న ప్రారంభమైనచో, రేపు అంతరించి తీరవలయును. అప్పుడు సర్వనాశనమే ఫలితార్థమగును. జీవము శాశ్వతమై వచ్చునదే! దీనిని గ్రహించుటకు పెద్ద మేధాశక్తి అవసరము లేదు. ఈ నాటి ప్రకృతిశాస్త్రములన్నియు మనకు తోడ్పడుచున్నవి. అవి మన ధర్మశాస్త్రములలోని సూత్ర ములకు భౌతికప్రపంచములో నిదర్శనములను చూపు చున్నవి. మనలో ప్రతివాని స్థితియు అనంతమగు పూర్వజన్మ ములయొక్క ఫలితార్థమేయని మీరు ఎఱిగియే యున్నారు. లోకములో ఒకబిడ్డ పుట్టెననుకొనుడు. అతడు ప్రకృతి యొక్క చేతిలోనుండి తళుక్కుమని తటాలున ఊడిపడుట లేదు. కవులు అటుల వర్ణించి ఆనందించిన ఆసందింతురు గాక! కాని, ఆ బిడ్డ నెత్తిమీద అనంతమగు పూర్వకర్మ భారము ఉన్నది. మంచియో, చెడ్డయో, తన పూర్వకర్మలను

పరిష్కరించుకొను నిమిత్తమే ఈ లోకమునకు అతడు వచ్చుచున్నాడు. ఇదియే కర్మసూత్రము. మనలోని ప్రతి వాడును, తన అదృష్టమునకు తానే కర్తయగుచున్నాడు. ఈ సూత్రము 'విధి వ్రాత', 'దైవసంకల్పము' అను వాదములను ఎగురగొట్టివేయుచున్నది. ఈ సూత్రమే భగవంతుసకును మానవునకును సమాధానమును కూర్చుటకు ఆధారమగుచున్నది. మన దుఃఖములకు మనమే బాధ్యులము; ఇంకెవరును కారు. కార్యరూపములు మనమే; కారణమును మనమే. అందువలననే మనము స్వతంత్రులము అనుట. నేను సుఃఖినైన యెడల, ఆదుఃఖము నేను తెచ్చిపెట్టుకొనినదే. నేను తలంచుకొనిన యెడల సుఖవంతుడనుగ మారగలననుటకు అదియే నిదర్శనము. నేను దుష్టుడనైన యెడల అదియు నాకర్మఫలమే. కావున నేను తలపెట్టునెడల పవిత్రుడను కాగలనానుటకు రుజువును అదియే. సరుని ఇచ్చ పరిస్థితులన్నింటికిని అతీతమై పరగుచున్నది. దీనిముందు అనగా, సరునందుగల బలిష్ఠమును, మహా త్వరమును, అఖండ మునగు ఇచ్ఛాస్వాతంత్ర్యముల ఎదుట, ప్రకృతియు జోహారవలసినదే; తలవంచి దాస్యము చేయవలసినదే. కర్మసూత్రమువొక్క మహిమ యిట్టిదిసుమీ!

తరువాతి ప్రశ్న : జీవుడు అనగా నేమి అనునది. 'జీవు' డనగా నేమో గ్రహింపనిది మన శాస్త్రమునందలి 'దేవు'డనగా ఏమో తెలిసికొనలేము. బాహ్య జగమును పరిశీలించు మూలమున దానికి పరమందేమి కలదో కనిపట్టుటకు భారతదేశమునందును, ఇతర దేశములం

దును ప్రబల ప్రయత్నములు సాగియున్నవి. కాని చివరకు ఆ ప్రయత్నములన్నియు ఎట్లు వ్యర్థములయ్యెనో మనకందఱకు తెలిసిన విషయమే. పరమార్థమును కనుగొనుటకు మార్గము. మనము ఈ జడప్రపంచమును పరిశీలించిన కొలది, మనమే జడమయులమైపోవుట తటస్థించుచున్నది. ఈ జడప్రపంచము జోలి పెట్టుకొనిన కొలది, మనలో మిగుకు మిగుకు మనుచున్న పారమార్థికత కుండ ఎగిరిపోవుట తటస్థించుచున్నది. కాబట్టి పారమార్థికతకు, పరమసత్యమును, గ్రహించుటకు, అది మార్గము కాదు. అది హృదయద్వారమున, జీవాత్మ ద్వారమున మాత్రమే, లభింపనలసియున్నది. బాహ్య కర్మలు పరమార్థమును గురించి, ఆ అఖండబ్రహ్మమును గురించి, ఏమియు బోధింప జాలవు. అంతర్యసాధనము మాత్రమే అటుల చేయగలదు. ఆత్మద్వారమున, అనగా జీవాత్మ విచారణ ద్వారమున, మాత్రమే మనము దేవుని గురించి తెలిసికొనగలము. ఈ జీవాత్మయొక్క స్వభావమును గురించి హిందూదేశములోని ఆ యా సంప్రదాయముల మధ్య భిన్నాభిప్రాయములు గలవు. కాని వారందఱును ఏకీభవించు అంశములును కొన్నిగలవు. ఆత్మలు ఆద్యంతములులేక, స్వభావముచేత నేనిత్యములని, మన మందఱమును ఒప్పుకొందుము. మఱియు సర్వశక్తులును, ఆనందమును, పరిశుద్ధతయు, సర్వవ్యాపకత్వమును, సర్వజ్ఞత్వమును, ప్రతి ఆత్మయందును నెలకొనియుండుననియు మనము నమ్ముదుము. ఇది యొక మహనీయ మగు భావమని జ్ఞప్తి

నుంచు కొనవలయును. కొద్ది గొప్ప అను భేదము లేక, పుణ్యపాపముల భేదము లేక, ప్రతిమానవునందును ప్రతిజీవి యందును సర్వవ్యాపకమును సర్వజ్ఞమును అగు ఒకే ఆత్మ వసించుచుండును. భిన్నత్వము ఆత్మయందు లేదు. దాని బాహ్యాకారమందుండును. నాకును ఒక అత్యల్ప జీవికిని మధ్య గల భేదము ఆత్మ ప్రకాశమందే. మూలతత్త్వమున ఆ జీవియు నావంటిదే. అతడు నాసోదరుడే. నాయందున్న యాత్మయే వానియందును కలదు. హిందూదేశము ప్రబోధిం చిన మహాతత్త్వ రహస్యమిది. మానవ భ్రాతృత్వము అనగా హిందూదేశమున సర్వజీవభ్రాతృత్వము అగుచున్నది. చిన్న చీమ మొదలు బ్రహ్మదేవుని వఱకు, అన్ని శరీరము లును మనవియే. శాస్త్రమునందు ఈ భావము గలదు: "ఒక శ్రీహరియే సమస్త శరీరములందును అధివసించునని తెలిసి యోగి ప్రతి శరీరమును శ్రీహరి మయముగ భావించి పూజించును." అందువలననే భారతదేశమున బీద వారిని గురించియు, పశువులను గురించియు, ఇంతేల ప్రతి జీవిని గురించియు, ప్రతివస్తువును గురించియు, మహోదార భావములు వెలయుచున్నవి. ఆత్మను గురించిన మన భావ ములలో సర్వాంగీకారము పడసినది ఇది యొకటి.

దేవుడు అన నెట్టివాడు? అను ప్రశ్న ఇప్పుడు సహ జముగా కలుగుచున్నది. ఆత్మను గురించి ఇంకొక విషయము చెప్పుకొందము. ఇంగ్లీషుభాష నేర్చుకొన్నవారు 'సోల్', 'మైండ్' అనుమాటలను అర్థము చేసికొనుటలో తబ్బిబ్బు పడుచున్నారు. మనము 'ఆత్మ' యనునదియు ఇంగ్లీషులో

''సోల్'' అనునదియు చాల భిన్నవస్తువులు. మనము 'మనస్సు' అను దానినే పాశ్చాత్యులు '' సోల్ '' అందురు. సుమారు ఇరువదిసంవత్సరములక్రిందట, సంస్కృతభాషాద్వారమున 'ఆత్మ' అను మాటను వారు వినువఱకును, వారికి ఆ భావమే లేదు. ఇది స్థూలశరీరము. దానిని దాటిపోయినయెడల మనస్సుకలదు. కాని ఈ మనస్సు ఆత్మకాదు, సూక్ష్మశరీరము. అదిజననమరణములనుపొందుచు పోవు సూక్ష్మాణువులతో ఏర్పడినది. ఈ మనస్సును దాటిన పిమ్మట ఆత్మయుండును. అదియే నరునందుగల 'అహంత'; దానిని ''సోల్'' అనిగాని ''మైండ్'' అనిగాని అనువదింప దగదు. కాబట్టి మనము ఆత్మ అను పదమునే వాడవలెను; లేదా పాశ్చాత్యతత్త్వవిదులు పేర్కొనుతీరున ''సెల్ఫ్'' అనవలెను. మనము ఏ పదమును ఉపయోగించినను 'ఆత్మ' అనగా 'మనస్సు' కాదనియు, ఈ శరీరముకాదనియు, వీనినుండి అది వేఱనియు, జ్ఞప్తినుంచుకొనవలయును. ఈ యాత్మ సూక్ష్మశరీరమని పేర్కొనబడు మనస్సును వెంట తీసికొని జననమరణములను పొందుచు పోవును. అది సమస్త జ్ఞానమును పొంది పరిపూర్ణవికాసము పడసినపిదప ఈ రాక పోకలు అనగా జనన మరణములు ఆగిపోవును. అట్టి దశ యందు ఆత్మ తన సూక్ష్మశరీరమును ఇచ్ఛానుసారము నిలుపుకొనవచ్చును; లేదా పూర్తిగ వదలివేసి స్వతంత్రమై, శాశ్వత ముక్తిని పొందవచ్చును. ఈ ముక్తియే ఆత్మకు పరమ గమ్యము. ఇది మన మతమునకు గల విశిష్ట లక్షణములలో నొకటి. మనకును స్వర్గములు నరకములు గలవు.

కాని అవి శాశ్వతములు కావు. సహజముగనే అవి శాశ్వతము లనుటకు వీలులేదు. ఎన్ని స్వర్గము లున్నను, అవియు మన ఈ లోకము వంటివే; కాని భూలోకము కన్న అవి చాల పెద్దవిగా నుండవచ్చును. అందలి సౌఖ్యము కొంచెము హెచ్చుగా నుండవచ్చును. అందలి భోగములును కొంచెము ఎక్కువగానే యుండవచ్చును. కాని ఇది యంతయు జీవునికి నష్టమే. స్వర్గములు చాల నున్నవి. ప్రతిఫలము నాసించి, ఇక్కడ సత్కర్మలు చేయు నరులు మరణించు సపుడు, ఈ స్వర్గము లలో దేవతలై పుట్టి, ఇంద్రుడు మొదలగు పదవులను పొందుదురు. ఈ దేవతానామములు కొన్ని పదవుల పేళ్లుగ నున్నవి. ఇప్పటి దేవతలు ఒకప్పుడు మానవులుగా నుండి, తమ సత్కర్మల వలన దేవతలైరి. మనము ఇంద్రుడు మొదలగు పేళ్లను గ్రంథములందు చూచునపుడు, అవి ఒక్కొక్క వ్యక్తియొక్క పేరులు అనుకొనరాదు. వేల కొలది ఇంద్రులు ఉండగలరు. "సహుషుడు" అనురాజు కలడు. అతడు మరణించినపుడు ఇంద్రుడైనాడు. అది ఒక పదవి. ఒక జీవాత్మ ఉన్నతిని సాధించి ఇంద్ర పదవిని పొంద వచ్చును. ఆ పదవిలో కొంతకాలము మాత్రమే ఉండగలడు. ఆ గడవునకు పిమ్మట అతడు మరణించి నరుడై పుట్టును. కాన ఈ నరదేహమే అన్నిటిలోను ఉత్తమ మైనది. కొందఱు దేవతలు ఇంకను గొప్పవారు కా గోరి స్వర్గభోగ ముల పైని వాంఛలనుగూడ త్యజించి వేయుదురు. ఈ లోక ములో అనేకులు ధనము, అధికారము, భోగము మొదలగు

వాని మోహమునకు లోబడుదురు ; అటులనే దేవతలలో కూడ అనేకులు వీని మోహమున బడుదురు. అందుచేత తమ సత్కర్మఫలము వ్యయము కాగానే, క్రిందికి దిగి వచ్చి మఱల మానవులై పుట్టుదురు. అందువలననే ఈ లోకమునకు కర్మభూమి యని పేరు వచ్చినది. ఈ లోకమునం దుండియే మనము మోక్షమును సంపాదించు కొనవలెను. కావున స్వర్గములు శ్రేయము వాంఛనీయములు కావు! ఇక వాంఛనీయమగున దెద్ది? ముక్తి, ''బంధరాహిత్యము''. మహోన్నత స్వర్గమునందు శ్రేయము నీవు బద్ధుడవే, బానిసవే అని మనశాస్త్రములు చెప్పుచున్నవి. నీవు ఇరువది వేల సంవత్సరములు రాజుగానుండినను ఏమి లాభము? నీ కొక శరీరమున్నంతనఱకు నీవు భోగములకు దాసుడవే. నీవు కాలమునకు లోబడి యున్నంతవఱకును, 'దేశము'నకు లోబడియున్నంతనఱకును, నీవు బానిసవే; కాబట్టియే బాహ్య ప్రకృతియొక్కయు ఆంతర ప్రకృతియొక్కయు బంధమునుండి విముక్తులము కావలెను అను ఆదర్శము. ప్రకృతి నీ పాదములకడ పడవలయును ; నీవు దాని కతీతుడవై, ముక్తుడవై, తేజస్వివై, ప్రకాశింపవలెను. ఇక నీకు జన్మ ముండదు; కావున మరణమును ఉండదు; నీకు సుఖముండదు; కావున దుఃఖమును ఉండదు. అయ్యది సర్వాతీతమగు అనిర్వచనీయమగు నిత్యానందపదవి. మన మీ లోక మున సుఖము, శుభము అనునవి అట్టి నిత్యానందము యొక్క అత్యల్ప రేణువులు అనవలెను. అట్టి నిత్యానందమే మన పరమగమ్యము.

జీవాత్మకు లింగభేదము, అనగా స్త్రీ పురుష నపుంసక భేదము, లేదు. ఆత్మ స్త్రీ యని గాని పురుషుడని గాని చెప్పుటకు వీలు లేదు. లింగభేదము కేవలము శరీరమునకు సంబంధించినది; కాబట్టి స్త్రీ, పురుషుడు, అను భావములన్నియు ఆత్మసంబంధముగా చెప్పుట భ్రాంతి. అవి శరీరమును గుఱించియే చెప్పుకోదగినవి. అటులనే వయస్సును గుఱించిన భావములును. ఆత్మకు వయస్సనునది లేదు. ఆ సనాతనుడు సర్వకాలము ఒకే తీరున నుండును.

ఆత్మ భూలోకమునకు ఎట్లు వచ్చినది? ఈ ప్రశ్నకు మన శాస్త్రములు ఒక్కటే సమాధానమును చెప్పుచున్నవి. అజ్ఞానమే ఈ బంధనమున కంతకును హేతువు! అజ్ఞానము మూలమున బద్ధులమైతిమి. జ్ఞానము ఆ దోషమును నివారణ చేయును; మనలను ఉద్ధరించును. అట్టి జ్ఞానము లభించు నెట్లు? అది భక్తిద్వారమున లభించును, భగవంతుని పూజించుటవలన, సమస్త జీవులను భగవంతుని ఆలయములుగ భావించుట వలన, లభించును. భగవంతుడు సమస్త భూతములందును వసించుచున్నాడు. కాబట్టి గాఢభక్తిద్వారమున జ్ఞానము లభించును; అజ్ఞానము అంతరించును; బంధనములు తెగి పోవును; జీవుడు ముక్తుడగును.

భగవంతుని గుఱించి రెండు విధములగు భావములు మనశాస్త్రములందు గలవు. ఒకటి సగుణము, రెండవది నిర్గుణము. భగవంతుడు సర్వవ్యాపి, సృష్టికర్త, రక్షకుడు, సర్వసంహారకుడు, ఈ జగత్తునకు శాశ్వత జనకుడో

జనని యో, యని భావించుట సగుణాద్వైత భావము. అతడు మననుండి వేఱుపడియుండును. సమస్త జీవులకు సదా పరుడై యుండును. క్రమముగా వానిని సమీపించుట, వాని యందు వసించుట, 'మోక్షం' మనబడును. ఇక నిర్గుణభావమును విచారింతము. అందు విశేషణములన్నియు అనవసరములును అసమంజసములును అని త్రోసివేయబడి, సర్వవ్యాపియు, నిర్గుణుడును, అగు పురుషుడు మిగులు చున్నాడు. వానిని జ్ఞాని అనుటకు వీలు లేదు. ఏలన, జ్ఞానము బుద్ధికి సంబంధించినది. జిజ్ఞాసువు అనుటకు వీలు లేదు, ఏలన జిజ్ఞాస అల్పుని పని. వివేకి యని చెప్పజాలము. తర్కించుటకూడ అజ్ఞాని లక్షణమే. అతడు సృష్టికర్త కాడు. ఏలన బంధనము లేనివాడు దేనిని గాని సృష్టింపబోడు. భగవంతునికి బంధనమేమి కలదు? వాంఛాసాఫల్యము కొఱకు తప్ప, ఎవడును కర్మ చేయడు. దేవునికి ఏమి వాంఛ లుండును? ఏవేని కొఱతలుండిన వానిని తీర్చుకొను నిమిత్తము కాక, ఎవడును పనులు చేయడు. పరమాత్మకు కొఱత యేమి కలదు? వేదములందు దేవునిగూర్చి 'వాడు' అను పదము ప్రయోగింపబడలేదు; 'అది' అనెడు నిర్గుణసూచక మగు పదమే ప్రయోగింపబడినది. వాడు అనగనే భగవంతుడు ఎవరో ఒక పురుషుడు అను భేదభావము కలుగును వేదము నిర్గుణ మగు పరమాత్మనే బోధించుచున్నది. ఈ సిద్ధాంత మును అద్వైత సిద్ధాంత మందురు.

ఈ నిర్గుణతత్త్వముతో మనకుగల సంబంధము ఎట్టిది? మనము ఆ తత్త్వమే; మనమును అతడును ఒక్కటియే. ప్రతి

వాడును ఆ నిర్గుణమూర్తి యొక్క వ్యక్తరూపమే. అదియే సమస్తమునకును మూలాధారము. ఇట్టి యఖండనిర్గుణ తత్త్వమునుండి మనము వేఱని భావించుకొనుటవలననే దుఃఖము కలుగుచున్నది. ఈ యద్భుతనిర్గుణతత్త్వముతోడి మన ఐక్యమును తెలిసికొనుటయే మోక్షము. నేనిప్పుడు సంక్షేపముగ భగవంతుని గుఱించి చెప్పిన ఈ రెండుభావములు మన శాస్త్రములందు గోచరించుచున్నవి.

వీనినిగూర్చి ఇంకను కొంచెము వివరముగా చెప్పుకొందము. ఈ నిర్గుణాద్వైతము యొక్క భావనపైని ఆధారపడియే, యేనీతిశాస్త్రములుగాని నిర్మాణముకాగలవు. ప్రతి జాతియందును, 'నీతోడి నరులను నీవలె ప్రేమింపుము' అని అత్యంతప్రాచీనకాలమునుండి బోధింపబడుచున్నది. కాని భారతదేశమున 'సమస్తజీవులను నీవలె ప్రేమించుము' అని బోధింపబడినది. నరులు, పశువులు అను భేదమును మనము పాటింపము. అయినను మనవలె ఇతర జీవులను ప్రేమించుట యెందువలన ధర్మమో, కారణము ఎవరును చెప్పుటలేదు; ఎవరికిని తెలియదు. కాని ఆ కారణము 'నిర్గుణబ్రహ్మమును' గుఱించిన భావనయం దిమిడియున్నది. ప్రపంచమంతయు ఒక్కటని, సర్వచైతన్యమును ఏకముకాగా విశ్వము అభిన్నమై భాసించునని, నీవు తెలిసికొనినప్పుడు, ఒకనికి అపకారము చేసినయెడల నీకు నీవే అపకారము చేసికొంటివనియు, ఒకనిని ప్రేమించుటవలన నిన్ను నీవే ప్రేమించుకొంటివనియు గ్రహింతువు. దీనినిబట్టి మనము ఇతరులను ఏల హింసింపరాదో తెలిసికొనగలము. ఇట్లు

'నిర్గుణబ్రహ్మము' అనెడు ఆదర్శమే నీతిశాస్త్రమునకు ఆధారమని స్పష్టమగుచున్నది. సరే. అందు సగుణబ్రహ్మమునకు తావెక్కడ? 'సగుణబ్రహ్మ' మనెడు భావమునుండియే అద్భుత ప్రేమప్రవాహము ఉద్భవిల్లుచున్నదని నే నెఱుగుదును. భక్తిమహిమ ఆ యా కాలములందలి పరిస్థితులకు అనుగుణముగా మానవులపై తన అద్భుతప్రభావమును ప్రసరింపజేయుట నాకు బాగుగ అనుభవమే. అయినను మనదేశములో ఇప్పుడు అంతగా కావలసినది భక్త్యను తాపముకాదు. మనకు పరాక్రమము కొఱవడియున్నది. ఆహా! ఈ నిర్గుణబ్రహ్మభావము ఎంత వీర్యవంతమైనది! సమస్తభ్రాంతులను వెదజిమ్మివైచి "నేను ఈ విశ్వమునందు అంతర్యామియై పరగు నిర్గుణబ్రహ్మమను" అను జ్ఞానముతో సాహసియై మానవుడు నిలబడగలడు. ఆతనికి భయముకలిగించునది ఇకనే ముండును? ప్రకృతిశాసనములను సైతము ఆతడు లెక్కసేయడు. మరణమన్న ఆతనికి పరిహాసముగ తోచును. అతడు తనఆత్మయొక్కప్రభావముపైని ఆధారపడి నిలుచును. ఆ ఆత్మ అనంతమై, అఖండమై, అవినాశియై ప్రకాశించుచున్నది. ఆ ఆత్మను కత్తులు నరకజాలవు; గాలి ఆర్పజాలదు; నిప్పు కాల్పజాలదు; నీరు తడుపజాలదు. అది తుది మొదలులేనిది; దానికి చావు బ్రతుకులులేవు. ఆద్యంతములులేని ఈ ఆత్మతో పోల్చినయెడల, చంద్రులును సూర్యులును నక్షత్రమండలములును సముద్రములోని నీటిచుక్కలను పోలియుండును. ఆత్మప్రభావము నెదుట ఆకాశము శూన్యమై చనును.

కాలము అభావమైపోవును. ఇట్టి మహిమాధ్యమగు ఆత్మ యందు మనకు విశ్వాసము కుదురవలయును. అందుండి మన కెంతేని బలము చేకూరగలదు. నీ వేది కాగోరిన అది కాగలవు. నీవు దీనుడవు అనుకొనిన దీనుడవే అగుదువు; బలాఢ్యుడను అనుకొనిన బలాఢ్యుడవే కాగలవు. నీవు పాపిని అనుకొనిన పాపివి అగుదువు; పుణ్యశాలి ననుకొంటివా పుణ్యశాలి వగుదువు. దీనులము అనుకొన దగదని ఇది మనకు నేర్పుచున్నది. బలాఢ్యులము, సర్వశక్తిమంతులము, సర్వజ్ఞులము అని మనము సంకల్పముచేయవలెను. ఆశక్తియంతయు ఇప్పుడు నాయందు ప్రకాశమునకు వచ్చి యుండక పోవచ్చును. కాని అది నాయందున్నది. సమస్త జ్ఞానమును నాయందున్నది; సర్వశక్తియు నాయందున్నది; నేను పరమపవిత్రుడను; నిత్యముక్తుడను. ఈ జ్ఞానమును నేనుప్రకటింపజాల కుండుటయేల? నాకు దానియందు విశ్వాసము కుదురలేదు కనుకనే. దానియందు నాకు విశ్వాసము కుదిరినతోడనే అది ప్రకాశమునకు రాగలదు. వచ్చియే తీరును. నిర్గుణబ్రహ్మముయొక్క భావన ప్రబోధింపగలది ఇదియే. మీబిడ్డలను పసితనమునుండియే పరాక్రమవంతులుగ చేయుడు. వారికి ధైర్యమును నేర్పకుడు. మీ ఆచారములను నేర్పకుడు. వారిని వీర్యవంతులనుగా చేయుడు. ధీరులై, సర్వదమనులై, తితిక్షావంతులై, సర్వస్వతంత్రులై నిలుచునటుల ప్రోత్సహింపుడు. మొట్టమొదట వారికి ఆత్మయొక్క మహిమను తెలుపుడు. అదిమీకు వేదాంతమునందు మాత్రమే లభింప గలదు. ఇతర మతములందు కాన్పించు

భక్తిప్రపత్తులు మొదలుగాగల భావములును, ఇంకను విశేషభావములును అందుకలవు. కాని ఈ యాత్మభావనయో ఉజ్జీవనప్రదమగుభావన; అత్యద్భుతమైనది! ఈ ప్రపంచమును తలక్రిందులు చేయగల భావనాపటిమ వేదాంతము నుండియే బయలుదేఱగలదు. అది జడప్రకృతిశాస్త్రములకును మతమునకును సామరస్యమును కూర్పగలదు.

ఈ విధముగా మన మతమును గుఱించిన ప్రధానాంశములను, అనగా ముఖ్యసూత్రములను మీకు దెలుప ప్రయత్నించితిని. ఇక దాని అనుష్ఠానమును గుఱించి నాలుగుమాటలు చెప్పవలసియున్నది. ప్రస్తుతము హిందూదేశములోనున్న పరిస్థితులలో అనేక శాఖాసంప్రదాయములు బయలుదేఱుట సహజమే. నిజమునకు భారతదేశమున అనేక శాఖాసంప్రదాయములు ఉండనే యున్నవి. కాని అవి ఒక దానితో నొకటి పోరాటములు సలుపకుండుట చిత్రము. శైవుడు ప్రతి వైష్ణవుడును నరకము పాలు కావలసినదే అనుట లేదు. వైష్ణవుడును ప్రతిశైవుని నరకమున కూలుదువుగాక యని శపించుటయు లేదు. "ఇది నా మార్గము; నీ మార్గమున నీవు పొమ్ము. అంత్యమున మనమందఱమును కలసికొనగలము" అని ప్రతి వైదభక్తుడును పలుకును. భారతదేశమున ఈ విషయము అందఱును ఎఱుంగుదురు. ఇదియే 'ఇష్టదేవతా' సిద్ధాంతము. భగవంతుని పూజించుటలో అనేకవిధానములు కలవని మన ప్రాచీనులు ఎప్పుడో గ్రహించిరి. వివిధ స్వభావగుణములకు సరిపడునటుల వేర్వేఱుమార్గము లుండవలయునని వారు

తెలిసికొనిరి. భగవంతుని చేరుటలో మీ మార్గము నా మార్గము కాక పోవచ్చును. ఒకవేళ అది నాకు అపకారమును చేయవచ్చును. కాని ప్రతివాడును ఒకే మార్గమును అవలంబించితీరవలయునను భావమే మిగుల అనర్థకము, అర్థశూన్యము. అట్టి భావమును పూర్తిగా త్యజింపవలయును. అందఱును ఒకేమతాభిప్రాయమును కలిగియుండి ఒకే మార్గమున నడువవలసివచ్చుచో లోకము మునిగిపోవును. అప్పుడు మతములన్నియు బుద్ధివికాస మంతయు నాశనమై పోవును. వైవిధ్యమే జీవితమునకు మూలాధారము. అది అంతరించినపుడు సృష్టి పూర్తిగా విలయమందును. భావమునందు ఈ వైవిధ్యమును కాపాడుకొనునంతవఱకే మనము సజీవులమై యుందుము. వైవిధ్యమున్నంత మాత్రమున మనము కొట్లాడుకో నక్కఱలేదు. నీ మార్గము నీకు మంచిది, నా మార్గము నాకు మంచిది. నా మార్గమునకు సంస్కృతమున నా 'ఇష్టదైవము' అని పేరు. ప్రపంచములోని ఏ మతముతోడను మనకు వైరము లేదని మీరు ముఖ్యముగా జ్ఞప్తి నుంచుకోవలయును. మనలో ప్రతివానికిని వాని 'ఇష్టదైవ'మున్నది. కాని యితరులు వచ్చి మా మార్గమే ఏకైకమార్గము అని పలుకుచు తమ సంప్రదాయమును మనకు బలాత్కారముగా అంటగట్టజూచుచో మనము వారిని మందలింపవలసియున్నది. వారి మాటలు విన్నచో మనకు నవ్వువచ్చును. భగవంతుని చేరుటకు వేఱొకమార్గమున పోవుచున్నారను కారణమున సోదరులను నాశము చేయజూచు ఇట్టి ప్రజలు ప్రేమను గూర్చి బోధలు చేయు

బూనుట పరిహాసాస్పదము. వారిప్రేమ అంతగా పాటింప దగినదికాదు. తమ మార్గమునకు భిన్నమగు మార్గమున నడచు ఇంకొకమానవుని చూచి సహింపలేనివారు ఏమి ప్రేమను బోధింపజాలుదురు? వారిదే ప్రేమ అయినయెడల ఇక ద్వేషమన ఎట్టిది? క్రీస్తునుగాని, బుద్ధునిగాని, మహమ్మదునుగాని, మఱే ప్రవక్తనుగాని పూజింపుడని బోధించు ఏ మతముతోడను మనకు వైరము లేదు. "సోదరా! స్వాగతము. నేను నీకు సాహాయ్యము చేసెదను; కాని నీవు నన్నుకూడ నా మార్గమున పోసీయవలెను. అది నా 'ఇష్టము'. నీ మార్గము చాల మంచిదే, సంశయములేదు. కాని అది నాకు అపాయకరము కావచ్చును. నాకు ఏ ఆహారము సరిపడునో నా అనుభవమునుబట్టి నాకు తెలియును. ఎంతమంది డాక్టరులైనను నాకు సరిపడు ఆహారమును నిర్ణయించి చెప్పజాలరు; నన్ను శాసింపనుజాలరు. అటులనే "నా స్వంత అనుభవమువలన నాకు ఏ మార్గము ఉత్తమమో నే నెఱుగుదును. ఒక దేవాలయమో ఒక ప్రతీకమో ఒక విగ్రహమో ఏదో యొకటి నీలోని దైవాంశను ప్రత్యక్షము చేసికొనుటకు నీకు సాయపడునెడల, నీవు దాని ననుసరించుట నాకు సమ్మతమే" అని హైందవుడు చెప్పును. మీ కిష్టమగునేని రెండువందల విగ్రహములు పెట్టుకొనుడు. ఏవేని కొన్ని రూపములు, కొన్ని మంత్ర తంత్రములు ఆత్మసాక్షాత్కారమునకై మీకు సహాకారకములగునేని తప్పక వానిని అవలంబింపుడు. ఏయే విగ్రహములు, ఏయే దేవళములు, ఏయే కర్మకలాపములు భగవంతుని సమీపించుటకు

మీ కవసరములగునో వానిని యథేచ్ఛగా అనుసరింపుడు. కాని వానిని గుఱించి వాదములు మాత్రము సలుపకుడు. మీరు వివాదములకు దిగితిరా దైవోన్ముఖముగ సాగు మీ పయనము ఆ క్షణమునందే ఆగిపోవును; అధోగతినంది పశు ప్రాయు లగుదురు.

మన హైందవమతములోని అభిప్రాయములు ఈ విధముగా నున్నవి. మన మతము ప్రతివానిని తనలో ఇముడ్చుకొనునుగాని ఎవరిని బహిష్కరింపదు. మన కుల ములును మన సంప్రదాయములును మన మతముతో సంబంధించినటుల కాన్పించినను, వానికి అట్టి సంబంధము లేదు. ఈ సంప్రదాయములు మన జాతీయతను రక్షించు టకు ఒకప్పుడు అవసరమైనవి. మనరక్షణకు ఆవశ్యకము కానినాడు అవి నిలువవు. స్వభావసిద్ధముగా అవి శిథిలమయి పోవును. కాని నేను పెద్దవాడనయినకొలదిని హిందూ దేశములోని ఈ ప్రాచీన ఆచారములను గుఱించి నాకు గౌరవభావము కలుగుచున్నది. ఒకప్పుడు నేను వీనిలో అనేకములు తుచ్ఛములనియు నిష్ప్రయోజనములనియు తలంచియుంటిని. కాని నేను పెద్దవాడనైన కొలదిని వానిలో దేనినిగాని నిందించుటకు జంకుచున్నాను. ఏలయన వానిలో ప్రతిదానియందును శతాబ్దముల కొలది గడించిన అనుభవము ఇమిడియున్నది. నిన్న మొన్న పుట్టి, రేపు చావనున్న ఒక కుఱ్ఱవాడు నాకడకువచ్చి నా పద్ధతులనన్నిటిని తప్పు ననుకొనుడు. నేను వానిబోధను ఆలకించి వాని అభిప్రాయ ముల ప్రకారము నా ఆచారవ్యవహారముల నన్నిటిని

మార్చుకొందునేని నేనే మూఢుడను కావలసియుండును. ఆయా దేశములనుండి మనకు వచ్చుచున్న బోధ చాలవఱకు ఇట్టిదిగా నున్నది. ఈ పండితమ్మన్యులతో ఇటుల చెప్పుదము గాక ! "మీరు సుస్థిరముగా మీ సంఘనిర్మాణమును చేసి కొన్నప్పుడు మేము మీ మాటను ఆలకింతుము. రెండుదిన ములవఱకేని ఒక్క అభిప్రాయమును మీరు నిలుపుకొన జాలకున్నారు; వివాదములకు దిగుచున్నారు; ఓడిపోవు చున్నారు. తొలకరిలో పుట్టు మిడుతలవలె మీరు పుట్టు చున్నారు; వానివలెనే అయిదు నిమిషములలో చచ్చు చున్నారు. నీటిబుడగల రీతిని పైకిలేచుచున్నారు; ఆ బుడ గలవలెనే తెప్పపాటులో చిట్లిపోవుచున్నారు. మీరు మీ సంఘమువంటి ఒక సుస్థిరసంఘమును మొట్టమొదట నిర్మా ణము చేసికొనుడు. ఇరువదేసి శతాబ్దములు గడచినను చెక్కుచెదరక, మహిమాఢ్యములై నిలిచియుండగల శాస నములను సంప్రదాయములను మొట్టమొదట మీరు నెల కొల్పుకొనుడు. ఆపిమ్మట అట్టి విషయములగూర్చి మీతో మాటాడుటకు అవకాశము దొరకునులెండు. కాని అంత వఱకును మీరు ఆలోచనలేక పైతోయ్రేకమున తలతిరిగి మాటాడు అవ్యక్తులే యని చెప్పుచున్నాము."

నేను మన మతమును గుఱించి చెప్పవలసిన దానిని ముగించితిని. నేడు మనకు అవసరమగు ఒకటి రెండు విషయ ములను మీకు జ్ఞప్తికి తెచ్చి విరమించెదను. ఈ కలియుగ మునకు మహాభారతమువంటి ఉత్తమగ్రంథమును ప్రసా దించినందులకు (శ్రీ) వ్యాసమహర్షికి నమస్కరింతముగాక.

ఇతరయుగములందు ఆచరింపబడిన తపస్సులు, కష్టసాధ్యములగు యజ్ఞములు, నేడు ఉపకరింపవు. ఈ యుగమున ఆవశ్యకమైనది దానము; అనగా పరోపకారము. పరమార్థ జ్ఞానమును ఒసగుట అత్యుత్తమదానము; దాని తర్వాత వ్యావహారికజ్ఞానదానము; ఆ పిమ్మట ప్రాణరక్షణము; తుదిది ఆహారపానీయాదుల నిచ్చుట; ఇవి దానములగును. పరమార్థ జ్ఞానము నొసగు నతడు అనేకజన్మలలో పడకుండ జీవుని రక్షించును. వ్యావహారికజ్ఞానదాతయు పరమార్థ జ్ఞానమువై పునకు నరునిదృష్టిని త్రిప్పగలడు. వీని తరువాత అత్యల్పములైన ప్రాణరక్షణము మొదలగు ఇతర దానములు లెక్కలోనికి వచ్చును. కావున పరమార్థజ్ఞానమును బోధించుట కంటె ఇతరవిధములగు కర్మలన్నియు తక్కువ యని మీరు గ్రహించుట అవసరము. ఇట్టి అధ్యాత్మజ్ఞానప్రచారమున తోడ్పడుటయే అత్యుత్తమసాహాయ్యము. మనశాస్త్రములందు అనంతమగు పరమార్థజ్ఞాననిధి కలదు. ఈ త్యాగభూమియందుతప్ప పుడమిని మఱి యెచ్చోటను తత్త్వవిజ్ఞానము ననుష్ఠానరూపమున ప్రకటించు ఆదర్శమూర్తులను చూపజాలము. నాకు కొంచెము ప్రపంచానుభవము కలదు. ఇతర దేశములందు ప్రగల్భములు కొట్టువారు చాలమంది కలరుకాని మతానుష్ఠానపరులై అధ్యాత్మజ్ఞానమును జీవన చర్యలలోనికి ప్రవేశపెట్టిన పురుషవరులను ఇక్కడనే, ఈ దేశమందు మాత్రమే, కనుగొనగలము. మతమనగా మాటలు చెప్పుట కాదు. చిలుకలు మాటాడగలవు. ఈ దినములలో జడయంత్రములు సయితము మాటాడుచున్నవి. కాని

వైరాగ్యయుతమైన, అధ్యాత్మధర్మసహితమైన, తితిక్షావంత మైన, అఖండప్రేమపూరితమైన జీవనము నాకు కావలయును. అట్టి జీవనము మాత్రమే ఆత్మజ్ఞానికి లక్షణము. మన దేశములో ఇట్టి భావములును, ఆదర్శమూర్తులగు ఇట్టి మహానుభావులును, అసంఖ్యాకముగా ఉన్నారు. ఆ మహాయోగుల మేధలందును హృదయములందును కూర్చ బడియున్న భాగ్యరాసులను పైకితీసి, గొప్పవారనక, కొద్ది వారనక, ధనికులనక, దరిద్రులనక, సర్వజనులకును సమ ముగా పంచిపెట్టవలయును. భారతదేశముననే గాక ప్రపంచ మంతటను వానిని వెదజల్లవలయును. మీకు తథ్యమగు మతాభిమానము కలదేని, మీ దేశమును మీరు నిజముగా ప్రేమింతురేని, మీ గ్రంథములలో నిక్షిప్తమైయున్న ఈ భాగ్యరాసులను పైకిదీసి వానికి వారసులగు ప్రపంచప్రజల కెల్లరకు పంచియిచ్చు మహోద్యమమును పూనుడు. సోమరితనమును వీడి తీవ్రప్రయత్నములు సాగింపుడు. అన్నిటికంటెను ఒక విషయము మీకు తెలుపుట ఆవశ్యకము. యుగయుగాంతరములనుండి ఓర్వలేనితనము మన హృదయములందు ఇంకియున్నది. మనము ఒకరినిచూచి ఒకరము అసూయపడుచున్నాము. "ఆతనికి ఆధిక్యము ఎందుకుండవలయును? నాకే ఏలయుండరాదు?" అనుకొనుచుందుము. దేవతాపూజలందు సైతము 'నేనుముందు; నేనుముందు' అనుచుందుము. అట్టి దౌర్భాగ్యదాస్యమునకు మనము దిగినాము. దీనిని ముందు వదలించుకొనవలసి యున్నది. ఈ కాలమున హిందూదేశమున గల మహానర్థ

కరమగు పాపము ఈ క్షుద్రదాస్యభావమే. ప్రతివాడును నాయకత్వము వహించి నడపగోరును; విధేయుడై సహకరించుట కెవ్వడును ఒప్పుకొనడు. పూర్వకాలపు అద్భుత బ్రహ్మచర్యధర్మము ఈ నాడు అడుగంటి పోవుటయే దీనికి కారణము. మొట్టమొదట విధేయతను నేర్చుకొనుడు. నాయకత్వము దానంతట అదియే వచ్చును. మొట్టమొదట సేవకుడవుగా నుండుట నేర్చుకొనుము; ఆ పిమ్మట స్వామిగా నుండు అర్హత నీకు లభించును. ఈ ఓర్వలేనితనమును బాపుకొనుము. ఇంకను చేయవలసియున్న మహాకార్యములను అప్పుడు నీవు చేయగలుగుదువు. మనపూర్వులు అత్యద్భుత కార్యములు చేసియున్నారు. వారి ఘనకార్యములను గుఱించి భక్తిప్రపత్తులతో సగర్వముగా చెప్పుకొనుచున్నాము. సరే, మనమును ఘనకార్యములు చేయబోవుచున్నాము. ముందు రానున్న వారు వెనుదిరిగిచూచి తమపూర్వులగు మనలను గుఱించి ధన్యవాదములు చేయుచు సగౌరవముగా ప్రస్తుతింతురుగాక! మన పూర్వులు మహాఘనులును మహామాన్యులును ఐనను, వారి కీర్తిని అతిక్రమించునంతటి మహాకార్యములను ఇచ్చట నున్నవారిలో ప్రతి యొకరును చేయగలుగునటుల పరమేశ్వరుడు అనుగ్రహించుగాక!

పాంబన్‌లో సమర్పింపబడిన స్వాగతపత్రమునకు ప్రత్యుత్తరముగా నొసగిన ఉపన్యాసము.

అనంతరము పాంబన్ పట్టణమునకు శ్రీ వివేకానంద స్వాములవారు చేరగనే రా మ నా డు రా జా గా రు శ్రీవారిని కలిసికొని భ క్తిపూర్వకముగా స్వాగత మొసగిరి. సముద్రతీరమున శ్రీవారు పడవ దిగిన-చోట స్వాగతసత్కారములకొఱకు ప్రత్యేకముగా నిర్మింపబడి చిత్ర విచిత్రముగా అలంకరింపబడిన పందిరియందు పాంబన్ పట్టణవాసుల పక్షమున ఈ క్రింది అభినందనపత్రము సమర్పింపబడెను.

పరమపూజ్యులగు యతివర్యా!

గాఢతమకృతజ్ఞతతోడను, ప ర మ పూ జ్య భావము తోడను, శ్రీవారికి స్వాగత మర్పింపగలిగినందులకు మేము మిగుల సంతసించుచున్నారము. అనేకములగు ఆహ్వానముల ఒ త్తిడియున్నను, ఒక్క-సారి మాకు దర్శనమిచ్చుటకు కరుణతో సంతోషముగా మీ రంగీకరించినందులకు మే మెంతయు కృతజ్ఞులమగుచున్నాము. మీయందలి మహనీయ సద్గుణ రాశికిని, ఔదార్యపు పెంపున మీరు నిర్వహింపబూనుకొని, అసమాన శక్తితోడను పరిపూర్ణోత్సాహముతోడను, అచంచలదీక్షతోడను కొనసాగించుచున్న మీ పవిత్రోద్యమమునకును ఇవే మా పూజాంజలులు!

పాశ్చాత్యసభ్యజాతుల మనస్సులందు మీరునాటిన హిందూత త్త్వబీజములు అం కు రిం చు చుం డు ట చూచు

చున్నాము. అవి పెరిగి అవ్వారిగా సత్ఫలములనిచ్చు సూచనలను ఇప్పుడిప్పుడే కనుగొని మహానందముపొందుచున్నాము. శ్రీవారు ఈ ఆర్యావర్తములో సంచారము చేయునప్పుడు పాశ్చాత్యదేశములలోకంటె మిన్నగా, ఈ మన మాతృభూమియందలి సోదరులను జన్మాదిగా ఆవరించిన నిద్రనుండి మేల్కొలిపి, చిరకాలము మఱుచియున్న బ్రహ్మవిద్యను వారి జ్ఞప్తికి తెచ్చి సుప్రబోధము కల్పింప ననుగ్రహింతురుగాక యని మనవిచేయుచున్నాము.

మా హృదయములు మా సద్గురువులగు శ్రీవారియెడల సత్యభక్తితోడను, పూజ్యభావముతోడను, పవిత్రాభిమానముతోడను నిండి పరవశములైపోవుచున్నవి. కావున మా భావములను తగురీతిని వ్యక్తముచేయజాలకున్నాము. శ్రీవారికి దీర్ఘాయురారోగ్యముల నొసంగి, చిరకాలముగా లోకమున కొఱవడియున్న విశ్వభ్రాతృభావమును పునరుద్ధరించుటకు వలసిన సమస్తశక్తులను సర్వేశ్వరుడు ప్రసాదించుగాకయని పూర్ణభక్తితో మేమందఱమును ప్రార్థించుచు విరమించుచున్నారము.

తదనంతరము శ్రీరాజాగారు తమ స్వపఱమున పూర్ణభక్తివిశ్వాసములను తెలుపుచు స్వీయస్వాగతమర్పించిరి. శ్రీవారు ఈ క్రిందివిధమున ప్రత్యుత్తరమొసగిరి :—

మనపవిత్ర మాతృభూమి మతమునకును తత్త్వశాస్త్రమునకును ప్రధానక్షేత్రము; మహాఋషులకు జన్మ

స్థానము; తీవ్రవైరాగ్యమునకు ఆలవాలము. మానవుడు సాధింపవలసిన మహోన్నతపరమాదర్శము అత్యంత ప్రాచీన కాలమునుండి నేటివఱకును విరాజిల్లుచు వచ్చినది ఇచ్చట నే!

నేను పాశ్చాత్యదేశములకు పోయివచ్చితిని. అనేక జాతులవారిమధ్య అనేకదేశములలో సంచారముచేసితిని. ప్రతిజాతియు ప్రతిసంఘమును ఒక్కొక్క విశిష్టాదర్శముతో ఒప్పుచున్నటుల నాకు కాన్పించినది. ఒక ప్రధానాదర్శము వారిజీవితమునంతను ఆక్రమించుచున్నది. ఈ ఆదర్శము వారి జాతీయజీవనమునకు పట్టుకొమ్మయై పరగుచున్నది. హిందూ దేశమునకును అట్టి పట్టుకొమ్మ ఒకటి కలదు. అయ్యది రాజనీతికాదు; సైనికబలముకాదు; వాణిజ్యాధిక్యతకాదు; యంత్రనిర్మాణకౌశలముకాదు; మతము. మతమే మన జీవననిధి; మనకున్న భాగ్యసర్వస్వము. మనము కోరుకొను నదియు అదియే. అట్టి వేదాంతము మన హిందూదేశమున సర్వదా వర్ధిల్లుచు వచ్చినది.

కండరబలము నిజమునకు గొప్పదే. ప్రకృతిశాస్త్ర ప్రయోగములవలన నిర్మించిన యంత్రజాలమందు ప్రకటిత మగు బుద్ధిమహిమ చాల అద్భుతమైనదే. అయినను ప్రపంచముమీద వేదాంతమునకుగల ప్రభావము వానికి లేదు.

భారతదేశము చిరకాలముగా కార్యదీక్ష గలిగి మెలగుచున్నటుల మనజాతి చరిత్రయే తెలుపుచున్నది. ఈనాడు యథార్థము నెఱుగనివారు బయలుదేఱి, భార

తీయుడు స్తబ్ధుడని, మందమతి యని, ప్రచారముచేయు చున్నారు. ఇతర దేశప్రజలకు ఇదే వాడుకపదమై పోయి నది. భారతదేశము ఎన్నడైనను మందమతియై పడియుండె ననుభావమును నే నొప్పుకొనజాలను. మన ఈ పుణ్యభూమి యందుకంటె ఎచ్చోటను కార్యదీక్ష ప్రస్ఫుటముగ ప్రకా శించుటలేదు. అత్యంతప్రాచీనమును, మహామహిమాఢ్యమును అగు మనజాతి యింకను సజీవమై యుండుటే మన జాతి కార్యదక్షతకు ప్రబలసాక్ష్యము. ప్రతిదశాబ్దియందును మన జాతి నూతన యౌవనమును పడయుచు, అక్షీణమును అవినాశియునై, దివ్యజీవనగతితో ప్రకాశించుచున్నది. ఈ కార్యపరత మనదేశమున మతమునందు గోచరించును. కాని ప్రతివాడును తన వృత్తిని ప్రమాణముగ పెట్టుకొనియే యితరులను విమర్శించుచుండుట మానవనైజ మనుసత్యమును ముఖ్యముగ గమనింపవలయును. ఉదాహరణకు, ఒక చెప్పులుకుట్టువానిని పరామర్శింపుడు. వానికి చెప్పులు కుట్టుట మాత్రము తెలియును. ఆతనికి చెప్పులు తయారు చేయుటను మించిన యోగ్యతరకార్యము తోచదు. ఒక తాపీపనివాడున్నాడనుకొనుడు. అతనికి ఆ తాపీ పని మాత్రము తెలియును. ఇతర లౌకికజ్ఞానము సున్న. దీనికి మఱొక కారణముకూడ నున్నది. కాంతి మిక్కిలి తీక్ష్ణముగ నున్నప్పుడు మన కన్నులు చూడలేవు. మన దృష్టిశక్తి యొక్క పరిమితిని దాటి మన కన్నులు చూడనేరవు. వాని నిర్మాణము అటులున్నది. కాని అంతరవలోకనప్రభా వముగల యోగి అట్లుకాదు. పామరులను ముసుగువేసి

కప్పియుంచు అనాత్మావరణమును భేదించుకొని పోయి ఆతడు చూడగల్గును.

నేడు అధ్యాత్మపుష్టినిచ్చు ఆహారముకొఱకు ప్రపంచము వేయికన్నులతో భారతదేశమువైపు చూచుచున్నది. ఈ భారతదేశము సమస్త జాతులకును అభిక్షను పెట్టవలసియున్నది. మానవకోటికి కావలయు పరమాదర్శము ఇక్కడమాత్రమే లభింపగలదు. పాశ్చాత్యపండితులు ఇప్పుడిప్పుడే ఈ విషయమును గ్రహింపగల్గుచున్నారు. ఈ ఆదర్శము మన సంస్కృతవాఙ్మయమునందును వేదాంతశాస్త్రమునందును సురక్షితమై యున్నది. యుగయుగములనుండి ఇయ్యది భారతీయుల ప్రత్యేకసంపదయై విలసిల్లుచున్నది.

చరిత్రదృష్టి ప్రసరించినంతవఱకు హైందవ సిద్ధాంతములను, తత్త్వసూత్రములను ప్రచారముచేయుటకై ఏ ప్రబోధకుడును ఇంతవఱకు హిందూదేశపు పొలిమేరలు దాటిపోయినట్లు కాన్పింపదు. కాని ఇప్పుడు అద్భుతమగు మార్పొకటి మనయందు కలుగుచున్నది. "ఎప్పుడెప్పుడు ధర్మము అణగిపోయి అధర్మము పెచ్చుపెరుగునో, అప్పుడెల్ల లోకమును రక్షించు నిమిత్తము నేను వచ్చుచుందును" అని శ్రీకృష్ణభగవానుడు చెప్పియున్నాడు. ఏ దేశమందేని శ్రేష్ఠమగు నీతిశాస్త్రము కలదేని అది మన దేశమునుండి పరిగ్రహింపబడినదిగనే యున్నదనియు, జీవుని నిత్యత్వముంగూర్చిన ఉత్తమభావములుగల మతము ఎందున్నను, అది ప్రత్యక్షముగగాని పరోక్షముగగాని, మనయొద్దనుండి గ్రహింప

బడినదిగనే యుండుననియు మతపరిశోధనలవలన తెలియ వచ్చుచున్నది.

ఈ పందొమ్మిదవ శతాబ్దాంత భాగమున జరుగు చున్నంతగా దుర్బలుర పైబడి దోచుకొనుటయు, దౌర్జన్యము చేయుటయు, పీడించుటయు ప్రపంచచరిత్రయందు ఏకాల మునను జరిగి యుండలేదు. వాంఛలను జయించుటవలన తప్ప ముక్తి చేకూరబోదనియు, విషయభోగములకు బానిసయై యుండునంతకాలము ఎవనికిని మోక్షము అలవడ దనియు ప్రతివాడును గ్రహింపవలసియున్నది. ఈ మహాసత్యమును సకలజాతులవారును నెమ్మది నెమ్మదిగ తెలిసికొని ఆమో దించుచున్నారు. శిష్యుడీ సత్యమును గ్రహించు నర్హతను పొందినతోడ్తోడనే, గురువుయొక్కబోధ వానిని రక్షింప వచ్చుచుండును. భగవంతుడు అనంతదయా సముద్రుడుగాన, తనబిడ్డలకు—వా రేమతము వారై నను—కరుణజూపుచునే యుండును. ఈ కరుణారాశి ఎన్నడును వట్టిపోవునది కాదు. మన ఈశ్వరుడును సమస్తమతములవారి ఈశ్వరుడును ఒక్కడే. ఈ అభిప్రాయము భారతదేశమునందు మాత్రమే గోచరించుచున్నదిగాని ప్రపంచములోని మఱే యితర మత గ్రంథమునందును కానరాదని నేను బాహాటముగా చాటి చెప్పుచున్నాను.

హిందువులమగు మనము ఈశ్వరేచ్ఛవలన బహు బాధ్యతాయుతమగు క్లిష్టపరిస్థితిలో నున్నాము. పాశ్చాత్య జాతులవారు ఆధ్యాత్మసాహాయ్యముకొఱకు మన దాపునకు

వచ్చుచున్నారు. మానవజన్మకు సంబంధించిన సమస్యలను గుఱించి ప్రపంచమునకు జ్ఞానదానము చేయుటకు తగిన సామర్థ్యమును సంపాదించు కొనవలసిన మహాభాగ్యత నైతికముగ భారత పుత్రులకు ఏర్పడినది. ఒక్క విషయము చూడుడు. కొండకోటలలో నివసించుచు అప్పుడప్పుడు వెలువడివచ్చి బాటసారులను దోచుకొనుచుండిన ఎవడోఒక దొంగలరాయని సంతానమని చెప్పుకొనుటకు ఇతర దేశము లందలి ఘనులును, మహాపురుషులును గర్వపడుచుందురు. కాని హిందువులమో, కొండలందును గుహలందును ఫల మూలములు తిని జీవించుచు పరమాత్మధ్యానమునందు కాలముగడపిన ఏ ఋషియొక్కయో, ఏ సాధుపురుషుని యొక్కయో సంతానమని చెప్పుకొని గర్వపడుచుందుము. ఈ నాడు మనము అధోగతిపాలై పసచెడి యుండవచ్చును. కాని మన మతమును గుఱించి శ్రద్ధపూని, సరియైన మార్గ మున పనిచేయ ప్రారంభించినయెడల మనము తిరిగి మహాను భావమును పొందగలము.

అత్యంతాదరముతో హృదయపూర్వకముగ మీరు నా కొసగిన స్వాగతమునకు వందనముల నర్పించుచున్నాను. ఈ రామనాడు మహారాజాగారు నాయెడల చూపుచున్న ప్రేమకు తగురీతిని నాకృతజ్ఞతను తెలుపగలుగుట సాధ్యము కాదు. నేను స్వయముగాగాని, యితరులద్వారాగాని ఏమేని సత్కార్యము చేసియుండినయెడల అందుకై హిందూదేశపు కృతజ్ఞత ఈ సత్పురుషునికే చెందవలసియున్నది. ఏమన, అసలు నేను "షికాగో" నగరమునకు పోవలయునని మొదట

సంకల్పముచేసినది వీరే. ఆభావమును నాకు సూచించి దానిని నిర్వహింప పట్టుపట్టి ప్రోత్సహించినదియు వీరే! ఇప్పుడు నా చెంతనే నిలుచుండి నేనింకను పనిచేయవలయునని వెనుకటి యుత్సాహముతోడనే ఆయన సదా ఆశించుచున్నారు. మన ప్రియమాతృభూమియెడ అభిమానమువహించి అధ్యాత్మ మార్గమున ఆమె నుద్ధరించుకొనుటకై పాటుపడుటకు ఇట్టి రాజన్యులు ఇంకను ఏడెనిమిదిమంది దొరకుదురుగాక యని నే నభిలషించుచున్నాడను.

శ్రీ రామేశ్వరాలయము నొద్ద శ్రీవారు "సత్యమగు ఈశ్వరార్చనము"ను గుఱించి ఒసగిన ఉపన్యాసము

మత మనునది భక్తిలో కలదుగాని బాహ్యార్చనము లందు కాదు. అది హృదయమునందు పూను నిర్మలమును నిష్కపటమును అగు ప్రేమయందుండును. నరుడు శరీరము నందును మనస్సునందును పరిశుద్ధుడైనచేగాని, దేవాలయ మునకు వచ్చుటవలనను, శివుని పూజించుటవలనను ఫలితము కలుగదు. మనస్సునందును శరీరమునందును పరిశుద్ధులగు వారి ప్రార్థనలకు శివుడు ప్రతిఫలము నొసంగును. తాము అపవిత్రులుగ నుండియు ఇతరులకు ధర్మబోధ చేయజూచు వారు తుదకు అపజయమునే గాంతురు. బాహ్యపూజ, అంత రంగిక పూజకు ఒక చిహ్నము మాత్రమే. అంతరంగిక పూజయు పరిశుద్ధతయు మాత్రమే వాస్తవముగ కావలసి

నవి. అవి లేని యెడల బాహ్యపూజకు ఫలముండదు. కాబట్టి మీరందఱు దీనిని జ్ఞప్తియుంచుకొనుడు.

ఈ కలియుగములో జనులు తాము ఏమి చేసినను సరియే, ఒక పుణ్యక్షేత్రమునకు పోయినమాత్రాన తమ పాపము లన్నియు తుమింపబడునని నమ్మినంత అధోగతిని పడిపోయినారు. కల్మషహృదయముతో దేవాలయములో అడుగు పెట్టినవాడు అదివఱకు వానికున్న పాపములు ఇంకను పెరిగి మఱింతపాపియగును. తీర్థమనగా పవిత్రవిషయముల తోడను, పవిత్రపురుషులతోడను, నిండియున్న స్థలమని అర్థము. కాని ఒకస్థలమున పవిత్రజనులుండి, అచ్చట దేవాలయము లేకున్నను అది తీర్థమేఅగును. నూరు దేవాలయము లున్న స్థలమున దుష్టజనులుచేరినచో తీర్థము అచ్చటనుండి అదృశ్యమగును. తీర్థక్షేత్రమునందు కాపురముండుట చాల కష్టము. ఏమన, సామాన్యస్థలములలో చేసినపాపమును సులభముగా పోగొట్టుకొనవచ్చును. కాని తీర్థక్షేత్రమున చేసినపాపమును తొలగించు కొనలేము. నిష్పాపులుగనుండి పరోపకారము చేయుటయే పూజ లన్నింటియొక్క సారము. దరిద్రునందును, దీనునందును, రోగియందును, శివుని చూడ గలుగువాడు నిజముగా శివపూజచేసినవాడు. విగ్రహమునందుమాత్రమే శివుని చూచువానిపూజ ప్రారంభదశదే. ఒక దరిద్రునియందు—వానిజాతినిగాని మతమునుగాని కులమునుగాని మఱిదేనినిగాని పాటింపక—శివునిచూచి, వానికి పాయపడి ఉపచారములు చేసినవానిపై శివున కెక్కువప్రీతి;

తన్ను దేవళము లందుమాత్రమే చూడగలుగునట్టి మను జునిపై అంత ప్రీతియుండదు.

ఒక ధనికునకు ఇద్దఱు తోటమాలీలు ఉండిరట. వారిలో ఒకడు చాలసోమరి; పనిచేసెడివాడుకాడు. కాని యజమాని తోటలోనికి వచ్చినప్పుడెల్ల లేచి చేతులు జోడించుకొని 'ఆహా మాదొరగారి ముఖము ఎంత సుందర ముగనున్నది!' అని పొగడుచు వాని యెదుట తన్మయత్వము నటించెడివాడు. రెండవతోటమాలి విశేషముగ మాటలాడు వాడు కాడు; కష్టపడి పనిచేసి అన్నిరకముల పండ్లను, కూర గాయలను పండించెడివాడు. వానిని నెత్తిని మోసికొనిపోయి దూరముననున్న యజమాని ఇంటికి చేర్చెడివాడు. ఈ ఇరువురు తోటమాలీలలో ఎవరిని యజమాని ఎక్కువగ మెచ్చుకొనునో ఆలోచింపుడు. శివుడే అట్టి యజమాని; ఈ ప్రపంచమే వానితోట; ఇక్కడ రెండు తీరులగు తోటమాలీ లున్నారు. ఒకడు సోమరి, మాయలమారి, ఏమియు పనిచేయడు. కాని శివునికన్నుల సొగసును, ముక్కుయొక్క చక్కదనమును, ఇతరావయవముల సౌందర్యమును ఊరక అభివర్ణించుచు స్తోత్రములు చేయుచుండును. రెండవవాడు శివుని సంతానమగు దరిద్రులను, దీనులను, సమస్త జంతుజాల మును, అదియిది యనలేల—సమస్త సృష్టిని—కనుపెట్టుచు, సేవించుచుండును. వీరిరువురిలో శివునకు ఎక్కువప్రియు డెవడు? అతని బిడ్డలకు సేవలుచేయువాడే అనుటకు సంశయము లేదు. తండ్రికి సేవచేయగోరునతడు, మున్నుందు వాని బిడ్డలకు సేవచేయవలయును. అట్లే శివుని సేవింపగోరు నతడు

ప్రథమమున వాని బిడ్డలకు—సమస్త జంతుజాలమునకు—సేవచేయవలయును, శాస్త్రములలో భగవద్భక్తులను సేవించువారు భగవంతుని సేవకులలో పరమోత్తములని చెప్పబడియున్నది. కావున దీనిని సదా జ్ఞప్తినుంచుకొనుడు.

పరమపవిత్రులుగనుండి, మీశక్తికొలది సాహాయ్యము కోరివచ్చు ఎవ్వనికైనను ఉపకారముచేయుచుండవలయునని మీకు మఱలచెప్పుచున్నాను. ఇదియే సత్కర్మ! దీని మహిమవలన చిత్తశుద్ధి లభించును. అప్పుడు ప్రతివాని యందును వసించుచున్న శివుడు ప్రత్యక్షముకాగలడు. అయన ప్రతివాని హృదయమునందును సదా వసించుచునే యున్నాడు. అద్దముమీద మురికిగాని దుమ్ముగాని ఉండిన యెడల మనస్వరూపము అందు ప్రతిఫలింపదు. అటులనే మన హృదయము లనెడు అద్దములమీద అజ్ఞానమను మురికి, దుర్మార్గమను దుమ్ము, పడుచుండును. ముందుగా మన మేలునే చూచుకొను స్వార్థపరత పాపములలో మహా పాపము. ఎవడు తాను ముందుతినవలయునని, ఇతరులకంటె ఎక్కువ డబ్బుసంపాదింపవలెనని, లోకములోని సమస్త సంపదలను పొందవలెనని ఆశపడునో, ఎవడు తాను ఇతరుల కంటె ముందుగ స్వర్గమునకుపోవలెనని, ఇతరులకంటె ముందుగ మోక్షమును పొందవలెనని అపేక్షించునో వాడే నిజమగు స్వార్థపరుడు. నిష్కామియగు నరుడు 'నేను తుది వఱకు ఆగియుందునుగాక; స్వర్గమునకు పోవలయునని నే నారటపడను; నాసోదరులకు ఉపకారము కలుగగలదేని అందులకై నేను నరకమునకైనను పోవుటకు సంసిద్ధుడనై

యుండును' అని పలుకును. ఇటువంటి స్వార్థరహితవృత్తియే మతమునకు నికషప్రాయము. ఇటువంటి నిష్కామబుద్ధి ఒకనియందు ఎంతెంత హెచ్చుగా నుండునో, అతడు అంతంతగా ఆధ్యాత్మ పరుడును, శివసాన్నిధ్యము పొందిన వాడును అగును. అతడు చదువరియైనను లేక నిరక్షరకుక్షియైనను శివునకు ఇతరులకంటె సమీపముగ నున్నవాడే! అతనికి ఆసంగతి తెలియవచ్చును, తెలియకపోవచ్చును. కాని స్వార్థపరుడగు నరుడు సమస్తదేవాలయములను దర్శించుచు, సర్వతీర్థములను సేవించుచు, చిరుతపులివలె శరీరమంతయు బొట్లు ధరించియుండియుగూడ శివునకు చాల దూరమునసే యుండును.

రామనాడునం దొసంగిన స్వాగతపత్రమునకు శ్రీ స్వాములవారి ప్రత్యుత్తరము

రామనాడునందు రాజాగారు శ్రీవివేకానందస్వాముల వారికి ఈక్రింది స్వాగతపత్రమును సమర్పించిరి:

పరమపవిత్రమూర్తీ, శ్రీపరమహంసా, యతిరాజా, దిగ్విజయ కోలాహల సర్వమతసంప్రతిపన్నా, పరమయోగీశ్వరా, శ్రీమత్ భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస కరకమలసంజాతా, రాజాధిరాజసేవితా, శ్రీవివేకానంద స్వామీ! అవధారు.

సేతుబంధ రామేశ్వరము, రామనాథపురము, రామనాడు అని పేరుగాంచిన ఈ చారిత్రకప్రసిద్ధమగు ప్రాచీన సంస్థానపు ప్రజలమగు మేము ఈ మన మాతృభూమికి హృదయపూర్వకముగా మిమ్ములను ఆహ్వానించుచున్నాము. విదేశయాత్ర ముగించుకొని మీరీ భారతభూమిపై అడుగిడిన తోడనే తమ చరణకమలములను మనసార అర్చింపగలిగిన మహాభాగ్యము లభించుట నిజముగ మా అదృష్టవిశేషమే. అందును, పురాణపురుషుడును, మన ఇష్టదైవమునుఅగు శ్రీరామచంద్రమూర్తి పాదస్పర్శచే పావనమైన ఈ తీరమందు మీకు మున్ముందుగ పాదార్చనముచేయగలుగుట మా పురాకృత సుకృతప్రాప్తముగా భావించుచున్నాము. అతిప్రాచీనమును, పరమపావనమును అగు మనమతము యొక్క శ్రేష్ఠత్వమును మహిమను పాశ్చాత్య పండితవరుల మనస్సులకు నచ్చజెప్పు మీ మాన్యతరప్రయత్నములకు చేకూరిన అసమానవిజయప్రాప్తిని వినిర్మలాభిమానము తోడను పరమసంతుష్టితోడను గమనించుచుంటిమి. హిందూ మతము విశ్వజనీన మతాదర్శ మనుటకు తగి, సర్వలక్షణ విరాజమానమై, సమస్తజాతులందును, సర్వసంప్రదాయములందును గల స్త్రీ పురుషుల చిత్తవృత్తులకును, అవసరములకును ఉపకరింపగలదై యున్నదని, యూరపు అమెరికాలయందు పండితసభలలో సుస్పష్టముగా సవిమర్శముగా అసమాన వాక్పటిమతో ప్రకటించి, వారికి నచ్చజెప్పితిరి. నిష్కామమగు ఉత్సాహముచే ప్రేరితులై పరమపవిత్ర సంకల్పముతో పరవశులై అద్భుత స్వార్థత్యాగముపూని

శాంతిధర్మసందేశప్రవక్తలై భారతీయ వేదాంతవిజయ పతాకమును, యూరపు అమెరికాల యందలి ఉత్తమక్షేత్ర ములందు నాటుకొనుటకు, అంతులేని మహాసముద్రములను సైతము దేవరవారు దాటిపోయితిరి. విశ్వసోదరత్వము ముఖ్యావశ్యకమనియు, అది సుసాధ్యమేయనియు, శ్రీవారు ఆచరణ పూర్వకముగను, సద్బోధల మూలముననను, ప్రచా రము గావించితిరి. అన్నిటికంటెను పాశ్చాత్యదేశములందలి మీ పరిశ్రమ ఉపేక్షితులగు భారతీయులను మేల్కొలిపి, వారి ప్రాచీన మతముయొక్క ఘనతను, మహిమను వారి దృక్పథమున బెట్టినది; అమూల్యమగు హైందవ మత ధర్మములను తెలిసికొని ఆచరింపవలయునను అకుంఠితాభి మానమును పరోక్షముగ వారి హృదయములందు పురికొల్పినది.

పూర్వపశ్చిమవాసుల పారమార్థిక పునరుజ్జీనన మునకై శ్రీవారు ఔదార్యముతో పూని నిర్వహించు చున్న యీ మహోద్యమమునకు శ్రీవారి యెడల మా హృదయములందు నిండిన సంతోషమును కృతజ్ఞతను ప్రకటించుటకు సమర్థములగు శబ్దములు మాకు స్ఫురింప కున్నవి. దేవరవారి ప్రియశిష్యవర్గములో నొకరగు మా రాజాగారి యెడల పరమపూజ్యులగు మీరు సదా చూపు చున్న వాత్సల్యమును, దేవరవారు ప్రప్రథమముగా ఈ రాజ్యమునందే ఓడదిగి గౌరవించినందులకు రాజాగారు పొందుచున్న సంతోషమును, అభిమానమునుగూడ, వర్ణింప

నలవిగాకున్నదని మనవిచేయక ఈ యభినందన పత్రమును ముగింపజాలము.

దేవరవారు ఎంతయో సమర్థతతో ప్రారంభించిన ధర్మ్మప్రచారకార్య్యమును కొనసాగించుటకు వలసిన దీర్ఘాయు రారోగ్య జవసత్త్వములను దేవరవారికి ప్రసాదించుగాక యని సర్వేశ్వరుని వేడుకొనుచు విరమించు చున్నారము.

రామనాడు } ఇట్లు భక్తి ప్రపత్తులతో నమస్కృతులర్పించు
25-1-1897 } శ్రీ పూజ్యపాదులవారి ప్రియశిష్యులు,
సేవకులు.

శ్రీస్వాములవా రీ క్రిందివిధమున ప్రత్యుత్తర మిచ్చిరి:

ఇక తెల్లవాఱదనుకొన్న రాత్రి మెలమెల్లగా గడచి చనుచున్నట్లున్నది. భరింపరాని తీవ్రవేదన ఎట్లో ఉపశమించుచున్నట్లు తోచుచున్నది. ఇంతకుముందు శవముగ గోచరించిన ఆకృతి నిద్రనుండి మేల్కొనబోవుతీరున, సజీవమువోలె, కానిపించుచున్నది. అదిగో వినుడు, ఏదోశబ్దము వినవచ్చుచున్నది. చరిత్రగాని, పురాణ గాథలుగాని గతకాలపు ఆ అంధకారములోనికి తొంగిచూడనైన సాహసింప జాలనంత దూరాననుండివచ్చు ఆ నాదము, ఎక్కడనుండియో కాదు, ఇక్కడనుండియే, భారత దేశమునుండియే, మన మాతృభూమినుండియే వెలువడి, అఖండజ్ఞానశీతగిరియొక్క కర్మ్మ భక్తి జ్ఞానశిఖరములందు మాఱుమ్రోగుచు మనకడకు వచ్చుచున్నది. ప్రశాంతమై సుదృఢమై, విస్పష్టస్వరకలితమై,

దినములు గడచినకొలది పెరిగి పెరిగి వినవచ్చుచున్నది. అల్లదే చూడుడు; అప్పుడే ఆ నిద్రిత మేలుకొనుచున్నది. మంచు కొండనుండి వెలువడు పిల్లగాడుపులీల అది వట్టి పోయిన కండరములలోనికిని, ఎండిపోయిన యెముకలలోనికిని, జీవము పోయుచున్నది! నిద్దురమత్తు తేటిపోవుచున్నది! అమ్మ మేలుకొనుచున్నది; మన దేశమాత దీర్ఘనిద్రనుండి మేల్కాంచుచున్నది. గ్రుడ్డివాడు మాత్రము చూడజాలడు; కుత్సితమతులు చూడనొల్లరు. అయిననేమి? ఇంకనామెను ఎవరును ఆపజాలరు! ఇంకనామె నిద్రపోదు. ఇకనామెను అన్యులెవ్వరు నిరోధింపనోపరు. అదిగో, ఆ అఖండశక్తి స్వరూపిణి దిగ్గునలేచి నిలబడుచున్నది!!

రాజా, రామనాడు వాస్తవ్యులారా! మీరు నన్ను ఇంత ఆదరణతోడను ప్రేమతోడను సన్మానించి నందుకు ఇవే నావందనములు! నోటితోపలుకు భాషకంటె హృదయము హృదయముతో ముచ్చటించుట మిన్నయగును గావున మీకింత ఔదార్యమును ప్రేమయు కలిగినవి. ఆత్మ ఆత్మతో నిశ్శబ్దముగ మాటాడగలదు; అయినను ఆభాష సుస్పష్టమైనదే. నాఅంతఃకరణమందు నేను దానిని గ్రహించుచున్నాను. రామనాడు రాజా! నామాట నమ్ముడు. పాశ్చాత్యదేశములలో మన మతమును గుఱించి గాని, మన మాతృదేశమును గుఱించిగాని అల్పప్రజ్ఞుడనగు నావలన ఏమేని ఉపకారము జరిగినదేని—మన యిండ్ల దాపుననే మనకు తెలియరాక లోతుగ పూడ్చిపెట్టబడి తరతరములుగ పడియున్న అమూల్య రత్నరాసులవైపు

భారతీయులదృష్టిని మరల్పయత్నించు నా ప్రయత్నము ఏమాత్రమేనిసఫలమైనదేని—దాపున నీరుగలదని యెఱుంగక గ్రుడ్డివారై దప్పిచేత చచ్చుటకంటెను, ఎక్కడికోపోయి ముటికిగోతుల నీరు త్రాగుటకంటెను, తమగృహముల ప్రక్కనే నిరంతరము ప్రవహించుచున్న స్వచ్ఛజలధారల చెంతకేగి తృప్తిదీఱ గ్రోలుడని వారికిత్రోవ జూపజాలితినేని—భారతదేశమున ప్రతి విషయమునందును మతమే, మత మొక్కటియే, ప్రాణాధారమనియు అది నష్టమైనచో, రాజకీయ తంత్రములెన్ని చేజిక్కినను, సంఘసంస్కరణము లెన్ని సాగినను, ప్రతి భారతీయుని నెత్తిమీద కుబేరసంపదలు వచ్చిపరిగిపడినను కూడ, భారతమాతకు మరణము తప్పదని తెలిపి మన సోదరులను కార్యోన్ముఖుల చేయుటలో ఏమేని ఫలితము కాన్పించెనేని—భారతదేశమేకాక ఇట్టికృషి జరిగిన ప్రతి ఇతరదేశముకూడ, ఓ రామనాడు రాజా! మీ యెడ కృతజ్ఞత చూపవలసియుండును. ఏలయనగా ఇట్టిసంకల్పమును మొదట నాకుకలిగించినది మీరే; ఆపనియందు నిరంతరము ఉత్సాహము పురిగొలిపినదియు మీరలే; ఏమి జరుగనున్నదో దివ్యదృష్టితో మీరు గ్రహించినట్లుగా నాచేయి పట్టుకొని, ఎల్లెడల అండగా నిలిచి, నన్ను నిరంతరము ప్రోత్సహించుచు వచ్చితిరి. కావున నా విజయమును గుఱించిన ఆనందోత్సవము జరుపుటలో మీరు మొదటి వారగుట ఉచితమే. నేను భారతదేశమునకు మరలి వచ్చునపుడు మొట్టమొదటగా మీ సంస్థానపుపొలిమేరలపై అడుగిడుటయు సమంజసమే.

ఇప్పుడు గొప్ప గొప్ప కార్యములు జరుగవలసి యున్నవి. విచిత్రశక్తులు పనిచేయవలసి యున్నవి. మీరు ఇదివఱకే తెల్పియున్నటుల, ఇతరదేశీయులకు మనము చాల విషయములను నేర్పవలసియున్నాము. పారమార్థికతకును, వేదాంతమునకును, సంఘనీతికిని, సాధుత్వమునకును, ప్రియ వర్తనమునకును, ప్రేమకును ఇదియే మాతృభూమి. అవి నేడును సజీవములై యున్నవి. ఈ విషయములలో ప్రపంచము లోని అన్ని దేశములలోను భారతదేశము ప్రధాన మనియు, మొదట నిలువదగినదనియు, ధీరుడనై నిలిచి సాహసముతో పలుకుటకు నా ప్రపంచానుభవము అర్హత నొసంగుచున్నది. ఈ చిన్న సంఘటనమును గమనింపుడు. గడచిన నాలుగైదు సంవత్సరములలో గొప్ప రాజకీయ సంస్కరణములు జరిగినవి. ఆయా దేశములందు ఇప్పుడున్న వ్యవస్థలను పూర్తిగా తలక్రిందులు చేయుటకు పూనుకొని, కొంతకొంతగా ఫలమును సాధించుచు, పాశ్చాత్య ప్రపంచ మందంతటను మహోద్యమ ములు పని చేయుచున్నవి. వానిని గుఱించి ఏమేని వినియున్నారేమో, మన సోదరులను అడుగుడు; వానిని గుఱించి ఒక్కమాట యైనను వీరు వినియుండరు. ఐనను షికాగో నగరమున ఒక మహామతసభ జరిగెననియు, ఆమహాసభకు భారతదేశమునుండి ఒకసన్న్యాసి వెళ్లెననియు, అక్కడ మిగుల ఆదరింపబడెననియు, అప్పటినుండి పాశ్చాత్యదేశ ములలో ప్రచారము సాగుచున్నదనియు, ఇచ్చటి నిరు పేదయు ఎఱుంగును. మనసామాన్యప్రజలు మూఢులనియు, వారికి విద్యయందు అభిలాష లేదనియు, ఏవిషయమేని తెలిసి

కొన నిచ్చగింపరనియు, చెప్పగా వినుచు వచ్చితిని. ఒకానొకప్పుడు ఈ అభిప్రాయము నాకును కలిగియుండెను. ఎప్పుడొప్పుడూహాకల్పనలకన్నను, ప్రపంచసంచారులు, కువిమర్శకులు వ్రాసిన పుస్తకరాసులకన్నను, స్వానుభవము మహోత్తమ గురువని గ్రహించితిని. భారతీయులు మూఢులు కారనియు, మందబుద్ధులు కారనియు, ఏ ఇతరజాతికిని తీసిపోని జ్ఞానసముపార్జనాశక్తి కలవారే యనియు, నా అనుభవము నాకు తెలుపుచున్నది. కాని ప్రతిజాతికిని నిర్వహింపవలసిన కర్తవ్యమొకటికలదు. ప్రతిజాతికిని స్వభావసిద్ధముగా పుట్టువుతో వచ్చినవ్యక్తిత్వమును, ప్రత్యేకలక్షణములును ఉండును. ఈ నానాజాతిరాగసమ్మేళనమున ప్రతిజాతియు ఒక్కొక విశిష్ట స్వరము. ఆ విశిష్టతయే దానిప్రాణము; దానికి ఆయువుపట్టు. అది ఆ జాతికి వెన్నెముకవంటిది. ఆ జాతి జీవసారమునకు అదియే మూలాధారము, ఉత్పత్తిస్థానము. ఇచ్చట మనపుణ్యభూమికి మతమే ఆయువుపట్టు, జీవనాధారము. ఇతరులు రాజకీయముల గుఱించి ప్రసంగింతురుగాక; వర్తకమువలన తమకువచ్చి పడు ధనరాసులను లెక్కించుకొని మురియుదురుగాక; వ్యాపారమూలమున తమకు చేకూరిన అధికారవ్యాప్తినిగూర్చి గర్వింతురుగాక; ఐహిక స్వాతంత్ర్యసంపదను గుఱించి ప్రగల్భములు పలుకుదురుగాక. కాని ఇవి భారతీయునికి అర్థముకావు. అర్థము చేసికొనుటకును అతడు ప్రయత్నింపడు. వేదాంతము, మతము, భగవంతుడు, జీవుడు, బ్రహ్మము, మోక్షము మున్నగువానినిగూర్చి పరీక్షించినచో ఇతరదేశములందు

తత్త్వవిదులని పేరుగాంచిన చాలమందికన్న మనదేశము లోని మామూలు సేద్యగానికికూడ ఎక్కువ తెలిసియుండును. ఇది యథార్థము. ఆర్యులారా, మనము ప్రపంచమునకు కొంత బోధింపవలసి యున్నామని చెప్పియుంటిని. ఈ కారణము చేతనే, ఈ ఈశ్వరేచ్ఛవలననే, మన జాతికి శతాబ్దములకొలది మహోపద్రవములు తటస్థించినను, దాదాపు వేయి సంవత్సరములుగా విదేశీయుల పరిపాలన క్రింద పడియున్నను, పరదేశీయులు మనలను ఎంతగా అణగ ద్రొక్కుచున్నను, ఈ మనజాతి ఇంకను సజీవముగ నిలిచి యున్నది! దీనికి చావులేదు, ఇది అమరము. ఇది భగవంతుని యెడ ప్రపత్తిగలిగి మతధర్మమునకును అధ్యాత్మజ్ఞానమునకును కారణాచిరై యుండుటే ఇందుకు కారణము.

పాశ్చాత్యజాతులును ఇతరజాతులును కూడ, ఇప్పుడు మితిమీరిన రాజ్యాధికార వాంఛల తోడను, సాంఘిక కుతంత్రములతోడను, విసిగి వేసారి, సగము చచ్చి, అధోగతిని పడియున్నారు. వారికి ప్రాణము పోసి నూతనోజ్జీవము కల్పింప గల మహాశక్తి—ప్రపంచమంతటను వెల్లువలై ప్రవహింప వలసిన మతధర్మముల, సత్యాత్మత త్త్వముల మూలశక్తి, ఇక్కడనే కలదు. భారతదేశ వాతావరణ మెల్లనిండి హోరున పైకెగయుచున్న యీ అనురూపవిరూప నానావిధశబ్ద ఘోషలనుండి, ఒక్క పలుకు — పరమోత్కృష్టమును, ప్రస్ఫుటమును, పరిపూర్ణమునై వినవచ్చుచున్నది. అది "త్యాగము" అను శబ్దము. త్యాగము చేయుడు! భారత దేశపు మతధర్మము లన్నిటికిని ఇది మూలమంత్రము. ఈ

ప్రపంచము మూడునాళ్లముచ్చట. ఈ ప్రస్తుతజన్మ క్షణ భంగురము. ఆవల—ఈ బూటకపు ప్రపంచమును దాటి దూరముగా—అఖండబ్రహ్మము వెలుంగుచున్నది. దానిని వెదకుదముగాక. ఈ విశాల జగమును సయితము చిన్న బురదగుంటగా భావించునట్టి సాహసులగు వీరులును, మనీషా వంతులగు ఋషిప్రవరులును, ఈ ఖండమున తేజరిల్లిరి. వీరు ఈ విశ్వమునుదాటి ఆవల చాలదూరము పోయియుండిరి. అనంతమగుకాలము సైతము వారికి లెక్క—లేదయ్యెను. కాలమును దాటి, కాలపరిమితులను అతిక్రమించి, వారు చాలదూరముపోయిరి. ఆకాశము వారికి లెక్క—లేదయ్యె; దానినిదాటియు వారు పోజూచిరి. ఈ వికారమయప్రపంచ మును దాటి ఇటులపోవుటయే మతధర్మ సూక్ష్మము. ఈ అతీతభావనయే—సర్వమును అతిక్రమించిపోవు ఈ పూనిక—యే—ప్రకృతి ముఖమును కప్పిపెట్టిన ముసుగును బదాబదలుగా చించివైచి, ఏ మైనను సరియే, ఏమివాటిల్ల నున్నను సరియే, ఆపరమందున్నదాని జాడను కనుగొని తీరవలయునను దీక్ష—యే—ఈ జాతికి విశిష్ట లక్షణము. ఇది మన పరమధర్మము. కాని ఒక దేశములోని ప్రజలందఱును నిండు త్యాగము పూనజాలరనుటయు సత్యమే. అయినను త్యాగముపూనువారికి ఉత్సాహముగొలుప దలచితిరేని, అటుల చేయుటకు మార్గముకలదు. రాజకీయములగుఱించి, సంఘపునరుద్ధారణమును గుఱించి, మీరు చేయు ప్రసంగ ములు, ధనార్జనమునకును వాణిజ్యమునకును ఉపకరించు మీ బోధలు—ఇట్టి వన్నియును, బాతువీపుమీద పోసిన నీటివలె

అప్పుడప్పుడే జారిపోవును. కావున మీరు ప్రపంచమునకు బోధింపవలసి యున్నది ఈ త్యాగతత్త్వమే. మనమును ఏమేని నేర్చుకొనవలసి యుండునా? ఈ ప్రపంచమునుండి మనము ఏమైన గ్రహింపవలసియున్నదా? బహుశః ఒకింత భౌతిక శాస్త్రజ్ఞానము, నిర్మాణకౌశలము, ప్రకృతిశక్తులను వశముచేసికొని ప్రయోగములను చేయు విధానమును, స్వల్పాధారములనుండి ఘనతర ఫలమునుపొందగల యుక్తిని, మనము కొంచెము నేర్చుకొనవలసియుండును! సరే, దీనిని కొంతవఱకు పాశ్చాత్యులనుండి నేర్చుకొందము. అంతియే గాని, ఈ భారత దేశమునకువచ్చి, 'తినుట, త్రాగుట, వినోదములతో కాలము గడపుటమాత్రమే' పురుషార్థముగా బోధింప నెంచువాడు, ఈ జడప్రపంచమును పరమదైవత ముగ రూపింప జూచువాడు—అట్టి వాడెవడైనను మోస గాడే! ఈ పుణ్యభూమియందు వానికి తావు లేదు. వానినుండి అటువంటి దానిని నేర్చుకొనుటకు భారతీయుని మనస్సొప్పదు. పాశ్చాత్యనాగరికతలోని మెఱుపులు, తళుకులు కన్నుల నెంత జిగేలుమనిపించుచున్నను, దాని అధికార ప్రాబల్యము ఎంత విశాలమైనను, అది సర్వము నిష్ఫలమే అని ఈవేదికపై నిలిచి మోమోటమిలేక వారికి తెలుపుచున్నాను. అది అంతయును బూటకములలో బూటకము. భగవంతుడొక్కడే సత్యము; ఆత్మఒక్కటియే నిత్యము; అధ్యాత్మమే శాశ్వతము; దానిపట్టు వీడకుడు!

కేవలపరమార్థధర్మమును అవలంబించుట కింకను పక్వదశకు వచ్చియుండనివారు మనలో అనేకులు కలరు.

మన అవసరములకు తగినట్లు కొంచెము సంస్కరించుచో, పాశ్చాత్యుల భౌతికశాస్త్రవాదము అట్టివారికి కొంచెము ఉపయోగపడునేమో! ఒక పొరపాటు ప్రతి దేశమునందును, ప్రతి సంఘమునందును కనబడుచున్నది. ఆవిషయము బాగుగా తెలిసిన భారతదేశమునందు సైతము ఆ పొరపాటే జరుగుట మిక్కిలి శోచనీయము. ప్రస్తుతము అర్హత గడించి యుండని ప్రజలకు బలాత్కారముగ అత్యుత్తమ పారమార్థిక ధర్మములను ఉపదేశించుట ఇటీవల ఆచారమై పోయినది. నామార్గము మీ మార్గము కాకపోవచ్చును. సన్న్యాసము భారతజీవితమునకు పరమ ధర్మమని మీకందఱికును తెలిసియే యున్నది. ప్రతివానికిని మనశాస్త్రములు ''త్యాగమును'' విధించుచున్నవి. ఈ ప్రాపంచిక భోగములను అనుభవించిన ప్రతి హిందువును, తన జీవితాంత్య భాగమున వైరాగ్యము పూనితీరవలయును. అటుల చేయని వాడు హిందువేకాడు. తాను హిందువునని చెప్పుకొనుటకు వానికి అర్హతలేదు. ఈప్రపంచభోగముల బూటకమును అనుభవపూర్వకముగా తెలిసికొనిన పిమ్మట, వానిని త్యాగముచేయుట పరమాదర్శమని మన మెఱుగుదుము. ఈజడప్రపంచము, లోన డొల్లయనియు, దానిలోపల ఉండునది బూడిదయేయనియు గ్రహించి విడిచివేసి, వెనుకకు మరలవలయును. మనస్సు ఇంద్రియముల వెంటబడి సుడులు తిరుగుచు వెలుపలికి పోవుచున్నది. ఆమనస్సు అంతర్ముఖము కావలెను. ప్రవృత్తి ఆగిపోవలయును, నివృత్తి ఆరంభము కావలయును; అదియే ధర్మము. కాని ఈ ఆదర్శమున

కొంతఅనుభవము కలిగిన పిమ్మట మాత్రమే గ్రాహ్యము కాగల వైరాగ్యధర్మమును పసివానికి నేర్పలేము. పసివాడు ఆవేశపరవశుడై జన్మించుచున్నాడు. వాని జీవితమంతయు వాని ఇంద్రియములలో నుండును. వాని జీవితమంతయు ఒక ఇంద్రియభోగరాశి. అటులనే ప్రతి సంఘమునందును పసి వారినిబోలు పురుషులుందురు. వారికి కొంత అనుభవము కావలసియుండును. కొంత భోగమును అనుభవించిన పిమ్మ టనే, వారు దానిని బూటకమని గ్రహింపజాలుదురు. అప్పుడు వారికి వైరాగ్యమబ్బును. అటువంటివారికి తగినంత అవకాశమును ఈయవలెనని మనశాస్త్రములు చెప్పుచునే యున్నవి. కాని ఇటీవల, దురదృష్టవశమున, సన్న్యాసి ధర్మములచే కట్టుపడియుండునో, ఆ ధర్మములచేతనే ప్రతి వాడును కట్టుపడి ఉండవలయునను వాదన బయలుదేఱినది. అదిచాల పొరపాటు. ఈ పొరపాటేలేనియెడల, మన దేశములో ఎల్లెడల గోచరించు దారిద్ర్యమును, దైన్య మును చాలవఱకు తగ్గియుండెడివి. అతితీక్ష్ణమైన ఆధ్యాత్మిక నైతికధర్మములు పేదవానిజీవితమును అన్నివైపుల క్రమ్ము కొనియున్నవి. వీనివలన ఆ దరిద్రునకు ప్రయోజనములేదు. అట్టిబంధములను తొలగించివేయుడు. పాప మా దరిద్రుని ఒకింత సుఖమును అనుభవింపనిండు. అప్పుడతడు, తనంతట తానే ఉత్తీర్ణుడగును. ఆ పిమ్మట వైరాగ్యము దానంతట నదియే వచ్చును. బహుశః ఈ విషయములో పాశ్చాత్యుల నుండి మనము కొంత నేర్చుకొనవలెను. కాని ఇట్టి విషయ ములు నేర్చుకొనుటలో జాగ్రత్త చాల అవసరము.

పాశ్చాత్యభావములను అలవఱచుకొనినవారిలో కొందఱి ఆదర్శములు దాదాపు భ్రష్టమై యుండుటను చూచుచున్నా నని తెలుపుటకు మిక్కిలి విచారపడుచున్నాను. భారత దేశమున మనమార్గమనందే మనను నలిపివేయు రెండు పెద్ద తిరుగలి రాళ్ళున్నవి: తాతలనాటి పూర్వాచార పరాయణత ఒక తిరుగలిరాయి; ఈనాటి యూరపు నాగరికత మఱియొక తిరుగలిరాయి. వీని రెంటిమధ్య పడి ప్రజలు నలుగుచున్నారు. నామట్టుకు నేను పూర్వాచార పరాయణతకే ఒప్పుకొందును. యూరపువారి పద్ధతిని మాత్రము ఒప్పుకొనజాలను. ఏల యందురా, పూర్వాచారము ననుసరించువాడు తెలివితక్కువవాడుగ నుండవచ్చును; మోటువాడుగ నుండవచ్చును; కాని వానియందు పురుషలక్షణ ముండును. వానికి భక్తి కలదు; వానికి బలము కలదు; అతడు తన కాళ్లపై తాను నిలుచును (అనగా స్వతంత్రుడు). ఇక యూరపియను పద్ధతిని అవలంబించువాడో చంచలుడు, అస్వతంత్రుడు, గాఢపరిజ్ఞానశూన్యుడు. అతడు ఎక్కడపట్టిన అక్కడ, తన చేతికందినభావములను ప్రోగుచేసికొని వికట స్వరూపియైయుండును. ఈ భావములను అతడు జీర్ణముచేసికొనడు. అవి వానిలో ఇమడవు. వాని చందమునకు సరిపడవు. అతడు తనకాళ్లపై తాను నిలబడలేడు. వానితల గిఱ్ఱ గిఱ్ఱ తిరిగి పోవుచుండును. వానికర్మలకు సంకల్పశక్తి ఎక్కడిది? ఆంగ్లదేశీయులు దయచూచి వీపు తట్టిన వానికి చాలును. యూరపియనుల మెప్పుకోసమై ఏవో కొన్ని సాంఘికదురాచారములను నోటికివచ్చినట్లెల్ల

తిట్టి తన సంఘ సంస్కరణాభిమానమును ప్రదర్శించుకొనును. అతడు మన ఆచారములలో కొన్నింటిని చెడ్డవనుట, కేవలము, యూరపియనులు అటుల చెప్పుచున్నాడు గనుకనే! అతడిచ్చు సమాధానమును ఇంతే! నాకిట్టివి గిట్టవు. నీ స్వశక్తి పైని ఆధారపడి నిలిచి చచ్చినను మేలే. ప్రపంచములో పాపమేదేని ఉన్నయెడల అది దౌర్బల్యమే. సర్వవిధములగు దౌర్బల్యములను తొలగించుకొనుడు; దుర్బలత పాపము. దుర్బలతయే మృత్యువు. ఈ దుర్బల చంచలాత్మలను మానవులనుటయే తప్పు. సరే, వారినేమని పిలువవలయును? మీరే ఊహించుకొనుడు. కాని, పూర్వాచార పరాయణులో, పట్టుదల గలవారు; పురుషులు. ఉత్తమాదర్శ పురుషులు ఎల్లప్పుడును ఉందురు. అట్టి ఒకరిని మీకిప్పుడు చూపుదును. ఇదుగో, వారు మీ రామనాథరాజాగారే. వీరిని మించిన శ్రద్ధావంతుడగు హిందువును ఈ దేశమున ఎల్లెడల వెదకినను మీరు కాంచబోరు. పూర్వపశ్చిమ దేశముల వ్యవహారముల రెంటిని సంపూర్ణముగ తెలిసికొనుటలో గాని, ప్రతిజాతి నుండియు శ్రేష్ఠమగు విషయములను అవకాశమున్నంతవఱకును స్వీకరించుటలో గాని, ఈ దేశమున ఇంకేరాజైనను మీ రాజును మించజాలడు. అట్టిరాజు మీకు లభించియున్నాడు. "ఉత్కృష్టజ్ఞానమును పూర్ణశ్రద్ధతో కనిష్ఠజాతినుండియైనను స్వీకరింపుము. మోక్ష మార్గము పంచముని వలన లభింపనున్నను, వానికి శుశ్రూషలుచేసి తెలిసికొనుము. కన్యరత్నసమానమైనచో అంత్యజాతిలోని హీనకుటుంబములోనున్నను ఆమెను పెండ్లిచేసి

కొనుము.'' అసమాన మహనీయమూర్తియు ఉత్తమధర్మ స్మృతికర్తయునగు మనువుయొక్క శాసన మితీరుననున్నది. ఇది సత్యము. మీ కాళ్లపైని మీరు నిలువుడు. మీకు అలవియగుదానిని జీర్ణించుకొనుడు. ప్రతిజాతి నుండియు జ్ఞానమును స్వీకరింపుడు. మీకు శ్రేయము కూర్చుదానిని పరిగ్రహింపుడు; అయినను మనము హిందువులము గనుక సర్వమును మన జాతీయధర్మములకు లోబడియే జరుగవలసి యుండును. ప్రతినరునకును ఒక జీవితపరమార్థము కలదు. అది వాని అనంతపూర్వకర్మ ఫలితార్థము. మీలో ప్రతి వాడును అత్యద్భుతమగు పిత్రార్జిత సంపదతో పుట్టి యున్నాడు. అది మీ భవ్యజాతీయజీవనముయొక్క అఖండ పూర్వార్జితకర్మఫలమే. లక్షలకొలది మీ పితరులు మీ ప్రతికార్యమును కనుపెట్టి చూచుచున్నారనుకొని జాగ రూకులై మెలగుడు. ప్రతి హిందూబాలుడును పుట్టునప్పుడు తనతోడ తెచ్చికొను నిర్ణీతకర్తవ్యమెద్ది? బ్రాహ్మణ జన్మను గుఱించి మనువు ఏమని ధీరముగా ప్రతిజ్ఞ చేసెనో మీరు చదివియుండలేదా? బ్రాహ్మణజన్మ ''ధర్మమను ధనాగారము యొక్క రక్షణకొఱకు'' అని ఆయన వ్రాసియున్నాడు. ఆ మాట ఈ పుణ్యభూమియందు జన్మించు బ్రాహ్మణునికే గాక, ప్రతివానికిని జీవితపురుషార్థమని నేను చెప్పుచున్నాను. ''ధర్మమను ధనాగారముయొక్క రక్షణకొఱకు'' అను మాటలను గుర్తుపెట్టుకొనుడు. మనజీవితమందలి యే యితర సమస్యయైనను, ఈ ఏకైక సూత్రమునకు లోబడియుండవలసి నదే! సంగీతమునందు లయకలుపుకొను సూత్రము కూడ

ఇటువంటిదే. రాజకీయాధికారము ప్రధాన జీవితధర్మముగా గల ఒక జాతి యుండవచ్చును. ఆ ముఖ్య జీవితధర్మమునకు, వారి మతమును, వారి సర్వమును లోబడి నడువవలసినదే. అధ్యాత్మజ్ఞానమును వైరాగ్యమును ప్రధానజీవనధర్మముగా గలిగి, 'ఈ ప్రపంచమంతయు బూటకము; మూన్నాళ్ళ ముచ్చట' అనెడు ధర్మసూత్రముపై నడచుచున్న మఱొక జాతి ఇక్కడ నున్నది! సర్వమును—ప్రకృతిశాస్త్రములు గాని, కళలుగాని, భోగములుగాని, అధికారములుగాని, సంపదలుగాని, పేరుగాని, ప్రతిష్ఠలుగాని—ఆ ఒక్క ధర్మమునకు లోబడి పోవలసినవే. భారతీయుని శీలముయొక్క రహస్యమిది. ప్రతి హిందూశిశువునకును నైజమైన ఈ ఒక్క ప్రధాన ధర్మమునకు అనగా—పారమార్థికతకు, జాతి పవిత్రతకు—అతని సర్వస్వము లోబడవలసినదే. యూరపియనులవలన అతడు గ్రహించిన ప్రకృతిశాస్త్రవిజ్ఞానమేకాక తనకలిమి, పదవి, ప్రఖ్యాతి, సర్వమును దానికి లోబడి తీఱవలెను. అదియే వాని జాతీయజీవనమునకు కీలకము! ఆధ్యాత్మికతయనెడు జాతీయజీవనస్రవంతిని తన సర్వస్వముగ పెట్టుకొనిన పూర్వాచారపరాయణుడు ఒకపక్షమునను, ఆధ్యాత్మికతయనెడు జీవనసూత్రమును జాఱవిడిచి పాశ్చాత్యులనుండి బిచ్చముగాగొనిన కృత్రిమభావములను అమూల్యముగానెంచి మనస్సున పాదుకొల్పినవాడింకొకపక్షమునను కలడు. వీరిద్దఱిలో పూర్వాచారపరుడగు మొదటి వానినే ఇక్కడనున్న ప్రతివాడును అభిమానించు ననుటలో నాకు సంశయము లేదు. ఏలయన వానియందు మనము

విశ్వాస ముంచదగును. జాతిధర్మము అను పట్టుకొమ్మ వానికి కలదు. కావున, అతడు సజీవుడై నిలువగలడు. కాని ఆ రెండవ పురుషునకో మరణమే గతి! ఒకని ఆయువుపట్టు చలింపనంతవఱకు, వాని జీవచేష్ట సురక్షితముగా నున్నంత వఱకు, ఇతరములగు ఇంద్రియచేష్టలకు హానికలిగినను, ప్రమాదము లేక ఆ వ్యక్తి బ్రతికియుండగలుగును. వ్యక్తి జీవనవిధమునఁనే, మన జాతీయజీవనధర్మము సురక్షితముగా నుండువఱకు మనజాతిని నాశనముచేయగల దేదియు నుండదు. కాని నా మాటలను గుర్తు పెట్టుకొనుడు : ఆధ్యాత్మధర్మమును జారవిడిచితిరేని, దానిని ఆవలత్రోసివేసి పాశ్చాత్యుల ప్రాపంచిక నాగరికత వెంటబడితిరేని, దాని ఫలితార్థముగా, మూడుతరములలో మీ జాతి వినాశముజెందును. మీ జాతీయభవనపు పునాదులు పెళ్ళగిలి మీ జాతి సర్వనాశము చెందును.

కావున స్నేహితులారా! దీనిని తప్పించుకొనుటకు మార్గము ఒక్కటే కలదు. ఈ అధ్యాత్మధర్మమును మనము గట్టిగాపట్టుకొని యుండవలెను. మన ప్రాచీనులు మనకు కరుణించి ఒసగిన అమూల్య వరప్రసాదమిదియే! ఏదేశమందైనను, మహాచక్రవర్తులు సైతము తమకు గోత్ర పురుషులుగా, రాజులనుగాని, కొండకోటలలో నివసించు నిస్సహాయులగు మార్గస్థులను దోచుకొనుచు వచ్చినదొంగ దొరలనుగాని పేర్కొనక, దిగంబరులై అడవులలో వాసము చేయుచు వచ్చినసాధువులను పేర్కొనుటను మీరెన్నడైనను వినియున్నారా? అటువంటి భూమియొక్క పేరును మీరు

ఎన్నడైన ఆలకించితిరా? ఆ దివ్యభూమి ఇదియే సుడీ! ఇతర దేశములలో గొప్పమతగురువులు ఎవఁడోఒక రాజు తమ గోత్రపురుషుడని రుజువుచేయ ప్రయత్నింతురు. కాని ఇక్కడన్ననో, మహారాజులు సైతము ఎవడో యొక పురాణ ఋషినితమ గోత్రపురుషునిగా చెప్పుకొందురు. కాబట్టి మీకు అధ్యాత్మధర్మమునందు నమ్మకమున్నను లేకపోయినను, జాతీయజీవనముకొఱకైనను మీరు అధ్యాత్మధర్మమును చేపట్టి దాని ననుసరింపవలసియున్నది. ఆ పిదప రెండవచేతిని చాచి ఇతర జాతులనుండి మీకు దొరకుదానినెల్ల సంపాదించుకొనుడు. కాని ఆ సర్వమును మీ యేకైక జాతీయ ధర్మమునకు లోబడునట్లు చేయవలసియే యుండును! ఆమార్గమున అద్భుతముగా, మహిమాఢ్యముగా, భావి భారతభూమి ప్రకాశింపనున్నది. ఆ దివ్యప్రకాశచిహ్నములు ఇపుడే కన్పించుచున్నవని నా నమ్మకము. అది ప్రాచీన భారతము కంటె ఉజ్జ్వలమై ప్రకాశించును. పూర్వపుఋషు లందఱి కంటె గొప్పవారగు ఋషులు పుట్టనున్నారు. మీ పితృదేవతలు సంతృప్తులగుటయే గాక, తమతమ లోకములనుండి తొంగిచూచుచు, తమ సంతానము మహాతేజోవంతులును, మహాపురుషులును నగుటకు వారెంతయు సగర్వముగా ఆనందింతురని నా నిశ్చయము.

కాబట్టి మన మందఱమును శ్రమపడి పనిచేయుదుము గాక. ఇది నిద్దురపోవుటకు సమయముకాదు. భావి భారతోదయము మన చేతలపై నాధారపడియుండును. అతల్లి సంసిద్ధముగా వేచియున్నది. ఆమె కొంచెముగా కునుకుచున్నదేమి?

లెండు! మేల్కాంచుడు!! అదిగో ఆ సనాతన ధర్మసింహాసన మున నవయౌవనముతో పూర్వముకంటె దేదీప్యమానముగ వెలుంగుచు మన దేశమాత ఆసీనయై యున్నది! కన్నువిచ్చి చూడుడు. ఆ భగవత్ స్వరూపము మన మాతృదేశములో వలె ఇంత ప్రస్ఫుటముగా మఱి యెచ్చటను ప్రకాశించి యుండలేదు. మఱెచ్చోటను ప్రజలు భగవంతుని ఇట్టి రూపముతో భావనచేసి యెఱుగరు. ఒక వేళ నా ధీరోక్తులను విని మీరు అబ్బురపడవచ్చును. మనకుగల భగవద్భావనకు సమమగునట్టి భావనను ఇతరుల మతగ్రంథములలో ఎందేని చూపుడు. వారికికలది గోత్రదేవతలు మాత్రమే. యూదుల దేవుడు, అరబ్బుల దేవుడు, ఈ కుల దేవతగనో ఆ కుల దేవత గనో ఉన్నారు. పైగా ఒకరి కుల దేవత తక్కినవారి కుల దేవతలతో సదా పోరుసలుపుచుండును. కాని మనతండ్రియై, మనతల్లియై, మన మిత్రమై, మన సఖులకు సఖుడై, మన ఆత్మలకు పరమాత్మయై పరగు మనదేవుడు సర్వశుభంకర మూర్తి! అపార కరుణాస్వరూపి! ఇట్టి భగవద్భావన ఇక్కడనే — ఈ భారతదేశమునమాత్రమే — చూపట్టును. శైవులకు శివుడును, వైష్ణవులకు విష్ణువును, కర్మపరాయణులకు కర్మదేవతయు, బౌద్ధులకు బుద్ధుడును, జైనులకు జినుడును, క్రైస్తవులకు యూదులకు యెహోవాయును, ప్రతి సంప్రదాయమునకు ఆ సాంప్రదాయక దేవతయు, వేదాంతులకు బ్రహ్మమునై యొప్పు ఆ సర్వేశ్వరుడు, ఈ దేశమునందు మాత్రమే పూర్ణతేజముతో సాక్షాత్కరించును. ఆ సర్వ వ్యాపి మనలను ఆశీర్వదించుగాక! మనకు అండయై నిల్చు

గాక! మనకు బలమును ప్రసాదించుగాక! ఈదివ్యభావమును ఆచరణలో పెట్టగల సాహసమును మనలకొసంగుగాక! మనము వినినదియు, మనము చదివినదియు, మనలో సంస్కారరూపమున వెలయుగాక! అది మనకు సత్యమై యొప్పుగాక! మనము పరస్పర సాహాయ్యము చేసికొనుటకు అది శక్తిరూపిణియై చెలగుగాక!! మనము ఒకరిని గుఱించి ఒకరము అసూయాపరులము కాకుందుముగాక!!!

పరమకుడియొద్ది అభివందన పత్రమునకు ప్రత్యుత్తరము

రామనాడు విడిచినపిమ్మట శ్రీస్వాములవారు ఆగిన మొదటిపట్టణము పరమకుడి. అక్కడ చాల గొప్ప యుత్సవము జరిగెను. ఈ క్రింది స్వాగతపత్రము శ్రీవారికి అర్పింపబడినది.

శ్రీమత్ వివేకానందస్వాములవారికి:—

శ్రీవారు పాశ్చాత్యప్రపంచమున నాలుగు సంవత్సరములపాటు జయప్రదముగా వేదాంతప్రచారము సాగించి వచ్చు తరుణమున, పరమకుడి పట్టణవాసులమగు మేము శ్రీవారికి భక్తిగౌరవ పురస్సరముగా స్వాగతము సర్పించుకొనుచున్నారము.

షికాగో నగరమున జరిగిన మహామతసభకు విజయము చేసి అతి ప్రాచీనమగు మన కర్మభూమియందు నెలకొని

యున్న నిగూఢపవిత్ర జ్ఞానరాసులను, నానామత ప్రపంచ ప్రతినిధులయెదుట ప్రదర్శించిన తమ యౌదార్యము మా కెల్లరకు ఆనందమును గర్వమును కలిగించినది. వేద వాఙ్మయమునందు నిగూఢము లై యున్న పవిత్ర ధర్మములను శ్రీవారు బాహాటముగా ప్రకటించి, మన హైందవమతమును పాశ్చాత్యపండితులకు గల తిరస్కారభావమును తొలగించితిరి! సర్వకాలములందును సమస్త చిత్తవృత్తులకును ఉపకరించు తెఱగున, అయ్యది విశ్వానుగుణ్యమై విశ్వ శరణ్యమై, పరగుచున్నదని వారికి నచ్చచెప్పితిరి!

శ్రీవారి పాశ్చాత్య శిష్యవరులు ఇప్పుడిచ్చట మా మధ్య నిలుచుటయే, శ్రీవారి ధర్మబోధలు చక్కగా సిద్ధాంత రూపమున సుగ్రాహ్యములై, ఆచరణరూపమున ఫలప్రదము లయ్యె ననుటకు ప్రబల నిదర్శనముగా నున్నది. హృదయాకర్షకమగు దేవర దివ్యదర్శనప్రభావము, పూర్ణవైరాగ్య యుతులై, ఇంద్రియ నిగ్రహపరులై, బ్రహ్మసాక్షాత్కార సిద్ధులై, మానవజాతి కెల్ల ఆత్మమార్గదర్శులై గురుపీఠము నధిష్ఠించిన మన ప్రాచీన మహాఋషులను మా మనోనేత్రము లకు ప్రత్యక్షము చేయుచున్నది.

మానవజాతిని కనికరించి అధ్యాత్మమార్గమున నడపు టకు వలయు దీర్ఘాయురారోగ్యములను దేవరవారికి ఆ పర మేశ్వరుడు ప్రసాదించుగాకయని వేడికొనుచు విరమించు చున్నారము.

పరమభక్తి విశ్వాసములతో ఇట్లు విన్నవించు,
దేవరవారి శిష్య, కింకర బృందము

ఈ అభినందన పత్రమునకు ప్రత్యుత్తరము చెప్పుచు శ్రీ స్వాములవారిటుల సెలవిచ్చిరి :

నాకు ఈ విధముగా స్వాగత మిచ్చుటలో మీరు చూపిన ఆదరణకును, ప్రేమకును, నా మనస్సులోని కృతజ్ఞతను తగురీతిని వెలువరింప గల్గుట అసంభవము. మీ ఆమోదమును పురస్కరించుకొని ఈ నాలుగు మాటలు మాత్రము చెప్పెదను. ఈ దేశీయులు ప్రేమపూర్వకముగ నన్నాదరించినను, ద్వేషభావమున తరిమివేసినను, ఈ దేశమునైని, ఇందలి ప్రజలనైని, నా హృదయమున వెల్లివిరిసెడి యీ అభిమానము, ఈ అనురాగము ఇట్లే శాశ్వతముగా నిలిచి యుండును. 'నరులు కర్మకొఱకే కర్మ నాచరింపవలయును. ప్రేమకొఱకే ప్రేమ చూపవలయును' అని గీతలో శ్రీకృష్ణ భగవానుడు సెలవిచ్చియున్నాడు. పాశ్చాత్య ప్రపంచమున నేను నిర్వహించిన కార్యము అత్యల్పము. నేను చేసినదాని కంటె శతాధికముగా కృషి సలుపగల శక్తి మీ కెల్లరకును గలదని నా విశ్వాసము. భారతదేశమునుండి వెలువడి, ధైర్యోత్సాహములతో చతుర్దిశాంతముల కేగి, పారమార్థిక ధర్మప్రబోధము గావింప నుత్సహించు మహోధీరులును, పరమాత్మతత్త్వవిదులును, ఎన్నడు ఉదయింతురా యని నేను పేరాసతో ఎదురుచూచుచున్నాను. ఆ దివ్యభావములు హైందవ తపోవనములనుండి మనకు సంక్రమించినవి. అయ్యవియే భారతభూమికి సహజసంపదలు! మానవజాతి చరిత్రయందు జాతులు జాతులే ప్రాపంచికవిషయములపై విసువుచెందుట అప్పుడప్పుడు సంభవించుచుండును.

ఇందుకు కారణము ఆ సమయములందు, వారి వ్యూహము లన్నియు చేజారి, ప్రాచీనసంస్థలు, సిద్ధాంతములు, శిథిల ములై, ఆశలన్నియు గాలిమేడలుగా మాఱి, ఏదిచూచినను పట్టువదలి పోయినట్లు గోచరించుటే. ప్రపంచములో సంఘ జీవనమును నిర్మించుటకు, రెండురీతుల ప్రయత్నములు చేయ బడినవి: ఒకదానికి ఆధారము మతము; రెండవదానికి ఆధారము సంఘావసరము. ఒకదానికి పునాది అధ్యాత్మ ధర్మము; రెండవదానికి ప్రకృతిశక్తి. ఒకదానికి మూలము పరమార్థచింత; రెండవదానికి ప్రత్యక్షభోగము. ఒకటి ఈ క్షుద్రప్రపంచమునొక్క దృఙ్మండలమును దాటి చాల దూరము దృష్టి సారించును; అది రెండవదానిని పూర్తిగా విడనాడియే జీవనారంభము చేయుటకుగూడ సాహసించును. ఆ రెండవదో ప్రపంచవిషయములను ఆధారముచేసికొని నిలుచుటతో తృప్తిపడి, అందే శాశ్వతసుస్థిరాధారమును కల్పించుకొన నాసపడును. ఒకసమయమున మొదటిదగు ఆత్మపక్షము ఉన్నతిగాంచును; వెంటనే రెండవదగు జడ ప్రకృతి పైకిలేచును. ఈ తీరున తరంగగమనముతో ఇవి ఒకదానివెనుక ఒకటి నడచుచుండుట విచిత్రముగదా. ఒకే దేశములో ఈ భిన్నదశలు కాన్పించుచుండును. ఒకసమయ మున జడవాదము వెల్లివిరియును. ఐహికసౌఖ్యమును, భోగానుభవమును సమృద్ధిగా నొసగు విద్యలు, సిద్ధాంతములు ప్రచండముగా వాయువేగమున ప్రచారము గాంచును; వెంటనే అవి క్షీణించి నశించిపోవును. వైభవముతోపాటు అసూయాక్రోధములుకూడ మానవజాతిలో కార్చిచ్చువలె

చెలరేగును. స్పర్థలు, ద్వేషము, హింస, ప్రళయతాండవము సలుపును. అంత ఇంపైనది కాకున్నను పామరులు చెప్పుకొను ఇంగ్లీషు సామెత ఒకటి కలదు: "ఎవడికాడు దొడ్డు తీస్తే, యెనకోణ్ణి యెన్నెమ్మ యేస్కోయిందంట" ఆకాలమున ఇదేనీతి ప్రచారముగాంచును. జీవనిర్మాణతత్త్వమే వ్యర్థమైనదని ప్రజలు తలపసాగుదురు. పారమార్థికధర్మము అడ్డుపడనియెడల, మునిగిపోవుచున్న ఈ ప్రపంచమును అది చేపట్టి ఉద్ధరింపనియెడల, అట్టివేళలలో జగత్తే నాశమై పోగలదు. ఈ ధర్మాభ్యుదయమువలన ప్రపంచమునకు మరల ధైర్యముకలిగి నూతననిర్మాణమునకు ఆధార మేర్పడును. అందుచే ఇంకొక అధ్యాత్మరంగము వచ్చును. మరల ఇదియు అణగిపోవునదే కానిండు. పారమార్థిక ధర్మాభ్యుదయము కలుగు వెంటనే ప్రపంచశక్తులన్నియు తమచేతనే కలవనువాడు కొంద ఱేర్పడుట వాడుక. వెంటనే దీని ఫలితార్థముగా ప్రజలలో అనాత్మవాదము బయలుదేఱును. జాతియొక్క మతాధికారములే గాక సమస్త భౌతికాధికారములు, పదవులు, ఏకొలదిమంది చేతులలోనో చిక్కిపోవుటచే, వారు విజృంభించి ప్రజల నెత్తినెక్కి పిండిగొట్ట సాగుదురు. సర్వాధికారములు తమవేయని వాదింతురు. అప్పుడు సంఘము ఈ పీడ తొలగించుకొన గిజగిజ లాడును. భౌతికవాదము వారికి అండయై రక్షణబూనును.

హిందూదేశస్థితిని విచారించినయెడల ఇదే విషయము ఇప్పుడుకూడజరుగుచున్నట్లు గోచరింపగలదు. ఈనాడు మీరిచ్చటచేరి, వేదాంతప్రచారము చేయుటకై పాశ్చాత్యదేశ

ములకు పోయివచ్చిన ఒకవ్యక్తికి స్వాగతమిచ్చుటకు మూల కారణము యూరపుదేశమునగల అనాత్మవాద ప్రాబల్యమే. కావున ఒకదృష్టితో చూచిన, ఈ భౌతిక వాదము భారత భూమిని రక్షింపవచ్చినట్లే తోచును. అది జీవితావకాశము లను అందటికిని సమముగా కల్పించుచున్నది; కులముచే లభించు ప్రత్యేకాధికారములను, అర్హతలను ఎగురగొట్టి వేయుచున్నది. తరతరములుగా ఏకొలదిమంది మాత్రమో తమచేతులలో నిముడ్చుకొని, తమకొఱకు సైతము వినియో గము చేసికొనక, వ్యర్థముగా దాచిపెట్టుకొనిన అమూల్య జ్ఞానరత్నములను పైకిలాగి బహిరంగచర్చకు లోనుజేసినది. సగము దొంగలు అపహరించుటచేత ఎప్పుడో నష్టమైనది; తక్కిన సగము కుక్కలవంటి నీచుల చేతులలో చిక్కినది. వారు దానిని అనుభవింపజాలరు; ఇతరులను అనుభవింప నీయరు. నేడు హిందూదేశములో మనము స్థాపింపవలయు నని పెనుగులాడుచున్న రాజకీయ విధానములు యూరపులో తాతలనాటినుండి నెలకొనియున్నవే. కొన్ని శతాబ్దములుగా వానిని, స్వానుభవముచే పరీక్షించి, తుదకవి అన్నియు పనికి మాలినవని వారు కనుగొనిరి. ఒకదానితర్వాత నొకటిగా ఆ రాజకీయవ్యవస్థలు, విధానములు, వ్యర్థములని వారు కనుగొనిరి. ఇప్పుడు యూరపుఖండము ఎటు జూచినను గతికానక అల్లాడుచున్నది. భౌతికవ్యాపారపీడనము అచట మహాఘోరముగా పరిణమించినది. దేశసంపద, అధికారము అంతయు ఏమాత్రమును పనిచేయని కొలదిమంది సోమరుల చేతులలో చిక్కినవి. వీరు శ్రమపడరు; కాని లక్షలకొలది

జనముచేత పనులు చేయించు తంత్రములను పన్నుచుండురు. ఈ అధికారముతో వారు భూలోకము నెల్ల రక్తరాశిలో ముంచివేయగలరు. ఆస్తికసిద్ధాంతములను కాలరాచి నిరంకుశముగా ప్రభుత సాగింతురు. నేడు పాశ్చాత్య ప్రపంచము ఏ పదుగురు ధనికపిశాచములచేతనో పాలింప బడుచున్నది. తమదేశములందలి ప్రజాస్వామ్యరాజ్య పాలనము, స్వాతంత్ర్యము, స్వేచ్ఛ, శాసనసభలు అని వారు చెప్పుకొను గొప్పలన్నియు వట్టి బూటకమే.

పాశ్చాత్యప్రపంచము ధనికపిశాచుల హింసలకు లోనై శోకములు పెట్టుచున్నది. ప్రాక్ప్రపంచము యాజక బ్రాహ్మణుల పీడనము సహింపలేక శోకములు పెట్టు చున్నది. ఇవి రెండును తమ హింసకులను అదపులో నుంప వలెను. ఒకరు మాత్రమే లోకమును ఉద్ధరింపగలరని తలంపకుడు. పక్షపాత మిసుమంతయు లేని ఈశ్వరుడు సృష్టి లోని ప్రత్యణువును సమానముగనే చేసియున్నాడు. నీచాతి నీచుడగు ఘోరకర్మునియందు సైతము మహాఋషియందు కొంతవడియుండు కొన్ని సుగుణములు కాన్పించును. అతి క్షుద్రమగు కీటకమునందు సైతము అత్యుత్తమపురుషునందు గోచరింపని కొన్ని గుణములు కాన్పించును. అల్పభోగియని మీరు తలంచు నిరుపేదయగుకూలివానికి మీకుగల బుద్ధి చాకచక్యము లేకపోయినను, వేదాంతతత్త్వమువంటి విషయ ములను అతడు గ్రహింపజాలకపోయినను, మీ శరీరమును వాని శరీరముతో పోల్చి చూచినయెడల, వానిది మీశరీర మంత నిల్వరము లేనిదికాదనియు, వానిశరీరమునకు తగిలిన

గాయములు మిగాయములకంటె త్వరితముగా మానిపోవు ననియు, మీవలె అతడు చీటికి మాటికి మంచానపడడనియు కనుగొందురు. వాని ప్రాణము ఇంద్రియగతమైనది. వాని భోగము ఇంద్రియములందే. పైగా వాని జీవితము ఒడుదుడుకులులేక సమముగా నడచును. భౌతికక్షేత్రమునగాని, బుద్ధిక్షేత్రమునగాని, అధ్యాత్మక్షేత్రమునగాని, ఎచ్చటనో పరిహారముకల్పించి భగవంతుడు సమత్వమును నెలకొల్పును. కావున మనమే లోకోద్ధారకులమని భ్రమింపరాదు! మనము లోకులకు అనేకవిషయములు నేర్పగలమునిజమేగాని, వారియొద్ద మనము అనేకవిషయములు నేర్చుకొనవలసికూడ ఉన్నది. లోకము దేనికొఱకు నిరీక్షించుచున్నదో దానినిమాత్రమే మనములోకమునకు బోధింపగలము. ఆధ్యాత్మికమగుపునాది లేనియెడల పాశ్చాత్య నాగరికత అంతయు ఇంకొక యేబది సంవత్సరములలో ఛిన్నాభిన్నమై పోగలదు. ఖడ్గబలముతో మానవజాతిని పరిపాలింపజూచుట కేవలము వ్యర్థము ; అది యెన్నడును పొసగదు. అసలు బలాత్కారముగా పరిపాలించుటవంటి భావములకు ఏది ఉత్పత్తిస్థానమో అదియే వాని అధోగతికిని క్షయమునకును, విచ్ఛిన్నతకును జన్మస్థానమగును. అనాత్మశక్తి ప్రదర్శనమునకు ప్రధానక్షేత్రమగు యూరపుఖండము తన స్థితిని మార్చుకొని, తన ప్రస్తుత సంప్రదాయమునుకూడ మార్చుకొని, తన జీవితమునకు ఆధ్యాత్మధర్మమును పునాదిగా చేసికొనుటకై పూనిక వహింపనియెడల, ఇంకొక యేబదిసంవత్సరములలో ముక్కలు ముక్కలై దుమ్ములో కలసిపోవును. మన ఉపనిషత్తులు

ప్రతిపాదించు ఆస్తికధర్మ మొక్కటే యూరపును నేటి దుఃస్థితినుండి ఉద్ధరింపగలదు.

మనదేశమునందలి సంప్రదాయములు, తత్త్వశాస్త్రములు, స్మృతులు భిన్నభిన్నముగానున్నను, వీని అన్నిటికిని మూలాధారమై పరగు సిద్ధాంతమొకటి కలదు. "జీవుడు లేక ఆత్మ అనునదొకటి యున్నది" అను విశ్వాసము మనలోని అన్ని సంప్రదాయముల వారికిని కలదు. ఈ భావమే ప్రపంచ చిత్తవృత్తినంతను మార్చివేయగలదు. భారతదేశమున హిందువులు, జైనులు, బౌద్ధులు మున్నగు సర్వ సాంప్రదాయకులును, ఆత్మరూపియగు జీవుడు కలడను భానమును అంగీకరింతురు. అది సమస్తశక్తులకును నిలయము. శక్తినిగాని, పవిత్రతనుగాని, పరిపూర్ణతనుగాని వెలుపలనుండి మీరు పొందగలరని బోధించు ఒక్క సిద్ధాంతమేనియు భారతదేశమున పుట్టలేదని మీకు బాగుగా తెలియునుగదా! ఈ లక్షణములన్నియు స్వభావసిద్ధము లని భారత సిద్ధాంతములెల్ల తెలుపుచున్నవి. అపవిత్రత కేవలము ఆగంతుకముగవచ్చి మీపై నిబడి మీనిజ స్వభావమును కప్పివేయుచున్నది. కాని మీ స్వస్వరూపము పవిత్రమై, శక్తిమంతమయి సదా వెలుగుచునేయున్నది. మిమ్ము అదపులోపెట్టి నడపుటకై ఏ అన్యసాహాయ్యమును మీకు అక్కఱలేదు. మీరు ఆత్మనిగ్రహము కలవారే. మీకాసంగతి తెలియునా, తెలియదా అనునదే ప్రశ్న. మనకు ఉన్న ప్రతిబంధమును ఒక్కమాటలో చెప్పెదను: అది అవిద్య. నరునికి భగవంతునికి, పుణ్యపురుషునకు పాపికి,

గలభేదమేమి? అజ్ఞానము! మీ కాలిక్రిందపడి గిజగిజలాడు నికృష్టమూ పురుగునకును మానవజాతికెల్ల శిరోభూషణ మనదగు పురుషోత్తమునకును గల భేదమేమి?—అజ్ఞానమే. అదియే ఈ భిన్నత్వమును కల్పించుచున్నది. ఆ ప్రాకు లాడు పురుగునకుగూడ లోపల అఖండశక్తియు, జ్ఞానమును పావనతయు, సర్వేశ్వరుని అనంత పరిపూర్ణతయు కలదు! అది యిప్పుడు అవ్యక్తముగా నున్నది; ఇక వ్యక్తము కావలయును.

భారతదేశము ప్రపంచమునకు బోధింపవలసిన మహా ధర్మము ఇదియే. ఈ ధర్మము ఇంకే దేశమునను కానరాదు. ఇదియే వేదాంతము: ఆత్మను గుఱించిన శాస్త్రము. పురుషుని నిలబడి పనిచేయునటుల చేయునదేది? బలము. బలమే యోగ్యత; దుర్బలతయే పాపము. ఆగ్నేయాస్త్రము వలె రివ్వునవచ్చిపడి, అజ్ఞానరాసులనెల్ల భస్మీపటలముచేయు మహాశక్తిని ఉపనిషత్తులు "నిర్భయత్వము" అని పేర్కొను చున్నవి. మీరు బాగుగా ప్రచారము చేయవలసిన ఏకైక మతధర్మము ఈ 'నిర్భయత్వమే'! వ్యావహారిక ప్రపంచమున గాని, అధ్యాత్మ ప్రపంచమున గాని, 'భయ' మనునది మన పతనమునకును పాపమునకును మూలకారణ మనుట సత్యము. దుఃఖమును కల్పించునది 'భయము'; మరణమును కూర్చు నది 'భయము'; దుర్జనత్వమును పెంచునది 'భయము'. సరే, భయమునకు మూలమెద్ది? మన నైజతత్వమును గుఱించిన అజ్ఞానమే. మనమెల్లరము, సకల సార్వభౌముల కును సార్వభౌముడైన భగవంతుని వారసులము. మనము

సాక్షాత్తు భగవదంశ సంభూతులమే! ఇంతే గాదు, మనము అల్పనరుల మనుకొనుచు, స్వస్వరూపములను మఱచి యున్న ప్పటికిని మనము స్వయంబ్రహ్మమే. అట్టి ఉన్నత భావనా స్థితినుండి మన మిప్పుడు భ్రష్టులమైపోయితిమి. ఈభ్రష్టతయే విభేదములను తెచ్చిపెట్టినది; నేను నీకంటె గొంచెము గొప్ప వాడను, లేక నీవు నాకంటె గొంచెము గొప్పవాడవు అను నిట్టి విభేదములు కల్పించినది. అద్వైతభావమే నేడు భారత దేశము నేర్వవలసిన గొప్పపాఠము. దీనిని మీరు గుర్తించు కొనుడు! ఇది గ్రహింపబడినపుడు సమస్త విషయముల స్వరూపమును మారిపోవును. అప్పుడు మీరు మునుపటివలె గాక వేఱుదృష్టితో ప్రపంచమును చూతురు. ఆదృష్టికి ఈ ప్రపంచము—ప్రతి జీవియు ప్రతి ఇతర జీవితోడను పోరాడుటకే పుట్టి, బలాఢ్యుడు విజయము పొందుచుండ దుర్బలులు మృత్యువువాతబడుచుండవలసిన—ఘోర రణ రంగముగా కన్పడదు; శ్రీహరి బాలరూపముదాల్చి మన మందఱము వాని చెలికాండ్రమై చుట్టును గుమిగూడియుండ లీలమెయి వినోదములుసల్పుచుండు నాట్యరంగముగా భాసించును. ఈలోకము మిక్కిలి ఘోరముగను, బీభత్సముగను, అపాయకరముగను, కన్పట్టినను, అంతయు ఒక నాటకమే అను సత్యము గోచరించును. ఆత్మయొక్క స్వరూపమును తెలిసికొనినప్పుడు దుర్బలునకుకూడ ఆశలు చిగిరించును. అధఃపతితునకు ఘోరపాపికికూడ నూతనాశలు అంకురించును. 'నిస్పృహచెందకుడు' అని శాస్త్రములు ఘోషించుచున్నవి. మీరేమిచేసినను మీయాత్మస్వభావము మారదు.

అది ఒకేరూపమున నిర్మలముగా భాసించుచుండును. ప్రకృతిని ప్రకృతియే నాశముచేయునా? మీరది నిర్మల తత్వము. కోటియుగము లది మఱుగుపడియుండుగాక, తుద కది బయటపడితీరును; విజయశాలియై వెలువడివచ్చును. కావున అద్వైతము ప్రతివానికిని ఆశను పురికొల్పునేగాని నిస్పృహతను గలుగచేయదు. అది భయము నాధారము చేసికొని బోధలుచేయదు. నీవు అడుగు తప్పివేసితివా నిన్ను పడలాగివేయుటకు పిశాచములు సంసిద్ధముగా నున్నవని అది చెప్పదు. దానికి పిశాచములతో పనిలేదు. మీ అదృష్టము మీచేతులలోనే యున్నదని అది చెప్పును. మీకర్మయే ఈశరీరమును మీకు సృష్టించిపెట్టినది. మఱెవరును దానిని మీపై పడవేయలేదు. సర్వవ్యాపియగు బ్రహ్మము అజ్ఞానమువలన మఱుగుపడి యున్నాడు. బాధ్యత అంతయు మీ మీదనే యున్నది. మీ ఇచ్ఛలేకయే మీ రీ లోకమునకు తీసికొనిరాబడి ఈ ఘోరప్రదేశమున విడిచిపెట్టబడినటుల భావింపవలదు. ప్రతిక్షణమును కొంచెము కొంచెముగా మీ శరీరమును ఇప్పుడు మీరు పెంచుకొనుచున్న విధముననే, మీరే, పూర్వజన్మములో దీని నిర్మాణమును చేసికొంటిరి. మీ ఆహారమును మీరే తినుచున్నారు. మీకొఱకై ఎవరును తినిపెట్టుటలేదు. మీరు తినినదానిని మీరే జీర్ణము చేసికొనుచున్నారు. మీ కొఱకు ఎవరును జీర్ణము చేసిపెట్టుటలేదు. ఆ ఆహారమునుండి రక్తమును కండరములను శరీరమును మీరే నిర్మించుకొనుచున్నారు. మీకొఱకు ఎవరును నిర్మించిపెట్టుటలేదు. ఇటులనే సర్వదా మీరు

ప్రవర్తించుచున్నాడు. గొలుసులోని ఒక్కయుంగరమును పరీక్షించిన యెడల గొలుసు స్వభావమెల్ల తెలియును. మీ శరీరనిర్మాణమును మీరు చేసికొనుట ఒక్క క్షణకాలము సత్యమగునేని, ప్రతి క్షణమునందును మీరు అటులనే, పూర్వము చేసియుంటిరనియు, ఇకముందుకూడ చేయగలరనియు స్పష్టమగుచున్నది. మంచికిని చెడ్డకును ఇటుల బాధ్యతయంతయు మీమీదనే పడుచున్నది. ఇదియే గొప్ప ఆశకు మూలము! నేను కూర్చుకొనినదానిని నేనే విప్పుకొనగలను. ఇట్లయ్యును ఈశ్వరుని కరుణ నరునికి అవసరము కాదని మన మతము బోధించుటలేదు. ఈశ్వరకరుణ సదా ఉండనేయుండును. అయినను ఈ భయంకర శుభాశుభ ప్రవాహమునకు దూరముగనే ఈశ్వరుడు నిలిచియుండును. ఆయన నిత్యముక్తుడు. ఆ కరుణానిధి ఈ ప్రవాహమును దాటించి మనలను ఆవలియొడ్డుచేర్చుటకు ఎల్లప్పుడును సంసిద్ధముగా నున్నాడు. ఆయనకరుణ అపారము. నిర్మలహృదయములకు అది నిరంతరము దొరకగలదు.

ఒక యర్థమున మీ అధ్యాత్మధర్మమే మీ సంఘపునర్నిర్మాణమునకు పునాదులు వేయవలసి యున్నది. నాకు ఇంకకొంత అవకాశము ఉండిన యెడల పాశ్చాత్యులు మన అద్వైత సిద్ధాంతములనుండి ఇంకను ఎటుల నేర్చుకొనవలసి యున్నారో తెలిపియుండెడి వాడను. ఏమన ప్రకృతి శాస్త్రములు ప్రబలిన ఈదినములలో సగుణబ్రహ్మము యొక్క ఆదర్శమునకు అంతగా బలములేదు. ఐనను, ఒకని అధ్యాత్మజ్ఞానము ప్రాథమికదశలో నుండి, వానికి దేవా

లయములు, విగ్రహములు అవసరములగునెడల, ఆతడు కోరు కొనునన్ని ఇచటకలవు. వాని భక్తి సాధనకు సగుణ దైవము అవసరమగునెడల, ఆసగుణ దైవతమయొక్క పరమోత్తమ భావములుకూడ ఈ దేశమున అపారముగా గలవు. ప్రపంచ ములో మఱెచ్చోటను ఇంతటి వైవిధ్యముతో రూపకల్ప నము చేయబడియుండలేదు. ఒకనరుడు తన తర్కదృష్టిని తృప్తి పఱుచుకొని వివేకశీలియై యుండగోరునేని అత్యుత్తమ తర్కసాధ్యములగు నిర్గుణబ్రహ్మ భావములుగూడ వానికి ఇక్కడనే లభింపగలవు.

శివగంగ, మానామదురపట్టణములవారు సమర్పించిన స్వాగత పత్రమునకు శ్రీస్వాములవా రొసగిన ప్రత్యుత్తరము

మానామదురపట్టణమున, శివగంగ మానామదుర పట్టణముల జమీందారులును పురజనులును శ్రీస్వాముల వారికి ఈ క్రిందిస్వాగత పత్రమును అర్పించిరి.

శ్రీమత్ వివేకానంద స్వాములవారికి

పరమపూజ్యులరగు స్వామీ!

శివగంగ మానామదురపట్టణముల జమీందారులును, పురజనులును అగుమేము శ్రీవారికి పూర్ణహృదయముతో స్వాగత మర్పించుకొనుచున్నారము. మాజన్మలోని గాఢతర

ఆశాప్రపూర్ణసమయములందుగాని, మా అతివిస్మయకర స్వప్నములందుగాని, మాహృదయములకు అత్యంత సమీప వర్తులగు శ్రీవారు ఇటుల మాగృహములకు అత్యంత సమీపమున దర్శనమొసంగుచురని మేమెన్నడును ఊహించి యుండలేదు. మీరు శివగంగకు రాజాలరని తెలిపిన మొదటి తంతివార్త మాహృదయములను నిబిడాంధకారమున ముంచివైచినది. తదుపరిచేరిన తంతివార్త ఆ అంధకారమేఘ పటలాంచలములను రజతకాంతులుతీర్చి యుండనియెడల, మా నిస్పృహావస్థ దుర్భరమైయుండెడిది. శ్రీవారు మా పట్టణమున దర్శనభాగ్య మొసగుటకు అంగీకరించిరని మొదట వినినప్పుడు మాపేరాస లన్నియు ఫలించినటుల తలంచితిమి. గంగానది పిచ్చుకగూటిపై ప్రవహించి అనుగ్రహించినట్లైనది! మా ఆనందమునకు మితిలేదయ్యెను. కాని గంగాతీర్థము తనసమ్మతిని ఉపసంహరించుకొనవలసెనని తెలిసినప్పుడు మేమైనను ఆ తీర్థమునొద్దకు పోవీలులేదయ్యె గదాయని మిక్కిలి పరితపించితిమి. ఎట్లైననేమి దేవరవారు మా ప్రార్థనలను ఆలించి మమ్మనుగ్రహించితిరి. సముద్ర ప్రయాణమునందుగల దుర్భరసంకటములను సరకు గొనక అత్యద్భుత నిస్స్వార్థభావముతో, పాశ్చాత్యప్రపంచమునకు ప్రాచ్యప్రపంచము యొక్క ప్రపూతదివ్యసందేశమును గొని పోయిన మీ ధైర్యమును, ఆ కార్యనిర్వహణమున మీరలు చూపిన అసమాన దక్షతయు, మీరు పూనుకొనిన సర్వ భూతహిత ధర్మమునకు లభించిన అసదృశమగు అఖండవిజయ మును, మీకు శాశ్వతవినిర్మల కీర్తిని గడించిపెట్టినవి. కుక్షిం

భరత్వమే పరమధర్మముగ బోధించు పాశ్చాత్య జడవాదము భారతీయ మతవిశ్వాసములమీదికి భయంకరముగా దండెత్తి వచ్చుచున్న ఈ సమయమున, మన మహర్షుల సద్బోధలును దివ్యగ్రంథములును రూపుమాయనున్న ఈకాలమున, శ్రీ వారింబోలు సద్గురుని ప్రభావము మతధర్మప్రచార చరిత్ర యంను నూతనాధ్యాయమును విప్పినది. క్రమముగా, హిందూతత్త్వశాస్త్రమనెడు స్వచ్ఛమగు అపరంజిమీద, కాలగతిని వచ్చిపడిన కాలుష్యమునెల్ల కడిగివైచి, తమ విచక్షణాపటిమమనెడు టంకసాలయందు శ్రీవారు సంస్కరించి, జగమునం దెల్లెడల సుగ్రాహ్యమగు నాణెముగా దానిని పరివర్తనము చేయుచుగాకయని మేము నిరీక్షించుచున్నాము. హిందూవేదాంతధ్వజమును, మహామత సభయందు ఆసీనులైన నానా సంప్రదాయ ప్రచారకుల సమక్షమున, విశ్వశరణ్యముగ ప్రకటించి ప్రతిష్ఠించిన మీ సాహసము, రాజకీయక్షేత్రమున మీసమకాలికయగు మహారాణినిబోలి, సూర్యుడెన్నడును అస్తమింపని మహాసామ్రాజ్యమునకు మిమ్ము అచిరకాలములో సార్వభౌముని చేయగలదని అపేక్షించుచున్నాము. కాని ఈ రెంటికిని ఒక్కభేదముకలదు. ఆమె ప్రభుత్వము స్థూలప్రపంచమున వర్ధిల్లుచుండ, దేవరవారి ప్రభుత్వము భావప్రపంచమున ప్రకాశింపగలదు. దీర్ఘకాల పరిపాలనముచేతను, ఉదార ధర్మప్రచారముచేతను, ఆమె సర్వాతీతయై వెలయునటుల, అతులిత నిష్కామముతో పూనిన ప్రేమప్రచారమును కొనసాగించి ఆధ్యాత్మిక చరిత్రయందు పేరుగాంచిన పూర్వ ఋషివరుల

నందఱిని శ్రీవాడు అతిక్రమించి ప్రకాశింతురుగాక యని సర్వేశ్వరుని భక్తిపూర్వకముగా ప్రార్థించుచున్నాము.

పరమపూజ్యులరగు స్వామీ!
భక్తి వినమ్రతలతో దేవరవారి నర్చించు సేవకులము.

ఆ స్వాగతపత్రమునకు ప్రత్యుత్తర మొసగుచు శ్రీ స్వాములవా రిటుల పల్కిరి.

మీరిప్పుడు నాకొసగిన సాదర స్వాగతమువలన ఎంతటిగొప్ప కృతజ్ఞతాభారమును నాపైనపెట్టితిరో నేను వ్యక్తీకరింపజాలకున్నాను. నే నెంతగా అభిలాషపడినను, దీర్ఘోపన్యాసము గావించుటకు తగిన స్థితిలో నేనిప్పుడు లేను. మన సంస్కృత పండిత మిత్రుడు పూర్ణప్రేమతో ఎన్ని మనోహరములగు విశేషణములను నాకు తగిలించినప్పటికిని, నాకెట్లో ఒక దేహమున్నది గదా! ఈ శరీరము జడ ద్రవ్యసంబంధమయిన ప్రేరణలను, నియమములను, ధర్మములను సదా అనుసరించుచునే యుండును. అట్లగుటచే ఈ స్థూల శరీరమునకు సంబంధించినంతనఱకు అలసట, ఆయాసము, అనునవి ఉండితీఱును.

నేను పాశ్చాత్యదేశములందు కావించిన కొలదిపాటి కృషినిగూర్చి, యీ దేశపు నలుమూలల కానవచ్చుచున్న సంతోషము, ఆమోదము, అద్భుతావహముగానున్నవి. నేను కావించిన యీ స్వల్పకార్యమునకే ఈ జాతి ఇంతగా ధన్యవా

దము చేయుచుండ, మన తరువాత రానున్న మహర్షులును, లోకసంస్కర్తలును, ఈ జాతికి ఎంతగా సమ్మానపాత్రులు కానున్నారో! భారతదేశము మతధర్మమునకు జన్మభూమి. భారతీయులు మతధర్మమునుమాత్రమే గ్రహింపగలరు. ఆమార్గములో వారి విద్యావిధానము నిరంతరముగా అనేకశతాబ్దములు నడిచినది. తత్ఫలముగా మతమొక్కటియే పరమపురుషార్థముగా వెలసినది. ఆ విషయము మీరందఱు ఎఱిగినదియే. ప్రతివాడును ఏ వర్తకుడో, బడిపంతులో, యుద్ధభటుడో కానక్కఱలేదు. కాని ఈ లోకము భిన్నభిన్న జాతుల కావాసమై, మొత్తముమీద సామరస్య భావముతో విరాజిల్లుచుండును.

ఈ నానాజాతి రాగసమ్మేళనమునందు, మనము అధ్యాత్మస్వరమును ఆలాపనచేయవలెనని బ్రహ్మదేవుడు ప్రాసిపెట్టెను కాబోలు! అద్భుత మహిమాఢ్యులగు మన పూర్వులనుండి మనకు పిత్రార్జితముగావచ్చిన ఆదివ్య సంప్రదాయమును మనమింకను కోల్పోవలేదని నేను సంతోషించుచున్నాను. మన పూర్వులవంటి వారిని చూచుకొని ఏజాతి వారయినను గర్వోన్నతులుకాగలరు! ఈ జాతియొక్క భవిష్యదున్నతియందు నాకు అచంచల విశ్వాసము కల్గుచున్నది. ఇప్పటి మీ ఆదరభావము వ్యక్తిత్వేన, నాయెడల చూపిన మన్ననగా కాక, మన జాతీయ హృదయము అందు ప్రతిబింబించుచున్నదని తలచి, అది ఇంకను క్షేమముగా వర్ధిల్లుచున్నందుకు మహానందము నందుచున్నాను. భారతమాత యింకను జీవించియేయున్నది! ఆమె మరణించె

నని చెప్పువారెవరు? మనము కార్యశూరులముకాగా చూడ వలెనని పాశ్చాత్యులు అభిలషించుచున్నారు. యుద్ధభూముల యందు మనము కార్యశూరులమయి నిలువగా చూడవలె నని వాంఛింతురేని, వారికి ఆశాభంగమే కలుగును. అది మనక్షేత్రముకాదు. ఒక యోధజాతి అధ్యాత్మక్షేత్రమున విహరించుట చూడ గోరితిమేని, మనకునుఅటులనే ఆశాభంగ మగును. కాని వారిక్కడికివచ్చి చూచి,మనమును వారితో సమముగా కార్యోత్సాహులమై యున్నామనియు, మన జాతిబ్రతికియే యున్నదనియు, అది ఎప్పటివలెనే సంపూర్ణ చైతన్యముతో మనుచున్నదనియు గ్రహింతురుగాక! మనము క్షీణించిపోయితిమను దురభిప్రాయము వారికి పోగొట్టవలయును.

కాని మీకు ఇప్పుడు అప్రియవాక్కులను కొన్నింటిని చెప్పనున్నాను. వానికై మీరు కోపింపకుందురని నమ్మెదను. యూరపియనుల జడవాదము వచ్చి మనను దాదాపుగా ముంచి వేసిన దని మీరిప్పుడు పల్కితిరి. అదియంతయు యూరపియనుల దోషము కాదు; చాలవఱకు మన దోషమే. వేదాంతులమగు మనము ఎల్లప్పుడును అంతర్ముఖ దృష్టితో, ఆత్మపరిశీలనాపరులమై విషయములను గ్రహింపవలయును. మనకు మనమే హాని చేసికొన్న పిదపగాని, మనకు హానికల్పింపజాలు శక్తి జగత్తులో నెక్కడను ఉండ జాలదు. ఇది వేదాంతులమగు మనము స్పష్టముగా నెఱుగుదుము. భారతదేశ జనసంఖ్యలో అయిదవ భాగము మహమ్మదీయులలో చేరిపోయిరి. ఇంకను వెనుకకుపోయి

చూచితిమేని, పూర్వయుగమున జనసంఖ్యలోని మూడింట రెండుపాళ్ళు బౌద్ధులయిపోయినట్లే, ఇప్పుడు అయిదవపాలు మహమ్మదీయులయిరి. ఇప్పటికే పదిలక్షలకు మించి క్రైస్తవులయినారు.

ఇది యెవరి తప్పు? మన చరిత్రకారులలో ఒకరు అడిగిన ఈ ప్రశ్న ఎన్నడును మఱవరానిది. అనర్గళజీవనది తమప్రక్కనే ప్రవహించుచుండగా, పాపము, ఈ దీనులు ఆకలిదప్పులతో చావనేల? తమ సొంతమతమును విడిచి పోవుచున్న ఈ ప్రజలకై మనము ఏమైన చేసితిమా? వారేల మహమ్మదీయులు కావలసివచ్చినది? ఇంగ్లాండులో వేశ్యావృత్తి నవలంబింప యత్నించిన ఒక ఉత్తమబాలికను గుఱించిన ఉదంతమును నేను వింటిని. ఆమె అటులచేయు కొందులకో అని ప్రశ్నించిన ఒక నారీమణితో ఆబాలిక "నాకు సానుభూతి లభించుటకు అది ఒక్కటియే మార్గముగానున్నది. ఇప్పుడు నా కెవరును దిక్కు కాన్పించుటలేదు. నేను పతితనై హింసల పాలయితినేని, అప్పుడు బహుశః కొందఱు కృపామతులగు నారీమణులువచ్చి నన్ను తమయింటికి తోడ్కొనిపోయి నా కేదో ఉపాయము చూపుదురు" అనెనట! మనము ఈ మతభ్రష్టులనుగూర్చి ఇప్పుడేడ్చుచున్నామే; మునుపు వారికొఱకు ఏమైనను చేసితిమా? ఇప్పుడైనను మనము ఏమినేర్చుకొంటిమి? సత్యజ్యోతిని చేపట్టితిమా? చేపట్టినచో, ఎంతమేర దాని కాంతులు ప్రసరింపజేసితిమి? ఈ ప్రశ్నలను మనలో ప్రతియొక్కరమును వేసికొందము. నిజమారసినచో, ఇప్పుడు మతాంత

రము నాశ్రయించిన మన సోదరులకు మనము ఎప్పుడును సాహాయ్యము చేసియుండలేదు. మనమట్లు చేసియుండక పోవుట మనదోషమే! మనపాపమే! మనము ఎవరిని నిందింప నక్కఱలేదు. మనకర్మమునే నిందించుకొనవలసియున్నది.

నాస్తికమతముగాని, మహమ్మదీయమతముగాని, క్రైస్తవమతముగాని, ఒక్కటి యనలేము—ప్రపంచములోని సర్వమతములును మూఢవిశ్వాసవలన వర్ధిల్లినవే! మృష్టవర్తనము, మలినాహారము, దారిద్ర్యము, రోగము మొదలగు వానిమూలమున చెడిపోయి క్షీణించియున్నదేతప్ప ఏక్రిమియు శరీరమును తాకజాలదు. సంపూర్ణారోగ్యముగల పురుషుడు నిరపాయముగా విషక్రిములమధ్య చరింపగలడు. సరే! మన పద్ధతులను మార్చుకొను నవకాశము ఇంకను కలదు. వ్యర్థములు, అర్థహీనములు అగు విషయములనుగూర్చి మూ ప్రాతపోట్లాటలను, ప్రాతవివాదములను మానుకొనుడు. బుద్ధితెలిసిన మానవులు వందలు వందలుగకూడి 'నీరు ప్రాగు నప్పుడు మనము చెంబును కుడిచేతితో పట్టుకొనవలయునా, ఎడమచేతితో పట్టుకొనవలయునా? చేతిని కడుగుకొనవలసి నది మూడుసారులా, నాల్గుసారులా? నీరు పుక్కిలింపవలసి నది ఐదుతడవలా, ఆఱుతడవలా?' అను విషయముల గుఱించి సంవత్సరములకొలది వాదనలు చేయుచు, ఇప్పటికి ఐదాఱువందల సంవత్సరములనుండి భ్రష్టులైపోవుచున్నారు. ఈపాటి ఘనవిషయములనుగూర్చి తర్కవాదములుచేయుచు, వానిపై బ్రహ్మాండమగు శాస్త్రగ్రంథములు వ్రాయుచు, కాలము, శక్తి, జీవితము వ్యర్థముచేయు మహానుభావులు

ఉన్నదేమి, ఊడినదేమి? ఇట్టివారిచేతులలో మనమతము సర్వనాశనమై పోవును. మనము వేదాంతులముకాము, పౌరాణికులముకాము, తాంత్రికులమునుకాము. ''నన్ను ముట్టకుడు'' అను మహామంత్రావలంబులమై పోయినాము! మనమతము పాఠశాల ప్రవేశించినది. కూటికుండ మన 'ఇష్టదేవత'యై వెలసినది. 'నేను పరిశుద్ధుడను; నన్ను తాకకు' అను పలుకులే మతధర్మరాజములై పోయినవి. ఈ స్థితియే మఱొకశతాబ్దముపాటు సాగునెడల మనలో ప్రతివాడును 'పిచ్చిఆసుపత్రి' చేరవలసియుండును. మన మెదడు పాసిపోయి, మన మనస్సు ఉత్తమజీవనవిషయములను గ్రహింపజాలని గతి పట్టిన దనుటకు ఇది స్పష్టమైన గుర్తు. నూతన కల్పనాశక్తి అంతయు అడుగంటినది. మనోబలము ఉడిగినది. దాని ప్రవృత్తి పాడైనది. ఆలోచనాశక్తి ఆరిపోయినది. అది యిప్పుడు తనకు దొరకిన చిన్న గిటిలోపడి, గిరగిర తిరుగవలసినదే! ఇట్టి అల్పవిషయములను వెంటనే గంగలో త్రొక్కి, మనము సాహసముతో నిలబడవలయును; కార్యశూరులము కావలయును; ధీరులమై వర్తింపవలయును. అప్పుడే—మన పూర్వులు మనకు పిత్రార్జితముగా నొసగిపోయిన రత్నరాసులకు, లోకమెల్ల నిరంతరము ఆరాటపడుచున్న భాగ్యనిధులకు, వారసులమని చెప్పుకొను యోగ్యత మనకు కలుగును. ఈ ధనరాసులను మనము పంచిపెట్టనియెడల లోకము వినాశము గాంచును. వానిని వెలికితీసినొనిరండు! విరివిగా లోకమున వెదజల్లుడు!! దానమే కలియుగములో ప్రధానధర్మమని వ్యాసమహర్షుల

వారు చెప్పుచున్నారు. అన్నిదానములలో అధ్యాత్మజ్ఞాన దానమే అత్యుత్తమము. దీనితర్వాత లౌకికజ్ఞానదానమును, దానితర్వాత ప్రాణదానమును, తుదిని దరిద్రులకిడు అన్న దానమును గణనీయము లగును. అన్నదానము చాలినంత చేయుచునే యున్నాము. ఇంకేజాతిలోను మనకంటె ఎక్కువగా బిచ్చము పెట్టువారలు లేరు. గుడిసెలో గుప్పెడన్న మున్నంతవఱకు బిచ్చగాడుసైతము మఱొకబిచ్చగానికి దానిలో సగము పెట్టబోవును. ఇట్టిస్థితి భారతదేశములో మాత్రమే కాన్పించును. మనలో ఈ ధర్మము కావలసినంత యున్నది. ఇక పై రెంటివిషయము విచారింతము. ముఖ్యముగా అధ్యాత్మజ్ఞానదానము, లౌకికజ్ఞాన దానము మనము చేయవలసియున్నది. ధైర్యముతో, సాహసముతో, ఆత్మవిశ్వాసముతో కార్యభారము వహించితిమా, ఇరువదియైదేండ్లలో ఈ సమస్య పూర్తిగా పరిష్కారమైపోగలదు. మన మిక దేనికొఱకును కీచులాడుకొనవలసిన పనియుండదు. హిందూప్రపంచమెల్ల మరల ఆర్యావర్తమై వర్ధిల్లగలదు.

నేనిప్పుడు చెప్పవలసినదంతయు ఇదియే. నాకుగల పదకములనుగూర్చి మాటలాడుట నాకంతగా అలవాటు లేదు. ముందు చేసి చూపి, పిమ్మట ఆ పదకములనుగూర్చి ప్రసంగించుట నా మార్గము. నాకు కొన్ని పదకములున్నవి. ఈశ్వరేచ్ఛ యున్నయెడల, నాకు ఆయువు చాలునెడల, వానిని ఆచరణలో పెట్ట నిశ్చయించుకొనియున్నాను. అటుల చేయగలుగుదునో లేదో నాకు తెలియదు. జీవితములో ఒక

ఉత్తమాదర్శమును పెట్టుకొని దానికై జీవితమును అర్పించుట గొప్పకార్యము. మనము బ్రతుకుటవలన ప్రయోజనమేమి? అల్పమును, దీనమును, వ్యర్థమును అగు నరజీవితము ఎందులకు? ఒక గొప్పపురుషార్థమునకు జీవితమును అర్పించుటయే దాని ప్రయోజనము. భారతదేశములో పూనవలసిన ఉత్తమ కర్తవ్యము ఇదియే. ఈ కాలపు ఆధ్యాత్మికధర్మపునరుద్ధరణమునకు నేను స్వాగతము చెప్పుచున్నాడను. అనుకూలతరుణమును ఉపయోగపఱచుకొనకపోయితినేని, అది నా బుద్ధిలోపమగును.

మధురాపురమున నొసగబడిన స్వాగతపత్రమునకు శ్రీ స్వాములవారి ప్రత్యుత్తరము.

మధురాపుర హిందువులచే (శ్రీ) స్వాములవారికి ఈ క్రింది స్వాగతపత్రము సమర్పింపబడియెను:

పరమపూజ్యులరగు స్వామీ!

ఈ మధురాపురప్రజలమగు మేము, సాంద్రభక్తి గౌరవపురస్సరముగ, (శ్రీ)వారిని ఈ మా పురాతనపుణ్యక్షేత్రమునకు ఆవాహనము చేయుచున్నాము. ఇంద్రియభోగలంపటములందుగూల్చు సమస్త సంగములను సంపూర్ణముగ త్యాగముచేసి, కేవల పరోపకార జీవనమును పరమకారుణ్యభావముతోపూని, మానవజాతియొక్క ఆధ్యాత్మికోన్నతికై పాటుపడుచున్న దేవరవారియందు పవిత్రమా

హిందూసన్న్యాసాదర్శమును మేము ప్రత్యక్షముగా కనుగొనజాలుచున్నాము. హిందూమతముయొక్క యథార్థ సారాంశము కర్మకలాపములతో కూడినది కాదనియు, దరిద్రులై సంకటముల జిక్కినవారి కెల్లరకును శాంత్యానందములను గూర్పగల్గు వినిర్మలత్వసిద్ధాంతాచరణమనియు, మీజీవితసరణియందే రుజువుచేసితిరి.

ప్రతినరుని, వాని పరిస్థితులకు అనుగుణముగను, వాని శక్తులకు అనుసారముగను, ఉత్తమమార్గమున ప్రవేశపెట్టి ఉద్ధరింపగల వేదాంత సిద్ధాంతమును, మతధర్మమును అమెరికావారికిని, ఇంగ్లాండువారికిని బోధించితిరి. శ్రీ వారి ఉపదేశములు గత మూడువత్సరములనుండియు పరదేశములందే చేయబడినవైనను, ఈ దేశమునందుసైతము విశేషాసక్తితోడ గ్రహింపబడుచు, పరదేశములనుండి వచ్చిపడిన నాస్తికప్రచారమును చాలవఱకు అరికట్టుటకు ఉపకరించినవి.

విశ్వమునందు అధ్యాత్మధర్మమును ఫలప్రదముగావించు కర్తవ్యము మనమీదకలదు. కావునసే భారతదేశము ఈ నాటికిని సజీవమైయున్నది. ఈ కలియుగకల్పాంతమున శ్రీవారింబోలు మహాత్ములుదయించుటవలన, ఆ పవిత్రకర్తవ్యమును కొనసాగించుటకు దక్షులగు మహాత్ములు పెక్కుమంది అచిరకాలమునసే ఉద్భవింప నున్నారనుటకు నిదర్శనము కాన్పించుచున్నది.

పూర్వకాలమునుండి విద్యాక్షేత్రముగా ప్రసిద్ధిగాంచిన ఈ మధురానగరము, యోగులకు అభిమాన తీర్థమగు

ఈ పావన ద్వాదశాంతక్షేత్రము, శ్రీ సుందరేశ్వరుని ఈ ప్రియనిలయము, హిందూత్వసిద్ధాంతమును ప్రకటించుటలో శ్రీవారుచూపిన దక్షతను, మానవజాతికి శ్రీవారు గావించిన మహోపకారమును అభినందించుటలో మతేతరభారత నగరమునకును తీసిపోదు.

భగవంతుడు శ్రీవారికి పూర్ణపాటవమును, జవసత్వములను, దీర్ఘాయువును, ప్రసాదించుగాక యని ప్రార్థించుచున్నాము.

శ్రీ స్వాములవారి క్రిందితీరున ప్రత్యుత్తర మొసగిరి:

మాననీయుడగు మీ సభాధ్యక్షుడు సూచించినటుల, ఈ నాలుగుసంవత్సరములును పాశ్చాత్యలోకమున నేను గడించిన అనుభవమును నా పరిశ్రమఫలితములను, వివరించుచు మీచెంత చాలదినములు గడపగల్గినచో మిగుల సంతోషించెడివాడనే. కాని దురదృష్టవశమున స్వాములకును శరీరములు కలవు! కడచిన మూడువారముల నుండి నిర్విరామముగా నేను గావించిన ప్రయాణములవల్లను, ఉపన్యాసములవల్లను, ఇప్పుడు నేను దీర్ఘోపన్యాసము చేయుట సాధ్యపడకున్నది. కాబట్టి మీరు నాయెడల చూపిన ఆదరమునకు నా హృదయపూర్వకకృతజ్ఞతను తెలుపుటతో తృప్తిపడుచున్నాను. ఇప్పుడు మనకుగల కొలదిఅవకాశములో అనేక విషయములనుగూర్చి ఉపన్యసింపబూనక, ఎక్కువ అవకాశముగల మఱియొకదినమునకు వానిని వాయిదావేసి ప్రస్తుతము ఏవో ఒకటిరెండు అంశములనుగూర్చి

మాత్రము ప్రస్తావింతును. మధురలోని పురప్రముఖులందు సుప్రసిద్ధులైన రామనాథపురరాజుకు అతిథిగాఉండుటనుబట్టి, ఒకవిషయము నామనస్సున ప్రస్ఫుటముగా తోచుచున్నది. షికాగో నగరమునకువెళ్లు సంకల్పమును నామనస్సున మొట్ట మొదట ప్రవేశపెట్టినది ఈ 'రాజా'గారే యని బహుశః మీలో చాలమందికి తెలిసియే యుండును. తన పలుకుబడిని, ఉత్సాహమును, వినియోగించి ఆ సంకల్పమును పోషించి నదియు వారే. ఈ స్వాగతపత్రములో నన్నుగూర్చి చేయ బడిన అభినందనములో చాలభాగము ఈ దాక్షిణాత్య ప్రభు వునకే చెందవలసియున్నది. వసుమతీరాజగుటకు మాఱుగా వీరు యతిరాజై యుండిన సముచితముగ నుండునని నేను తలచుచున్నాను; నిజముగా ఈయన యతిరాజపదవికే అర్హుడు.

ప్రపంచములో ఏ ప్రదేశమేని ఒక విషయమున వెనుకబడి యున్నప్పుడు, ప్రకృతిశక్తులన్నియు అచ్చటికిచేరి దానికి నూతనోజ్జీవము కల్పించి తీఱును. ఇది స్థూల ప్రపంచమునందు వలెనే అధ్యాత్మప్రపంచమునందును సత్యమే! ప్రపంచమున ఏ భాగమందైనను అధ్యాత్మ ధర్మము కొఱవడి, మఱొకచోట ఆ ధర్మము వర్ధిల్లుచున్న పుడు, మనము బుద్ధిపూర్వకముగా ప్రయత్నించినను, ప్రయత్నింపకున్నను, ఆ అధ్యాత్మధర్మము కొఱవడియున్న తావునకు పోయి ఆ వ్యత్యాసమును సవరణగావించును. మానవజాతిచరిత్రయందు ఒకటి రెండుసార్లు మాత్రమేగాక, మాటిమాటికి ప్రపంచమునకు అధ్యాత్మజ్ఞాన దానముచేయు

నదృష్టము ఈ భారతభూమికి చిరకాలముగా కలదు. సైనిక విజయము వలనగాని, వాణిజ్యవిజృంభణమువలనగాని, ప్రపంచములో ననేకజాతులు ఒక్కమహాజాతిగా మిళితము జేయబడినపుడెల్ల, ప్రతిజాతియు రాజకీయమో, సాంఘికమో, ఆధ్యాత్మికమో, ఏదో తనవంతు భాగమును ఇతరజాతులకు దత్తముచేయుచునే యుండును. ఈ మానవవిజ్ఞానరాశికి భారతదేశము తనవంతుగా చేర్చుచువచ్చినది పారమార్థిక బలము, అధ్యాత్మవిద్య. పర్వ్యాసామ్రాజ్య ముదయమగుటకు ఎంతో పూర్వమే, భారతమాత వీనిని ఒకసారి ప్రపంచమునకు ప్రసాదించియున్నది. రెండవ తడవ పర్వ్యా సామ్రాజ్యము వర్ధిలుచుండిన సమయమున జరిగినది. మూడవసారి గ్రీకులు విజృంభించిన కాలమున జరిగినది. ఇప్పుడు, ఈ ఆంగ్లేయ విజృంభణ కాలమున, నాల్గవసారి ఆ కార్యమే మరల నిర్వహింపబడనున్నది. పాశ్చాత్యుల నిర్మాణకౌశలము, ఐహికనాగరికత, మన కిష్టమున్నను లేకున్నను, మనదేశమున చొరబడి, వ్యాప్తిగాంచుచున్నట్లే, భారతీయుల పారమార్థికతయు, వేదాంతమును పాశ్చాత్య భూములందు వెల్లివిరియుచున్నవి. దీనికి ఎవరును అడ్డుపడజాలరు. అట్లే పాశ్చాత్యులనుండి ఏదో ఒకవిధమగు భౌతికనాగరికత ఇచ్చటికి రాకుండకూడ మనము అడ్డుపడజాలము. అది కొంత లభించుటవలన మనకు మేలు కలుగవచ్చును. అటులనే కొంచెము పారమార్థికత్వము పాశ్చాత్యులకును మేలు చేకూర్పవచ్చును. ఈ విధముగా పరస్పర వ్యత్యాసములు పోయి సమత్వము నెలకొనవచ్చును. అనగా,

పాశ్చాత్యుల యొద్దనుండి ప్రతిదానిని మనము నేర్చుకొన వలయుననిగాని, లేక వారు మనవలన ప్రతిదానిని నేర్చుకొన వలయునని గాని అర్థముకాదు. ప్రతివారును తమకున్న దానిని భవిష్యత్సంతానములకు పిత్రార్జితముగా నొసగుచుండవల యును. ఇందువలన యుగయుగములుగా లోకులుకన్నకలలు నిజమై, వివిధజాతులమధ్య సామరస్యము ఏర్పడి భావికాల మున ఒక ఆదర్శప్రపంచము రూపొందవచ్చును. ఆ ఆదర్శ ప్రపంచము ఎన్నడైన సంభవమగునో కాదో నే నెఱుగను. అట్టి ఆదర్శమానవసమాజము ఎన్నడైన నిర్మాణమగునో కాదో నామట్టుకునాకు సందేహమే. కాని అదివచ్చినను రాకున్నను, మనలోని ప్రతివ్యక్తియు ఆ భావము రేపే ఫలింపనున్నదో అనునట్లును, అయ్యది తన ప్రయత్నము మీదనే ఆధారపడియున్నదో అనునట్లును, పూనికతో పని చేయనలసియుండును. లోకములో ప్రతివాడును తన కర్తవ్య మును నిర్వహించియే యున్నాడనియు, ప్రపంచమును నిర్దుష్టము చేయుటకు మనవంతు పనిమాత్రమే మిగిలియున్న దనియు, మన మెల్లరము భావించి పనిచేయవలయును. ఆ బాధ్యత మనయంతట మనమే గైకొనవలయును.

ఈలోపుగా భారతదేశములో మహత్తరమగు మత పునరుద్ధరణము జరుగుచున్నది. అందుచే అపాయము కలుగవచ్చును, కాని కీర్తియు కలుగవచ్చును. ఏలయన, మత పునరుద్ధరణము ఒక్కొక్కప్పుడు మూర్ఖావేశమునకు దారితీయును; హద్దులుదాటి పొంగిపొరలును. కొంత పరిమితి దాటినవెనుక దానిని ఎవ్వరును—ఆ యుధ్యమప్రారంభ

కులు సైతము—నిరోధింపజాలరు. కాబట్టి ముందుగనే హెచ్చరికను పొందుటమంచిది. మనకు ప్రాచీన మూఢాచారపరాయణత్వ మనెడు తిరుగలితొయి ఒకవైపుననున్నది. పాశ్చాత్యసభ్యతావిజృంభణమునందు అస్థిగతమై ఒడల జీర్ణించిపోయిన జడవాదము, అనాత్మవాదము, కృత్రిమ సంస్కారము, అనెడు తిరుగలితొయి మఱియొకవైపున నున్నది. మన మీరెంటినడుమ చిక్కక పురోగమింపవలయును. ఈ రెంటిని దృష్టియందుంచుకొనవలయును. మనము పాశ్చాత్యులము కాలేము అని మొదట జ్ఞప్తిపెట్టుకోవలెను. వారిని అనుకరింప బూనుటవలన లాభములేదు. నీవొక వేళ పాశ్చాత్యులనుఅనుకరింపగలిగితివేని ఆక్షణమందే మృత్యువు నిన్నావేశించును. నీకింక ప్రాణము దక్కదు. రెండవది—అసలటు లనుకరింపగలుగుట అసంభవము. అనాదికాలమున పుట్టి, లక్షలాది యుగములుగా ప్రవహించుచున్న ఒక మహానదికి నీ విప్పుడు అడ్డుపడి హిమగిరిశిఖరముపై దాని ఉత్పత్తిస్థానమును చేరునట్లు దానిని వెనుకకు నెట్టగలవా? అదియు సాధ్యమైనను, నీవు పాశ్చాత్యుడవుగా మాఱుట మాత్రము అసంభవము. పాశ్చాత్యుడు నిన్నకాక మొన్న పుట్టిన తన సభ్యతనే విడువజాలడేని, శతశతాబ్దములనుండి నిరవధికముగా ప్రజ్వరిల్లుచు వచ్చుచున్న నీ సభ్యతను నీవు త్రోసిపుచ్చుకొనగలవని తలతువా? అది పొసగదు. ప్రతి చిన్న గ్రామదేవతయందును, ప్రతి చిన్నమూఢాచారమునందును, మతధర్మమని మనము చెప్పుకొను తత్త్వము గూఢముగా భాసించుచున్నదని జ్ఞప్తినుంచుకొనవలయును. ఐనను

స్థానికాచారములు అనంతములును, పరస్పర విరుద్ధములునై యున్నవి. వీనిలో మనము అనువర్తింపవలసినవి ఏవి? అనువర్తింపతగనివి ఏవి? ఉదాహరణకుచూడుడు : దాక్షిణాత్య బ్రాహ్మణునకు వేఱొక బ్రాహ్మణుడు మాంసమునినుట కండ్లు బడినతోడనే ఒడలుకంపించును. ఉత్తరదేశపు బ్రాహ్మణుఁడో అది మహా పవిత్రకార్యమని యెంచును. యజ్ఞముల పేరిట వందలకొలది మేకలను అతడు వధచేయును. మీ ఆచారమును ప్రచారముచేయుటకు మీరు పూనుకొనినతోడనే, తమ ఆచారమును ప్రచారముచేయుటకు వారును సిద్ధపడుదురు. భారతదేశమునం దంతటను ఎన్నో ఆచారములు భిన్నభిన్నములుగా నున్నవి. కాని అవి స్థానికములు; అనగా ఒక్కొక్క స్థలమునం దొక్కొక్క విధముగా నుండునవి. ఐనను పామరజనులు తమ స్థానికాచారమే తమ మతమునకు సారభూతమని పొరపాటుగా తలంచుచుందురు.

దీనిని దాటినను మఱింత కష్టతరమైన ఇంకొక ప్రతిబంధముకలదు. మన శాస్త్రములలో రెండు విధములగు ధర్మములున్నవి. ఒక రకపు ధర్మములు నరుని శాశ్వత స్వభావముపైని ఆధారపడినవి. అవి ఈశ్వరునికి, జీవునికి, జగత్తునకు, గల పరస్పర శాశ్వత సంబంధమును గుఱించి చెప్పును. ఇక రెండవరకపు ధర్మములు దేశకాల పాత్రలపై ఆధారపడి, ఆయాకాలపరిస్థితి, అప్పటి సంఘమర్యాదలు మొదలగు వానికి సంబంధించియుండును. మొదటిరకపు ధర్మములు ముఖ్యముగా మన శ్రుతులందు గోచరించును. రెండవరకపు ధర్మములు స్మృతులందును,

పురాణములు మున్నగువానియందును గోచరించును. వేదములు పరమగమ్యములు; త్రికాలాబాధితములు; సార్వకాలప్రమాణములు. పురాణములలోని ఏ భాగములైనను వేదధర్మములకు విరుద్ధముగా నున్నయెడల ఆ పురాణభాగములను నిర్దాక్షిణ్యముగా త్రోసివేయవచ్చును. ఇక స్మృతులలోని ధర్మములో భిన్నభిన్నముగానుండును. ఈయుగములో ఈ ఆచారము నవలంబింప వలయునని ఒక స్మృతి చెప్పును. ఇంకొక యుగములో రచింపబడిన వేఱొకస్మృతి ఇంకొకదానిని అవలంబింపవలెనని విధించును. ఈ ఆచారము సత్యయుగమున వాడుకలో నుండవలయును; ఈ ఆచారము కలియుగములో వాడుకయందుండవలయును అని పురాణములు చెప్పుచుండును. సనాతనధర్మములు నరుని ఆంతర స్వభావముపై ఆధారపడునవిగాన, నరజాతి జీవించియుండునంతకాలమును శాశ్వతములైయుండునవే. అవి సర్వకాలమును ఉపకరించు సర్వవ్యాపకములైన విశ్వజనీన ధర్మములు. కాని, స్మృతులు స్థానిక పరిస్థితులకు అనుగుణములైన విధులను తెలుపును. ఆ యా స్థితిగతుల ననుసరించి నిర్మింపబడుటచే కాలక్రమమున అవి మార్పుచెందుచుండును. కావున ఒక్కచిన్న సాంఘికాచారము మార్పుచెందినచో, మతమే భ్రష్టమవునని మీరు తలంపరాదు. ఈ ఆచారములు ఇదివఱ కెన్నో మార్పులు చెంది చెంది, నేడు మనకీ రూపమున కాన్పించుచున్నవని గ్రహింపవలయును. గోమాంసము తినకున్నచో ఏ బ్రాహ్మణునికిని బ్రాహ్మణత్వము నిలువజాలదని మన స్మృతులు ఘోషించిన కాలముకూడ కలదు. ఒక

సన్న్యాసియో, రాజో, మహాపురుషుడో ఇంటికివచ్చినప్పుడు, ఉన్నవానిలో శ్రేష్ఠమగు కోడెదూడనుచంపి వండిపెట్టుడి వారని వేదములు తెలుపుచున్నవి. మనము వ్యవసాయ వృత్తిని ముఖ్యముగా అవలంబించువార మగుటచేత, శ్రేష్ఠములగు కోడెలను వధించుట జాతివినాశమునకు హేతువగునని కాలక్రమమున గ్రహించితిమి. కావున ఆ ఆచారము మానివేసితిమి. అంతట గోవధ కూడదని శాసింపబడినది. మన మిప్పుడు మహాఘోరకార్యములుగా భావించునవి ఒకప్పుడు సదాచారములుగా నున్నట్లు ఇందుచే స్పష్టపడుచున్నది. ఇప్పటిస్మృతులు పోయి కాలక్రమమున ఇతర స్మృతులు రచింపబడును. అవి మరల తోలగింపబడి మఱికొన్ని క్రొత్తస్మృతులు పుట్టును. వేదములు సనాతనములగుటచేత ఏకరీతిగనుండి, అన్నియుగములకును పనికివచ్చునని యు, స్మృతులు కాలానుసారము పుట్టుచు అంతరించుచు నుండవలసినవని యు మనము గమనింపవలెను. కాలము గడవగా గడవగా పెక్కుస్మృతులు గతించిపోవును. ఋషులు వచ్చి ఆ యుగముయొక్క అవసరములనుబట్టి సంఘమును క్రొత్త మార్గముల నడుపుదురు; క్రొత్తవిధులను క్రొత్త పద్ధతులను నెలకొల్పుదురు. అవి లేనిది అప్పటి సంఘము బ్రతుకజాలదు. ఈ విధముగా మనము మనమార్గమును ఎప్పటికప్పుడు సవరించుకొనుచు పైని పేర్కొనబడిన రెండు ప్రమాదములను తప్పించుకొని మెలగవలెను. ఇందుకై మన లో ప్రతివ్యక్తియు అపారమగు హృదయ వైశాల్యమును, ఆత్మవిశ్వాసమును కలిగి, ప్రతిదానిని పరిగ్రహించుటగాని,

విసర్జింపరాదు అని గ్రహించునుగాక! హఠభక్తుని తీవ్రత తోపాటు, జడవాదియొక్క విశాలతగూడ ఉండుట అవసరము. సముద్రమువలె లోతును, అనంతాకాశమువలె విశాలమును నగు హృదయము మనకు కావలసియున్నది. పుడమిని ఎన్నడేని వెలసిన ఏజాతితోనైన సరిపోలజాలు నంతటి పురోవృద్ధికాములముగను, హిందువులకు మాత్రమే నైజమై వెలయునంతటి పూర్వాచారపరాయణులముగను, ఉందుముగాక యని ముక్తకంఠముతో పలుకుచున్నాను.

ప్రతి విషయములోను ప్రధానాంశమును అప్రధానాంశమును వేఱుచేసి చూచుటను మనము నేర్చుకొన వలయును. ప్రధానమైన వనగా శాశ్వతములై నిలుచునవి; అప్రధానమైన వనగా కొంతకాలము మాత్రమే ఉపకరింప గలిగి, ఆ పిమ్మట తొలగించి వీని స్థానమున ప్రధానమగు దేనినేని నెలకొలుపని యెడల, ప్రత్యక్షముగా హానికరము లగునవి. ఇట్లనుటచే, మీరు నడుములుబిగించి మీ పూర్వాచారములను, పూర్వసంప్రదాయములను నాశముగావింప వలెనని నాఅభిప్రాయము కాదు; ఎంతమాత్రమును కాదు. వానిలో అతిదుష్టములైనవానిని సయితము మీరు తూలనాడ తగదు. దేనినిగాని తూలనాడవలదు. ఇప్పుడు ప్రత్యక్షముగా హానికరములై చూపట్టు ఆచారములు సయితము, పూర్వము ఒకానొకప్పుడు ప్రాణప్రదములై యుండినవే! ఈ నాడు మీరు వానిని త్రోసివేయ వలయునేని, శాపనార్థములతోమాత్రము ఆ పని చేయకుడు. పూర్వము ఒకప్పుడు అవియే మనజాతిని నాశము కాకుండ సంరక్షించి, మహోప

కారము చేసియుండిన కారణమున వానిని దీవించుచు, వాని యెడ కృతజ్ఞతను జూపుచు, వానిని సాగనంప వలయును. మన సంఘమును నడపిన నాయకులు ఎన్నడుగాని సేనాధిపతులును, చక్రవర్తులునుకారనియు, వారు మహర్షులనియు మనము జ్ఞప్తినుంచుకొనవలయును. ఈ ఋషులు ఎవరు? ఉపనిషత్తులు తెలుపునట్లు 'ఋషి' అనగా సామాన్య నరుడు కాడు. ఒక మంత్రద్రష్ట. ఆయన 'మతము'ను ప్రత్యక్షము చేసికొనిన వాడు. ఆయనకు 'మతము' అనగా పుస్తకపఠనము కాదు; వాగ్వాదమును కాదు; ఊహారచనయు కాదు; ప్రసంగ ప్రాగల్భ్యమును కాదు. ఆయనకు 'మతము'అనగా ప్రత్యక్షానుభవము; అపరోక్షానుభూతి; ఇంద్రియానుభవములకు అతీతములగు సత్యములను స్వయముగా ముఖాముఖి చూచుటవంటి ఒక మహానుభూతి! 'ఋషిత్వము' అనగా ఇటువంటిది. ఈ ఋషిత్వము ఏ యుగమునకును ప్రత్యేకముగా చెందినదికాదు; ఏకాలమునకుగాని, ఏ జాతికి గాని, ఏ కులమునకు గాని సంబంధించినది కాదు. "బ్రహ్మమును సాక్షాత్కారము చేసికొనవలసియున్నది" అని వాత్స్యయన ఋషి చెప్పుచున్నాడు. మీరును, నేనును, ప్రతివ్యక్తియు ఋషులము కావలసి యున్నాము. మనకు నేడు ఆత్మవిశ్వాసము అత్యావశ్యకము. మనము లోకసంస్కర్తలము కావలసి యున్నది. అందుకు వలయు సర్వమును మనలో అజ్ఞాతముగా నున్నది. మనము 'మతము'ను ప్రత్యక్షముగ చూడవలయును. స్వానుభవమునకు తెచ్చుకొనవలయును. ఆ మార్గమునసే మన సంశయముల నన్నిం

టిని తీర్చుకొనవలయును. మహాఋషిత్వముతో తేజరిల్లుచు, ధీరులమై నిలిచి, మనమెల్లరము మహాపురుషులము కావలయును. అప్పుడు మన పెదవులనుండి వచ్చు ప్రతి శబ్దమునకును వెనుక అనంత సత్యశక్తి వెలయుచుండును. పాపము మన ఎదుట నిలువలేక కాళ్లకు బుద్ధిచెప్పును. మనము ఎవరినిగాని శపింప నవసరములేకుండ, ఎవరిని దూషింప నగత్యము లేకుండ, ఈప్రపంచములో ఎవరితోడను పోరు సలుప నక్కరలేకుండ, చూచిన మాత్రాన సమస్త పాపములును ఎగిరిపోవును. మనము, ఇచ్చటనున్న మన లోని ప్రతివాడును, ఋషిత్వమును పొంది ఇతరుల ముక్తిని, మన ముక్తిని, సాధించుకొనగలుగునట్లు పరమేశ్వరుడు మనల ననుగ్రహించుగాక!

శ్రీ స్వాములవారు కుంభకోణము వేంచేసినప్పుడు, అచ్చటి హిందూసంఘమువారు ఈ క్రింది స్వాగతపత్రమును సమర్పించిరి.

పూజ్యులరగు నోస్వామీ!

అత్యంత ప్రాచీన పుణ్యక్షేత్రమగు ఈ కుంభకోణపట్టణమునందలి పురజనుల పక్షమున, మన పురాతన దేవాలయములచేతను మహాఋషులచేతను సాధుపుంగవులచేతను పవిత్రీభూతమై వెలుంగు పుణ్యభూమియగు మన దేశమునకు, పాశ్చాత్య ప్రపంచమునుండి శ్రీవారు మరలివచ్చు ఈ

తరుణమున, మేము భక్తిపూర్వకముగా శ్రీవారికి స్వాగత మర్పించుకొనుటకు అనుజ్ఞ కోరుచున్నాము. శ్రీవారు పూనిన మతప్రచారమునకు అమెరికా యూరపు ఖండములలో అద్భుతవిజయమును చేకూర్చినందుకును, ప్రపంచమున నలుదెసలనుండి వచ్చి షికాగోనగరమున సమావేశమైన వివిధ మతప్రతినిధిమహాశయులకు హిందూ మతము, హిందూ తత్త్వశాస్త్రము, నరునికిగల సమస్త భగవద్భావములను, అధ్యాత్మ సాధనాదర్శములను ఉద్ధరించి, వారికి సామరస్యమును కూర్చు జాలునంతటి విశాలములును, సహేతుకములును, విశ్వశరణ్యములునునై, ఒప్పుచున్నవని నచ్చుచెప్పుటకు తగిన సమర్థతను శ్రీవారికి ప్రసాదించినందుకును, భగవంతునియెడ మే మత్యంతము కృతజ్ఞులము.

విశ్వప్రాణుడును, విశ్వాత్మయునై యొప్పు పరమేశ్వరుని చేతులలో ధర్మపతాకము సర్వదా సురక్షితమైయుండునను విశ్వాసము, అనేక సహస్రాబ్దములుగా మన భక్తి ప్రపత్తులయందు లీనమైయున్నది. శ్రీవారు క్రైస్తవభూములందు సలిపిన పవిత్రప్రచారముయొక్క ఫలితముగా పరమార్థజీవులగు హిందువుల పిత్రార్జిత సంపదయై పరగు ఆధ్యాత్మిక ధర్మముయొక్క అగణితమహిమ భారతీయులయొక్కయు విదేశీయులయొక్కయు దృష్టిపథమున ప్రతిష్ఠింపబడినది గనుక మేము ఆనందమును పొందుచున్నాము. శ్రీవారి ఈ ప్రచారవిజయము, ఇదివఱకే సుప్రసిద్ధమై వెలసిన శ్రీవారి సద్గురుదేవుని కీర్తి ప్రకాశమును ఇనుమడింపజేసినది; నాగరిక ప్రపంచముయొక్క దృష్టిలో మన

కొక గౌరవస్థానమునుకూడ కల్పించినది; మన పూర్వు లొనరించిన మహాకార్యములను గుఱించి జాతిత్వేన గర్వపడుటకు ఆధారము కలదనియు, మన నాగరికతయందు పరపీడనో జ్జృంభణము లేకపోవుట మన అసమర్థత, దౌర్బల్యము వలన కాదనియు మాకు విశదముచేసినది. శ్రీవారివంటి సదసద్వివేకులును, దీక్షాపరులును, పూర్ణ నిష్కాములును అగు బోధకులు మాలో నుండుటచేత, హిందూజాతియొక్క భావిభాగ్యదశ ప్రతిభావంతమును, ఆశాజనకమును అయి తీఱును. జగత్ప్రభుండును, సకలజాతులకు ఏకైకదైవత మును అగు పరమేశ్వరుడు శ్రీవారికి దీర్ఘాయురారోగ్యముల నొసంగి, హిందూమత తత్త్వప్రచారకులుగా శ్రీవారు పూనిన మహాపవిత్రోద్యమమును జయప్రదముగా నిర్వహించు కొఱకు అధికాధికముగా ధీశక్తిని జవసత్త్వములను ప్రసాదించు గాక యని ప్రార్థించుచున్నారము.

మఱొక స్వాగతపత్రము ఆ పట్టణపు హిందూవిద్యార్థులు సమర్పించిరి. పిమ్మట శ్రీ స్వాములవారు **"వేదాంత ప్రచారమును"** గుఱించి ఈ క్రింది తెఱగున ఉపన్యసించిరి.

"కొలది పాటి ధర్మాచరణమునయితము గొప్ప ఫలము నొసంగును" అను గీతావచనములోని సత్యత్వము నా జీవితమునందు అనుదినము నాకు గోచరమగుచునే యున్నది. నేను నిర్వహించిన కార్యము నిజముగా గణన లోనికి రావగినంతటిదికాదు. కాన, కొలంబో మొదలు ఈ నగరమువఱకు, అడుగడుగున, నా కొసంగబడిన స్వాగత

సత్కారములందు చూపట్టు ఆదయ, ఆ ప్రేమ, ఇంత గొప్పగానుండునని నేను ఎన్నడును ఊహించియుండలేదు. ఐనను ఈయాదరము హిందువులమగు మనకు సంప్రదాయానుగుణముగనే యున్నది. మనజాతికిది సహజమే. ఏల యందురా, చూడుడు! మనది హిందూజాతి; మన ఆయువుపట్టు, మన జీవనిధి, ఇంతేల మన ఆత్మయే 'మత ధర్మము'గా భాసించుచున్నది. ప్రాచ్యజాతుల మధ్యను, పాశ్చాత్యజాతుల మధ్యను, పర్యటించుచు ప్రపంచ మెట్లున్నదో నేను కొంచెము చూచియున్నాను. ఒక్కొక్క మహోధర్మము ఒక్కొక్క జాతియొక్క వెన్నెముకగా కనబడుచున్నది. కొందఱికి రాజనీతి, కొందఱికి సంఘశిక్షణము, కొందఱికి బుద్ధి పరిశ్రమ—ఇట్లే వారి వారి జాతీయభావముల ననుసరించి ప్రాణభూతములగు జాతి లక్షణము లేర్పడుచున్నవి. మన యీ మాతృభూమికి 'మతమే' మూలాధారము; మతమే వెన్నెముక. మతమనెడు పెనుశిలమీద మన జాతీయజీవితసౌధము నిర్మింపబడి యున్నది. చెన్నపురి ప్రజలు ప్రేమతో నాకు అమెరికాకు పంపిన అభినందన పత్రమునకు నేనిడిన ప్రత్యుత్తరములో, 'హిందూదేశములోని యొక పేదరైతునకు, పాశ్చాత్య ప్రపంచములోని పెక్కుమంది విద్యాధికుల కంటె, ఉత్తమమగు మతసంస్కారము కలదు' అను సత్యమును సూచించి యుంటిని. ఈనాడు నామాటలు నిస్సందేహముగా సత్యము లని నాకు రుజువగుచున్నది. మన జనసామాన్యమునకు ప్రపంచజ్ఞానము తక్కువనియు, దానిని సంపాదించుకొన

వలయునను కోరికయే వారికి లేకున్నదనియు, పూర్వ మొకప్పుడు నేను అసంతృప్తి పొందుచుండెడి వాడను. ఇప్పుడు నాకు దానిరహస్యము తెలియవచ్చినది. వారికి ఏ విషయములందు అభిమానముకలదో ఆ విషయములు తెలిసికొనుటకు ఇతరదేశప్రజలకన్న ఎక్కువ ఔత్సుక్యమును వారు ప్రదర్శింతురు. యూరపులో జరుగుచున్న గొప్ప గొప్ప రాజకీయపరివర్తనములను గూర్చి గాని, యూరపియనుసంఘములలో జరుగు ఉద్యమాభివృద్ధులను గుఱించిగాని, మనపల్లెటూరి వారిని అడుగుడు. వారి కేమియు తెలిసియుండదు; తెలిసికొనవలయు ననెడు అపేక్షయునుండదు! కాని హిందూదేశముతో ఏప్రమేయము లేకుండ, ఎక్కడోయున్న సింహళద్వీపము నందలి పల్లెటూరి అమాయక ప్రజలుకూడ—అక్కడ పొలములో పనిపాటులు చేయు కూలివాండ్రుసైతము—అమెరికాలో ఒక మత మహాసభ జరిగెననియు, ఒకహిందూసన్న్యాసి అక్కడకు వెళ్ళెననియు, వానికి కొంతజయము చేకూరెననియు అప్పుడే తెలిసికొని యుండిరి.

కాబట్టి మన అభిరుచి ఎందున్నదో ఆవిషయములు తెలిసికొనుటకు ఇతరజాతులతో సమముగ మనవారును చొరవచూపుచునే యున్నారు. హిందూదేశములో ప్రజలకు రుచించు విషయము 'మతము' ఒక్కటే. ఒకజాతియొక్క అభిరుచియంతయు మతాదర్శములందుండుట మంచిదా, లేక రాజకీయాదర్శములందుండుట మంచిదా, అని నే నిప్పుడు తర్కింపబోవుటలేదు. మంచికో చెడ్డకో మన అభిరుచులు

మతములో లగ్నమైయున్నవి. మీరు దానినిప్పుడు మార్చ లేరు; దానిని నాశనముచేసి దానికి మారుగా ఇంకొక దానిని తెచ్చిపెట్టనుకూడ లేరు. బాగుగా పెరిగిన ఒక పెద్దచెట్టును ఒక చోటునుండి తీసి, వేఱొక చోట నాటి, వెంటనే వేరూను నట్లు చేయుట సాధ్యముకాదు. మతధర్మప్రవాహము వేలకు వేలు సంవత్సరములనుండి హిందూదేశమున పారుచున్నది; మంచికో చెడ్డకో భారతవాతావరణము అనేకశతాబ్దముల నుండి మతాదర్శములతోనిండి మెఱయుచున్నది. మంచికో చెడ్డకో మనము మతాదర్శములలో పుట్టి అందులోనే పెరిగి యున్నాము. అదిమన రక్తములోనికి ఇంకిపోయినది. ప్రతి నాళములోని జీవకణములందును, అది చొరబాటైనది. అది మనశరీరముతో సారూప్యముపొందినది. అది మనప్రాణ ములకే ఆయువుపట్టైనది. తాను మలచుకొన్న మార్గము వెంబడి యుగయుగములుగా ప్రవహించుచున్న ఈ మత వాహినిని పూడ్చివేయక దానిని విడనాడుట సాధ్యమా? ఒకవేళ అట్లు పూడ్చివేసినను, దాని దుష్పలితములను అనుభవింపకుందురా? గంగా ప్రవాహము వెనుకకు మరలి, హిమగిరి శిఖరములకు ఎగబ్రాకిపోయి, నూతనమార్గమును అవలంబింప వలయునని మీరు వాంఛించుచున్నారా? అదియే సంభవమైనను, ఈ భారతమాత తనకు సహజమైన అధ్యాత్మజీవనమార్గమునుండి తొలగి, ఇంక ఏదో క్రొత్త మార్గమును—రాజకీయాదిమార్గాంతరమును—త్రొక్కుట మాత్రము అసంభవము. ఎవనికివాడు తనకు సుకరమైన

ధర్మమేదో దానిని మాత్రమే చేపట్టును. భారతదేశమునకు అధ్యాత్మమార్గమే సుగమమార్గముగా కన్పించుచున్నది. మత మార్గమును అనుసరించి నడచుటే హిందూదేశ జీవన విధానము.

ఇక ఇతర దేశములందో మతమనునది అనేక 'జీవితావసరములలో' ఒకటి. నాకలవాటైన ఒక చిన్ని దృష్టాంతమును తెలిపెదను. "ఒక దొరసాని భవంతిలోచాల వస్తువులున్నవి. భవంతులలో జపాను కూజాను అందముగా అమర్చుకొనుట ఒక 'ఫ్యాషను.' అదిలేకున్న అందమునకు కొఱతకావున ఒక జపానుకూజా కొనవలెనని దొరసాని మోజుపడినది. ఆ దొరకును, ఆ దొరసానికిని, ఇట్టిమోజులు చాలకలవు. వానిలో ఇంచుక మతావలంబనము ఒకటి." కావున వారొకించుక మతమునుకూడ చేపట్టుదురు. వారికి ఈలోకమే పరమగమ్యము. ఆగమ్యము చేరుటకు సహకారులైననే దేవుడును, మతమును! వారికి 'దేవు'డనగా ఈ ప్రపంచమును తమకొఱకు పరిశుభ్రముచేసి, అమర్చిపెట్టు ఒక పరిచారకుడు. వారు దేవునకొసగు విలువ అంతగానే కనబడుచున్నది. ఎవరు సుజ్ఞానులుగా నుండవలయునో అట్టి వారి పెదవులనుండి—పోనీ సుజ్ఞానులమని నటనచేయు పెద్దలనోటినుండి—ఒకటి రెండు శతాబ్దములుగా హిందూ మతధర్మమును ఖండించుచు వెలువడుచున్న ఆక్షేపములు ఎట్టివో మీ రెఱుగుదురుగదా! మన మతము ఐహిక సుఖ జీవనమునకు అనుకూలింపదట! అది మనఒడిలో బంగారపు రాసులు కుమ్మరింపదట! ఇతర జాతులను దోచుకొనుటకు

అది మనకు తోడ్పడదట! దుర్బలుర నెత్తినెక్కి, వారి నణగ ద్రొక్కు వీరులనుగా మనలను తయారు చేయదట! దీనుల జీవరక్తములను గ్రసియించువిద్యను మనకది నేర్పదట! నిజమే, మనమతము అటుల చేయదు. జాతులను దోచుకొని, ధ్వంసముచేసి, రూపుమాపుచు, భూమి అదరిపడి దద్దరిల్ల అన్యదేశములపైకి దాడివెడలు సమరయోధులను మనమతము సిద్ధము చేయదట! కావున 'ఈ మతములో పస ఏమున్నది? అది మీ తిరుగళ్లకు కక్కు కొట్టిపెట్టదు. మీ కండరములకు బలమెక్కింపదు. అట్టి మత మెందులకు?' అని వారు ప్రశ్నించుచున్నారు.

వారి ఆక్షేపణలే మన మతముయొక్క యోగ్యతను రుజువుచేయుటకు ఆధారములని వారు తెలిసికొనలేకున్నారు. మన మతము ఈ ప్రపంచ భోగములకొఱకై ప్రాకులాడదు. 'మూడునాళ్లముచ్చట యగు ఈక్షుద్రభోగమయప్రపంచమును మన సర్వస్వముగా భావింపరాదు. అదొక ఘనమగు గమ్యార్థముగా నుండతగదు' అని బోధించుచున్నది గనుకనే, ఈ మనమతమును సత్యమనుచున్నాము! ఏనాలుగడుగుల వ్యాప్తియో గల ఈచిన్నివసుధాచక్రము, మన మతదృష్టికి హద్దులుపెట్టజాలదు. మన గమ్యార్థము చాల దూరముగా నున్నది. ఇంద్రియములనుదాటి, ఆకాశమును అతిక్రమించి, కాలమునకు అతీతముగా పోయి, తుదకు మన గమ్యమును చేరినపుడు, ఈ ప్రపంచము ఇసుమంతయు దృష్టిగోచరముకాదు. అచ్చట సర్వాతీతమై పరగు ఆత్మ విభూతిమహాసాగరమున ఈ బ్రహ్మాండమే ఒక చిన్నచుక్కయై

గోచరించును! ''బ్రహ్మసత్యము, జగత్తుమిథ్య; మీ ఐశ్వర్య మంతయు బుగ్గి, మీ బలమంతయు క్షుద్రము, ఈ జన్మయే దుఃఖము'' అని మనమతము తెలుపును; కాబట్టియే అది సత్యమైనది! వైరాగ్యమును ఉపదేశించి, యుగయుగముల నాటి దివ్యజ్ఞానమును గఱపును గావునసే, మన మతమును సత్యమనుట! మన ప్రాచీనులు సాధించిన అధ్యాత్మపరిణతికి, ప్రజ్ఞానరాశికి, వారసులమగు మనతో పోల్చిచూచిన, ఇతర జాతులు నిన్న మొన్నటి పసిబిడ్డలు! వారిని చూచి ''ఓ బిడ్డలారా! మీరు ఇంద్రియదాసులుగ నున్నారు. ఇంద్రియ భోగములు అశాశ్వతములు, ఆత్మవినాశకరములు. అవి యొసగు మూడునాళ్ల ముచ్చట తుదిని మిమ్ము భ్రష్టులను చేయును. దానిని విడిచివేయుడు; ఇంద్రియలోలురు కాకుడు; ప్రపంచమును పరిత్యజింపుడు'' అని హైందవమతాదర్శము ఎలుగెత్తి చాటుచున్నది. పరమార్థమును చేరుత్రోవ వైరాగ్యమే గాని. భోగము కాజాలదు. కాబట్టి మనదే సత్యమతము.

జాతితరువాత జాతిగా, ఈ ప్రపంచనాటక రంగము మీదికి వచ్చి, కొలదినిమిషములు తమ విధిప్రకారము చక్కగనే నాట్యముచేసి, తుదకు రూపుమాసి చనుచున్నవి. మహాకాలసముద్రమున చిన్న అలను సయితము తమ జాడచూపుటకైనె నిలుపజాలక, అవి మృతిచెందుచున్నవి. అట్టియెడ, ఇదిగో, మనము నిత్యజీవులమో యనునట్లు, సజీవులమై మెలగుచుండుట ఒకచిత్రవిషయముగాదా! ''అందఱును పడిపోగా, అస్తమములు మిగులుదురు'' అనెడు

నూతనసిద్ధాంతిములగూర్చి వారు ఏమేమో పలుకుదురు. మాంసకండరముల బలమే అర్హతములనొనర్చి నిత్యజీవము నొసంగునని వారి యభిప్రాయము! వారి యభిప్రాయమే సత్యమగునేని యోధాగ్రేసరవిఖ్యాతిగన్న ప్రాచీన జాతులలో ఒక్కటేనియు ఈనాడు సజీవమై వైభవోపేతమై యుండవలసినదిగదా; ఒక్క అన్యజాతినిగాని, ఉపజాతినిగాని, ఎన్నడును జయించియెఱుగని, దుర్బల భారతజాతి ఈనాడు నిర్జీవమై పోయియుండవలసినదిగదా. కాని మన మిప్పటికిని ముప్పటికోట్లమందిమి కలము! (ఒక ఆంగ్లయువతి నన్ను చూచి—"మీ హిందువులు ఏమి ఘనకార్యము చేయగలిగిరి? ఒక చిన్న ఉపజాతినైనను జయించియుండలేదే?" అని ప్రశ్నించినది.) అదిపోనిండు, మన జాతి బలమంతయు ఉడిగి, సర్వాంగవాతముతో ఊరకపడియున్నదని చెప్పుట సత్యముకాదు; ఎంతమాత్రమును కాదు. మన యందు కావలసినంత చైతన్యము కలదు; కాలము పండి, ఆవశ్యకత కలిగినప్పుడు అది ప్రళయసముద్రమువలె పొంగి, పొరలి, జగమును ముంచివేయుచున్నది!

అతిప్రాచీనకాలము నుండికూడ, ఈ సత్యమును మనము ప్రకటించుచునే యున్నాము. నరుడు ఎంత ఎక్కువ సంపదను కూర్చుకొనగలడు అను సమస్యను పాశ్చాత్య ప్రపంచము పరిష్కరింపజూచుచుండ, ఇక్కడ భారతదేశమున నరుడు ఎంత స్వల్పముతో జీవింపగలడు అను సమస్యను పరిష్కరింపజూచుచున్నాము. ఈ పోరాటముతో శతాబ్దములు గడవవలసినదే; ఈ

విభేదము సదానిలిచి ఉండునదే. 'ఆత్మనిగ్రహ సాధన పూని మితభోగులగువారు తుదకు జయశీలులై జీవింతురు. సుఖాభిలాషులై భోగముల గుడుచువారు, తాత్కాలికముగా ఎంత జవసత్త్వములు గలవారుగా పైకి చూపట్టినను, చివరకు నశింపవలసినవారే యగుదురు! వారి వంశములు త్వరలోనే అంతరించును' అని చరిత్ర గుణపాఠము నేర్పుచున్నది. వ్యక్తిజీవితమునందును, సంఘ జీవితమునందునుగూడ, ప్రాపంచిక భోగములపై రోత గలుగు సమయములు వచ్చుచునేయుండును. అట్టి భోగ విముఖత ఇపుడు పాశ్చాత్యప్రపంచమున వ్యాప్తిచెందు చున్నట్లు కాన్పించుచున్నది. అక్కడను జిజ్ఞాసువులున్నారు; వారును మహనీయులే. అధికారమునకు, ఐశ్వర్యమునకు ఆశపడి పరుగులిడుట వ్యర్థపుపనులలో వ్యర్థపుపనియని వారును కనుగొనుచున్నారు. అట్టి బుద్ధిశాలురలో చాలమంది—స్త్రీలును పురుషులునుకూడ—పోటీలన్నను, పోరాటములన్నను, వ్యాపారనాగరికత తెచ్చిపెట్టు ద్వేషములన్నను, వెగటుచెందుచున్నారు. వానిని తొలగించుకొను ఉపాయమును అన్వేషించుచున్నారు. యూరపునందలి అనర్థములన్నిటిని తొలగించుటకు రాజకీయ సాంఘిక పరివర్తనములే ఉపకరించునని, వానినే పట్టుకొని ప్రాకులాడువారలును గలరు. అయినను, ఉత్తమాలోచనాపరులు ఇతరమార్గములకై వెదకులాడుచునే యున్నారు. ప్రజలను రాజకీయముగను, సాంఘికముగను ఎన్నిరీతుల క్రిందు మీదులుచేసినను, అనర్థములెన్నడును తొలగజాలవని

వీరు గ్రహించిరి. హృదయముమాత్రి యోగ్యతరమైనదే గాని, జీవితానర్థదశలు తొలగవు. ఎంత బలాత్కరించినను, ఎంతటి రాజకీయాధికారము చెలాయించినను, ఎన్ని క్రూర శాసనములు చేసినను, జాతిపరిస్థితి చక్కబడజాలదు. ఆధ్యాత్మికచింతనము, నైతిక శిక్షణము మాత్రమే జాతిని సన్మార్గమునబెట్టి సంస్కరింపగలుగును. అందువలన, ఈ పాశ్చాత్యజాతులవారు ఏదేని క్రొత్తభావమైఖరిగాని, ఏదేని నూతన తత్త్వమార్గముగాని దొరకునాయని ఆతుర పడుచున్నారు. వారవలంబించుచున్న క్రైస్తవమతము చాల వఱకు శుభప్రదమును మహిమాన్వితమును అయినదే. కాని దానినివారు తిన్నగా అర్థముచేసికొనుటలేదు. ఇంతవఱకు వారు అర్థముచేసికొనగల్గిన విధమునుబట్టి, ఆ మతము అసమర్థమైనదని తేలినది. పాశ్చాత్యులలో జిజ్ఞాసువులగు బుద్ధిమంతులు ఏ నూతనభావస్ఫురణమునకై పరితపించుచున్నారో, ఆధ్యాత్మిక తృప్తి పాసలను తీర్పగల ఏ ఆహారపానీయములకొఱకు ఆరాటపడుచున్నారో, అవి యెల్ల మన ప్రాచీనతత్త్వశాస్త్రమునందు, ముఖ్యముగా వేదాంత సిద్ధాంతమునందు, లభించుచున్నవి. ఇట్లగుటలో ఆశ్చర్య మేమియులేదు.

లోకములో ప్రతిమతమునకును నానా విధములగు చిత్రవిచిత్ర ప్రభావములు కలవని ప్రచారము చేయుట నేను ఎఱుగుదును. క్రైస్తవమతము ఒక్కటి మాత్రమే విశ్వశరణ్యమైనదని నా స్నేహితుడు డాక్టర్ బారోస్ (Barrows) చాటిచెప్పుట మొన్న మొన్ననే అందఱు వినియే

యున్నాఁడుగదా! ఈ విషయమును కొంచెము విమర్శన దృష్టితో విచారించినమీఁదట వేదాంతమతము మాత్రమే విశ్వజనీనమతముగా వెలయఁగలదనియు, ఇంక ఏ ఇతరమత మునకును అట్టి యోగ్యతలేదనియు, నాకు దృఢముగా తోఁచినది. దానికి కారణములు ఏవియో మీకు తెల్పెదను. ఒక్క మన మతముతప్ప, ప్రపంచములోని గొప్ప మతము లించుమించుగా అన్నియు, తన్మతస్థాపనాచార్యుల జీవితములతో అవినాభావసంబంధము కలిగియున్నవి. వారి మత సిద్ధాంతములు, మతోపదేశములు, మతబోధలు, నీతిశాస్త్రములు: అన్నియు వారి మతస్థాపకుని జీవితమును ఆధారముచేసికొని నిర్మింపబడినవే! ఆ పురుషునిబట్టియే అవి ఆమోదము పడయుచున్నవి; ఆ మహాత్మునివలననే అవి మహిమాఢ్యము లగుచున్నవి; ఆ ప్రముఖుని ఆధారము చేసికొనియే అవి ప్రమాణములగుచున్నవి. ఈ విధముగా ఆయా మతస్థాపకులు చారిత్రకపురుషులు అను భావమే పునాదిగా అనేక మతమహాభవనములు నిర్మింపబడుట చూడ, నాకు నిజముగా ఆశ్చర్యమగుచున్నది. మత కర్తల జీవితవృత్తాంతములందు, దాదాపు సగభాగముకూడ ఈ కాలములో నమ్మెడువారుండరు; తక్కిన సగమును సందేహముతోఁజూతురు. ఆధునికపరిశోధనల వలన, అట్టి వారి జీవితోదంతములుకొన్ని చారిత్రకసత్యములు కావని సులభముగా రుజువుచేయవచ్చును. ఆదెబ్బతో వారి "చారిత్రకసత్యము" లెల్ల పుక్కిటిపురాణములై, వారి రాతి పునాదులెల్ల వట్టి యిసుకతిప్పలై, వారు కట్టుకొన్న భవన

మంతయు బదాబదలై నేలకూలును. ఇక మరల ఎన్నడును పూర్వస్థితికి రాజాలదు.

మన మతమొక్కటితప్ప, ప్రపంచములోని ప్రతి మతమును అట్టి ఒకానొక చారిత్రక పురుషునిపై ఆధారపడి పైకివచ్చినదే! ఇక మనదో, ధర్మసూత్రములపై ఆధార పడియున్నది. వేదములను తానుసృష్టించితినని చెప్పుకోగల స్త్రీగాని, పురుషుడుగాని లేడు. 'వేదములు' అనగా సనాతన ధర్మముల జ్ఞానరాశి. ఋషులు ఆ ధర్మములనుకాంచిరి. అప్పు డప్పుడు ఈ ఋషులనామములు—నామములు మాత్రమే—పేర్కొనబడుటకలదు. వారు ఎవరో, ఎటువంటివారో కూడ మనకు తెలియదు. చాలమంది ఋషులవిషయములో, వారి తండ్రులు ఎవరైనది తెలియవచ్చుట లేదు. ఏ ఋషి యొక్కయు జన్మదినముగాని, జన్మస్థానముగాని తెలియనే తెలియదు. ఈ ఋషులకు తమ పేరు ప్రతిష్ఠల గొడవయే పట్టలేదు. వారు ధర్మబోధనుమాత్రము చేసిపోయిరి. తాము బోధించిన ధర్మములకు తామే నిదర్శనములుగ నుండుటకు తమచేత నైనంతవఱకు ప్రయత్నించిరి. మన భగవంతుడు నిర్గుణుడయ్యును సగుణుడుగాకూడ నుండు తీరున, మన మతముకూడ మిక్కిలి అపౌరుషేయమైనదయ్యును (అనగా పురుషులపైగాక ధర్మములపై ఆధారపడినదయ్యును) పురుష ప్రచారమునకుగూడ అపారమగు అవకాశము నిచ్చు చున్నది. ఎట్లన, ఇన్ని యవతారములను, ఇందఱు ప్రవక్త లను ఋషులను మనకొసంగియు, ఇంకను అట్టివారి ఆగమ నముకొఱకు నిరీక్షించుచుండు మత మింకొకటి కలదా? అవ

తారములు అనంతములనియు, మీరు కోరినంతమంది వచ్చుటకు ఇంకను అవకాశమున్న దనియు, భాగవతము చెప్పుచున్నది. కావున మన మతచరిత్రయందు పేర్కొన్న బడిన మహాపురుషులలో, అవతారములలో, ప్రవక్తలలో, ఎంతమంది చరిత్ర పరిశోధనవలన నిజమగు వ్యక్తులు కారని రుజువైనప్పటికిని, మన మతమునకు ఇసుమంతయు హానియుండదు. అది ధర్మములపై ఆధారపడినదే కాని, వ్యక్తులపై ఆధారపడినది కాకపోవుటచేత సర్వకాలము సుస్థిరమై నిలువగలదు. ప్రపంచ ప్రజలందఱును ఏ ఒక్క పురుషునో అనుసరించునట్లు కల్పించుట కేవలము వ్యర్థము. వారినందఱిని సనాతనములును, విశ్వజనీనములును, అగు ధర్మముల ననుసరించునట్లు చేయుట సైతము దుస్సాధమే. కాని, ఎప్పటికైనను లోకజనులలో నెక్కువభాగమును ఒక్క భావవై ఖరికి తేగలుగుచో, అది ధర్మసూత్ర మూలమున కాగలదుగాని, పురుషులమూలమున కాజాలదు. ఐనను మన మతమునందు వ్యక్తుల పలుకుబడికిని అధికారమునకును చాల అవకాశముకలదని యిప్పటికే చెప్పితిని! ఈ మహాత్ములలోనుండి మన ఇచ్ఛానుసారము ఏర్చి తీసికొను నవకాశము కలిగించు 'ఇష్టదైవము' అనెడు అత్యద్భుత సిద్ధాంతము ఒకటి కలదు. నీకు గురువుగా, నీకు పూజార్హుడుగా ఈ ప్రవక్తలలోనుండిగాని, ఉపదేశకులలోనుండిగాని, ఎవరినైనను నీ యిష్టము చొప్పున ఏర్చుకొనవచ్చును. నీవు ఏర్చుకొనిన వ్యక్తియే ప్రవక్తలలో అగ్రగణ్యుడనియు, అవతారములలో పరమపూజ్యుడనియు భావనచేయు నవకాశమునూడ

నీకున్నది. దానివలన ఏ హానియులేదు. కాని దీనికంతకును వెనుక మూలాధారముగా, సనాతన సత్యధర్మసిద్ధాంతములను నిలుపుకొనవలసి యుండును. ఇక్కడ ఒక విచిత్ర విషయము గమనార్హము. మన వేదధర్మములకు నిదర్శనములుగా నున్నంతవఱకే మన అవతారములను మనము ప్రమాణములుగా పాటించుచున్నాము. మన సనాతన వైదికమతధర్మములను ఉపదేశించిన ఉత్తమ గురుడును, భారతదేశమున బుట్టిన వేదాంతవ్యాఖ్యాతలలో ప్రథమ గణ్యుడును అగుటచేతనే శ్రీకృష్ణుని మహిమ ఇంతగా ప్రకాశించుచున్నది.

వేదాంతము అత్యధికముగా ప్రపంచదృష్టిని ఆకర్షించుటకు రెండవ కారణము ఇది: బాహ్యప్రకృతి పరిశీలనకు పూనిన ఆధునికశాస్త్రములు ఇంతవఱకు కనిపట్టిన విషయములకు, ప్రతిపాదించిన సిద్ధాంతములకు, మన వేదాంత సూత్రములెల్ల అనుగుణముగా నున్నవి. ఇది అద్భుతావహమగు విషయము. ప్రపంచమందలి ఏ మతశాస్త్రమునందును ఆధ్యాత్మిక, భౌతిక సిద్ధాంతములకు ఇట్టి సామరస్యము కాన్పింపదు. అస్పష్టమగు ప్రాచీనకాలములో ఆకారమునందును, అనుభూతియందును, చిత్తాకర్షణయందును, అక్కడక్కడెల్లెండ్రవలె నున్న రెండు భావనాసంప్రదాయములు బయలుదేఱి రెండు భిన్నమార్గములను అవలంబించినవి. అందొకటి ప్రాచీన హైందవసంప్రదాయము; రెండవది ప్రాచీన గ్రీకుసంప్రదాయము. ఇందు మొదటిది ఆంతర ప్రపంచమును పరిశోధించుటతో ప్రారంభమైనది. రెండవది

బాహ్యప్రపంచపరిశోధనతో ప్రారంభమైనది. అయినను, రెండును సర్వాతీతమగు ఒక్కపరమార్థమునే వెదక బయలు వెడలెను. వీనికి వాటిలిన వివిధ దశాంతరముల చరిత్రను పరిశీలించుచు పోయిన, ఈ రెండు భావవాహినులును, ఆ పరమగమ్యమునుగూర్చి, ఒక్కవిధమగు శ్రుతిలోనే గానము చేసినట్లు మనకు విదితమగును. నూతన భౌతిక శాస్త్ర సిద్ధాంతములు హిందువుల వేదాంతమతసిద్ధాంతములతో మాత్రమే సామరస్యము నంచగలవని స్పష్టముగా కాన్పించు చున్నది. పాశ్చాత్యుల భౌతికవాదము తన ప్రత్యేకతను తాను నిలుపుకొనుచునే వేదాంత ధర్మసిద్ధాంతములను అంగీకరించుటవలన, పరమార్థమును చేరగలుగునని నిస్సందేహముగా చెప్పవచ్చును. ఈ నవీనశాస్త్రసిద్ధాంత ములను యుగయుగాంతరములకు పూర్వమే మనవేదాంతులు దర్శించియుండిరని మనకును—మనకనగేల, కన్నులు తెఱచి సత్యమును చూడగోరువారికెల్లరకును, తెలియవచ్చుచున్నది. కాని భాషలో ఈ రెంటికిని భేదము కలదు. నవీనశాస్త్రము లందు ఆసిద్ధాంతములు జడప్రకృతిపరముగా చెప్పబడి యుండ, వేదాంతమునందవి అధ్యాత్మపరముగా ప్రతిపాదింప బడియున్నవి. వేదాంతము పాశ్చాత్యజిజ్ఞాసువులను ఆకర్షించుటకు మఱియొక హేతువుకూడ కలదు. అది దాని యద్భుత తార్కికదృష్టి. వేదాంతమునందలి సిద్ధాంతములు ఎంతయో యుక్తియుక్తముగానున్నవని కొందఱు పాశ్చాత్య భౌతికశాస్త్ర పండితులు నాతో స్వయముగా చెప్పి యున్నారు. వారిలో నొకరు, భోజనము చేయుటకుగాని

తన పరిశోధనాలయమును విడిచి వెలుపలికి పోవుటకుగాని, సరిగా తీతిక చిక్కనివారు, వేదాంతమును గుఱించిన నా ఉపన్యాసములను వినుటకై గంటలకొలది కాలము నిలువబడి యుండెడివారు. దీనికి కారణము నా ఉపన్యాసములు సమంజసముగానుండి, ఈ యుగజనుల మహాశయములతోను, నేటి విజ్ఞానశాస్త్ర పరిశోధనాఫలితములతోను చక్కగా సమన్వయపడుటేయని ఆయన నాకు చెప్పినాడు.

ఇక వివిధమతములను శాస్త్రీయముగా పరిశీలించుట వలన తేలిన సిద్ధాంతములను రెంటిని మీకు ముఖ్యముగా తెలుపగోరుచున్నాను. ఒకటి, మతములన్నియు విశ్వేశ్వరణ్యములే అను భావమునకును, రెండవది, సమస్త వస్తువులును ఏకపదార్థవికారములే అను భావమునకును సంబంధించినవి. బాబిలోనుల, యూదుల చరిత్రలు పరిశీలించినచో వారి మతమునకు సంబంధించిన ఒక విషయము మనకు గోచరించును. ఈ బాబిలోనుజాతియు, యూదియాజాతియు, ఒక్కొక్కటి పెక్కు ఉపజాతులుగా విడిపోయి యున్నవి. ప్రతి ఉపజాతికిని ఒక ప్రత్యేక దేవత గలదు. ఈ చిన్న చిన్న ఉపజాతి దేవతలకు సామాన్యముగా ఒక్క జాతీయ నామమునే వాడుట కలదు. బాబిలోనుజాతీయుల దేవతలను 'బాలులు (**Baals**)' అందురు. వీనిలో 'మెరోడాక్ బాల్' ప్రధానదైవము. కాలక్రమమున ఈ పెక్కు ఉపజాతులలో ఒకటి ఇతర ఉపజాతులను జయించి తనలో ఇముడ్చుకొనును. తత్ఫలముగా ఈ జయశాలిని యగు ఉపజాతిదేవత తక్కిన ఉపజాతిదేవతలందఱిమీదను అధికారిణి యగును. బాబిలోను

జాతి సగర్వముగా తమలో కలదని చెప్పుకొనుచున్న ఏకేశ్వరారాధన ఈ తీరుగానే యేర్పడినది. యూదుల దేవతలకు 'మోలోక్' అను సామాన్యనామము గలదు. వీరిలో 'ఇస్రాయేల్ (Isreal)' అనబడు ఉపజాతికి చెందిన 'మోలోక్' నకు 'మోలోక్ యహ్వా (Moloch Yahva)' లేక 'మోలోక్ యవా (Moloch Yava)' అని పేరు. కాలక్రమమున ఇస్రాయేల్ అను ఉపజాతి తక్కిన ఉపజాతులను జయించి, వారి 'మోలోకు' లను నాశనముచేసి, తమ 'మోలోక్' ను అన్నిటిలో శ్రేష్ఠతమమని ప్రకటించిరి. మతముపేరిట గావింపబడిన ఈ యుద్ధములవలన, ఎంతటి రక్తపాతము, ఎంతటి పరహింస, ఎంతటి ఘోరదౌర్జన్యము సంఘటిల్లెనో మీరు సులభముగా ఊహించుకొనవచ్చును. ఆ పిమ్మట కొంతకాలమునకు ''మోలోక్ యహ్వా'' యొక్క ఆధిపత్యమును నాశముచేయవలయునని బాబిలోన్ జాతివారు ప్రయత్నించిరి. కాని విజయము నొందజాలక పోయిరి.

మతవిషయములలో ఆధిక్యముకొఱకు, ఇట్టి ఉపజాతి పోరాటములు హిందూదేశపు సరిహద్దులలో కూడ జరిగి యుండునని నాకు తోచుచున్నది. ఇక్కడకూడ, ఆర్యుల లోని ఆయా ఉపజాతులవారు తమతమ దేవతలను శ్రేష్ఠులుగా ప్రకటించుకొఱకై తమలోతాము యుద్ధములు చేసి యుందురు. కాని, హిందువులచరిత్ర యూదులచరిత్ర వంటిది కాక వేఱొక రూపమొందవలసియుండెను. సమస్త దేశములందును భారతదేశము ఒక్కటే శాంతిభూమియును, అధ్యాత్మక్షేత్రమునునై భావికాలమున ప్రకాశింప నుండు

టచే, ఆ ఉపజాతుల పోరాటములును, వారి దేవతల యుద్ధములును, చిరకాలము సాగియుండలేదు. ఇంతవఱకు ఈ పుడమిపై జన్మించిన మహర్షి శ్రేష్ఠులలో శ్రేష్ఠుడు—ఆ అతి ప్రాచీనకాలమునందే, చరిత్రకు తెలియని ఆ అజ్ఞాతయుగమునసే, యుగయుగములుగా వచ్చుచున్న సంప్రదాయములుసైతము ఊరక తొంగిచూచుటకేని సాహసింపని ఆ తమోమయ కాలారంభమునసే—ఈ కర్మభూమిపై ప్రభవించి "ఏకం సద్విప్రా బహుధా వదన్తి" (ఉన్నదొక్కటే, దానినే జ్ఞానులు అనేకవిధములుగా పేర్కొనుచున్నారు) అని ప్రవచించి యున్నాడు. మానవముఖమునుండి ఇంతవఱకు బహిర్గతమైన వాక్యములలో ఇంత ఉదాత్తమైనది మఱియొకటిలేదు. మన హైందవజాతీయ జీవితమునకు ఈ సత్యమే మూలాధారముగా నిలిచియున్నది. మన జాతీయ జీవితమునందు అనేక శతాబ్దములుగా 'ఏకం సద్విప్రా బహుధా వదన్తి' అనెడు మహాభావము పరంపరాగతమై వచ్చుచున్నది. అది విస్ఫురణము గాంచుచు మన జాతీయ జీవితమునంతను ఆవరించినది; మనరక్తములో ఇంకిపోయినది; మనతో సారూప్యముపొందినది. ఆ మహాసత్యము మన ప్రతిరక్తనాళములోను ప్రవహించుచు, ప్రియముగొలుపుచున్నది. అందువలననే మనదేశము మతసహనమునకు పట్టుగొమ్మయై లోకవిఖ్యాతి నార్జించినది. మన మతమును ఖండించి నాశముచేయుటకు వచ్చియున్న అన్యమతములకు మసీదులను, చర్చీలను నిర్మించియిచ్చినది ఇక్కడనే, ఈ దేశమునసే! లోకము మననుండి నేర్చుకొనుటకు నిరీక్షించు

చున్న మహాధర్మసూత్రము ఇదియే. అబ్బ! దేశాంతరము లందెంతటి అసహనమున్నదో మీకు తెలియదు!! ఈ మత ద్వేషము కారణముగా నా అనువులను పరదేశముల పాలు చేయవలసి వచ్చునని నాకనేక పర్యాయములు తోచినది. మతముపేరిట సోదరుని వధించుట వారికి అత్యల్పవిషయము. ఈనాడు వారొకవేళ ఇట్టి నరహత్యలకు తలపడకున్నను, రేపు పాశ్చాత్యనాగరికతా కేంద్రమగు మహాపట్టణపు నడివీధు లందే వారా పనిచేయవచ్చును. పాశ్చాత్యదేశములలో ఎవ్వడైనను తమదేశమంగీకరించిన మతమునకు విరుద్ధముగా ఒక్కమాట పలికెనా, మహాభయంకరమగు బహిష్కారాయుధము వానినెత్తిమీద పడినదన్నమాటే! వారు మన కులాచారములను విమర్శించుచు ధారాళముగా, చొరవగా, వానిని ఖండింతురు. కాని పాశ్చాత్యదేశములందలి మహా పండితాగ్రేసరులు సయితము ప్రజాభిప్రాయమునకు భీతిల్లి మతవిషయములలో తాము సత్యమని విశ్వసించు దానిలో శతాంశమైనను బయటబెట్టుటకు సాహసింపక వట్టి పిరికి పందలవలె పడియుందురు. నావలె ఆ దేశములకుపోయి కొంతకాలము నివసించుచో మీకును ఈ విషయము తేట తెల్లమగును.

కాబట్టి లోకవ్యాప్తముగా మతసహనధర్మము ప్రతిష్ఠింపబడవలెనని ప్రపంచము ఆరాటపడుచున్నది. అది నాగరికతకే ఒక మహావరప్రసాదము! ఈ భావమును గౌరవింపని నాగరికత చాలకాలము నిలువజాలదు. మూర్ఖావేశము, రక్తపాతము, దౌర్జన్యము ఆగిపోకున్నచో, ఏ నాగరి

కతగాని అభివృద్ధినందదు. మనయెడ ఇతరులు ఔదార్యమును జూపగోరుదుమేని, ఇతరుల మతవిశ్వాసములయెడల ఔదార్యము, దాక్షిణ్యము ముందు మనము చూపవలయును. ఇంతేకాదు; ఇతరుల మతవిశ్వాసములును, భావములును ఎంతభిన్నముగా నున్నను వారియెడల సహనము చూపుటే గాక, ప్రత్యక్షముగా హృదయపూర్వక సహకారమును సయితము ఒసంగవలయునని ప్రపంచప్రజలెల్ల గ్రహింతురు గాక. భారతదేశములో మనము చేయుచున్నది సరిగా అదియే. ఇక్కడ, ఈ భారతదేశములోనే, క్రైస్తవులకు చర్చీలను, మహమ్మదీయులకు మసీదులను కట్టిపెట్టినాము; ఇంకను కట్టిపెట్టుచున్నాము. మనము చేయవలసినదదియే. వారెంతగా ద్వేషించినను, ఎంతగా దౌర్జన్యము చూపినను, ఎంతక్రూరులై వర్తించినను, ఎంతగా ద్రోహముచేసినను, ఎంతగా నిర్బంధించినను, ఎంతటి దూషణవాక్యములు పల్కినను, మనముమాత్రము ప్రేమచేతనే వారిని జయింపవలయును. తక్కిన వన్నియు జారిపోయినను, ప్రేమమాత్రము తుదివఱకును నిలిచి యుండును; ద్వేషము నిలువజాలదు. సాధువర్తనమే చిరకాలము జీవించి, ఫలప్రదమగుటకు తగిన సత్త్వము కలది; దౌర్జన్యమునకును, హింసకును అట్టి శక్తి లేదు. ఈ సత్యమును ప్రపంచమునకు మనము రుజువుచేసి చూపువఱకును క్రైస్తవులకు చర్చీలను, మహమ్మదీయులకు మసీదులును, కట్టిపెట్టుచునేయుందుముగాక!

ఆధ్యాత్మికదృష్టితోజూచిన ఈ జగమంతయు ఏక పదార్థవికారమే యనెడు సనాతనదివ్యభావమే ప్రపంచము

మననుండి నేర్చుకొనవలసిన రెండవభావము. ఉన్నతజాతుల కన్న నిమ్నజాతులవారును, సభ్యజనులకన్న సామాన్య జనులును, చదువరులకన్న చదువురానివారును, బలశాలుర కన్న బలహీనులును, ప్రపంచమునందెల్లెడల దీనిని ఎక్కు-వగా కోరుచున్నారు. పాశ్చాత్యుల నూతన శాస్త్ర పరి శోధనలు స్థూలసాధనల ద్వారా విశ్వమంతయు ఒక్కటిగా, అఖండముగానున్నదని రుజువుచేయుచున్నట్లు మదరాసు విశ్వవిద్యాలయ పట్టభద్రులకు, విద్యార్థులకు, నేనీనాడు చెప్ప నక్క-అవలేదు గదా. స్థూలదృష్టితో మాటాడినచో, మీరును, నేనును, ఈ సూర్యచంద్రనక్షత్రములును జడద్రవ్య మనెడు ఒకానొక అఖండ సముద్రమధ్యమున చిన్నిచిన్ని తరంగములవలె నున్నారమనియే చెప్పవలెను. ఇట్లే 'శరీరము,' 'మనస్సు' అనునవి సైతము ఆ సమష్టిమహా సముద్రమునందలి చిన్నతరంగములకు పెట్టినపేళ్లు మాత్రమే అని భారతీయుల వేదాంతశాస్త్రము పెక్కు-యుగములకు పూర్వమే రుజువుచేసి యున్నది. ఈ వేదాంతము ఇంకొక అడుగు ముందుకు పోయి, ఏకమై చూపట్టు ఈ విశ్వమంతటికి వెనుక, అద్వితీయమై, సర్వాధారమై, సత్యాత్మ వెలయు చున్నదని ప్రకటించినది. ఈ జగమంతటను పర్వి ఒక్క-పరమాత్మయే కలదు. "ఏకమే వాద్వితీయం". ఈ విశ్వ మంతయు సత్యమగు తాత్త్వికదృష్టిలో అభిన్నమే యనెడు మహాభావము, ఈ దేశమునగూడ అనేకులను భీతిలజేయు చున్నది! ఈ నాడు సైతము దీనిని ఆమోదించువారికన్న, నిరాకరించువారే హెచ్చుమంది కలరు.

ఐనప్పటికిని, ప్రపంచము ఈ దివ్యభావముకొఱకే పరితపించి పోవుచున్నది; భారతదేశమున నోరులేని ప్రజలు తమ్ము ఉద్ధరించునని దీనిపై ఆశాదృష్టులు ప్రసరించుచున్నారు. ఈ సిద్ధాంతమును దైనందినజీవితమున ఆచరణలో పెట్ట కున్నచో ఈ దేశమును పునరుద్ధరించుటకు మఱియొక మార్గము లేదు.

తార్కికశేలురగు పాశ్చాత్యులు తమ తత్త్వసిద్ధాంత ములును, నీతిసూత్రములును ఎంతవఱకు తర్కసహములుగా, యుక్తియుక్తములుగా నున్నవో కనుగొనుటకు ఇప్పుడు గట్టిగా పూనుకొనుచున్నారు. ఒక పురుషుడు ఎంతటి ఘనుడైనను, ఎంతటి మహాత్ముడైనను, వాని ఒక్కని ఆమోదము పడసిన మాత్రాన నీతిశాస్త్రమునకు పరమ ప్రామాణ్యము కలుగబోదని మీకందఱకు తెలిసియే యున్నది. నీతిసూత్రములకు ఏ ఒక్కని ప్రమాణముగా చూపిన మాత్రాన, ప్రపంచమునందలి ఉత్తమజిజ్ఞాసువు లెవ్వరును అంగీకరింపజాలరు. తమ నీతిసూత్రములకును, ధర్మశాస్త్రములకును ప్రామాణ్యమును సమకూర్చుటకు మానవుని అంగీకారముకన్న గొప్పదేదో ఇంకొకటి ఉండి తీఱవలెనని వారు కోరుదురు. నీతిశాస్త్రమునకు ప్రమాణ ముగా ఏదేని సనాతనధర్మసూత్రము కావలెనని వారు అభిలషింతురు. సరే; నీలోను, నాలోను, అందఱిలోను, ఆత్మలోను, జీవునిలోను, నిండియున్న ఆ అఖండబ్రహ్మమున కన్న సర్వోత్తమప్రమాణ మింకేముండును? ఆత్మయొక్క అఖండాద్వితీయత్వమే సమస్త నీతిధర్మమునకును, శాశ్వతా

భారమయి వెలయుచున్నది. మీరును నేనును సోదరుల మని మాత్రమే భావన చేయుట చాలదు. మీరును నేనును వేఱుగాక నిజమునకు 'ఒక్కరమే.' అని తెలిసికొన వలయును. హిందూతత్త్వశాస్త్రము ఇట్లే పలుకుచున్నది. ఈ అద్వైతభావమే సమస్తనీతులకును, సర్వాచారమార్మిక సిద్ధాంతములకును పునాది. పరతంత్రమై కృశించిపోవుచున్న యీ భారతదేశమేకాక యూరపుఖండము సయితము, ఈ నాడు అద్వైతమును కోరుకొనుచున్నది. ఈ దివ్య సూత్రము బాగుగా ప్రస్ఫుటముగాకున్నను, ఇంగ్లాండు, జర్మనీ, ఫ్రాన్సు, అమెరికాలలో తలయెత్తుచున్న నూతన రాజకీయ సాంఘికోద్యమములకు మూలకారణమై యున్నది. మిత్రులారా! నా వాక్కులను గమనింపుడు! స్వాతంత్ర్యము కొఱకును, సర్వమానవ విముక్తికొఱకును, మానవజాతి యొనర్చు తీవ్రప్రయత్నములను వివరించు వాఙ్మయమునం దంతటను, భారతీయ వేదాంతాదర్శములు ప్రస్ఫుటములై గోచరించుచుండును. కొందఱు గ్రంథకర్తల విషయములో, వారి ఆంతర్యప్రేరణమునకు ఆధారమేమో వారికి తెలియ కున్నది. మఱికొందఱు తామేదో అపూర్వకల్పనము చేసినట్లు నటింపజూచుచున్నారు. కాని ఆ మూలాధారమును ప్రకటించి, దానికి తమకృతజ్ఞతను తెలుపుకొనిన ఉచితజ్ఞులు కొలదిగా లేకపోలేదు.

అమెరికాలో ఉన్నప్పుడు నేను అద్వైతమునే అత్యధికముగను, ద్వైతమును అత్యల్పముగను బోధించు చుంటి నన్నెడు ఆక్షేపణను ఒకతఱి వింటిని. పూజాసంసేవనా

పరములగు ద్వైతభక్తి సిద్ధాంతములందు ఎంతటిమహిమ గలదో, ఎంతటి భక్తిరాసులుగలవో, ఎటువంటి అఖండ పారవశ్యమునుగూర్చు దివ్యానంద విభూతులుగలవో అను భవమునుబట్టి నే నెఱుగుదును. కాని అట్టి ఆనందములో నైనను బాష్పములు విడుచుటకు మనకిది తరుణముకాదు. ఇదివఱకే కావలసినంత కన్నీరు కార్చియున్నాము. మెత్త దనముచూపుటకు మనకింక అవకాశములేదు. మనము దూదిపింజలవలె మెత్తబడి ప్రాణములు సైతము కోల్పోవు వఱకు, ఈ మెత్తదనము మనలను వెంటాడివచ్చినది. మన దేశమున కిప్పుడు కావలసినవి అప్రతిహతమగు ఇనుప కండరములు, ఉక్కునరములు, వజ్రసంకల్పము! మహా సముద్రాంతర్భాగమున అట్టడుగునకు మునుగవలసివచ్చినను, ముఖాముఖిని మరణముతో పోరాడవలసి వచ్చినను, జంకక ఏరీతినైనను జగద్రహస్యముల నెల్ల భేదింపగల దృఢసంక ల్పము! మనకిప్పుడు కావలసిన దదియే. అద్వైతాదర్శమును, అనగా సర్వమును ఏకమనెడు భావమును, అర్థముచేసికొని అనుభవమునకు తెచ్చుకొనుటద్వారా అభేద్యములగు దైహిక మానసికశక్తులను సాధించుటయే మనకిప్పుడు కర్తవ్యము. విశ్వాసము! విశ్వాసము! ఆత్మవిశ్వాసము! ఈశ్వరునందు విశ్వాసము!! ఈ విశ్వాసమే ఔన్నత్యమునకు కీలకము!! పురాణోక్తములగు ముప్పదిమూడుకోట్ల దేవత లందును. అప్పుడప్పుడు విదేశీయులువచ్చి మీ మెడుట నిలబెట్టిన లెక్కలేని చిల్లరదేవత లన్నింటియందును మీరు విశ్వాసముంచినను, మీయందు మీకు విశ్వాసము లేని

యెడల, అనగా మీకు ఆత్మవిశ్వాసము సున్నయైనచో, ఇప్పుడేకాదు ఎప్పటికిని మీకు ముక్తిలేదు, లేదు, లేదు. మీలోమీకు గాఢవిశ్వాసము కుదురవలెను. ఆత్మవిశ్వాసముతో తొమ్మువిఱిచి నిలబడవలెను. అదే మనకిప్పుడు కావలసినది. మనము ఇద్దఱమా ముగ్గురమా, ముప్పది మూడుకోట్ల ప్రజలముగదా! ఏ పదుగురు పరదేశీయులో గడచినవేయి సంవత్సరములుగా దౌర్జన్యముతో, రాక్షసత్వముతో, మనలను కాలరాచి మనపై ప్రభుత్వము చెలాయించుట ఎట్లు సంభవించినది? వారికి ఆత్మవిశ్వాసమున్నది, మనకు లేదు. ఇదియే కారణము! పాశ్చాత్యదేశములందు నేను కనుగొన్న విషయమొకటికలదు: నరుడు పతితుడై, నిరాశోపహతుడై పరమపాపియైపోయెనని క్రైస్తవమత బోధకులు ఎంత ప్రచారము గావించుచున్నను యూరపులోను, అమెరికాలోను, వారి జాతీయ హృదయాంతరాళము నందు మాత్రము ఆత్మవిశ్వాసముయొక్క మహోద్భుతశక్తి సుప్రతిష్ఠితమై యున్నది. ఇంగ్లండులో ఒక చిన్నపనివాడు కూడ "నేను ఇంగ్లీషువాడను, నేనేమైనను చేయగలను" అని మీతో సగర్వముగాచెప్పును. అమెరికాలో, యూరపులో, ఎక్కడైనను ఇంతే. వారికి ఆ ఆత్మవిశ్వాసము, ధైర్యసాహసములు ఉగ్గుపాలతో వచ్చును. ఇక్కడ మన బాలురో, క్రొత్తవారితో అసలు నోరువిప్పి మాటాడగలరా? లేదు లేదు. పోనీ, బాలురసంగతి అటుండనిండు; మనపెద్దలు సైతము అట్లు పలుకగలరా? మనకు ఆత్మవిశ్వాసము పూర్తిగా లోపించినది. దానిని పునరుజ్జీవింప జేయవలెను.

అట్లు చేయగలిగినది అద్వైతసిద్ధాంతమొక్కటే. మానవుల హృదయములను మేల్కొలిపి, వారి ఆత్మప్రభావమును వారికి తెలుపవలెనన్నచో, వేదాంతములోని అద్వైతపథమును వారికి బోధించుట ముఖ్యావశ్యకము. ఆ కారణము చేతనే నేనీ అద్వైతబోధకు గడంగితిని. నేను పాశ్చిక దృష్టితో అటుల చేయుటలేదు. విశ్వజనీనములును, సర్వజనాంగీకార్యములునగు ఉద్దేశములను ఆధారము చేసికొనియే నాబోధలను సాగించుచున్నాను.

ద్వైతికిగాని, విశిష్టాద్వైతికిగాని ఆక్షేపణయుండని సమాధాన మార్గము కనుగొనుట సులభమే. భగవంతుని దివ్యాంశము సమస్త వస్తువులందును వ్యాపించియుండునని సిద్ధాంతమును అంగీకరింపని సంప్రదాయము ఒక్కటేనియు భారతదేశమున కానరాదు. ప్రతివేదాంత సంప్రదాయమును పవిత్రత, పరిపూర్ణత, సత్యము, జీవాత్మయందు పూర్తిగా కలవని ఒప్పుకొనుచున్నది. కొందఱి అభిప్రాయమునను సరించి ఈపరిపూర్ణత ఒకొక్కప్పుడు 'సంకోచము' పొందుచు, ఇంకొకప్పుడు తిరిగి 'వికాసము'పొందుచునుండును; కాని అదిసర్వదాఉండియేయున్నది.అద్వైతమతానుసారము, అది సంకోచమునుగాని వికాసమునుగాని పొందుటే లేదు. కాని మరల మరల వ్యక్తమగుచు అవ్యక్తమగుచునుండును. ఎట్లన్నను పర్యవసానమున ఒక్కటే. ఒక విధముగా చెప్పుట మఱియొక విధముగా చెప్పుటకంటె తర్కసమ్మతముగా నుండవచ్చును. కాని పర్యవసానమున రెండుసిద్ధాంతములును దాదాపుగా ఒకటియే యగును. ఈ ఒక్క కేంద్ర

భావమే ప్రపంచమునకు ఆవశ్యకముగా ఉన్నది. ఇతర దేశము లన్నింటికన్నను మన మాతృభూమియందు దీని ఆవశ్యకత ఎక్కువగా కనబడుచున్నది.

మిత్రులారా! ఇప్పుడు మీకు అప్రియముగా తోచు కొన్ని యథార్థవిషయములను చెప్పవలసి యున్నది. మన దరిద్రసోదరులలో నెవడేని ఒక ఆంగ్లేయునిచే అవమానింప బడినప్పుడుగాని, హత్యజేయబడినప్పుడుగాని దేశమెల్ల ఎట్లు గగ్గోలు పెట్టునో వార్తాపత్రికలలో నేను చదువుచుందును. నేను చదువుదును, దుఃఖింతును. ఆ మఱుక్షణమే, దీని కంతకును బాధ్యులెవరు అను ప్రశ్న నామనస్సునకు తట్టును. వేదాంతి నగుటచేత ఆప్రశ్నను నాకునేను వేసికొనక తప్పదు. హిందువు అంతర్దృష్టిగలవాడు. అతడు సర్వ విషయములను తనలోనే, తన ద్వారానే, సాక్షిదృష్టితో చూడనెంచును. కాబట్టి బాధ్యులెవరు అని నన్ను నేను ప్రశ్నించుకొందును. 'ఆంగ్లేయులు కారు' అను సమాధానమే ప్రతిసారియు అంతర్వాణి చెప్పుచుండును! నిజము; వారు బాధ్యులుకారు! మన దౌర్భాగ్యమున కంతకు, మన పతనమున కంతకు, బాధ్యత మనదే. సర్వమునకు మనమే బాధ్యులము. మన పూర్వులలో ఉత్తమకులీనులు ఇతరసామాన్యజనులను కాల ద్రోక్కి నేలరాచినారు; వారిని దిక్కులేని వారినిగా చేసినారు. ఈ హింసలవలన ఆనిర్భాగ్యులు, తాము మానవజీవులమను మాటయే దాదాపుగా మఱచిరి. ఇట్లు అనేక శతాబ్దముల కాలము, గతి లేక, వారు కష్టములు కొట్టియు, నీళ్లు మోసియు, చెప్పులు

కుట్టియు, కూలినాలి చేసికొనియు ఎట్లో బ్రతుకులు కొన సాగించిరి. తాము సేవకులుగా, బానిసలుగా జన్మించితిమని భావించి వారట్లే దుర్భర దారిద్ర్యమును, అవమానమును భరించుచు కాలము వెళ్లబుచ్చిరి. ఈకాలపు విద్యాధిక తను గూర్చి మనమేదో గొప్పగా చెప్పుకొనుచున్నాము. కాని, యీ దౌర్భాగ్యజీవులపై దాక్షిణ్యముపహించి ఎవ్వ డేని వారి నుద్ధరింప యత్నించుచున్నప్పుడైనను, ఈ విద్యా ధికులు ముందుకువచ్చి అట్టివారితో సహకరింపరు. ఇంతయే కాదు. ఈ దీనజనులను ఇంకను ఎక్కువగా హింసించి పీడించుకొనుకు, పాశ్చాత్యుల ''వంశపరంపరా సిద్ధాంత ము''ను, అట్టివే మఱికొన్ని అసంబద్ధ సూత్రములను ప్రోవు చేసి నానావిధ పశువాదములను, రాక్షసతర్కములను సలుపుచుండుట నేను కనుగొనుచున్నాను. అమెరికాలోని మతమహాసభకు ఒక యువకుడు, నీగ్రోజాతివాడు—సాక్షాత్తు ఆఫ్రికా నీగ్రోజాతివాడు—ఇతరులతో కలసి వచ్చియుండెను. అతడొక దివ్యోపన్యాసముకూడ చేసినాడు. ఎట్లో నాకా యువకునియందు అభిమానము గలిగినది. అప్పుడప్పుడు వానితో మాటాడెడి వాడను. కాని అతడెవరో నేను తెలిసి కొనలేకపోయినాను. కాని, ఇంగ్లాండులో ఒకదినమున కొందఱు అమెరికనులను కలిసికొంటిని. వారునాతో చెప్పిన దిది : ఆ పిల్లవాడు ఆఫ్రికామధ్యభాగమున నివసించు ఒక నీగ్రోజాతి నాయకుని కొడుకు. ఒక దినము వేఱొక నాయకుడు ఈ పిల్లవాని తండ్రిపై ఆగ్రహముపూని వానిని వధించెను. వానినేకాదు, తల్లినిగూడ నటికివేసెను. శత్రు

వులు, వారి కళేబరములను వండుకొని తినిరి. విరోధి నాయకుడు ఈ పిల్లవానినికూడ చంపివేయవలయుననియు, వండి తినవలయుననియు ఉత్తరువుచేసినాడట. కాని ఈ పిల్ల వాడు ఎట్లో తప్పించుకొని పాఱిపోయినాడు. అనేకకష్టములు పడి, వందలకొలదిమైళ్లు ప్రయాణముచేసి, సముద్రతీరము చేరినాడు. ఒక అమెరికా ఓడవారు వీనిని తమనౌకలో నెక్కించుకొని, అమెరికాకు తీసికొని వచ్చిరి. ఆ చక్కని ఉపన్యాసము చేసినది ఈ పిల్లవాడే! అది తెలిసిన పిమ్మట, మీ వంశపరంపరా సిద్ధాంతమునుగూర్చి నేనేమి అభిప్రాయ పడవలసి యుండునో విచారింపుడు!

ఓ బ్రాహ్మణులారా! బ్రాహ్మణుడు పారంపర్య ధర్మముచేతనే మాలవానికంటె హెచ్చు బుద్ధివైభవము కలవాడై యుండు నెడల, బ్రాహ్మణుని చదువుకొఱకు ఇక డబ్బు ఖర్చుచేయవలదు. దానినంతను మాలవారి కొఱకే ఖర్చుచేయుడు. ఆ దుర్బలులకే దానముచేయుడు. అది వారికే కదా అవసరము. బ్రాహ్మణుడు బుద్ధికుశలతకలవాడుగనే పుట్టునెడల, ఆతడు ఇతరుల సాహాయ్యము లేకుండ తనంతట తానే విద్యను ఆర్జించుకొనగలడు. ఇతరులు బుద్ధికుశలత లేనివారైనయెడల, వారి విద్యాశిక్షణకై తగు ఉపాధ్యాయు లను ఏర్పాటుచేయుడు. నాకు తెలిసినంతమట్టుకు ఇది న్యాయముగను సహేతుకముగను కాన్పించుచున్నది. ఈ దీనజనులు, ఈ పీడితసోదరులు, ఈ ఆజన్మదరిద్రులు తమ యథార్థతత్త్వమును తెలిసికొనవలసియున్నది. బలవంతులకు బలహీనులకు అండయై, ఉత్తములకు నీచులకు ఆధారమై, ప్రతి

వానియందును ఒక్క అఖండాత్మయే ప్రకాశించుచున్నది. యోగులును మహర్షులును అగుటకు తగిన అనంతావకాశమును, అఖండశక్తియు, అందఱియందును కలవు. ప్రతి స్త్రీయును, ప్రతిపురుషుడును. ప్రతిబాలికయును, ప్రతిబాలుడును, జాతిభేదము లేక, జన్మభేదము లేక, సుబలదుర్బలతారతమ్య విచారణలేక, విశ్వమానవకోటియంతయు దీనిని ఆలకించి యోచనచేయునుగాక. ''ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్య వరాన్నిబోధత!'' 'లెండు, మేల్కాంచుడు, పరమార్థము చేరువఱకు ఆగకుడు' అని ప్రతిజీవికిని చాటిచెప్పుదుము గాక! ''లెండు! మేల్కొనుడు! దుర్బలతనుండి, సమ్మోహమునుండి తెప్పఱిల్లుడు.'' నిజముగా ఎవడును దుర్బలుడు కాడు! ఆత్మ అఖండము; సర్వశక్తిమంతము; సర్వజ్ఞము. లేచినిలబడుడు! మీ స్వస్వరూపమును ప్రకటింపుడు! మీలోనున్న బ్రహ్మమును ప్రకాశింపజేయుడు! వానిని నిర్లక్ష్యము చేయకుడు! మితిమీఱిన సోమరితనము, మితిమీఱిన దౌర్బల్యము, మితిమీఱిన మోహజాలము, శని దేవతలవలె మన నెత్తిపై నెక్కి చిందులు ద్రొక్కుచున్నవి. ఓహో! నవభారతపుత్రులారా! మీ సమ్మోహమును విదిల్చివేసికొనుడు. దానికివలయుమార్గము మీ శాస్త్రములందే కలదు. మీ సత్యస్వరూపమును మీరు తెలిసికొనుడు. ప్రతి వానికిని వానిస్వస్వరూపము బోధింపుడు. నిద్రలో పడియున్న జీవుని ఎలుగెత్తి పిలువుడు. ఓహో! ఆతడెటుల మేల్కొనునో మీరేచూడగలరు. ఆ సుప్తజీవి మేల్కాంచి, స్వస్వరూపజ్ఞానముతో కార్యపరుడగునప్పుడు ఆతనికి శక్తివచ్చును;

తేజము వచ్చును; శుభము గలుగును; పవిత్రతయువచ్చును. ఉత్కృష్టమగునదెల్ల అతనిని వరించును. ఆహా! గీతలోనాకు అత్యంత ప్రియమైన శ్లోకములు రెండు కలవు. అవి శ్రీకృష్ణ భగవానుని ప్రబోధమునకు సారమై, ముఖ్యపర్యవసాన మైనట్లు నాకు స్పష్టముగా గోచరించుచున్నవి :

శ్లో॥ సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరం।
వినశ్యత్స్వవినశ్యంతం యః పశ్యతి స పశ్యతి॥

శ్లో॥ సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థిత మీశ్వరం।
న హినస్త్యాత్మనా ఽత్మానం తతో యాతి పరాంగతిం॥
(XIII-౨౭-౨౮)

అనగా సకలభూతములందును సమముగా నిలుచు పరమేశ్వరుని, అశాశ్వతపదార్థములందుగల శాశ్వతబ్రహ్మ మును, చూచువాడే సత్యముగా ''తెలిసినవాడు''. సర్వత్ర సమభావముతో నుండు పరమేశ్వరుని చూచువాడు, ఆత్మను ఆత్మచేత హింసింపడు గాన, అతడు పరమగతిని, అనగా మోక్షమును పొందుచున్నాడు.

ఈ విధముగా చూచిన యెడల, ఇక్కడనేగాక దేశ దేశాంతరములందుసైతము ధార్మికపునరుజ్జీవనోద్యమము సాగించు నవకాశము వేదాంతమునకు కలదని స్పష్టమగు చున్నది. పరమేశ్వరుడు సర్వత్ర సమముగా వ్యాపించి యున్నాడు. నేడీ యద్భుతభావమును మానవజాత్యుద్ధరణ మునకై ఇచ్చటను, ఇతరదేశములందును ప్రచారము

గావింపవలసియున్నది. మన శాస్త్రములు చెప్పినటుల ఎచ్చుచెచ్చట కీడుగలదో, ఎచ్చుచెచ్చట జ్ఞానము కొఱవడి నదో, ఎచ్చుచెచ్చట అజ్ఞానము ప్రబలినదో, అదియెల్ల భేదభావముననుసరించి కలుగుచున్నదనియు, ఎచ్చుచెచ్చట మేలు కలదో అదియెల్ల సమత్వమునందును సర్వభూతముల ఏకత్వమునందును, అభిన్నత్వమునందును గల విశ్వాసము వలన చేకూరుచున్నదనియు, అనుభవపూర్వకముగా నేను తెలిసికొంటిని. ఇదియే వేదాంతము బోధించు పరమా దర్శము. ఆదర్శమును గ్రహించుట ఒక విషయము; దానిని అనుదినజీవితమునందు సర్వత్ర అనుష్ఠించుట వేఱొక విషయము. ఆదర్శమును చూపుట చాలమంచిదే. కాని, దానిని సాధించుటకు ఆచరణయోగ్యమగు మార్గమేది?

అనేక శతాబ్దములనుండి మనప్రజల మనస్సులలో ప్రధానముగా కాన్పించుచున్న క్లిష్టమును, బాధాకరమును, అగు కులభేద సమస్యయు, సంఘసంస్కరణ సమస్యయు, మనలను ఈ సందర్భమున ఎదుర్కొనుచున్నవి. నేను మర్మము విడచి చెప్పుచున్నాను. నేను కులవిధ్వంసకుడను కాను; కేవల సంఘసంస్కర్తను కాను. మీ కులభేదము లతోకాని, మీ సంఘసంస్కారముతోకాని ప్రత్యక్ష సంబంధము నాకేమియు లేదు. మీరు మీ కిష్టమైన కులమున నుండుడు. అంతమాత్రాన మీరు వేఱొక వ్యక్తినిగాని కులమునుగాని ద్వేషించుటకు కారణములేదు. ప్రేమను—ప్రేమను మాత్రమే—నేను బోధింతును. విశ్వాత్మయొక్క అభిన్నత్వమును సర్వవ్యాపకత్వమును ప్రతిపాదించు వేదాంత

సత్యము నాధారముచేసికొని నా ప్రబోధమును సాగింతును. దాదాపు నూఱుసంవత్సరములనుండి మనదేశము సంఘసంస్కర్తలతోను, నానావిధ సంఘసంస్కరణ తీర్మానముల తోడను, ఉట్టూతలూగిపోవుచున్నది. ఈ సంస్కర్తలయందు నామట్టుకు నాకు దోషములు కాన్పించుటలేదు. వారిలో చాలమంది యోగ్యులే; మంచి ఉద్దేశములు గలవారే. కొన్నివిషయములలో వారిలక్ష్యములుకూడ చాల మాననీయములే. కాని ఈ నూఱుసంవత్సరముల సంఘసంస్కరణ ప్రచారము ఈ దేశమందెక్కడను ప్రశంసనీయముగ సుస్థిర గణనీయఫలితార్థమును సాధించియుండలేదు. ఉపన్యాస వేదికలమీద వేనవేలుగా ప్రసంగములు చేసినారు. హైందవ జాతిని, హైందవనాగరికతను దుయ్యబట్టి, వానితలపై ఖండన గ్రంథముల నెన్నియో కురిపించినారు. ఐనను చెప్పుకొన దగినంతగా కార్యరూపము తాల్చిన ఫలితార్థమేదియు లేదు. దీనికి కారణ మెక్కడనున్నది? ఆ కారణము కనుగొనుట అంత కష్టముకాదు. ఖండనోద్రేకమునందే ఆ కారణము కలదు. నేనిదివఱకు చెప్పినటుల ఒక మహాజాతిగా చరిత్ర ప్రసిద్ధులమైన మనము మన శీలమును ఆత్మధర్మమును సురక్షితముగా నుంచుకొనుటకు, మున్ముందుగా ప్రయత్నింప వలయును. ఇతర జాతులవలన మనము నేర్చుకొనదగినవి చాలవిషయములు కలవనియు, అన్యులనుండి మన మనేక పాఠములు నేర్వవలయుననియు, నే నంగీకరింతును. కాని మన నవీన సంఘసంస్కరణ విధానములు పాశ్చాత్యపద్ధతులకు, కార్యోపాయములకు, చాలవఱకు గ్రుడ్డి అనుకరణములుగానే

సాగుచున్నవి. అందువలననే ఇటీవలి సంస్కరణోద్యమములు ఫలశూన్యములగుట తటస్థించినది.

ఇంకొక విషయమును కలదు. కేవలఖండనము ఎప్పుడుగాని శ్రేయోపాదకముకాదు. మన సంఘములో దోషములు కలవని పసిపిల్లవానికికూడ తెలియును. సరే. దోషములు ఏ సంఘమున లేవు? లోకములో నేను కలసి మెలసి తిరిగి కనుగొనిన ఆయా జాతులను ఉపజాతులను సరిపోల్చిచూడగా, మొత్తముమీద మనదేశప్రజలే మిక్కిలి నీతిపరులనియు, అత్యంత భక్తిపరాయణులనియు, మన సంస్థలే—వాని యేర్పాటునుబట్టి చూచినను, వాని గమ్యార్థమునుబట్టి చూచినను—మానవజాతి అభ్యుదయమునకు బాగుగా తోడ్పడుననియు నేను నిర్ధారణ చేసికొంటినని అస్మద్దేశీయులారా, ఈతరుణమున మీకు చాటి చెప్పుచున్నాను. కాబట్టి మనసంఘమునం దెట్టి పునర్నిర్మాణమును నేను కోరుటలేదు. వృద్ధి, వికాసము, జాతీయవిధానముల ననుసరించు పురోగమనము, నా ఆదర్శమైయున్నది. నా దేశముయొక్క పూర్వచరిత్రను తడవి చూచునప్పుడు, మానవబుద్ధివికాసమునకు ఇంతగా తోడ్పడిన దేశము ఈ ప్రపంచములో వేఱొకటి నాకు కానవచ్చుటలేదు. కాబట్టి నా జాతిని దూషించుటకు నాకు నోరాడదు. నేను మన వారితో 'మీరుచేసినది బాగున్నది; ఇంకను బాగుగా వర్తించుటకు ప్రయత్నింపుడు' అనియే చెప్పుదును. ఈ దేశములో పూర్వకాలమున మహాకార్యము లెన్నియో చేయబడినవి; ఇంకను ఘనతరకార్యములు చేయుటకు

వ్యవధియు అవకాశమునుగూడ కలవు. మనము ఎట్లును కదలక నిలిచియుండజాలమని మీ రెఱుగుదురు కదా! మన మట్లు కదలకుండ నిలిచియుంటిమేని, మనకు మరణమే సంభవించును. మనము ముందునకు సాగిపోవలయును; లేదేని వెనుకకైనను పోవలయును. అభివృద్ధిని పొంద వలయును; లేదా క్షీణింపవలయును. మన పూర్వులు మునుపు మహాకార్యములను చేసియున్నారు; అయినను మన మింకను పూర్ణతరజీవనమును సాధించి, వారి ఘనకార్యము లను అన్నింటిని దాటిపోవలయును. కావున, మనము వెనుకకుపోయి క్షీణించుటెట్లు? అది యెన్నటికిని పొసగదు. ఎన్నడును అట్లు కాతగదు. వెనుకకుపోయినయెడల జాతి క్షీణించి నాశనమైపోవును. కాబట్టి మనము ముందునకే పోయి, యింకను ఘనతరకార్యములను సాధింతుముగాక. నేను మీకు చెప్పవలసినది అదియే.

ఎట్టి తాత్కాలికపు సంఘసంస్కరణమును నేను బోధించువాడను కాను. నేను దోషములను సవరింప ప్రయత్నించుట లేదు. మీరు ముందునకు సాగిపోవుచు, మన పూర్వులచేత నిర్దుష్టవిధమున నిర్మింపబడియున్న మానవ పరిణామపదకమును ప్రత్యక్షాచరణమువలన పూర్తి గావింపు డని మాత్రమే విజ్ఞప్తిచేయుచున్నాను. మానవజాతియొక్క ఏకత్వము, నరునియం దంతర్గతమై వెలుంగు దివ్యాంశయు, పరమగమ్యమై వెలయు వేదాంతాదర్శమును, ఇంకను, ఇంకను హెచ్చుగా స్వానుభవమునకు దెచ్చుకొనుటకై పాటువడుడని మాత్రము మిమ్ము హెచ్చరించుచున్నాను.

నాకు వ్యవధియేయున్నయెడల, మన మీనాడు చేయవలసిన సర్వమును అనేకసంవత్సరములకు పూర్వమే మన ప్రాచీన స్మృతికర్తలచేత ఎట్లు నిర్ణయింపబడియున్నదో, మన జాతీయజీవితమున సంభవించిన, ఇంకను సంభవించుచున్న, పరిణామముల నన్నింటిని ఆనాడే వారెటుల ఊహించి యుండిరో, వివరముగా మీకు తెలిపెడివాడను. వారుసైతము కులవైరవిధ్వంసకులే; అయినను ఆధునికపురుషులవలెకాదు. కులభేదనిర్మూలన మనినంతనే ఊరివారందఱును కలిసి కూర్చుండి భోజనము చేయవలయుననికాని, సాహాయము సేవింపవలయుననిగాని, దేశమునందలి ఉన్మత్తులును మంద మతులును అందఱును తమకిష్టమైనప్పుడు, ఇష్టమైనచోటున, ఇష్టమైనవారిని పెండ్లిచేసికోవచ్చుననిగాని, ఆ విధమున దేశమును ఒక పెద్ద పిచ్చివాండ్ర శరణాలయముగా మార్చి వేయవలయుననికాని, మనపూర్వులు ఆశించినవారుకారు. మఱియు, ఒకదేశపు సౌభాగ్యము, అందలి వితంతువులలో ఎందఱికి భర్తలు దొరకిరో అను లెక్కపై ఆధారపడునని నమ్మినవారునుకారు. అట్టి వైభవముతో వెలిగిపోవు దేశ మెన్నడైన నుండగలదేమో చూడవలసి యున్నది!

మన పూర్వుల దృష్టిలో బ్రాహ్మణుడే ఆదర్శ పురుషుడు. మన గ్రంథములన్నింటను, ఈ బ్రాహ్మణా దర్శము ప్రస్ఫుటముగా గోచరించుచుండును. యూరపులో మతాధిపతులెల్లరును తమ పూర్వుల ఘనతను రుజువుచేసి కొనుటకు, వేలకువేలు ఖర్చుపెట్టి మిక్కిలి తంటాలు పడు చుందురు. ఎచ్చటనో ఒక కొండలో కాపురముండి, దారి

పోవువారిని కనుపెట్టిచూచుచు, వీలుచిక్కినప్పుడెల్ల వారిపై బడి దోచుకొనుచు, 'సుప్రసిద్ధి' గడించిన ఘోర చోరా గ్రేసర చక్రవర్తియొద్దకు ఎట్లో తమ వంశమూలమును లాగి కొని పోవువఱకును వారికి నిద్రపట్టదు. కులీనతాప్రదాతలగు ఆ మూలపురుషుల వృత్తి అంతదారుణముగానుండ, నేటి ప్రీశాధిపతి అట్టివారిలో ఒకనిని తన గోత్రపురుషునిగా నిరూపించుకొను వఱకు సంతృప్తుడు కాజాలకున్నాడు! ఇక హిందూదేశమునందన్ననో, మహారాజులు సైతము కౌపీన ధారియై కందమూలములు తిని, వేదపారాయణము చేయుచు అడవులలో నివసించుచుండిన ఏ ప్రాచీనఋషినో తమ గోత్ర పురుషునిగా నిర్ధారణచేసికొనజూతురు. భారతరాజన్యులు తమ వంశవృక్ష మూలములను కనుగొనుటకై పోవునది అక్కడికి! మన గోత్రపురుషుడు ఋషియైననే, మనది ఉత్తమకులమగును. వేఱువిధముగా కాదు.

మన ఉత్తమకులీనతకు నిదర్శనము ఇతరుల నిదర్శనముకంటె భిన్నముగానున్నది. అధ్యాత్మవిద్యకలిగి వైరాగ్యశీలుడగు బ్రాహ్మణోత్తముడు మనకు ఆదర్శ పురుషుడు. బ్రాహ్మణాదర్శమనగా నా అభిప్రాయమేమిటో తెలియునా? ప్రపంచవిషయాసక్తి శూన్యమైన, సత్యజ్ఞాన ప్రపూర్ణమైన, బ్రాహ్మణత్వము!! అదియే హిందూజాతికి ఆదర్శము! బ్రాహ్మణుడు రాజశాసనమునకు అతీతుడనియు, వానిని బంధించుశాసనమే లేదనియు, రాజులకు వాని పైని అధికారము లేదనియు, వానిశరీరమును ఎన్నడును హింసింప

దగదనియు, విధించు ప్రమాణములను మీరెన్నడును విని యుండలేదా? అది యెంతయు సత్యము! స్వలాభపరులును జ్ఞానహీనులును చేయు వ్యాఖ్యానముల ననుసరించి కాక సత్య ములును, మూలానుసరణములును అగు వేదాంత భావముల ననుసరించి మీరు ఈ విషయమును అర్థము చేసికొన వలయును. బ్రాహ్మణుడనగా, స్వలాభాపేక్షను పూర్తిగా చంపుకొనినవాడును, జ్ఞానమును భక్తిప్రపత్తులను తాను సంపాదించి ఇతరులకు ప్రసాదించుటే వృత్తిగా పెట్టుకొని జీవించువాడును అని భావనచేసినయెడల, అటువంటి బ్రాహ్మ ణులతో—అనగా ఆధ్యాత్మవిద్యాపరాయణులును నీతిమంతు లును ధర్మశీలురును అగు స్త్రీ పురుషులతో—నిండిన దేశముకలదేని, అట్టిదేశము రాజశాసనమునకు అతీతమై యుండునని భావించుట ఒక అబ్బురమా! అట్టి వారిని అదపులోనుంచుటకు రక్షకభటులును, యుద్ధవీరులును ఆవశ్యకమా? వారిని ఎవరేని అదపులో నుంచవలసిన అవసరము కలుగునా? వారు ఏప్రభుత్వము క్రిందనేని జీవించుట యెందులకు? వారు ఉత్తములు, పూజ్యులు, దైవాంశసంభూతులు గదా! మన ఆదర్శ బ్రాహ్మణులు ఇట్టివారు! సత్యయుగమునందు ఒక్కటేకుల ముండెడి దనియు, అది బ్రాహ్మణకులమేయనియు మనము చదువు చున్నాము. సృష్టి ఆరంభమునందు ప్రపంచమంతయు బ్రాహ్మణులతో నిండియుండెనని మహాభారతము తెలుపు చున్నది. వారు క్రమేణ పతితులు కాగా వేఱువేఱు కుల ములుగా చీలిపోయిరట. యుగచక్రము తిరిగివచ్చునప్పుడు

సృష్ట్యాదియందువలె అందఱును మరల బ్రాహ్మణులగుదురు. ఈ యుగచక్రము ఇపుడు తిరిగిపోవుచున్నది. అందుచేతనే ఆవిషయములను మీ జ్ఞప్తికి తెచ్చుచున్నాను. కాబట్టి వర్ణ సమస్యను పరిష్కారముచేయుటకై, ఇదివరకు ఉన్నతిలో నున్న వారిని క్రిందికి దిగలాగజనదు. ఆహారపానీయముల విషయములో హద్దుమీరి ఇష్టమువచ్చినట్లు ప్రవర్తింపదగదు. అధికాధికముగా సుఖములను అనుభవింపవలయునని పరిమితులను దాటిపోగూడదు. అది మార్గముకాదు. మనలో ప్రతివాడును వేదాంతమతాదర్శముల నందుకొనుట వలననే ఆ సంస్కరణము సిద్ధింపగలదు; అందుకు మనము ఆధ్యాత్మిక తేజమును సంపాదించి, ఆదర్శబ్రాహ్మణులము కావలయును. మనము ఆర్యులమైనను అనార్యులమైనను, బ్రాహ్మణుల మైనను శూద్రులమైనను, మనకందఱకు ఒకే శాసనము వర్తించును. మనము ఎచ్చటను ఆగక ముందునకు నిరంతరము సాగిపోవుచుండవలయునని ఆ శాసనాదేశము! అతి నికృష్టుడగు పంచముడు మొదలు మహాపురుషుని వఱకు, ఈ దేశములో నున్న ప్రతివాడును, ప్రయత్నించి ఆదర్శ బ్రాహ్మణుడు కావలయును. ఈ వేదాంతసిద్ధాంతము ఈ దేశమునకేకాక ప్రపంచమునకెల్ల వర్తించును. మానవ సంఘమునందలి ప్రతి వ్యక్తియు అప్రతీకారి, శాంతుడు, స్థిరచిత్తుడు, భక్తితత్పరుడు, నిర్మలుడు, ధ్యానపరాయణుడు అయి ఆదర్శపారమార్థిక జీవిగా పరిణమించునట్లు నెమ్మదిగను జాగ్రత్తగను నడుపుటయే కులవ్యవస్థయొక్క పరమావధి! ఆ ఆదర్శమునందు భగవంతుడు ప్రత్యక్షమై యుండును.

ఈ ఫలితార్థములు చేకూరుట యెట్లు? శపించుట, తిట్టుట, దూషించుట ఏమాత్రము ఉపకారకరములు కావని నేను మఱల మఱల మీకు చెప్పుచున్నాడను. అనేక సంవత్సరములు వానిని ఉపయోగించి చూచినారు. చెప్పుకోదగిన ఫలము ఇసుమంతయు చేకూరలేదు. సత్ఫలములు ప్రేమద్వారమునను సానుభూతి ద్వారమునను మాత్రమే చేకూరగలవు. ఇది చాలగొప్ప సమస్య. నా దృష్టిలో నున్న పరిష్కార మార్గముల నన్నింటిని, దినదినము నా మనస్సునకు తట్టుచున్న ఊహల నన్నింటిని, విశదము చేయుటకు అనేక ఉపన్యాసములు ఒసగవలసియుండును. కాబట్టి ఓ హిందూ సోదరులారా! మన హైందవధర్మనౌక యుగయుగాంతరముల నుండి లోకోపకారముచేయుచు పర్యటించుచున్నదని మాత్రము మీకు జ్ఞప్తిచేయుచు ఇప్పటికి నా యుపన్యాసమును ముగింపదలచితిని. ఈనాడు బహుశః మన నౌకకు చిల్లిపడియుండవచ్చును. బహుశః ఇప్పుడది కొంచెము ఓటిదైపోయి యుండవచ్చును. అటులగునేని మీరును నేనును గట్టిగా ప్రయత్నించి ఆ బెజ్జమును, పగుళ్ళను సవరణ చేయుట ధర్మము. రానున్న అపాయమునుగూర్చి మన దేశీయులను హెచ్చరింతుము గాక. వారు మేల్కొని మనకు తోడ్పడుదురు గాక. చిరనిద్రలో మునిగి మృతులవలె పడియున్న భారతీయులను నిదురలేపి, ప్రస్తుతస్థితిని, కర్తవ్యమును వారికి తెలుపుటకై మన దేశమునం దెల్లెడల సంచారము చేసి నా శక్తికొలది ఎలుగెత్తి ప్రబోధింతును. వారు నా పలుకులను పెడచెవి పెట్టుదురుగాక; వారిని నిందింపను.

ప్రాచీనకాలమున మన పూర్వులు మహా ఘనకార్యములను చేసియున్నారు. మనము భవిష్యత్కాలమున వారికంటెను ఘనతరకార్యములను సాధింపలేనియెడల, అందఱము ఒకటిగా మునిగి, మనశ్శాంతితో మరణించితిమను తృప్తినైన సాధింతుము గాక! దేశాభిమానులుగ నుండుడు; గత కాలమున మనకొఱకై అంతటి ఘనకార్యములు చేసిన ప్రాక్తన మహనీయులను సంస్మరింపుడు. సోదరులారా! నేను తారతమ్య విచారణ చేసిన కొలదిని, మీపై ప్రేమ అధికమగుచున్నది. మీరు యోగ్యులు, పవిత్రులు, సాధువులు! తరతరములుగా మీరు హింసల పాలగుచున్నారు. ఈ మాయామయ కలియుగములో మన గతి ఇటులైనది. పోనిండు. తుదకు ఆత్మ జయించితీరును. ఈ లోపుగా మనము నిరంతరకృషి సలుపుదుముగాక. మన దేశమును మనము నిందింపరాదు. కాలవైపరీత్యమున క్రుంగిపోయి, నిర్విరామకార్యపరత్వముచే అలసటపొంది, మన సనాతన వ్యవస్థలన్నియు ప్రస్తుతము జడప్రాయముగానున్నవి. అంత మాత్రమున వానిని శపించి తిరస్కారము చేయకుందుము గాక. అతి మూర్ఖములును వివేకశూన్యములును అగు సంప్రదాయములను సైతము నోరెత్తి నిందింపకుడు. పూర్వమొకప్పుడు అవియును కొంత ఉపకారము చేసియేఉండును. ఆదర్శములందును ప్రయోజనములందును ఈ దేశ సంప్రదాయములకంటె నిజముగా శ్రేష్ఠతర సంప్రదాయములుగల వేఱొండు దేశము ఈ ప్రపంచమున ఎక్కడను లేదని మీరు జ్ఞప్తి నుంచుకొనుడు. లోకములో దాదాపుగా ప్రతిదేశము

నందును కులవిభాగములుండుట నేను చూచినాను. కాని ఇంకెచ్చటను వాని గమ్యార్థము ఇక్కడియంత మహనీయముగా లేదు. కులవిభాగము అనివార్యమే యైనయెడల, డబ్బువలన నేర్పడిన విభేదముకంటె, పవిత్రత సభ్యత త్యాగము మున్నగువానిపై నాధారపడిన విభాగమునే నే నభిమానింతును. కాబట్టి దూషణలకు దిగవలదు. పెదవులను మూసి పెట్టి, మీ హృదయములను తెఱవుడు. మీలో ప్రతివాడును భార మంతయు పూర్తిగా తన ఒక్కని నెత్తి మీదనే ఉన్నటుల భావించి, ఈ దేశముయొక్కయు ప్రపంచ మంతటియొక్కయు విముక్తికొఱకు పాటుపడవలయును. వేదాంతముయొక్క దివ్యతేజస్సును, చైతన్య శక్తిని ఇంటింటికి కొనిపోయి పంచిపెట్టుడు. ప్రతిజీవియందును దాగియున్న దైవాంశమును మేల్కొలుపుడు. అప్పుడు మీకు చేకూరు విజయము ఎంతపాటిదైనను, మీరు ఒక మహోద్యమమును చేపట్టి, దానికొఱకై పాటుపడి, దాని కొఱకే జీవితములను అర్పణముచేసిన సంతృప్తి మీకు లభించును. ఈ ఉద్యమ విజయము ఎటుల చేకూరినను, దానిమీదనే ఇప్పుడుగాని, మఱెప్పుడుగాని మానవజాతి యొక్క మోక్షము ఆధారపడియున్నది.

చెన్నపురియందు సమర్పింపబడిన స్వాగత పత్ర మునకు శ్రీ స్వాములవారొసగిన ప్రత్యుత్తరము.

శ్రీశ్రీశ్రీ వివేకానంద స్వాములవారు చెన్నపురి చేరినప్పుడు శ్రీవారికొక స్వాగతపత్రము చెన్నపురి సన్మాన సంఘమువారివలన సమర్పింపబడెను. అది యిట్లున్నది :

పూజనీయులరగు నోస్వామీ !

శ్రీవారు పాశ్చాత్యప్రపంచమున మతప్రచారము సాగించి తిరిగివచ్చు నీ సమయమున చెన్నపురియందలి మన హిందూమతస్థుల పక్షమున, తమకు మేము, మిగుల హృదయపూర్వకమగు స్వాగతమును అర్పించుచున్నాము. ఈ స్వాగతపత్రముతోడ శ్రీవారిసమక్షమునకు మేమువచ్చుటలో మా ఉద్దేశ్యము కేవలము అనుచారముగానుండు కార్యకలాపమును జరుపుటకు మాత్రమేకాదు. భారత దేశముయొక్క అత్యుత్కృష్ట మతాదర్శములను ప్రచారము చేయుటద్వారా శ్రీవారుకావించిన లోకోపకారమును గుఱించి మాహృదయములలో నిండియున్న భక్తిని అర్పణము చేయుటకును, మాకృతజ్ఞతను వెలిపుచ్చుటకును వచ్చి యున్నారము. మతమహాసభ షికాగోనగరమున ఏర్పాటైన సమయమున, పూజనీయమగు మనప్రాచీన మతమును అమెరికాజాతివారికిని, వారిద్వారమున విశాల పాశ్చాత్య ప్రపంచమంతటికిని, అర్హమార్గమున ప్రకటనము చేయు నిమిత్తము ఎవరు ప్రాతినిధ్యము వహింతురాయని మన

దేశీయులలో కొందఱికి సహజముగా ఆందోళనకలిగినది. అదృష్టవశమున మేము మిమ్ములను కలిసికొనుటయు, అవసర మేతెంచునప్పుడు ధర్మసంస్థాపనయందు సాయపడవలసిన పురుషుడు ప్రత్యక్షమగునని నానాజాతి చరిత్రయందు తఱుచుగా ఋజువగుచుండిన సత్యమును మఱొకసారి అనుభవమునకు తెచ్చుకొనుటయు, తటస్థించినది. మత మహాసభయందు హిందూమతప్రబోధము గావించుటకు మీరు అంగీకరించినప్పుడు, మీ సామర్థ్యమును ఎఱిగియున్న కారణమున, ఆ ఘనతర మతమహాసభయందు తన ప్రతినిధి వలన హిందూమతము అతి సమర్థముగా ప్రతిపాదింపబడునని మాలో చాలమంది అభిప్రాయ పడితిమి. హిందూమత సిద్ధాంతములను మీరు ప్రకటించిన విధము సుస్పష్టమును, నిర్దుష్టమును, ప్రామాణికమునై. ఆ మతమహాసభయం దుండినవారికి చక్కగా నచ్చుటేకాక, మన హైందవ తత్త్వ శాస్త్ర జలనిధినుండి అమృతజీవరసములును ప్రేమరస ములును మాటిమాటికి చేకొననగునని, పరదేశములందలి స్త్రీ పురుష లనేకులు గ్రహించునట్లు చేసినది. తత్ఫలితముగా ఈ భూమండలమున ఇదివఱకెన్నడును సంభవించిన దాని కంటె, విశాలతరమును పరిపూర్ణమును పవిత్రమును అగు మానవ పరిణామము సంఘటిలగలదు. ఆ ప్రపంచ మహా మతసభయందు, ప్రతినిధులై చేరియున్న వారికి మత సమన్వయమునుగూర్చియు, విశ్వసౌదర్యమునుగూర్చియు బోధించి సర్వశరణ్యమగు హిందూమత సిద్ధాంతము దృగ్గోచరమగునట్లు చేసినందుకు మేము ముఖ్యముగా

శ్రీవారియెడ కృతజ్ఞులమగుచున్నాము. సత్యమును పావనత్వ
మును ఏ ప్రత్యేకదేశముయొక్కగాని, జాతియొక్కగాని,
శాస్త్రసిద్ధాంతముయొక్కగాని, సంప్రదాయముయొక్కగాని,
అనన్య సంపద అని పట్టుపట్టుటకును, ఏ మతముగాని ఏ తత్త్వ
సిద్ధాంతముగాని తక్కినవానిన న్నిటిని తిరస్కరించి నాశనము
చేసి ప్రత్యేకముగా వర్ధిల్లగలదని అభిప్రాయ పడుటకును,
ఇకమీదట విజ్ఞానవంతులును శ్రద్ధావంతులును అగువారికి
సాధ్యపడదు. శ్రీ మద్భగవద్గీతాహృదయమునందు మనో
హరమైయొప్పు సర్వసమాదరణ భావమును చక్కగా
విశదముచేసిన మీ మృదుమధుర భాషణములనే ఇందు
కాధారముగా ఉదాహరింతుముగాక: "సమస్త మత
చరిత్రయు ఆయాభిన్న దశాంతరములందును భిన్నపరిస్థితుల
యందును ఒకే పరమగమ్యమునుగుఱించి మానవులు
సాగించు ప్రస్థానముగా నున్నది."

మీ వశము గావింపబడిన ఉత్తమమును పవిత్రమును
అగు కర్తవ్యమును మాత్రము నిర్వహించి మీరు సంతృప్తులై
యున్ననుగూడ, మీ ఘనకార్యముయొక్క అమూల్యమగు
ప్రయోజనమును గుఱించి మన హిందూమతస్థులు సంతో
షముతోడను కృతజ్ఞతతోడను మిమ్మును అత్యుత్సాహ
ముతో అభినందించి యుందురు. కాని పాశ్చాత్యదేశము
లలో మీరు చొరబాటి పోవునపుడు, సనాతన హిందూ
మతముయొక్క ప్రాచీనబోధల నాధారము చేసికొని, అఖిల
మానవజాతికిని విజ్ఞానశాంతిసందేశములనుసైతము మీరు
కొనిపోయితిరి. వేదాంతమతముయొక్క పూర్ణప్రామాణి

కతను నిలువబెట్టుటయందు మీరు గావించిన మహోప కృతికై మీకు వందనములర్పించు ఈ సమయమున, మన మతమును, మన తత్త్వశాస్త్రమును, ప్రచారముచేయు నిమిత్తము సుస్థిరమగు కేంద్రస్థానములను నిర్మించి తీవ్రతర ప్రచారము సాగించుటయను మీ మహోద్దేశ్యమును ప్రశం సించి, ఆనందించుచున్నాము. మీ సర్వశక్తులను సమర్ప ణముచేయ సమకట్టిన ఉద్యమము, మీరు అభిమానించిన పవిత్రసంప్రదాయములకును, మీ జీవితమును మీ గమ్యార్థ మును ఉద్బోధించిన మీ గురుసత్తముని దివ్యసంకల్పమున కును అనుగుణముగా నున్నది! ఈ పవిత్రోద్యమమునందు మీతో నిలిచి సహకరించు మహాభాగ్యము మాకు లభించు గాకయని ఆశించుచున్నారము. సర్వజ్ఞుడును సర్వకరుణా మయుడును అగు సర్వేశ్వరుడు మీకు దీర్ఘాయురారోగ్యము లను ప్రసాదించి మీ పవిత్రోద్యమశిరమున, సనాతనధర్మ శీర్షమున ప్రకాశింప నర్హమగు భవ్యకిరీటమును శోభామయ విజయచిహ్నముగా ధరింపజేసి యనుగ్రహించుగాక యని మిగుల భక్తిపూర్వకముగా ప్రార్థించుచున్నారము.

పిమ్మట క్షేత్రిమహారాజుగారు పంపిన క్రింది అభినందన పత్రము చదువబడెను.

పరమపావనమూర్తీ!

శ్రీవారు చెన్నపురిచేరి స్వాగతసత్కారముల నందు కొను ఈతరుణమున, శ్రీవారు భారతదేశమునకు సురక్షిత

ముగా చేరుటనుగూర్చి నా సంతోషమును, ఆనందమును మున్ముందుగా తెలుపుకొను చున్నాను. ప్రకృతిశాస్త్రము సత్యమతమునకు ఎన్నడేని ఎదురై నిలిచియుండకపోయినను, 'ప్రకృతిశాస్త్రము జయించిన ఒక్క అంగుళమునేలనైనను, మతము ఎన్నడును తిరిగి జయించుకొనజాలదు' అనుచు మేధావులగువారు డంబములు పలుకు పాశ్చాత్య దేశములందు, శ్రీవారి నిష్కామ ప్రచారము సాధించిన అద్భుత విజయమును గూర్చి నా హృదయపూర్వకముగా అభివాదములను సమర్పించు కొనుచున్నాడను. మన ఋషి సంతానమునకు తగిన ప్రతినిధియై, షికాగోనగరమున జరిగిన మహామతసభకు విజయముచేయజాలిన మిమ్ము కన్న కారణమున మన భారతమాత ధన్యురాలైనది! హిందూ దేశమున ఈ కాలములో సైతము అఖండ బ్రహ్మజ్ఞాననిధి కలదని, పాశ్చాత్యప్రపంచము గ్రహింపజాలుట సర్వవిధముల మీ ధీసంపదవలననను, సాహసమువలననను, ఉత్సాహమువలననను సంభవమైనది. ప్రపంచమునగల వివిధ సంప్రదాయముల పరస్పర భేదవాదములకు, విశ్వశరణ్యమగు వేదాంతవిజ్ఞాన ద్వారమున సమన్వయము కుదురునని మీ పరిశ్రమవలన నిస్సందేహముగా రుజువైనది. "ఏకతత్త్వము భిన్నరూపములదాల్చుచే" ప్రకృతియొక్క విశ్వపరిణామ ప్రణాళికయను మహాసత్యమును గ్రహించి, తదనుగుణముగ ప్రపంచమందలి సమస్తజాతులవారును ప్రవర్తింప వలసియున్నారు. సఖ్యతవలననను, విశ్వసోదరభావము వలసను, పరస్పర సహనమువలననను, పరస్పర సాహాయ్యమువలననను,

విశ్వమానవజాతియొక్క పురుషార్థమును, పరమగమ్యమును, ఆర్యామతములు సాధింపగలవని మీరు నిశ్శంకముగా నిరూపించినారు. మహోన్నతమును పరమపవిత్రమును అగు శ్రీవారిప్రాపువలనను, శ్రీవారి ఉత్కృష్ట బోధలమహిమము వలనను, మూర్ఖావేశము ద్వేషము స్పర్ధ సమసిపోయి, శాంతి, సానుభూతి, ప్రేమ మానవులహృదయములందు రాజ్యముచేయు నూతనయుగము ప్రపంచ చరిత్రయందు ప్రారంభమగుటను వీక్షించు మహాభాగ్యము ఈతరమువారమగు మాకు లభించినది. నా ప్రజలతోబాటు నేనును శ్రీపరమేశ్వరుని వరప్రసాదములు శ్రీవారిమీదను శ్రీవారి ఉద్యమముల మీదను అవ్యాజముగ వర్షించుగాతయని ప్రార్థించుచున్నాడను.

ఈ అభినందనపత్రములు చదువబడిన పిమ్మట, శ్రీస్వాములవారు పురమందిరమును వదలి, వెలుపలతమకై వేచియున్న శకటముయొక్క సారథిపీటికపై నెక్కిరి. శ్రీవారికి స్వాగతము తెలుపుటకై చేరియున్న ఆ విశాల జనసమూహముయొక్క అత్యంత తీవ్రోత్సాహము కారణమున, శ్రీవారొసగ దలచిన ప్రత్యుత్తరమును మఱొక అవకాశము కొఱకై నిలిపియుంచి సంగ్రహముగా ఈక్రింది రీతిని సెలవిచ్చిరి :

తానొకటి తలంప దైవమొకటి తలంచును. స్వాగత పత్ర సమర్పణమును, దానికి ప్రత్యుత్తరమును ఇంగ్లీషువారి ఆచారము ననుసరించి జరుగవలయునని మీరు సంకల్పించి

నారు. కాని భగవంతుని సంకల్పము వేఱొక తీరున నున్నది. నేనిప్పుడు రథముపై నిలిచి భగవద్గీతాఘట్టము నందువలె అందందు చెదఱి కూర్చుండిన ఈ ప్రేక్షకులనుద్దేశించి ఉపన్యసింపవలసివచ్చినది. దైవికముగా ఇట్టిది సంభవించుటచే మనము కృతార్థులమైతిమి. ఇందుచే నా ఉపన్యాసమునకు రుచియు నే చెప్పబోవుదానికి బలమును చేకూరును. నాకంఠధ్వని మీ కందఱకు వినవచ్చునో లేదో తెలియదు. కాని వినబడునట్లు నా శక్తికొలది ప్రయత్నించెదను. పెద్దపెద్ద బహిరంగ సభలలో ఉపన్యసించు అలవాటు ముందెన్నడును నాకు లేదు.

కొలంబో మొదలు చెన్నపురి వఱకు నాయెడల చూపబడిన అద్భుతమగు ఆదరణయు, గాఢమగు ఉత్సాహానందములును, భారతదేశమునందంతటను చూపబడునట్లే కాన్పించుచున్నది. అవి నా ఊహాశక్తినికూడ మించిపోవుచున్న వనవచ్చును. అందుకు మిక్కిలి సంతోషించుచున్నాను. ఏలయన, ప్రతి జాతికిని దాని చైతన్యసూచకముగా ఒక ఆదర్శమును, దాని నడకకు ప్రత్యేకమగు ఒక తెన్నును, ఉండునని నే నిదివఱకు చాలసార్లు వచించియుంటిని. మీ ఆదరము దానిని రుజువు చేయుచున్నది. యుగయుగములుగా మతధర్మమార్గమున భారతీయుల బుద్ధి ఘనసించుచు వచ్చినది. ఇతరదేశములందు, మతమనునది అనేక జీవిత వ్యావృత్తులలో ఒకటి! పైగా ఇతరవ్యావృత్తులకున్న ప్రాధాన్యము దీనికి లేదు. ఇంగ్లాండులో వారి జాతీయ రాజకీయ తంత్రమున, మతము ఒక అల్పభాగముగానున్నది.

ఆంగ్లేయుల క్రైస్తవమతవ్యవస్థ ఎప్పుడుగాని రాజ్యాధికార పక్షమునకు చెందినదిగానే యుండును. అందువలన వారికి దానియందు విశ్వాసమున్నను లేకున్నను, ఆ వ్యవస్థ తమది అను అభిమానముతో దానిని పోషింతురు. గౌరవముగల ప్రతి పురుషుడును ప్రతి స్త్రీయును ఆ వ్యవస్థతో సంబంధము కల్పించుకొనవలెనని అపేక్షింతురు. మర్యాదకు అదొక చిహ్నము. అటులనే ఇతరదేశములందును జాతీయమగు ఒక్కొక మహాశక్తి ఆ జాతికి లక్షణముగా నుండును. ఆ మహాశక్తి రాజకీయ తంత్రజ్ఞతగనో, రణనీతిజ్ఞతగనో, వ్యాపారకుశలతగనో, ఆయా జాతులయందు వ్యక్తమగుచుండును. దానియందు ఆ జాతియొక్క హృదయము స్పందించుచుండును. పాశ్చాత్యజాతులకు మతమనునది లెక్కలేని చిల్లరవిషయములలో ఒకటి!

ఇక భారతదేశమునందన్ననో, మతము జాతీయ హృదయముయొక్క గర్భస్థానమే! అది మన జాతీయభవనమునకు పునాది! ఆధారశిల! రాజకీయములు, అధికార పదవులు, చివరకు బుద్ధిచాతుర్యమును ఇచ్చట అప్రధానములుగనే యెంచబడును. కావున మతమొక్కటే భారతదేశమునందు ప్రధానవిషయముగా భాసించుచున్నది. భారత ప్రజలందు ప్రపంచవార్తాజ్ఞానము మిక్కిలి కొఱవడియున్నదని ఎందఱో నాతో చెప్పుచుందురు. అది నిజమే. నేను కొలంబోనగరమున దిగినప్పుడు, యూరపులో జరుగుచున్న రాజకీయ విప్లవములను గూర్చియు, మంత్రివర్గముల మార్పులు, పతనములు మున్నగు విషయములను గూర్చియు,

అచ్చటివారిలో ఒక్కడేని వినియుండ లేదని నాకు తెలిసినది. సామ్యవాదమనగేమో, అరాజకత్వమనగేమో కూడ వారికి తెలియదు. పాశ్చాత్యరాజకీయ వాతావరణమున కలుగు చున్న తీవ్రపరిణామములను వారు అర్థముచేసికొనుచుండుట లేదు సరిగదా, కనీసము వానినిగూర్చి వినినపాపమున నైనను పోలేదు. కాని సర్వమతమహాసభకు భారతదేశము నుండి ఒకసన్న్యాసి వెళ్లెననియు, ఆయన ఏదో కొంత విజ యము సాధించెననియు, సింహళములోని ప్రతిస్త్రీకిని ప్రతి పురుషునకును, చివరకు ప్రతిపసిబిడ్డకును గూడ తెలిసి పోయెను. దీనినిబట్టి ఏమి రుజువగుచున్నది? మన ప్రజలందు వార్తలు తెలిసికొనవలయునను అభిలాషకు లోటులేదు. కాని ఆ వార్తలు తమకిష్టమైనవిగను, అభిరుచికి సరిపడునవి గను ఉండవలెను, అంతే. రాజకీయాది విషయములు జీవితా వశ్యకములుగా భారతీయులకు ఎన్నడును తోపలేదు. కాని మతము, పారమార్థికచింత, మున్నగునవిమాత్రము ఈ జాతి జీవించుటకును, వికాసము పొందుటకును, అత్యావశ్యకములని గ్రహింపబడినది.

ప్రపంచజాతులెల్ల నేడు రెండు సమస్యలను పరిష్కరింప జూచుచున్నవి. ఇందు భారతదేశము ఒక్కటియు ఒక పక్షము; మిగత ప్రపంచమంతయు రెండవపక్షము. ఆ సమస్య ఇది; చిరంజీవిత్వమును ఎవరు సాధింతురు? తక్కినజాతులెల్ల నశించుచుండ ఒక్కజాతి సజీవముగా నిలు చుటకు కారణమేమి? చిరస్థాయిగా నిలువదగినది ప్రేమయా, ద్వేషమా? భోగలాలసతయా, వైరాగ్యమా? జీవన

సంగ్రామమున పాంచభౌతికపదార్థమూ లేక ఆత్మయూ ఏది శాశ్వతముగా నిలిచియుండును? వెనుక, చరిత్రకు అందని పూర్వయుగములందు ఈ సమస్యలనుగూర్చి మనపూర్వులు ఎట్లు భావించిరో, నేడును మన మట్లే భావించుచున్నాము. అతి ప్రాచీనకాలమునందే పూజనీయులగు మన పెద్దలు ఈ సమస్యలనుగూర్చి చర్చించి, కొన్ని నిర్ణయములు చేసికొని, ప్రపంచమునంతను ధిక్కరించి నిలువబడిరి. మన పరిష్కారము నైరాగ్యము, త్యాగము, నిర్భయత్వము, ప్రేమ అను రూపముల నుండును. ఇవియే నశింపక నిలిచియుండ నర్హమైనవి. ఇంద్రియభోగపరిత్యాగము జాతిని చిరస్థాయిగా నొనర్చును. ఇందుకు నిదర్శనము చూడుడు. శూన్యము నుండి పుట్టి నాల్గుదినములు వెట్టియాటలాడి, అంతలో హరించిపోవు కుక్కగొడుగులవంటి జాతులు దాదాపు ప్రతి శతాబ్దమునందును తలయెత్తుచు, వెంటనే పడిపోవుచు నుండుట చరిత్ర తెలుపుచునే యున్నది. ప్రపంచములో ఏ ఇతరజాతినైనా త్మిమీదను పడని దారుణదురవస్థలు, ఘోర ప్రమాదములు తననెత్తిపై పడినను చలింపక, అతిక్లిష్ట సమస్యలతో యుగయుగములుగా పెనగులాడుచు వచ్చిన ఈ మహాజాతి, నైరాగ్యపథమువహించుటచేతనే యిన్ని ముప్పులుగడచి ఇప్పటి కిట్లు నిలిచియున్నది. నైరాగ్యము లేనిది మత మెట్లు నిలువ గలదు? ఇక యూరపుఖండము రెండవపథమును వహించి, ఒకపురుషుడు ఎంత సంపదను ఆర్జింపగలఁడో, అతడు ఇంక ఎంత అధికారమును సవ్య మార్గమునగాని, అపసవ్యమార్గమునగాని, యేదోఒకవిధముగా

కైవసముచేసికొనగలఁగో పరిష్కారముచేయ పూనుకొనినది. స్వార్థ, క్రౌర్యము, నిర్దాక్షిణ్యత యూరపును ఈ నాడు నడుపుచున్న సూత్రములు! పోటీలను తొలగించి, పరపీడనము నడంచి, క్రౌర్యముల మాపి, ఈ మాయామయ జీవితమున నరుని జీవాత్మను సరళముగా నడపుట మనము చేపట్టిన సూత్రము!!

(ఇప్పటికి జనసమ్మర్దము మితిమీరిపోయినది. శ్రీస్వాములవారి పలుకులు దూరమునకు వినబడకుండెను. అందువలన శ్రీవారు తమ ఉపన్యాసమును ఈ క్రింది మాటలతో ముగించిరి) :

మిత్రులారా! మీ ఉత్సాహము నాకు మిగుల ఆనందము గొలుపుచున్నది. ఇది అద్భుతము! నేను కోపము చెందితినని మీ రే మాత్రమును తలంపకుడు. మీరు చూపుచున్న ఈ ఉత్సాహమునకు నేను మిగుల సంతోషించుచున్నాను. అహో! ఎంతటి నిర్భరోత్సాహము! అదే కావలసినది. దానిని సుస్థిరమొనర్చుకొనుడు. నిప్పును నుసిగట్టనీయకుడు. మనము పెక్కు మహాకార్యములు చేయవలసియున్నది. అందులకై మీ సాహాయ్యము నాకు కావలెను. ఇటువంటి ఉత్సాహము ఎంతయు అవసరమే. ఈ సభను ఇంకను సాగించుట అసంభవము. నాకు స్వాగతమర్పించుటలో మీరుచూపిన ఆదరణకును ఉత్సాహమునకును నేను మిక్కిలి కృతజ్ఞుడను. శాంతముగా నుండునప్పుడు, మనము పరస్పరము తెలుపుకొనదగిన ఉత్తమసంకల్ప

ములును, భావములును, అనేకము కనబడుచుండును. సరే, మిత్రులారా, ఇప్పటికి ఇంతటితో స్వస్తిచెప్పదము.

నలునైపుల ఈ విధముగా కూడియున్న మిమ్ముల నుద్దేశించి యుపన్యసించుట సాధ్యమగుపనికాదు. కాబట్టి మీ రీ సాయంకాలము నన్నుచూచుటతోనే తృప్తి పడవలసి యున్నది. మఱొక సమయమునకు నా ఉపన్యాసమును ఆపి యుంచెదను. ఉత్సాహపూరితమగు మీ స్వాగత సత్కారమునకు నా వందనములు.

నా ఉద్యమప్రణాళిక

(చెన్నపురి విక్టోరియా మందిరమున నొసగిన ఉపన్యాసము)

మొన్నటి దినమున జనసమ్మర్దమువలన నా ఉపన్యాసము సాగింపలేకపోయితిని. కాబట్టి ఈచెన్నపురిప్రజలగు మీరు నాయెడల చూపుచున్న అక్షీణమగు ప్రేమకు మీకు నా వందనములను తెలుపుటకు ఈ యవకాశమును తీసికొనుచున్నాను. మీ సన్మాన పత్రములయందలి ప్రియవచనముల యెడ నా కృతజ్ఞతను తెలుపుచు, నాపై మీరు చూపుచున్న ఆదరణకు నన్ను పాత్రునిగా చేయుమని సర్వేశ్వరుని ప్రార్థించుచున్నాను. హైందవ మతప్రచారమునకును మాతృదేశ సేవకును నా యావజ్జీవమును సమర్పించి నిర్విరామ

ముగా కృషిసల్పుటకన్న శ్రేష్ఠతర మార్గము నాకు తోచుట లేదు. పరమేశ్వరుడు నన్నందుకు అర్హునిగా జేయుగాక!

నాయందు ఎన్నిదోషములున్నను, నాకు కొంత సాహసము కలదని నే ననుకొందును. మన భారతదేశము నుండి పాశ్చాత్య ప్రపంచమునకు నే నొక సందేశమును కొనిపోవలసి వచ్చినది. ధైర్యముతో దానిని నేను అమెరికా ఇంగ్లాండు ప్రజలకు అందజేసితిని. ఈ దినము నా ఉపన్యాసాంశమునకు దిగకపూర్వము, మీఅందఱికును కొన్ని సాహస వాక్యములు చెప్పబోవుచున్నాను. నాకు ఆటంకములు కల్పించుటకును, నా పని సాగనీయకుండ ఎదిరించుటకును, వీలగుచో నన్ను రూపుమాపుటకునుకూడ కొన్నిప్రయత్నములు జరిగినవి. ఈశ్వరకృపవలన అవి యన్నియు వ్యర్థమై పోయినవి. అట్టిప్రయత్నములు నిష్ఫలములగుచునే యుండును. కడచిన మూడుసంవత్సరములనుండి కొన్నికొన్ని అపోహలు వ్యాపించుచు వచ్చినవి. నేను పరదేశములందున్నంతకాలము ఈ విషయమై ఒక్కమాటయైనను పలుకక మౌనముగానుంటిని. ఇప్పుడు నా మాతృభూమి యందు నిలబడి, కొన్నిసమాధానవాక్యములు చెప్పుకొనుచున్నాను. అటులచేయుట నా పలుకుల ఫలితార్థము ఏమగునాయని చూడగోరి కాదు; నా మాటలవలన మీలో ఎటువంటి అనుభూతిని కల్పింపగలనో అను కౌతుకము తోడనుకాదు. నేను ఇట్టివానిని లక్ష్యముచేయువాడను కాను. ఏలయందురా, నాలుగుసంవత్సరముల క్రిందట ఒక దండమును కమండలువును మాత్రము చేబూని మీ నగర

మును ప్రవేశించిన ఆనాటి సన్న్యాసినే ఇప్పుడును! ఆ సువిశాలప్రపంచమే ఇప్పుడును నా యెదుట కాన్పించుచున్నది. ఇంతకుమించిన ఉపోద్ఘాతము లేకుండ నా యుపన్యాసము నారంభింతును.

మున్ముందుగా దివ్యజ్ఞానసమాజము వారినిగుఱించి కొన్నిమాటలు చెప్పవలసియున్నది. ఆ సమాజమువలన భారతదేశమునకు కొంతకొంత మేలు సమకూరెనని నేను వెఱుగా చెప్పనక్కఱలేదు. అందులకు ఆ సమాజము నెడలను, ముఖ్యముగా బెసెంటుదొరసానిగారియెడలను, ప్రతి హిందువును కృతజ్ఞుడై యుండవలయును. ఆమెను గుఱించి నాకు తెలిసినది స్వల్పమైనను, నేనెఱిగినంత మట్టుకు ఆమె భారతదేశ శ్రేయోభిలాషిణి అనియు, ఆమె తనకు సాధ్యమైనంతవఱకు మనదేశము నుద్ధరించుటకు చిత్తశుద్ధితో పాటుపడుచున్నదనియు నాకు దృఢాభిప్రాయము కలిగినది. అందులకు !నిజముగా భారతీయుడై పుట్టిన ప్రతివాడును ఆమెకు సదా కృతజ్ఞుడై యుండవలెను. ఆమెకును ఆమె కృషికిని సర్వశుభములు శాశ్వతముగా సమకూరుగాక! కాని, ఇది ఒకవిషయము; దివ్యజ్ఞాన సమాజములో చేరుట మఱొక విషయము. ఆదరమును, గౌరవమును, ప్రేమను చూపుట ఒకవిషయము; ఎవరేని చెప్పుదానిని తర్కింపకుండ, విమర్శింపకుండ, విచక్షణచేయకుండ, శిరసావహించుట వేఱొకవిషయము. అమెరికాలోను, ఇంగ్లాండులోను, నేను సాధింపగలిగిన స్వల్పప్రయోజనమునందు దివ్యజ్ఞాన సామాజికులు నాకు తోడ్పడిరని ఒకవార్త ఎట్లో ఎల్లెడల ప్రచార

మగుచున్నది. అందు ప్రతిపదమును పొరపాటే; ప్రతి మాటయు అనృతమే అని మీకు స్పష్టముగా చెప్పు చున్నాను. "విశాలభావములు," "అభిప్రాయభేదమునెడ సానుభూతి," అనుచు ప్రగల్భములు పలుకుట లోకమున తఱచు వినుచున్నాము. ఆ సూత్రములు చాల మంచివే. కాని ఒకడుచెప్పుదానిని సర్వము ఇంకొకడు గ్రుడ్డిగా విశ్వసించువఱకే ఆ సూత్రములు ఆదరింపబడుచున్నవి. ఎదుటి వాడు భేదాభిప్రాయమును తెల్పిన తోడనే ఆ ఆదరణ, ప్రేమ ఎగిరిపోవుచుండుట మనము కనులార చూచుచునే యున్నాము. వీరికన్న ఘనులు కొందఱుకలరు. వారు స్వలాభపరులు. వారి స్వలాభసంపాదనకు ఏదేని అడ్డు తగిలెనేని వారికడుపు మండిపోవును. ఎంత ద్వేషమునైనను వారప్పుడు వెలిగ్రక్కుదురు. వారు చేయవలసినదేమో వారికే తెలియదు. హిందువులు తమయింటిని తాము చక్కబెట్టుకొనుచో, క్రైస్తవమిషనరీలకు గలుగు నష్టమేమి? హిందువులు తమ్మితాము సంస్కరించుకొనుటకు తీవ్రముగా కృషిసల్పుచో, బ్రాహ్మసమాజము వారికిగాని, ఇతర సంస్కరణసమాజముల వారికిగాని వచ్చిపడు ఆపద ఏమున్నది? వీరందఱు ప్రతిఘటించి నిలువనేల? హైందవోద్యమములకు వీరు పరమశత్రువులుగా నిలువనేల? ఎందుకొఱకు అని నా ప్రశ్న! వీరి ద్వేషము, వీరి ఉద్రేకము ఎందుకో! కారణమును నామట్టుకునేను ఊహింపలేకున్నాను. ఏమైనను—వారి ప్రతీకారోద్యమము మాత్రము అతితీవ్రముగా విజృంభించుచున్నది.

నాలుగేండ్లకు పూర్వము పేరుప్రతిష్ఠలులేక నిరాధారుడనగు సన్న్యాసిగా అమెరికాకు పోవునపుడు, అమెరికాలో స్నేహితులుగాని అచటివారికి పరిచయపత్రములుగాని, లేకయే మహాసముద్రములుదాటి పరదేశములకు పోనున్న సమయమున, దివ్యజ్ఞాన సమాజనాయకుని దర్శింపబోయితిని. ఆయన అమెరికాదేశస్థుడు గావునను, హిందూదేశము నెడ అభిమానము కలవాడుగావునను, అక్కడ నెవరితోడనైనను నాకు పరిచయము కల్పించుటకు ఒక ఉత్తరమును వ్రాసియిచ్చునని సహజముగా నేను తలంచితిని. 'నీవు మా సంఘములో చేరుదువా?' అని న న్నాయన అడిగినాడు. 'చేరజాలను; నాకు మీ సిద్ధాంతములలో చాలవానియందు నమ్మకము లేదు. కావున నేనెట్లు చేరగలను?' అనినేనంటిని. 'అటులైనచో నే నేమియు నీకు సాహాయ్యముచేయజాలనందుకు విచారముగానున్నది' అని ఆయన నాకు జవాబు చెప్పినాడు. అట్లనుట నాకు మార్గము సరిచేసి పెట్టుటకాదే! నేను చెన్నపురిలోని కొందఱు మిత్రులసాహాయ్యమునసే అమెరికా చేరగలిగితినని మీ రెఱుగుదురుగదా ! వారిలో చాలమంది ఇప్పు డిక్కడే ఉన్నారు. న్యాయమూర్తి సుబ్రహ్మణ్యఅయ్యర్ గారు ఒక్కరు మాత్రమిచ్చుటలేదు. వారికి నేను మిక్కిలి కృతజ్ఞుడను. ధీనిధికి తగు దూరదృష్టి వారికి కలదు. నా కీ జన్మలోగల ప్రాణస్నేహితులలో వారొకరు. సమయమునకు అక్కఱకువచ్చు నిజమైన స్నేహితుడు ! యథార్థభారతపుత్రుడు ! మతమహాసభ జరుగుటకు చాలనెలలుముందుగనే నేనమెరికా చేరితిని. నాయొద్దనున్న

సొమ్ము చాలకొంచెము. అది త్వరలోనే వ్యయమైపోయెను. శీతకాలము వచ్చినది. నాకు ఉన్నవి వేసవికాలమున కుపకరించు సన్నని గుడ్డలు! ఆచలిలో ఏమిచేయుటకును నాకు తోపలేదు. చలి దుర్భరముగనున్నది. నేను వీథులవెంట బోయి యాచించితినా, నన్ను జైలులుకుపంపుదురు. అక్కడ చేరినప్పుడు నాజేబులో కొలదిడాలర్లుమాత్రమే మిగిలి యుండెను. అప్పుడు చెన్నపురిలోని నామిత్రులకు ఒక తంతి వార్త పంపితిని. ఈ సంగతి దివ్యజ్ఞానసమాజమువారికి తెలియనచ్చెను. 'ఇప్పుడు ఆ శనిగాడు చావనున్నాడు. భగవంతుడు మనల నందఱిని అనుగ్రహించుగాక' అని వారిలో నొకరు వ్రాసియున్నారు. అది నాకొఱకు మార్గమును సరిచేసిపెట్టుటయేనా? నేనిప్పు డావిషయమును తడవి యుండెడివాడనుకాను. కాని నాదేశీయులకు ఈవిషయములు కొన్ని తెలిసియుండుట మంచిదని దానిని ప్రస్తావించితిని. మూడుసంవత్సరముల కాలము ఈవిషయమునుగూర్చి నేను నోరెత్తలేదు, మౌనదీక్ష నవలంబించితిని. కాని ఈదినము ప్రాసంగికముగా ఆ విషయము బయటికి వచ్చినది. ఇంతే గాదు. మహామతసభలో కొందఱు దివ్యజ్ఞానసామాజికులను చూచితిని. వారితో మాటాడి వారితో కలిసియుండ గోరితిని. అప్పుడు వారేదో దేవతలైనట్లు, నేనొక కీటకమైనట్లు నానంక తిరస్కారముతోచూచిరి. ఆచూపులు ఇప్పటికిని నాకు స్పష్టముగా కనబడుచునే యున్నవి. మహామతసభలో నాకు పేరు ప్రతిష్ఠలువచ్చిన పిమ్మట, నాకు తీఱికలేని ఉపన్యాస కార్యక్రమ మేర్పడెను. కాని ప్రతిచోటను దివ్య

జ్ఞాన సామాజికులు నన్ను అపనిందలపాలు చేయసాగిరి. వారెవ్వరును నా ఉపన్యాసములకువచ్చి వినకూడదని ఆసంస్థ అధికారులు శాసించిరి. నచ్చి వినినచో వారు తమసంఘము యొక్క సానుభూతిని కోల్పోవుదురట! ఆ సంఘముయొక్క ఆంతరంగికశాఖయందు చేరువారు 'కుతూమీ', 'మోరియో' అనువారియొక్క ఆజ్ఞలకు—అనగా, వారి ప్రత్యక్ష ప్రతినిధులగు జడ్జి దొరగారియొక్కయు, బెసెంటుగారి యొక్కయునే గదా—లోబడి ప్రవర్తించుచుండవలెనని వారియొక్క ఆంతరంగికశాఖానియములు విధించుచున్నవట! కాబట్టి వారి ఆంతరంగికశాఖలో చేరుటనగా స్వతంత్రతను వారికి అర్పణచేయుటయే! నే నట్టి పనిని ఎన్నడును చేయజాలను. అట్టిపనిని చేయువానిని హిందువనియే నేను పిలువజాలను. జడ్జిదొరగారియెడల నాకు చాల గౌరవముగలదు. ఆయన మాననీయుడు, నిష్కపటి, న్యాయశీలుడు, నిరాడంబరుడు. దివ్యజ్ఞానసమాజప్రతినిధులలో ఆయన ఉత్తమోత్తముడు. ఆయనయు బెసెంటమ్మయు తమ తమ మహాత్ముని దే సరియైన మాటయని పరస్పరము వివాదము పెంచుకొందురట! కాని ఆ విషయమును విమర్శించుయోగ్యత నాకులేదు. అందలి విచిత్రమేమన, ఇరువురును ఒకే మహాత్ముని గుఱించి వివాదపడుచున్నారు! సత్యము దైవమున కే ఎఱుక; ఆయనయే ఇందు తీర్పుచెప్పగలడు. ఉభయపక్షములు సమానముగానుండునప్పుడు ఇతరులెవరును న్యాయ నిర్ణయము చేయజాలరు! అమెరికాయందంతటను, వారు నాకు మార్గమును బాగుగా సిద్ధముచేసి పెట్టినదిల్లే.

క్రైస్తవమిషనరీలతో కలిసి వారు నా వైరిపక్షమున చేరిరి. ఈ క్రైస్తవ మిషనరీలు నన్నుగుఱించి కల్పనచేసి యుండని ఘోరతరాసత్యనిందలను ఊహింపనేలేము. పర దేశములో దీనుడనై, దిక్కులేకయున్న నాప్రవర్తనమును అతిహేయముగా చిత్రించి నగరనగరమున ప్రచారము గావించిరి. ప్రతిగృహమునుండియు నన్ను వెడలగొట్టించు టకు వారు ప్రయత్నించిరి. నాయెడ స్నేహభావముచూపిన ప్రతివానిని నా శత్రునిగా చేయుటకు ప్రయత్నించిరి. తిండి లేక నేను చచ్చుట కనులార చూడవలెనని వారికోరిక! ఈ విధముగా పిశాచములవలె నన్ను అడుగడుగున వెన్నంటి బాధించినవారిలో నా స్వదేశీయుడే ఒకడుకలడని చెప్పు కొనుటకు నేను సిగ్గుపడుచున్నాను. ఇండియాలో సంస్కరణ పక్షమునకు చెందిన ఒక మహానాయకుడాయన! ఈ మహా నీయుడు 'క్రీస్తు హిందూదేశమునకు దిగివచ్చె'నని ప్రతిదినము చాటి చెప్పుచుండును. 'క్రీస్తు హిందూదేశమునకు వచ్చుట' ఈ విధముగ నేనా? హిందూదేశమును సంస్కరించుమార్గ మిదేనా? ఈ మహాపురుషుని నేను బాల్యమునుండియు ఎఱుగుదును. ఈయన ఒకప్పుడు నా ప్రియస్నేహితులలో ఒకడుగా నుండెడివాడు. అచ్చట చాలకాలము నాకు నా దేశీయులు కాన్పింపకుండిరి. నే నీయనను కలిసికొన్నప్పుడు ఎంతగానో ఆనందించితిని. కాని ఆయన నాయెడలచూపిన ఔదార్యము ఇట్లుండెను! మహాసభవారు నన్నభినందించిన దినమునుండి, షికాగోనగరమున నేను ప్రజాభిమానము చూఱగొన్న దినమునుండి, నాయెడల ఆయనవైఖరి ఈ

విధముగా మాటినది! కపటమార్గమున నా కపకారము చేయుటకై సర్వవిధముల ఈయన ప్రయత్నించినాడు. 'క్రీస్తు ఇండియాకు వచ్చుమార్గము' ఇదియేనా? క్రీస్తుపాదముల చెంత ఇరువది సంవత్సరములపాటు కూర్చుండి ఈయన నేర్చిన గుణపాఠము ఇదియా? క్రైస్తవమతము, క్రైస్తవశక్తి, హిందూదేశప్రజలను ఉద్ధరించునని మన సంస్కరణమహాశయులు ప్రకటించుచుందురే, అది జరుగుట ఇట్లేనా? నేను సూచించిన మహనీయుడే ఇందుకొక దృష్టాంతమైనచో, ఈ ఉద్ధరణమునుగూర్చి నమ్మకము కలుగుట కష్టము.

ఇంకొకమాట. ఒక సంఘసంస్కరణ పత్రికయందు నన్ను శూద్రు డనుట చదివితిని. సన్న్యాసియగుటకు శూద్రునకేమి అధికారముకలదని వారు అధిక్షేపించిరి. "యమాయ ధర్మరాజాయ చిత్రగుప్తాయ వై నమః" అను వాక్యము నుచ్చరించుచు ప్రతిదినమును ఎవనిపాదములచెంత ప్రతి బ్రాహ్మణుడును పుష్పముల నర్పించునో, ఎవని సంతతి వారు పవిత్రక్షత్రియులో, అట్టి మహాపురుషుడు నావంశకర్త యని ప్రకటించుటయే వారికి నా ప్రత్యుత్తరము! తమ పురాణగ్రంథములయందును ప్రాచీనగాథలయందును ఈ సంఘసంస్కర్తలకు విశ్వాసముకలదేని—నా కులస్థులు ప్రాచీనకాలమున చేసిన ఇతరవిధములగు ఉపకారముల నటుంచినను, వారనేకశతాబ్దముల కాలము భారతదేశమున సగముభాగము పరిపాలించిరని ఈ 'మహనీయులు' తెలిసికొందురుగాక! నా కులస్థుల ప్రసక్తియే లేనిచో భారతీయ నాగరికతయందు మిగులున దేముండును? నారక్తబాంధవుల

నుండియే వంగదేశము తమ మహాత్త్వవేత్తను, కవిశిఖామణిని, ఉత్తమచరిత్రకారుని, ప్రాచీననస్తుపరిశోధకాగ్రగణ్యుని, ఎందఱో మాన్యతమ మతబోధకులను, బడయగలిగినది! నారక్తమే ఆధునికశాస్త్రవేత్తలలో ఉత్తమోత్తముని భారతదేశమునకు ప్రసాదించినది. ఈ నిందాపరులు మనదేశచరిత్రను కొంచెము తెలిసికొనవలసియున్నది. మనలోని పై మూఁడుకులములనుగుఱించి వీరు కొంతచదివిన బాగుండును. సన్న్యాసులగుటకు బ్రాహ్మణుఁడును క్షత్రియుడును వైశ్యుడును సమానాధికారము గలవారనియు, వేదపఠనమునకు స్త్రైవర్ణికులును సమానార్హులనియు పాపము వీరికి తెలియదు. సరే, పోనిండు. ఇది యేదో మాటవరుసను చెప్పితిని. ఊరక ప్రస్తావించితిని. వారు నన్ను శూద్రుఁడు అనినారని నాకేమాత్రమును బాధలేదు. నాపూర్వులు దీనజనులను హింసించిన పాపమునకు అది కొంతపరిహారము కాగలదు! నేనొక మాలవాడనైనయెడల ఇంకను సంతసించియుందును. ఏల యందురా, బ్రాహ్మణులలో బ్రాహ్మణుఁడై, మాలవాని ఇంటిని అలికి శుద్ధిచేయసమకట్టిన మహాపురుషుని శిష్యుఁడను నేను! ఆ మాలఁడు వారినటుల చేయనీయకపోవుట చిత్రమా! బ్రాహ్మణసన్న్యాసి వచ్చి తన ఇల్లు శుభ్రపఱచుటకు అతఁడెటు లంగీకరించును? ఈ మహానీయుఁడో అర్ధరాత్రమున లేచి, అతిరహస్యముగా ఆ మాలనియింట ప్రవేశించి వాని మరుగుదొడ్డిని శుద్ధిచేసెను! తన పొడుగుపాటి తలవెండ్రుకలతో ఆస్థలమును తుడిచెను. సర్వజనులకును తాను సేవకుఁడైయుండు నిమిత్తము దినదినము ఆయన

అటులచేయుచు వచ్చెను. ఆ మహాపురుషుని పాదములను నేను నాశిరస్సున ధరింతును! ఆయన నా మార్గదర్శి! ఆ మార్గదర్శిజీవితమునే నేను అనుసరింప ప్రయత్నించుచున్నాను. అందఱకును సేవకుడగుటద్వారా హిందువు తన్ను తానుద్ధరించుకొనుటకు యత్నించును. హిందువులు జనసామాన్యమును ఉద్ధరింపవలసినమార్గము అది. అంతే కాని యే యన్యులసాహాయ్యమునో యాచించి కాదు! పాశ్చాత్యనాగరికతతో ఇరువదిసంవత్సరముల గాఢపరిచయముగల ఒకపురుషుని ఉదాహరణము నా జ్ఞప్తికి వచ్చుచున్నది. ఆ పురుషుడు పరదేశమునందున్న తన స్నేహితుడు తిండిలేక చచ్చుట చూడనలేనని కోరుకొనుచుండువాడు. ఎందులకో తెలియునా, ఆ స్నేహితుడు ప్రజల యాదరమును చూఱగొనినందునలన! తన ధనార్జనోపాయమునకు ఆ స్నేహితుడు ఆటంకముగా తోచుటవలన! నేను పేర్కొన్న ఇంకొక పురుషుడు యథార్థముగా పూర్వాచారములనుసరించు హిందువు మనదేశమున ప్రవర్తించువిధమున కుదాహరణము. మన సంస్కర్తలలో ఒక్కనియందేని నిర్మలసేవాభావము గోచరించునెడల, అతడు మాలవానికైనను నిష్కామముగా సేవ చేయుటకు సిద్ధపడునెడల, నేను వాని పాదముల చెంత కూర్చుండి వానిబోధను శిరసావహింతును. అంతవఱకు నేను ఈ సంస్కర్తలను, గింస్కర్తలను లెక్కచేయను. కడనెడు కబుర్లకన్న గంజెడు ఆచరణ మేలు!

ఇక చెన్నపురి యందలి సంస్కరణసంఘములవారిని గూర్చి విచారింతము. వారికి నాయెడల మిక్కిలి ప్రేమ.

వారు నన్ను గూర్చి చాల దయగా మాటాడుదురు. వంగదేశ సంస్కర్తలకును, చెన్నపురి సంస్కర్తలకును, తారతమ్యము కలదని వారు నాకు తెలిపిరి. ఇది నిజమే యని నేను మన స్ఫూర్తిగా ఆమోదించుచున్నాను. చెన్నపురి ప్రస్తుతము మనోహరమగు స్థితిలోనున్నది. వంగదేశమువలె చెన్నపురి "క్రియాప్రతిక్రియల" ఆటలోనికి దిగలేదు. ఇక్కడ సర్వ రంగములందును సుస్థిరమగు నిరంతరపురోగమనము కాన్పించుచున్నది. ఇక్కడ ప్రతిది ప్రవర్ధమానమగుచున్నది; ప్రతిక్రియలు అడ్డుటలేదు. అనేక విషయములలో వంగదేశ మున కొంతవఱకు పునరుద్ధరణము గోచరించుచున్నది. చెన్నపురిలో జరుగుచున్నది పునరుద్ధరణము కాదు, పెరుగుదల—సహజమగు పెరుగుదల. అందుచే ఈ రెండు రాష్ట్రములమధ్య, సంస్కర్తలు కలదని చెప్పు భేదము నిజముగా కలదని నేను పూర్తిగా ఒప్పుకొనుచున్నాను. కాని వారికిని అర్థముకానట్టి విషయము ఒక్కటి గలదు. ఇచ్చటి సంస్కరణసంఘములలోని కొందఱు నన్ను భయపెట్టి తమలో చేర్చుకొనవలెనని, పాపము, తీవ్రముగా ప్రయత్నించుచున్నారు. వీరిటుల ప్రయత్నించుట నాకు చిత్రముగా నున్నది. తన జీవితములో పదునాలుగుసంవత్సరముల పాటు పస్తులు పడియుండుటకు అలవాటుపడి, రేపు తనకు ఎచ్చట తిండి దొరకునో యెఱుగక, ఎచ్చట నిద్రింపవలసి వచ్చునో తెలియక, తిరుగుచుండిన నరుని భయపెట్టి లోబఱచుకొనుట సులభమైనపని కాదు. శరీరము కొంగర్లు పోయి గడ్డకట్టెడు మంచుభూములయందు దిగంబరప్రాయుడై

తిరుగుచు, రేపు ఎట్లుగడచునో తెలియనిస్థితిలో అనేక సంవత్సరములు గడప సాహసించిన పురుషుని సులభముగా లొంగదీయుట భారతదేశమున సాధ్యముకాదు. నేను వారికి తెలుపదలచిన మొట్టమొదటి విషయ మిది—నాకు కొంత స్వల్పీయమగు ఇచ్ఛాశక్తి కలదు; కొంచెము లోకానుభవమును కలదు; నేను ప్రపంచమునకు చాటితెలుప వలసిన సందేశముకూడ ఒకటి కలదు. నిర్భయముగ, ముందేమగునో అను ఆరాటము లేకుండ, నేను దానిని ప్రకటించెదను. నేను తమ్మునందఱను మించిన సంస్కర్తనని. ఈ సంస్కర్తలకు తెలియజేయుచున్నాను. వారు స్వల్పవిషయములను మాత్రము సంస్కరింపగోరుచున్నారు; నేనో సమూల సంస్కారము గావింపచూచుచున్నాను. మఱియు మాసంస్కరణ పద్ధతులయందు భేదము కలదు. వారిది నిర్మూలనపద్ధతి; నాది నిర్మాణపద్ధతి. నాకు సంస్కరణమందు నమ్మకము లేదు. పెరుగుదలయందు నా నమ్మకము. నేను ఈశ్వరుని స్థానమునందు కూర్చుండి మన సంఘమును శాసించుటకు సాహసించువాడను కాను. "ఈ మార్గమున నీవుపొమ్ము; ఆ మార్గమున పోనలదు" అనుచు అధికారికముగా శాసింపజాలను. తనకు చేతనైనన్ని ఇసుక రేణువులను తెచ్చి సంద్రమున దులుపుటతో పరిత్యజ్యమైనది శ్రీరామచంద్రుని సేతుబంధన మహాకార్యమున పాల్గొనిన ఉడుతవలె నుండగోరెదను. నాస్థితి అట్టిది! ఈ విచిత్రమగు జాతీయయంత్రము అనేకయుగములు పనిచేసినది. ఈ అద్భుతజాతీయ జీవననది మన యెదుట ప్రవహించుచున్నది. అది మంచిదో కాదో,

అది యెటులపాఱవలయునో, ఎవనికి ఎఱుక? ఎవడుచెప్ప సాహసింపగలడు? అనేక పరిస్థితులు దానినిచుట్టుముట్టినవి. అవి దాని కొక ప్రత్యేక గతిని సూచించుచున్నవి. ఒకప్పు డు దానిని నెమ్మదిగను, మఱొకప్పుడు వేగిరముగను, నడపుచున్నవి. దాని గతిని శోసించుటకు ఎవనికి ధైర్యముగలదు? గీత వెలుపునటుల స్థలాపేక్ష లేక పనిచేయుట మనవంతు. ఈ జాతీయజీవనాగ్నికి కావలసిన కట్టెలు సమకూర్చుము. దాని వృద్ధిని అదియే చూచుకొనును. దానివృద్ధిని నిర్ణయించి శాసించువా డెవడును లేడు. మన సంఘములో కావలసినన్ని లోపములున్నవి నిజమే. కాని ప్రతి ఇతర సంఘమునందును కూడ లోపములుకలవు. మనదేశము ఒక్కొక్కప్పుడు వితంతువుల కన్నీటి ధారలతో తడిసిపోవుచున్నది; అచ్చట, పాశ్చాత్యదేశములందు, పెండ్లికానిపడుచుల నిట్టూర్పులతో గాలిసుడులు తిరిగిపోవుచున్నవి. ఇక్కడ దారిద్ర్యము జాతి వినాశహేతువుగనున్నది; అచ్చట భోగలాలసత్వమునందలి వెక్కసపాటు జాతివినాశకారణముగానున్నది! ఇచ్చట తినుటకేమియు దొరకనికారణమున ప్రజలు ఆత్మహత్య చేసికొనుచున్నారు; అచ్చట తిండి వెక్కసమై ఆత్మహత్య చేసికొనుచున్నారు. ఇటు లెల్లెడల కీడుకలదు. అది జీర్ణించిన కీళ్లనొప్పివంటిది. దానిని పాదమునుండి తప్పించిన చో శిరస్సున కెగబ్రాకును. అక్కడనుండి తప్పించినయెడల మఱొకతావున చొరబడును. ఒకచోటునుండి మఱొక చోటికి దానిని మార్పు జూచుటే మనము చేయునది. అంతయే. పసిబిడ్డలు కీడును వారింప ప్రయత్నించుట

సరియైన మార్గముకాదు. మంచిచెడ్డలు ఒకేనాణెము యొక్క ఇరుప్రక్కలవలె పరస్పరానుబద్ధములని మన వేదాంతము బోధించుచున్నది. నీవు వానిలో ఒకదానిని కోరుకొందువేని రెండవదిసూడ వచ్చితీరును. సముద్రమున ఒక అల పైకిలేచుట మఱుక్షణములోనే పల్లమేర్పడుటలనలనే గదా! ఇంతేల, జన్మమే అనర్థము! ఇతరజీవులను చంపకుండ గాలిపీల్చుటయే సంభవముకాదు! ఎవరికో ఒకరిక లేకుండ చేసినకాని, ఒక ముద్దఅన్నము నీనోట బడుటలేదు. ప్రకృతి ధర్మమిట్లున్నది. ఇదియే వేదాంతము. కాబట్టి మనము కీడును ప్రతిఘటించుటకై చేయుకార్య మంతయు బాహ్య క్రియారూపముగాక సంకల్పరూపమైనదేయని గ్రహించుటే! మనము ఎంతగా డంబములు పల్కినను, కీడుతొలగించుపని స్థూలక్రియారూపమైనది కాక బోధనరూపమైనదిగనే యున్నది. కీడును తొలగించు కార్యమునుగూర్చి మన మీ విషయమును మొట్టమొదట గ్రహింపవలయును. అది మనలను ఎక్కువ శాంతిచిత్తులనుగా చేయవలయును; అది మనరక్తములో పొంగిపఱచుచున్న మూర్ఖావేశమును తొలగింపవలయును. ఎచ్చెచ్చట సంస్కరణములు దురావేశముతో సాగునో, అచ్చటనెల్ల అవి వ్యర్థములై పోయెనని ప్రపంచచరిత్ర మనకు తెలుపుచున్నది. అమెరికాఖండములో బానిసతనమును రూపుమాపుటకై జరిగినయుద్ధమున కన్న, ధర్మస్వాతంత్ర్యసంస్థాపనకొఱకు జరిగిన మహా ప్రయత్నము వేఱొకటి లేదు. దానినిగుఱించి మీరందఱు ఎఱుగుదురుగదా! దానివలన సిద్ధించినదేమి? బానిసతన

మున్ననాటికంటె, ఈనాడు ఆబానిసల ఇక్కట్లు నూఱు రెట్లు ఘోరతరముగానున్నవి! ఈ బానిసతనము పోవక పూర్వము ఈ దీనులగు నీగ్రోలు ఎవరోఒకని సొత్తుగానైన నుండిరి. తనసొత్తుఅగుటచేత వారిని సంరక్షింపవలసిన భారము ఆతనిమీద నుండెడిది. అందువలన వారి ప్రాణములు సురక్షితముగానుండెడివి. ఇప్పుడో వా రెవరి సొత్తునుకారు. వారిప్రాణములకు విలువలేదు. ఏమాత్రము మిషదొరకినను, వారిని నిలువునకాల్చి చంపుదురు. వారిని కాల్చి చంపు హంతకులను శిక్షించుచట్టము లేదు! వారు నల్లవారుగాన నరజీవులే కారట! పోనీ వారు పశువులైనను కారు. వారిగతి యిట్లున్నది. కీడును చట్టములసాహాయ్యమునగాని మూర్ఖావేశముచేతగాని బలాత్కారముగా తొలగించినయెడల ఫలిత మిట్లుండును. లోకోపకారము కొఱకైననుసరే, దురావేశముతోసాగించు ఉద్యమములు ఇట్లు పరిణమించుచుండును. ఇది నేను స్వయముగా చూచితిని. నాస్వంత అనుభవమువలన నాకీ విషయము తెలిసినది. కాబట్టి ఈ ఆక్షేపకసంఘములలో దేనిలోను నేను చేరజాలను. ఖండన మునకు ఎందుకు పూనవలయును? ప్రతిసంఘమునందును లోపము లుండునని యెల్లరకును తెలియును. ఈనాడు చిన్న పిల్లవాడుకూడ ఉపన్యాసపీఠమునెక్కి హిందూసంఘము నందలి దోషములనుగూర్చి పెద్ద ఉపన్యాసమును ఈయ గలడు. లోకసంచారియై పరదేశములనుండి ఇక్కడికివచ్చు ప్రతి విద్యాధికుడును, రైలులోపోవుచు ఒకసారి సింహావ లోకనముచేసి హిందూదేశములోని ఘోర దురాచారము

లనుగూర్చి గొప్పగొప్ప పండితోపన్యాసములను కురిపింప గలడు. మన సంఘములో దోషము లున్నవని మనము ఒప్పు కొనుచునేయున్నాము. దోషమేదియో, ప్రతివాడును చూప గలడు. కాని ఆ దోషములను పరిహరించు మార్గమును చూపువాడే ప్రజోపకారి. ఒకప్పుడు నీటమునుగుచున్న ఒక పిల్లవానికి దారినిబోవుచున్న ఒక వేదాంతి ఉపన్యాస మీయ సాగినాడట. అందులకు పిల్లవాడు "ముందు నన్ను నీటినుండి బయటికిలాగుము" అని అఱుపులు పెట్టెనట. అటులనే "మేము ఉపన్యాసములు కావలసినన్ని విన్నాము. సంఘ ములు కావలసినన్ని యున్నవి. పత్రికలును వలసినన్ని కలవు. మాకు చేయిఅందించి పైకిలాగు పురుషుడే కరవైనాడు. నిజముగా మమ్ముప్రేమించువా రెక్కడనైననున్నారా! మాయందు సానుభూతిచూపగల దయాపరు డెందుగలడు?" అని మనప్రజలు ఘోషించుచున్నారు. అవును, ఇప్పు డట్టి పురుషుడే కావలసియున్నాడు. ఈసంస్కరణోద్యమములతో నాకుగల అభిప్రాయభేదము అక్కడనే యున్నది. ఈ దేశ మున నూఱుసంవత్సరములుగా ఈ ఉద్యమములు పనిచేయు చున్నవి. తిట్లూటలుసాగించుట, నిందాపూరిత గ్రంథములను రచించుట తప్ప చేకూరిన మే లేమున్నది? ఈ రచనలు లేకున్న ఎంత బాగుండెడిదో! వారు పూర్వాచారపరులను విమర్శించిరి; ఖండించిరి; దూషించిరి. ఇంతలో పూర్వాచార పరులును ఆవైఖరినే అవలంబించి బదులుకు బదులు తీర్ప సాగిరి. తత్ఫలముగా ప్రతి దేశభాషలోను, జాతికి తల వంపులును, దేశమునకు అవమానమును గలిగించు గ్రంథ

రాశి సృష్టియైనది! 'సంస్కరణ' మనగా ఇదియా? జాతిని వైభవోన్నతికి తెచ్చుట ఇటులనేనా? ఈ దోషమంతయు ఎవరిది?

సరే, ఇంకొకగొప్పవిషయమునుగూర్చి విచారింప వలసియున్నది. హిందూదేశములో రాజులే సదా పరిపాలనము చేయుచు వచ్చిరి. రాజులే మన చట్టముల నన్నింటిని నిర్మాణము చేసినవారు. ఇప్పుడు ఆ రాజులు గతించిరి. ఆ ఉద్యమమును తలపెట్టువా రెవరును ఇప్పుడు లేరు. ఈ ప్రభుత్వమునకు సాహసము లేదు. ప్రజాభిప్రాయగమనమును అనుసరించి వీరు ఇప్పుడు తమ మార్గమును సవరించుకొనవలసి వచ్చినది. ప్రజలు తమ సమస్యలను తామే పరిష్కరించుకొనవలెనన్న, బల సౌష్ఠవములుగల సమష్టి అభిప్రాయములు ఏర్పడవలెను; దానికి చాలకాలముపట్టును. ఈ లోపుగా మనము ఓసిక పట్టవలసి యున్నది. సంఘ సంస్కార సమస్యలెల్ల 'సంస్కారము కోరువారెక్కడ?' అను ప్రశ్నలో లీనమగుచున్నవి. మొదట వారిని నిర్మింపుడు. వారిప్పు డెక్కడనున్నారు? లోకమున కానిపించు దౌర్జన్యము లన్నిటిలో అల్ప సంఖ్యాకుల దౌర్జన్యమే ఘోరతమమైనది. కొన్నివిషయములు చెడుగు లని భావించు ఏ కొలదిమంది పురుషులో జాతిని కార్యోన్ముఖముగా చేయ జాలరు. జాతి కార్యోన్ముఖము కాకుండుటకు కారణమేమి? దానికి విద్యలేదు. కావున మున్ముందు జాతికి విద్య నేర్పి, తరువాత శాసనసభా నిర్మాణము చేసికొనుడు. ఆ పిమ్మట శాసనములు బయలుదేఱును. ఎందుండి శాసనములు

బయలుదేఱవలయునో, అట్టి అధికారస్థానమును, మొదట సృష్టి చేసికొనుడు. మీ రాజులు గతించి పోయినారు. వారి స్థానమున క్రొత్తగా అధికారము పూనిన ప్రజాశక్తి ఎక్కడ? ముందు దానిని పెంపుచేయుడు. కావున సంఘసంస్కరణ విషయమున సైతము, ప్రజలకు 'ఎఱుక' గలిగించుట మీ మొదటి విధి. ఆ ఎఱుక కలుగునంతవఱకు మీరు వేచి యుండనలసినదే. దాదాపు నూఱేండ్లనుండి మీరు ప్రయత్నించి, సాధించిన సంస్కరణములలో చాలభాగము కేవలము అలంకారప్రాయముగనే ఉండిపోయినవి. ఈ సంస్కరణములలో ప్రతిదియు మొదటి రెండు వర్ణములకు మాత్రమే సంబంధించియుండెనేగాని, తెక్కినవానిని తాకనే లేదు. భారతదేశ స్త్రీలలో నూటికి డెబ్బదియైదుమంది విషయమున విధవావివాహప్రశ్నతో ప్రసక్తి లేనేలేదు. అట్టి ప్రశ్నలన్నియు హిందూదేశ ప్రజలలో ఉత్తమ కులములవారికి మాత్రమే సంబంధించినవి. వీరు ప్రజాసామాన్యపు ధనముతోనే తాము విద్యలునేర్చుకొనిరని గుర్తించుకొనుడు. వారి సొంతగృహములను బాగుచేసికొనుటకు సర్వప్రయత్నములను సాగించుకొనుచున్నారు. కాని అది సమష్టిసంఘసంస్కరణ మనిపించుకొనదు. మీరు ఎప్పుడుగాని, సమస్య పునాదులకడకు, వేరులయొద్దకు, దిగిరానలయును. నేను పూర్ణసంస్కరణమని చెప్పునది ఇట్టిదియే. అగ్నిని అక్కడ ముట్టింపుడు, అక్కడనుండి దానిని పైకి రగిలి రానిండు. అటులనే భారతజాతి నిర్మాణము పూర్తి కానిండు. అయ్యది విశాలమగు పెద్దసమస్య అగుటచేత,

దాని పరిష్కారము అంత తేలికయైనది కాదు. కావున మీరు ఆతురపడకుడు. ఈ సమస్యను అనేక శతాబ్దముల క్రిందటనే మన పూర్వులు గుర్తించియున్నారు. ఈ దినములలో, ముఖ్యముగా దక్షిణదేశమున, బౌద్ధమతమును గూర్చియు, బౌద్ధుల అజ్ఞేయసిద్ధాంతమునుగూర్చియు, ప్రసంగములుచేయుట ఆచారమైనది. ఈ నాడు మనకు సంక్రమించిన ఈ పతనదశ బౌద్ధమతమునలననే కలిగినదని వారు కలనైన గ్రహింపకున్నారు!

బౌద్ధమతము మనకు ఒప్పగించిపోయిన పిత్రార్జితమే ఇది! బౌద్ధమతము ఎటుల ఉదయించినదో, ఎటుల పతనము గాంచినదో ఎన్నడును పరిశీలించి యెఱుగనివారనేకులు బౌద్ధమతచరిత్రనుగూర్చి గ్రంథములువ్రాసిరి. వానిలో బౌద్ధమతము గౌతమబుద్ధుని అద్భుత నీతిధర్మముల వలనను, మహత్తర ప్రభావమువలనను, సర్వత్ర వ్యాప్తి గాంచెనని వ్రాయబడియుండును. ఈ గ్రంథరాజములనే మీరు చదువుచుందురు. బుద్ధదేవునియెడల నాకు అత్యంత గౌరవమును, పూజ్యభావమును కలవు. కాని బౌద్ధమతవ్యాప్తి ఆ గురుదేవుని వ్యష్టివిశేషమహిమవలనను ధర్మసిద్ధాంతములవలనను కంటె, ఎక్కువగా, బౌద్ధులు దేవళములు నిర్మించుటవలనను, విగ్రహముల ప్రతిష్ఠించుటవలనను, ఉజ్జ్వలకర్మకలాపములను అనుసరించుటవలనను కలిగినది; ఈ మాటలు గుర్తుంచుకొనుడు. ఈ రీతిగా బౌద్ధమతము ప్రవర్ధిల్లినది. ఎవరియిండ్లలో వారు ఆహుతులువేయుచువచ్చిన చిన్న హోమగుండములు, ఈపెద్దపెద్ద దేవాలయములతో, కర్మకలాప

ములతో, పోటీపడి నిలువలేకపోయెను. కాని కాలక్రమ
మున అదంతయును భ్రష్టమైపోయినది; దుర్నీతి
మయమయ్యెను. అది ఈ సభయెదుట మాటలాడదగని
విషయము. దానినిగుఱించి తెలిసికొన గోరువారు ఈ దక్షిణ
భారతదేశమున శిల్పవిశేషములతో నిండియున్న పెద్ద పెద్ద
దేవాలయములను పరిశీలించినచో, కొంచెము గ్రహింప
గలుగుదురు. బౌద్ధులనలన మనకు సంక్రమించిన దంతయు
ఇంతమాత్రమే!

ఆ పిమ్మట మహాసంస్కర్తయగు శంకరాచార్యుల
వారును, వారి అనుచరులును బయలుదేరిరి. హిందూదేశ
వాసుల నెల్లరను స్వచ్ఛమగు వేదాంతమతమునైపునకు
నెమ్మదిగా మరల్చుకొనివచ్చుటకు వారు బ్రహ్మప్రయత్నము
చేసిరి. ఆయనకు, ఆయన అనుయాయులకు మన యందున్న
లోపములు పూర్తిగా తెలియును. ఐనను వారు దూషణలు
చేయుటకు పూనుకోలేదు! "మీ రవలంబించున దంతయు
దోషము; దానిని దూరముగ నెట్టివేయుడు" అని వారు
అప్పటి ఆచారములను తిరస్కరింప లేదు; అటుల నెన్నడును
కార్యసిద్ధి పొసగదు. మూడువందల సంవత్సరములలో,
రోమను గ్రీకు మతముల పలుకుబడిని క్రైస్తవమతము
పూర్తిగా కూలద్రోసెనని నా మిత్రుడు డాక్టరు బాస్ట్రోస్
చెప్పుచున్నటుల ఈ దినమే పత్రికలలో చదివితిని. అవి
యూరపు, గ్రీసు, రోమునగరములను చూచిన వాని పలు
కులు కావు. రోమను గ్రీకు మతముల పలుకుబడి యంతయు
నిలిచియే యున్నది! ప్రాటెస్టెంటు మతవ్యాప్తిగల దేశము

లలో సైతము, మారుపేరులతోనో, క్రొత్తవేషములతోనో, ఆ ప్రాతదేవతలు నిలిచియే యున్నారు! ఆ స్త్రీదేవతలే మరియమ్మ లైరి; దేవుళ్లు ప్రవక్తలైరి! ఆ ఆచారములు క్రొత్త రూపము దాల్చినవి. 'పాంటిఫెక్స్ మాక్సిమస్' అను ప్రాతబిరుదు సైతము ఇప్పటికిని నిలిచియే యున్నది. కావున ఆకస్మికమగు మార్పులు పొసగనేరవు. శ్రీ శంకరాచార్యుల వారికి ఈ విషయము తెలియును. శ్రీ రామానుజాచార్యుల వారికిని తెలియును. వారికిగల మహోశయము అప్పుడున్న మతమును నెమ్మదిగా పరమావధిని చేరునట్లు నడుపుటయే. దీనికి వ్యతిరేకమగు రెండనపద్ధతిని అవలంబించి యుండిన యెడల వారును లోకవంచకులై పోయెడివారే! వారి మతము నందలి ప్రధాన సిద్ధాంతము పరిణామము; మార్పు! ఆవశ్యకములును సహకారకములును అగు భిన్నభిన్న అవస్థలను, అవస్థాంతరములను పొందుచు మార్పు చెందిచెంది జీవుడు పరమావధిని చేరవలసియున్నాడనిగదా ఆ సిద్ధాంతము. కావున వారిపై దోషారోపణము ఎవరు చేయగలరు?

'విగ్రహారాధన దోషము' అని పలుకుట ఈ దినములలో అలవాటై పోయినది. ప్రతివాడును ఆలోచన లేకుండ ఆమాటను అంగీకరించుచున్నాడు. నేను ను ఒకప్పుడు అటులనే భావించితిని. అందుకు ప్రాయశ్చిత్తముగా, విగ్రహారాధనమూలమున సర్వమును సాధించిన ఒక మహాపురుషునిపాదములను నేను సేవింపవలసివచ్చినది. వారే శ్రీ రామకృష్ణపరమహంసగారు. విగ్రహారాధనమూలమున

అట్టి రామకృష్ణపరమహంసలు సిద్ధించియుండ, మీ కీపుస్తకావలసినది ఈ సంస్కర్తల సిద్ధాంతములా, లేక పవిత్రములగు విగ్రహములా? మీ సమాధానమును తెలియగోరుచున్నాను. విగ్రహారాధనమూలమున రామకృష్ణపరమహంసలను కల్పనచేయగలుగుచో, మీరు ఇంకను వేలకొలది విగ్రహములను చేకొనుడు! భగవంతుడు మీ యత్నములను సత్వరము సఫలముచేయునుగాక! మీకు సాధ్యమగు ఏవిధానముచేతనైనను సరియే. అటువంటి మహాపురుషులను సృజింపుడు. ఐనను, విగ్రహారాధనము దోషమనుచున్నారు. ఎందువలన? ఎందువలననో ఎవరికిని తెలియదు! కొన్నిశతాబ్దములకు పూర్వము యూదియనుజాతిపురుషుడొకడు విగ్రహారాధనను ఖండించెనట. అనగా, తన ఆరాధ్యవిగ్రహమునుతప్ప, తక్కినవారి విగ్రహములన్నింటిని దూష్యము లనెనట! దేవునికి ఒకమనోహరరూపమునుగాని, చక్కనిచిహ్నమునుగాని కల్పించుట మహా దోషమని ఆ యూదుడనెను. ఒక పెట్టె యాకారముగా తయారుచేసి, దానిపైని ఇరుప్రక్కల ఇద్దఱు దేవదూతలు కూర్చుండినట్లులో, వానిపైని ఒక మబ్బు తేలియాడుచున్నట్లులో, చిత్రరూపకల్పనకూర్చి చూపినయెడల, అది పవిత్రమైన వానిలోనెల్ల పవిత్రమగునట! దేవుని పావురము రూపమునవచ్చిన యెడల పవిత్రము! కాని ఆదేవుడే గోరూపమున వచ్చినచో ఊహుఁ, పనికిరాదు. నాస్తికుని మూర్ఖమతమని దానినిఖండింప వలసినదే! ప్రపంచమిట్లునడచుచున్నది! కావుననే 'మర్త్యులమగు మనము ఎట్టి

మూర్ఖులమో!' అని ఒకకవివరుడు అన్నాడు. ఎదుటివాని కండ్లతో ఏ విషయమునేని చూడగలుగుట మహోదుర్లభము. అదియే మానవ జాతికి పట్టిన అనర్థము. అదియే ద్వేషములకు, అసూయలకు, వాదులాటలకు, పోరాటములకు మూలకారణము! ఎన్నడును చెన్నపట్టణమును వదలి బయటికి అడుగిడని మీరు—మీసాలువచ్చిన పాపలవంటి మీరు—నిలువబడి, ఈ ముప్పదికోట్ల జనులకు, వేలకొలది పూర్వసంప్రదాయములతో వెలయు ప్రజాసందోహమునకు, శాసనకర్తలు కాగోరుచున్నారా? మీకు లజ్జ లేదా? మరలుడు, అట్టి పరమ పాతక కార్యమునుండి వెనుకకు మరలుడు! గుణపారములను మీరు ముందుగ నేర్చుకొనుడు. మర్యాదనెఱుగనిబాలులారా, మీరు నాలుగు బంతులు కాగితముపై గిలుకగానే, వానిని ప్రకటించు పిచ్చివాడొకడు దొరకినంత మాత్రానే, మీరు జగద్గురువులమైతి మనుకొనుచున్నారా? మీ అభిప్రాయమే హిందూదేశ ప్రజాభిప్రాయమని తలంచుచున్నారా? నేను చెన్నపురి సంఘసంస్కర్తలకు ఈ మాట చెప్పవలసియున్నది. వారి యెడల నాకు మిక్కిలి గౌరవమును, ప్రేమయుకలదు. వారి విశాల హృదయములనుచూచి; స్వదేశముపై, బీదలపై, దీనులపై, వారికి గల సానుభూతినిచూచి; నాకు వారియందు ప్రీతియేర్పడినది. కాని, సోదరప్రేమతో వారికి ఒక్కవిషయము చెప్పదలచుకొన్నాను. వారి పద్ధతి సరియైనది కాదు. నూరేండ్లపాటు దానిని పరీక్షింపగా అది వ్యర్థమని తేలినది. ఇంకొక క్రొత్త పద్ధతిని ప్రయోగించి చూతముగాక!

భారతదేశమున ఎన్నడేని సంస్కర్తలకు కఱవు గలదా? భారతదేశ చరిత్రను మీఱుచదివితిరా? రామానుజులవారెవరు? శంకరాచార్యులవారెవరు? చైతన్యదేవు డెవరు? కబీరు ఎవరు? దాదు ఎవరు? ఒకరితర్వాత ఒకరుగా ఉదయించిన ఈ బోధకులందఱు ఎవరు? ధగద్ధగితముగా ప్రకాశించు ఈ నక్షత్రరాశి ఎట్టిది? రామానుజులవారు నిమ్నజాతులయెడల కరుణపూనలేదా? బ్రతికియున్నంత కాలమును మాలవారిని సైతము తన మతములో చేర్చు కొనుటకు ఆయన ప్రయత్నించియుండలేదా? మహమ్మదీయులనుగూడ తనవారిలో చేర్చుకొనుటకు ప్రయత్నించి యుండెనే! నానక్ మహాశయుడు హిందువులతోడను, మహమ్మదీయులతోడను సంప్రతించి పరిస్థితులు చక్కదిద్దలేదా? వారందఱును సంఘసంస్కరణప్రయత్నములు చేసినవారేగదా! వారికృషి ఇప్పుడును కొనసాగుచునే యున్నది. కాని ఉన్న భేదమిది: ఈనాటి సంస్కర్తలవలె వారు ఆర్భాటములు చేయలేదు; శాపనార్థములు పెట్టలేదు. సదా దీవనలే వారి పెదవులనుండి వెలువడినవి. వారెన్న డును ఖండనము చేసియెఱుగరు. 'జాతి నిరంతరము పెరుగుచుపోవలసినదే' అని వారు ప్రజలకు బోధించిరి. వారు వెనుదిరిగిచూచి "సోదరులారా, మీరుచేసినది యోగ్యమైనదే. కాని మనమింకను యోగ్యతరముగా ప్రవర్తింతము" అని పల్కిరి. "మీరు ఇదివఱకు దుష్టులు, ఇప్పుడు యోగ్యులుకండు" అని వారనలేదు. వీరి పలుకుల కును మన సంస్కర్తల పలుకులకును అపారమగు తార

తవ్యమున్నది. మన నైజము ననుసరించి మనము పెరుగ నలగును. విదేశసంఘములు మనకు చూపిన కార్యమార్గ ముల నవలంబించి లాభములేదు. అది సాగుట అసంభవము. మనలను నలిపి వంకరటింకరగా మెలిత్రిప్పి, విజాతీయరూప ములు తెచ్చుటచేయుట స్వాస్థ్యముకాదు. భగవత్కృపవలన అది అసాధ్యము. ఇతరజాతుల వ్యవస్థలను నేను నిందింప బూనుటలేదు. అవి వారికి శుభప్రదములే కాని, మనకు మాత్రము కొఱగావు. వారికి పాయస మగునది మనకు విషము కానచ్చును. మనము మున్నుందుగా నేర్చుకొన వలసిన నీతిపాఠ మిదియే. వారిశాస్త్రములు, వారి వ్యవస్థలు, వారి పూర్వగాథలు మున్నగువానివలన వారి కీ ప్రస్తుత ఆచారపద్ధతి సిద్ధించినది. మనమో మన పూర్వగాథల త్రోడను, వేలకోలది సంవత్సరముల మన కర్మానుభవము త్రోడను మన నైఖరినే సహజముగా అవలంబింపగలుగు దుము. మన చాలు ననుసరించియే మనము పోగలుగుదుము. మనము చేయవలసినదియు అదియే!

ఇక నా ఉద్యమప్రణాళికనుగూర్చి. పూర్వమహా ఋషుల అభిప్రాయముల ననుసరించుటయే నా ప్రణాళిక. నేను వా రొనర్చిన కార్యమును పరిశోధించితిని. వారు అవ లంబించిన క్రియావిధానముల రహస్యమును కనుగొను అదృష్టము నాకు లభించినది. వారు మహాసేయ సంఘ నిర్మాతలు! శక్తిని, పవిత్రతను, చైతన్యమును ప్రసాదింప జాలిన మహామహులు. వారు మహాద్భుత కార్యములను సాధించిరి. అట్టి కార్యములను మనముకూడ సాధింపవలసి

యున్నది. పరిస్థితులు ఇప్పుడు కొంచెము మారినవి. ఆ కారణముచేత మన కర్మవిధానమునూడ స్వల్పముగా మార వలసియున్నది. కావలసినది అంతే. ఒక్కొక్కజాతియు ఒక్కొక్క వ్యక్తివలెనే, తన జీవితమునకు ఒక ప్రత్యేక జీవనపద్ధతి—ఒకవిశిష్టమగు 'రాగము'—కలిగినదిగ్గిల్లుచుండును. ఈ ప్రధానరాగము ననుసరించి, మిక్కిలి స్వరములన్నియు నచ్చి చుట్టును చేరి 'లయ' కలుపుకొనవలసియుండును. ఆంగ్లజాతికి రాజ్యాధికారము ప్రాణాధారవిషయముగా నున్నది. ఇట్లే ఇంకొక దానికి లలితకళామయ జీవనమును, ఇంకొకదానికి ఇంకొకటియు, ప్రాణప్రదవిషయములుగా నుండును. భారతదేశమట్లో ఆధ్యాత్మజీవనము కేంద్ర విషయముగానున్నది. ఈ ప్రధానరాగము ననుసరించియే ఈ జాతియొక్క జీవన గానమంతయు సాగవలయును. ఏ జాతి యైనను, అనేక శతాబ్దములనుండి అనుస్యూతముగా నచ్చిన తన విశిష్టజీవనమార్గమునుండి తొలగి నడచెనా, అది సర్వనాశమైపోవును. కాబట్టి మీ మతమును త్రోసివేసి, రాజకీయములనో, సాంఘికవాదమునో, మరేయితరవిషయమునో మీ జాతీయజీవనమునకు ప్రధానధర్మముగా గ్రహింతురేని, మీకును వినాశము తప్పదు. ఈ ఆపదను తప్పించుకొనవలెనన్న, మతము అనెడు జీవస్థానమును ఆధారము చేసికొని మీ రెల్లరును నడవవలసియుండును. మీ మతమనెడు 'బ్రహ్మదండము' ననుసరించి మీ నానాశక్తులన్నియు స్పందింపవలసి యున్నవి. అమెరికాదేశీయులకు 'సాంఘిక జీవనము' అనునది జాతిధర్మము. అందుచే వారి సాంఘికజీవిత

మున 'మతము' ఎట్టి ప్రత్యక్షఫలితమును కల్పించునో తెలుపకుండ నే నా దేశమున మతబోధ చేయ జాలనని గ్రహించితిని. వేదాంతము వలన ఎట్టి విచిత్ర రాజకీయ పరివర్తనములు కలుగ గలవో తెలుపకుండ, నేను ఇంగ్లాండులో మతబోధ చేయజాలక పోయితిని. అదే తీరున హిందూదేశములో నూతన సంఘ నిర్మాణము వలన ఎట్టి ఆధ్యాత్మికజీవనాభివృద్ధి లభింపగలదో చూపుచునే సంఘ సంస్కార ప్రబోధమును సాగింపవలసియుండును. ఈ జాతికి ఏకైక వాంఛితార్థమగు ఆధ్యాత్మికజీవనము ఎంతచక్కగా వృద్ధికాగలదో చూపుచునే రాజకీయములను సైతము బోధింపవలసియుండును. ప్రతివినుష్యుడును తన ఈప్సితార్థమును తానే నిర్ణయించుకొనవలసి యుండును; అటులనే ప్రతిజాతియు. యుగాంతరములనాడే మన ఈప్సితమును మనము నిర్ణయించుకొంటిమి. కావున మనము దానికి తప్పక బద్ధులమై వర్తింపవలయును. మీలో అనేకులు ఈ నిర్ణయము దోషమేమోయని సందేహించు చున్నట్లున్నారు. అది యేమంత దోషమైనది కాదు లెండు! అనాత్మపదార్థమును విడిచి ఆత్మపదార్థమును, నరుని విడిచి నారాయణుని, ధ్యానము చేయబూనుట అంత చెడ్డ నిర్ణయమగునా? పరలోకమునుగూర్చి సుస్థిరవిశ్వాసము, ఇహలోకముపై తీవ్ర నిరసనభావము, గాఢవైరాగ్యబలము, భగవంతునియందు అచంచలభక్తి, జీవుడు నిత్యుడనెడు దృఢనిశ్చయము మీలో కలవు. వానిని మీలో ఎవరేని పూర్తిగా విసర్జింప గలరా యని నిలువదీసి అడుగుచున్నాను, చెప్పుడు. ఆ పని

మీవలన కాదు. మీరు అనాత్మవాదము పూని, ఏ కొలది నెలలపాటో ఆ వాదమున కనుకూలముగా ప్రసంగము చేసినంతమాత్రాన, నేను మోసపోను. మీ ఆంతర్యము నాకు తెలియును. నేను మీచేయి పట్టుకొనినమాత్రానచే, ఎవరికిని తీసిపోని ఆస్తికాగ్రేసరులై మీరు మరలివచ్చెదరు! మీ స్వభావమును, జన్మవాసనలను మీరు ఎట్లు మార్చుకొన గల్లుదురు?

కాబట్టి భారతదేశములో అభ్యుదయకరమగు ప్రతి ఉద్యమమునకును వెనుక మతోత్సాహము పనిచేయుచుండ వలెను. మనదేశమున సాంఘికవాదమునుగాని, రాజకీయ భావములనుగాని, ప్రవేశపెట్టుటకుపూర్వము అధ్యాత్మ భావ ములతో దేశమును నింపివేయవలయును. మన ఉపనిషత్తుల లోను శాస్త్రములలోను పురాణములలోను గుప్తపఱుపబడి యున్న మహాద్భుత సత్యములను వెలికి లాగవలయును. మఠములనుండి వానిని బయటికి తీయవలయును; వనముల నుండి తరలించుకొని రావలయును; ప్రత్యేకవర్గముల అధీ నమునుండి గుంజుకొని తెవలయును. అవి దేశమందంతటను— ఆసేతు హిమాలయ పర్యంతము—దవానలమువలె వ్యాపింప వలయునని మనముపూనికవహించితిమా, కార్యము సాధించితి మన్నమాటే. ఆ సత్యములను మనలో ప్రతివాడును తెలిసి కొనియుండవలయును. ఏలయంటిరా? "దీనిని మొదట విన వలయును, పిమ్మట మననము చేయవలయును; తుదిని ధ్యానమున నిలుపవలయును" అని పెద్దలు ప్రవచించి యున్నారు. వానిని ప్రజలకు మొట్టమొదట వినికిడి చేయ

వలయును; ప్రజలకు తమ శాస్త్రములలోగల ఈ మహాసత్యములను వినిపించు పుణ్యాత్ములెవ్వరో! వారి యదృష్టమే యదృష్టము! నేడు దీనికి మించిన సత్కర్మ మఱియొకటి లేదు. కలియుగములో ఒక కర్మమాత్రమే మిగిలియున్నది—యజ్ఞములు, ఘోరతపస్సులు ఇప్పుడు ఫలప్రదములు కావు. కర్మలయందుకూడ ఒక్కటి మాత్రమే మిగిలియున్నది; అది దానకర్మ! "దానములలోకెల్ల అధ్యాత్మవిద్యాదానము శ్రేష్ఠతమమైనది! దాని తర్వాతిది లౌకికజ్ఞానదానము; దానితర్వాతిది ప్రాణదానము; నాల్గవది అన్నదానము" అని మన వ్యాసులవారు చెప్పియున్నారు. ఆహా! మనది ఎట్టి విశిష్టదాతలతో గూడినజాతియో చూడుడు! శుష్కదరిద్ర దశయందుండు ఈ దేశములో ఎన్నెన్ని దానధర్మములు చేయబడుచున్నవో చూడుడు! చేత చిల్లిగవ్వయైనను లేని నిరుపేదసైతము ఆసేతు హిమాచలము హాయిగా, సుఖముగా తీర్థయాత్ర చేయగలడు; ప్రియమిత్రునివలె ప్రతి వానివలసను ఆదరణ పొందగలడు! ఎక్కడనేని ఒక పిడచ అన్నమున్నంత వఱకు ఈ దేశమున ఏ బిచ్చగాడును ఆకలిచే మరణింపడు. ఓహో, ఎట్టి ఔదార్యమో చూడుడు!

మొదటివిధమగు దానముయొక్క శక్తిని చేపట్టి ఈ ధర్మభూమియందు అధ్యాత్మజ్ఞానమును ప్రచారము చేయుదముగాక. ఆ ప్రచారము హిందూదేశపు హద్దులలో నిలిచిపోకూడదు; లోకమంతటిని ఆవరింపవలయును. ఇట్లు లోకవ్యాప్తమగు ధర్మప్రచారమును మనపూర్వులు చేసిరి. హైందవవేదాంతము ఎన్నడును ఈ దేశమునుదాటి పోలేదని చెప్పు

వారును, మతప్రచారార్థము తొలిసారిగా పరదేశములకేగిన సన్న్యాసిని నేనే యని చెప్పువారును, తమజాతి చరిత్రను ఎఱుగనివారే! ఇట్టి సంఘటనము లనేకపర్యాయములు సంభవించియేయున్నవి. అవసరమైనప్పుడెల్ల భారతీయాధ్యాత్మిక జ్ఞాన ప్రవాహము వెల్లువలై ప్రవహించి, లోకమును ముంచి యెత్తుచువచ్చినది. రాజకీయ ప్రచారము రణధ్వనులతోడను, యోధులతోడను, సాగింపవచ్చును. అగ్నిని కురిపించియు, ఖడ్గమును ఝళిపించియు, లౌకికజ్ఞానమును, సంఘనిర్మాణ విజ్ఞానమును విరివిగా ప్రచారము చేయవచ్చును. కాని అధ్యాత్మజ్ఞానదానమో కన్నులకు కానరాకుండ, చెవులకు వినరాకుండ కురియుచు, రోజాపుష్పరాసులను వికసింపజేయు మంచువలె, నిశ్శబ్దముగా జరుగవలసియున్నది. భారత దేశము నిరాడంబరముగా లోకమునకు మఱులమఱుల చేయుచువచ్చిన దానము ఇదియే. ఏదోఒకజాతి విజృంభించి విజయయాత్రలు సాగించి, ప్రపంచములోని ఆయా జాతులను సమ్మేళనముగావించుచు వచ్చినప్పుడెల్ల, రాచబాటలను సిద్ధముచేసి రాకపోకలకు సౌకర్యములను కల్పించినపుడెల్ల, భారతదేశము వెంటనే మేల్కొని ప్రపంచముయొక్క సమష్టి పురోభివృద్ధికి అధ్యాత్మబలమనెడు తవవంతు దానమును ఇచ్చుచునే వచ్చినది. బుద్ధదేవుడు పుట్టుటకు అనేక యుగములకు పూర్వమే ఇట్టిది జరుగుచుండెను. చీనాలోను, ఆసియామైనరులోను, మలయాద్వీపరాశియందును, దాని గుర్తులిప్పటికిని శేషించియున్నవి. పూర్వము గ్రీసుదేశపు సామ్రాట్టు దిగ్విజయముచేసి, అప్పటికి తెలిసియున్న ప్రపం

చము నలుమూలలను కలిపివేసినప్పుడును, ఇదే సంభవించినది. అప్పుడు హిందూదేశపు వేదాంతము వెల్లువలై ప్రవహించినది. పాశ్చాత్యులు గర్వముతో చూపుకొనునేటి నాగరికత, నాటి వెల్లువలో శేషించినభాగమే. ఇప్పుడు అట్టి అవకాశము మరల వచ్చినది. ఇంగ్లాండుదేశముయొక్క బలప్రభావమువలన ప్రపంచజాతులకు మును పెన్నడునులేని పరస్పర సంబంధము నేడు కలిగినది. ఇంగ్లీషువారి వ్యాపారముకొఱకై ఏర్పడిన రోడ్లు, కాలువలు, ప్రపంచమంతటను నిరంధ్రముగా అల్లుకుపోయినవి. ఇంగ్లీషువారి తెలివితేటల వలన ముందెన్నడును జరిగియుండనిరీతిని, ప్రపంచజాతులు ఈ నాడు ఒకదానికొకటి కలిపి ముడివేయబడి యున్నవి. మానవచరిత్రయందు పూర్వమెన్నడును జరిగియుండని విధమున కేంద్రవాణిజ్యస్థానములు నెలకొలుపబడి యున్నవి. వెంటనే హిందూదేశము ఎట్లో మేలుకొని, తన ఆధ్యాత్మిక దానవర్షములను ప్రపంచముపై కురిపించుచున్నది. ఆధారలు ఈ రోడ్లు ఈ కాలువలు ఆధారముగా దశదిశాంతములకు పరుపులు వెట్టును. నేను అమెరికా వెళ్లుట నాప్రయోజకత్వముగాని, మీ ప్రయోజకత్వముగాని, కాదు. భారత భాగ్యవిధాతయగు హైందవాధిష్ఠానదైవతమే నన్ను పంపియున్నాడు. ప్రపంచము నందలి అన్ని జాతులవారికడకును, నా వంటివారిని వందలకొలదిమందిని ఇంకను పంపనున్నాడు. ఈ కార్యమును అడ్డు పెట్టగల శక్తి లోకమున లేదు. మీ మతమును ప్రచారముచేయుటకు మీరు విదేశములకేగవలసియున్నది. లోకములో ప్రతి జాతికిని మీరు

మీ మతధర్మములను బోధింపుడు. ప్రతివానికిని నీత్యుప దేశము గావింపుడు. మీరు చేయవలసిన మొట్టమొదటి పని ఇదియే. ఇటుల అధ్యాత్మబోధచేసిన పిమ్మట, మీకు నలయు లౌకికజ్ఞానము, ఇతరజ్ఞానములు, దానితోపాటు తమంతతామే రాగలవు. కాని మతమును విడిచి మీరు లౌకికజ్ఞానము కొఱకు ప్రయత్నముచేసితిరా—నేను మీకు స్పష్టముగా చెప్పుచున్నాను—"ఈ భారతదేశములో అట్టి మీ ప్రయత్నము వ్యర్థముగాక తప్పదు! దానియందు మీ ప్రజలకు ఎన్నడును అభిమానము పుట్టదు. కొంతవఱకు ఆ కారణముచేతనే బౌద్ధమతమహోద్యమము సైతము వ్యర్థ మైనది.

మిత్రులారా! నేను అవలంబించు విధానమును తెలిపెదను, వినుడు. భారతదేశమునందును, ఇతరదేశము లందును, మన పారమార్థిక ధర్మములను బోధించుటకు తగిన వారుగా మనయువకులను తయారుచేయుట కొఱకు భారత దేశములో కొన్నిసంస్థలను నెలకొల్ప వలయును. ఇప్పుడు కావలసినది పురుషులుమాత్రమే అని ముమ్మాటికి గ్రహిం పుడు. తక్కినదంతయు సిద్ధముగ దొరకగలదు. కాని బలిష్ఠులును, జవసంపన్నులును, ఋజువర్తనులును, ఆత్మ విశ్వాసపరులునునైన యువకులు కావలసి యున్నారు. అట్టివారు నూరుమంది దొరకిరా ప్రపంచము సంపూర్ణముగా పరివర్తనము పొందగలదు!!! ఇచ్ఛాశక్తి తక్కిన శక్తు లన్నింటికన్నను బలతమమైనది. అది సాక్షాత్తుభగవంతుని యొద్దనుండియే వచ్చునదిగాన దానిముందు తక్కినదంతయు

లొంగిపోవలసినదే. నిర్మలమును, బలిష్ఠమును అగు 'ఇచ్ఛ' (సంకల్పము) సర్వశక్తిమంతమైనది! దానియందు మీకు విశ్వాసము లేదా? ఉన్నచో మీ మతములోని మహోన్నత ధర్మములను ప్రపంచమునకు బోధింప కంకణముకట్టుకొనుడు. ప్రపంచము ఆ ధర్మములకొఱకై ఎదురు చూచుచున్నది. అనేక శతాబ్దములుగా ప్రజలకు తుచ్ఛసిద్ధాంతములు నేర్పబడుచు వచ్చినవి. వారు వ్యర్థులని, నరజీవులేకారని, ప్రపంచమునందు ఎల్లెడలను బోధలు జరిగినవి. ఎన్నియో శతాబ్దములనుండి వారీ బోధలవలన భయభ్రాంతులై పశుప్రాయులై పోవుచున్నారు. తాము ఆత్మమయులనుమాటను వినుటకైనను వారెన్నడును నోచుకొనలేదు. వారికి ఆత్మను గుఱించి తెలుపుడు. "మీలో నీచాతినీచునంచును ఆత్మకలదు. అది యెన్నడును పుట్టునది కాదు, చచ్చునది కాదు. దానిని కత్తి తెగవేయజాలదు; నిప్పు కాల్పజాలదు; గాలి ఎండింపజాలదు; అది ఆద్యంతములులేనిది; అమృతమైనది; పరమపవిత్రమును సర్వశక్తిమంతమును సర్వవ్యాపకమును ఐనది" అని వారికి వినిపింపుడు. వారికి ఆత్మవిశ్వాసమును ప్రసాదింపుడు. ఇంగ్లీషువారికిని మీకును భేదమెక్కడనున్నది తెలియునా? తమ మతమునుగూర్చియు, తమ స్వధర్మమును గూర్చియు, ఎన్ని ప్రసంగములైనను చేయుదురుగాక. మీకు గలతారతమ్యము నాకు తెలియును: ఆంగ్లేయునకు తనయందు తనకు విశ్వాసము కలదు; మీకది లేదు. తానొక ఆంగ్లేయుడని, తానేమేనిచేయగలడని, అతనికి విశ్వాసము దృఢముగా కలదు! ఈ యాత్మవిశ్వాసమువలననే వాని ఆంతర్యమున

నున్న భగవంతుడు వానికి ప్రత్యక్షమగును! అతడంతట తన యిచ్చవచ్చిన దానిని దేనినైనను సులభముగా చేయగలడు. మీరో, మీ రేమియు చేయజాలరని, దద్దమ్మలని, మీవారే మీకు బోధించిరి. దానిని మీరు చక్కగానమ్మి దినదినము నిరర్థకులై పోవుచున్నారు!! మీకు కావలసినది బలము. కాబట్టి మీరు ఆత్మవిశ్వాసమును వహింపుడు. మనము దుర్బలులమై పోయినాము. ఆ కారణముచేతనే ''రహస్య వాదములు'', ''గూఢోపదేశములు'' మున్నగు తుచ్ఛ మతధర్మము లెన్నియో వచ్చి మనపై పడుచున్నవి! వానిలో గొప్పసత్యములే ఇమిడి యుండవచ్చును. ఐననేమి? అవి మనలను దాదాపుగా నాశనముచేసినవి. మీ నాడులను దృఢమైన వానినిగా చేసికొనుడు. ఇనుప నాడులు, ఉక్కు-కండరములు మనకు కావలసియున్నవి! మనము పెద్దకాలము శోకములు పెట్టియున్నాము, చాలును. ఇంక శోకించుట వలదు. లేచి మీపాదములపై మీరు నిలువబడుడు! పురుషులుకండు! ఇప్పుడు మనకుకావలసినది పురుషులను సృజించు మతమే! మనలను పురుషులనుగాచేయు సిద్ధాంతములే యిప్పుడు కావలయును! మనలను పురుషులనుగా చేయు విద్యయే మనకు ఎల్లెడల ఆవశ్యకముగా నున్నది! సత్యమును గుర్తించు పెట్లందురా? కాయికముగను, మానసికముగను, ఆధ్యాత్మికముగను, మిమ్ములను దుర్బలురనుగా చేయున దేదియైనను సరియే, దానిని విషప్రాయముగా త్రోసి వేయుడు! దానియందు జీవశక్తి లేదు; అది సత్యము కాజాలదు. సత్యము బలవర్ధకమైనది; సత్యము పవిత్ర

మైనది; సత్యము సర్వజ్ఞము. సత్యము బలదాయకముగా నుండవలయును; జ్ఞానదాయకముగ నుండవలయును; జవ సత్త్వదాయకముగా నుండవలయును. రహస్యోపదేశములందు కొన్ని సత్యరేణువులున్నను అవి సాధారణముగా మానవు లను నిర్వీర్యులను చేయునవియే! నా మాట నమ్ముడు. నా కీ విషయమున యావజ్జీవానుభవము కలదు. అందుచే అది నిర్వీర్యులనుచేయు స్వభావముగలదని నేను నిర్ణయింప గల్గితిని. నేను భారతదేశమందంతటను పర్యటించితిని; దాదాపు ప్రతి గుహలోను దూరి చూచినాను. హిమాలయ ములలో నివసించినాను. తమ జీవితమునంతను అందే గడపిన మహనీయులను ఎఱుగుదును. నా జాతియనిన నాకు అభిమానము మెండు. మీ రిప్పటికన్న ఇంకను క్షీణించి పోయి నిర్వీర్యులగుట నేను చూచి సహింపజాలను. కాబట్టి మీ కొఱకును సత్యముకొఱకునుగూడ "ఇక ఆగుడు! నిలువుడు!" అని నా జాతి క్షీణగతిని ఆపుటకు ఎలుగెత్తి పలుకుచున్నాను. నిర్వీర్యులనుచేయు ఈ రహస్యమతములను త్యజింపుడు. బలము కూర్చుకొనుడు. మీ ఉపనిషత్తులపై, దివ్యమై, సత్త్వప్రదమై, తేజోవంతమై, వెలయు మీ వేదాంత శాస్త్రముపై, మరల దృష్టి ప్రసరింపజేయుడు. ఈ రహస్య విషయములనుండి, మిమ్ము దుర్బలులనుచేయు ఈ రహస్య బోధలనుండి, దూరముగా పొండు. వేదాంత ధర్మమును చేకొనుడు. ప్రపంచములోని మహోత్కృష్టధర్మము లెప్పుడు గాని అతిసరళములుగనేయుండును; మీ జీవితములవలె నిరా డంబరములై యుండును. ఉపనిషత్తులు బోధించు ధర్మములు

మీ ఎదుటనే యున్నవి. వానిని చేపట్టుడు. వాని ననుసరించి జీవింపుడు. అప్పుడు భారతదేశము మోక్షమొందుకాలము ఆసన్నమగును.

ఇంకొక మాటచెప్పి ముగించెదను. పాశ్చాత్యులు దేశాభిమానమునుగూర్చి తఱుచు మాటాడుచుందురు. దేశాభిమానమునందు నాకును విశ్వాసముకలదు. దేశాభిమానమును గుఱించిన భావములు నాకును కలవు. ఘన కార్యములు సాధించుటకు మూడువిషయములు అవసరము. మొట్టమొదటిది హృదయపూర్వకమగు సానుభూతి. బుద్ధిలో గాని, తర్కములోగాని ఏమున్నది? అది నాలుగడుగులుమాత్రము పోయి అక్కడ ఆగిపోవును. కాని హృదయద్వారమున దైవప్రేరణ కలుగును. ప్రేమ దుస్సాధములగు ద్వారములనుకూడ తెఱచివేయగలదు. జగద్రహస్యము లన్నింటికిని ప్రేమయే సింహద్వారము. కాబట్టి సంస్కర్తలుకాగోరు మహాశయులారా! దేశాభిమానులు కాగోరు మహాత్ములారా! ముందు సానుభూతిని అలవఱచుకొనుడు. మీకు సానుభూతి గలదా? దేవతలయొక్కయు, మహాఋషులయొక్కయు, సంతానములో లక్షలకొలంది జనము నేడు పశుప్రాయులై పోయిరేయని మీరు నిజముగా దుఃఖించుచున్నారా? లక్షలాది జనము తిండిలేక ఈనాడు మలమల మాడుచున్నారే యనిగాని, తిండిలేక కోట్లకొలది జనము అనేకయుగములనుండి చచ్చిపోవుచున్నారనిగాని మీరు పరితాప పడుచున్నారా? అజ్ఞానము నల్లనిమబ్బువలె దేశమును కప్పివేసెనని మీరు ఆరాటపడుచున్నారా?

అది మీ హృదయములను కలంచివేయుచున్నదా? మీకు నిద్రపట్టకుండునట్లు చేయుచున్నదా? అది మీ రక్తమందు ప్రవేశించినదా? మీ గుండె దానితో స్పందించుచున్నదా? ఆ విచారముతోడ మీరు పిచ్చివారై పోవుచున్నారా? ఈ తీరున అయ్యో, సర్వమును నాశమైపోయెనగదా యను చింత మిమ్మావహించినదా? మీ పేరు ప్రతిష్ఠలను, మీ ఆలుబిడ్డలను, ఆస్తిపాస్తులను, శరీరసౌఖ్యములను సమస్తమును మీరు మఱచిపోయితిరా? నిజము చెప్పుడు. అటుల చేయగలిగితిరా, దేశాభిమానులగుటకు మీరు మొదటి మెట్టును ఎక్కితిరన్నమాట! అసలు నేను అమెరికాకు పోవుట మత మహాసభకొఱకు కాదని మీలో చాలమందికి తెలియును. నా దేశమునకు నేను ఏ సేవయు చేయలేకున్నానే యను పరితాపము నన్ను దయ్యమువలె పట్టుకొనినది. ఆభావము నాలో చేరినది; నా ఆత్మలో దూరినది; నా దేశీయులకొఱకై పనిచేయు మార్గము కనబడక పండ్రెండు సంవత్సరముల పాటు భారతదేశమంతయు కలియ దిరిగితిని. ఈ చికీర్ష తోడనే, ఏమియుతోపక నేను అమెరికాకు పోయితిని. నన్నప్పుడు ఎఱిగియున్నవారికి ఈ సంగతులన్నియు తెలియును. ఆ మతమహాసభ ఎవరికి కావలసివచ్చెను? నారక్త మాంసములు పంచుకొనిపుట్టిన నా సోదరులు ఇక్కడ తీయించి పోవుచుండ ఆ సభగొడవ ఎవరికి పట్టినది? అదియే నా మొట్టమొదటి భావము!

మీకు ఆ పరితాపమీ కలదనుకొందము. సరే, నుఱుగునుబోలి బుసబుసలాడు వ్యర్థపు ప్రసంగములతో మీ శక్తి

నంతను వ్యయముచేసికొనుటకు మారుగా, ఈ దుఃస్థితినుండి వెలువడు మార్గమును దేనినైనను, అనుష్ఠానయోగ్యమగు ఏ పరిష్కారమునైనను, మీరు కనుగొంటిరా? శాపనార్థములకు మారుగా కొంచెమైనను సాహాయ్యము చేయుమార్గమేదైన కనిపట్టితిరా? వారిదుఃఖములను ఉపశమింప చేయుటకై, ప్రతికియుండగనే వారి ప్రాణముల తీయు ఘోర హింసలనుండి వారిని తప్పించుటకై, ఏ ఉపాయమునైనను మీరు కనుగొన ప్రయత్నించితిరా? ఇంతకూడ చాలదు! పర్వతములవలె లేచి అడ్డమై నిలుచు ఆటంకములను దాటుటకు తగిన సంకల్పశక్తి మీకు గలదా? ఖడ్గము చేతబూని ప్రపంచమంతయు మిమ్ముల నెదిరించి నిలిచినను, ధర్మమని తోచిన దానిని ఆచరించుటకు మీరు సాహసింతురా? మీ భార్యలు బిడ్డలు మీకు విరోధులై నిలిచినప్పటికి, మీ ఐశ్వర్యములు నాశమై పోయినప్పటికిని, మీ పేరు రూపుమాసినప్పటికిని, మీ సర్వస్వమును అదృశ్యమై పోయినప్పటికిని మీరు ధర్మమునే అంటి పట్టుకొని నిలుతురా? దానినే అనుసరించుచు మీ గమ్యమును చేరువఱకు స్థిరసంకల్పముతో పురోగమింతురా? "ఋషులు నిందింతురుగాక, స్తుతింతురుగాక; భాగ్యదేవత వచ్చుగాక, తనత్రోవను తాను పోవుగాక; ఈ నాడే మరణము వచ్చిపడుగాక, నూఱుసంవత్సరములు అగుగాక; సత్యమార్గమునుండి ఒక అంగుళమైనను తొలగనివాడే నిజముగా స్థిరచిత్తుడగు పురుషుడు!" అని భర్తృహరి చెప్పుచున్నాడు. అట్టి సుస్థిరత మీయందు కలదా? ఈ మూడు విషయములు మీకు లభించునెడల

మీలోని ప్రతివాడును అద్భుతకార్యములు చేయజాలును! మీరు వార్తాపత్రికలలో వ్యాసములు వ్రాయనక్కఱలేదు; ఉపన్యాసములనిచ్చుచు అందందు తిరుగాడ నవసరములేదు. మీముఖమే దేదీప్యమానముగా తేజరిల్లును. మీరు గుహాంతరములందు నివసించుచున్నప్పటికిని మీసంకల్పములు రాతిగోడలను భేదించుకొనిపోయి, శతాబ్దముల కొలది లోకమందంతటను స్పందించుచుండును. అవి ఎవని మేధయందో నాటుకొని, అక్కడనుండి మరల పనిచేయుచుండును. సంకల్పముయొక్క శక్తి అటువంటిది. ఋజుత్వముయొక్క మహిమ అటులుండును. నిష్కల్మషదీక్షకు అట్టి సమర్థత కలదు.

బహుశః మీకు వేళ అతిక్రమించు చున్నది. ఇంకొక మాట మాత్రము వినుడు! నా దేశీయులారా! నా మిత్రులారా! నా బిడ్డలారా! ఈ జాతీయనౌక కోట్లకొలది జీవులను ఈ జీవనస్రవంతిమీద దాటించుచు వచ్చినది. అనేక శతాబ్దములనుండి ఇది ఈ నదిమీద ఇటునటు తిరుగుచున్నది. దాని సాహాయ్యమున కోట్లకొలది జీవులు ఆనలియొడ్డునచేరి నిత్యానందమును బడయజాలిరి! కాని నేడు మీ దోషము వలననే కావచ్చును, ఈ పడవ కొంచెము ఓటిదైనది. దానికొక తూటుపడినది. అట్లని దానిని మీరు దూషింతురా? ప్రపంచములో ఏ ఇతర వస్తువును ఇంత ఎక్కువగా పని చేయలేదని మీకు తెలియునుగదా! అట్టి ఈ నౌకపై కినిసి చెలరేగి దానినిగూర్చి అమంగళవాక్యములు పలుకుట మీకు తగునా? ఈ జాతీయనౌకలో —ఈమన సంఘము లో—చిల్లులున్నప్పటికిని, మనము దాని బిడ్డలమేకదా!

రండు, మనము పోయి ఆ రంధ్రములను బాగుచేయుదము! మన హృదయరక్తమును ధారవోసి ఆనందముతో ఆ కార్యమును నిర్వర్తింతము! మనకు సాధ్యముకాదేని, ఆ పవిత్ర కృషియందే మనము మరణింతుముగాక! మన మెదడుతో బిరడాలనుచేసి, ఆ పడవయొక్క రంధ్రములను పూడ్తుముగాక! అంతేకాని, నిందారోపణ చేయుటయా? వలదు వలదు! ఎన్నటికిని వలదు! ఈ సంఘమును గుఱించి నిర్దాక్షిణ్యముగ ఒక్కమాటనైనను పలుకకుము! దాని పూర్వోన్నత్యమును గురించియైనను నేను దానిని ప్రేమించెదను. మీరందఱును దేవతలబిడ్డలు కావుననను, మహిమాఢ్యులగు పితరుల సంతానము కావుననను, మిమ్ములను నేను ప్రేమించెదను. నేను మిమ్మెట్లు దూషింపగలను? ఎన్నడును అటుల చేయను. సమస్తమంగళములును మీకగుగాక! నా బిడ్డలారా! నా కలలన్నియు మీకు తెలుపుటకై మీ కడకు వచ్చినాను. మీరు ఆలకింతురా, మీతో కలసి పనిచేయుటకు నేను సిద్ధముగా నుందును. మీరు నా మాటలను చెవిని పెట్టనియెడల, మీరు నన్ను తన్ని హిందూదేశమునుండి వెడలగొట్టినను నేను తిరిగి తిరిగి వచ్చి "అయ్యో, మనమందఱము మునిగిపోవుచున్నాము, లెండు, లెండు" అని మిమ్ము ప్రబోధించుచునే యుందును. నే నిప్పుడు మీతో మీ మధ్య కూర్చుండుటకు వచ్చియున్నాను. మనము మునుగవలసి యుండినయెడల అందఱము కలిసియే మునుగుదము. అంతేగాని ఎన్నడును మన పెదవులనుండి దూషణవాక్కులు వెలువడకుండుగాక!

హిందవజీవితము : వేదాంతము

మన జాతిని పేర్కొనుటకును, మన మతమును తెలుపుటకును, సర్వసామాన్యముగా ప్రయోగింపబడు శబ్దమొకటి కలదు. అది ''హిందువు''. ఆ 'హిందూ' శబ్దమునకు—వేదాంతమును గుఱించిన నా భావమును వివరించు సందర్భమున—కొంత వివరణమును చెప్పవలసి యున్నది. 'హిందూ' అనెడు మాట, సింధూనదిని పేర్కొనుటకు గాను ప్రాచీన పారశీకులు వాడుచు వచ్చిరి. సంస్కృతములోని 'స' అను అక్షరము అప్పటి పారశీకభాషలో 'హ' గ మాఱును. కాబట్టి 'సింధు' అను పదము 'హిందు' అయినది. సరే, 'హ'కారమును ఉచ్చరించుట కష్టముగానుండుట చేత గ్రీకులు దానిని అసలే వదలి వేసిరని మీకు తెలిసియే యుండును. అందువలననే మనకు 'ఇండియనులు' అను నామము ఏర్పడినది. 'సింధూనదికి ఆవలియొడ్డున నివసించువాడు' అని తెలుపుటకు ప్రయోగింపబడిన 'హిందూ' పదము పూర్వకాలమున నొకవేళ సార్థకమై ఉండి యున్నను, ఈ ఆధునిక కాలమునందు దాని సార్థకత యంతయు పోయినది. ఏలయనగా, సింధూనదియొక్క ఈవలి యొడ్డున నివసించు జనులందఱు ఈ కాలమున ఒకే మతమునకు చెందిన వారు కారు. ఇప్పుడు ఇక్కడ హిందువులుకాక, మహమ్మదీయులును, పార్సీవారును, క్రైస్తవులును, బౌద్ధులును, జైనులును కలరు. 'హిందూ' అను మాటయొక్క వ్యుత్పత్యర్థ

ప్రకారము దానిలో వీరందఱును ఇమిడి యుండవలయును. కాని మతవిషయకముగా వీరినందఱిని హింసువులని పిలుచుట సరికాదు. మన మతమునకు సామాన్యనామమును కల్పించుట చాల కష్టమగు పని. ఈ మతము అనేక మతముల యొక్కయు, అనేక భావముల యొక్కయు, వివిధ కర్మకలాపముల యొక్కయు, ఆచారముల యొక్కయు, సమ్మేళనమై యున్నది. వీనికన్నిటికి ఒకేపేరుగాని, ఒకే అర్చనావిధానముగాని, ఒకే వ్యవస్థగాని లేక అన్నియు ప్రోగుపడినవి. మన ఈ సంప్రదాయములన్నియు వేద ప్రామాణ్యమునుమాత్రము అంగీకరించుచున్నవి. వేదములు పరమప్రమాణములని ఒప్పుకొనని ఏ వ్యక్తియు 'హిందువు' అని పిలుచుకొనుటకు అర్హుడు కాడని నిశ్చయముగా చెప్ప వచ్చును. ఈవేదములన్నియు కర్మకాండ, జ్ఞానకాండ, అనెడు రెండు భాగములుగా విభజింపబడియున్నవని మీ రెఱుగుదురు. కర్మకాండయందు యజ్ఞములు, క్రతువులు మున్నగువానినిగూర్చి చెప్పబడియుండును. వానిలో చాల భాగము ఈ కాలమునందు ఆచరణలోలేవు, 'ఉపనిషత్తులు' లేక 'వేదాంతము' అని పిలువబడు ఆధ్యాత్మికబోధభాగ మునే జ్ఞానకాండ యందురు. మన ఆచార్యులందఱును, మన తత్త్వవేత్తలందఱును, మన గ్రంథకర్తలందఱును—ద్వైతులు గాని, అద్వైతులుగాని, విశిష్టాద్వైతులుగాని—ఈ వేదాంత మునే పరమ ప్రమాణముగా చూపుదురు. భారతదేశము లోని ప్రతి తత్త్వసిద్ధాంతమునకు, ప్రతి సంప్రదాయమునకు, ఉపనిషత్తులలోనే ప్రమాణము చూపవలసియున్నది. అట్టి

ప్రమాణము చూపజాలని సంప్రదాయము వేదబాహ్యమై అసమ్మతమగును. కావున ఈకాలమున ఈదేశమందంతటను గల హిందువులందఱకు వర్తింపగల పేరు కావలెనన్నచో, వారిని 'వేదాంతు' లనిగాని 'వైదికు' లనిగాని పేరొక్కన వలెను. ఈ యర్థముననే 'వేదాంతమతము', 'వేదాంతము' అను పదములను నేను సదా వాడుచుందును. దీనిని ఇంకను కొంచెము వివరించెదను. ఏలయన 'వేదాంత' మను పదమును వేదాంతదర్శనములోని అద్వైతమతము అను అర్థముననే చాలమంది వాడుట ఇటీవల ఆచారమైపోయినది. ఉపనిషత్తులను ఆధారముగా పెట్టుకొనిన ఆయా వేదాంతమతములలో, 'అద్వైత' మనునది ఒకశాఖ మాత్రమే యని మీకందఱకును తెలియుననుకొందును. విశిష్టాద్వైత సాంప్రదాయులును, అద్వైతులతో సమానముగ ఉపనిషత్తులను గౌరవించెదరు. అద్వైతులవలెనే విశిష్టాద్వైతులును వేదాంతము ప్రమాణమని వాదింతురు. ద్వైతులును అట్లే యందురు. హిందూదేశములోని ప్రతి ఇతర సాంప్రదాయియు అట్లే చెప్పును. కాని ప్రజాసామాన్యమునందు 'వేదాంతి' అనగా అద్వైతి యని సాధారణముగా అభిప్రాయము ఏర్పడినది. అందుకు కొంతకారణముకూడ కలదనవచ్చును. వేదములే మనశాస్త్రములైనను, ఆ వైదిక సిద్ధాంతములకు వ్యాఖ్యానోదాహరణములుగా తదనంతరము ప్రాయబడిన స్మృతులును, పురాణములునుకూడ ఏర్పడియున్నవి. వీనికి వేదములకున్నంత ప్రామాణికత లేదు నిజమే. ఈ పురాణములును, స్మృతులును శ్రుతికి విరుద్ధ

ముగ నున్నచోట్లనెల్ల, శ్రుతినే అనుసరించి, స్మృతిపురాణ ములను త్రోసివేయవలెనని శాస్త్రవిధియు గలదు. అద్వైత వేదాంతియగు శ్రీ శంకరాచార్యులవారి వ్యాఖ్యానము నందును, ఆయనచే స్థాపింపబడిన సంప్రదాయమువారి రచన లందును, ఉదాహరింపబడిన ప్రమాణములు చాలవఱకు ఉపనిషత్తులనుండి తీసికొనబడినవే. శ్రుతులలో సాధారణ ముగా కనబడని అంశము నేదేని విశదము చేయవలసివచ్చి నప్పుడు తప్ప, స్మృతులనుండి ప్రమాణములు తీసికోబడ లేదు. ఇతర సంప్రదాయము లన్నిం, వారు ఎక్కువగా స్మృతులను, కొంచెముగా శ్రుతులను, ఆధారముచేసికొనిరి. ద్వైతసంప్రదాయములన్నిం, అధికాధికముగ స్మృతుల నుండియే వారు ప్రమాణములు కైకొనియున్నారు. వేదాం తులమని చెప్పుకొనువారు ఇంతగా స్మృతిప్రమాణములపై నాధారపడుదురని మనము భావింపము; కాని వారటుల చేసిరి. వారింతగా పురాణములనుండి ప్రమాణములను ఎత్తి చూపుటచేతనే అద్వైతియే స్వచ్ఛమగు 'వేదాంతి' యగు నను అభిప్రాయ మేర్పడియుండును.

అది యెట్లున్నను, వేదాంతమను శబ్దము భారతీయుల ఆధ్యాత్మిక జీవన క్షేత్రమున కంతటికిని అనువర్తింపవల యును. అది వేదములయొక్క అంశమగుటచేత, మనకుగల అత్యంత ప్రాచీన వాఙ్మయమని అందఱుచేతను అంగీకరింప బడుచున్నది. నవీన పండితుల అభిప్రాయమెట్లున్నను, వేద ములలోని కొన్ని భాగములు ఒకప్పుడును, మఱికొన్ని భాగములు మఱొకప్పుడును, వ్రాయబడి యుండెనని

హింసువులు అంగీకరింప జాలరు. వేదములన్నియును ఏక కాలమునందే రచింపబడెనని వారు దృఢముగా విశ్వసించు చున్నారు. ఇవి ఎన్నడును రచింపబడినవే కావనియు, బ్రహ్మదేవుని హృదయమున అనాదిగా ఉండియున్నవే యనియు కూడ, వారి నమ్మకము. వేదాంతము ద్వైతము యొక్కయు, విశిష్టాద్వైతముయొక్కయు, అద్వైతము యొక్కయు, క్షేత్రమునంతను ఆవరించు నను భావమునసే నేను వేదాంతశబ్దమును వాడుదును. ఈ ఆవరణములోనికి రానిష్టపడునేని, బౌద్ధ జైనమతములలోని కొన్నికొన్ని భాగములనుసైతము మనము స్వీకరింపవచ్చును. మన హృదయములు అందుకు తగినంత విశాలములుగనేయున్నవి. కాని మనలోనికి వచ్చుటకు ఇష్టపడకున్నది వారే. మనము సంసిద్ధముగనే యున్నాము. తీవ్రదృష్టితో పరిశోధించిన యెడల, బౌద్ధమతసార మంతయు ఉపనిషత్తులనుండియే గైకొనబడినదని స్పష్టమగును. బౌద్ధమతములోని మహో దార నీతి సూత్రములన్నియు మనఉపనిషత్తులందు, 'తు, చ' తప్పకుండ, మాటలు మాటలుగ, అక్షరాలు కాన్పించుచున్నవి. అదే విధముగ జైనుల సిద్ధాంతములు సైతము——వారి స్వకీయభ్రాంతికల్పనలను విడిచినయెడల——మన ఉపనిషత్తు లందు గోచరించుచున్నవి. అనంతరకాలమున భారత దేశమున ప్రబలిన ఆధ్యాత్మికమతభావాంకురములన్నియు కూడ ఉపనిషత్తులలో కలవు. ఉపనిషత్తులలో భక్తిభావనా దర్శము లేదని కొందఱు వాదములు చేయుచుందురు. ఈ వాదములు కేవలము నిరాధారములు. ఉపనిషత్తులు చక్కగ

చదివినచో ఈ వాదములు ఎంతమాత్రము సత్యముకాదని స్పష్టపడును. ప్రతి ఉపనిషత్తునందును కావలసినంత భక్తి యున్నది; మీరు కొంచెము కన్నులు తెఱచి దానిని చూడ వలసియుండును, అంతే. ఉత్తరకాలమున పురాణములలోను, ఇతర స్మృతులలోను, పూర్తిగ వికసించియున్న అనేక భక్తి భావములు ఉపనిషత్తులయందు బీజప్రాయముగా నున్నవి. వాని ఆకృతిరేఖలు స్థూలముగా అందే కలవు. కొన్ని పురాణములు ఆ స్థూలరేఖలను సూక్ష్మముగా తీర్చిదిద్దినవి. అంతేగాని, ఉపనిషత్తులలో అంకురముగనైన గోచరింపని ఒక్క భారతీయాదర్శమైనను, నూతనముగ వికసించినది కాన్పింపదు. ఉపనిషత్తులు బాగుగా చదువని కొందఱు పెద్దలు, భక్తికి ఏదో అన్యాధారము చూపనలయునని వెఱ్ఱి ప్రయత్నములు చేసియున్నారు. కాని వారిప్రయత్నము లన్నియు వ్యర్థములనుట ఋజువైనది. భక్తిపరముగా మీకు కానలసినదంతయు ఉపనిషత్తులలో—సంహితలలోనైతము —కలదు. భక్తి, పూజ, మున్నగునదంతయు అందున్నది. కాని అవి వికసించుటమాత్రము ఆ తరువాతి కాలముననే క్రమక్రమముగా జరుగుచువచ్చినది. సంహితాభాగములందు కొన్నికొన్ని చోటుల, భయసంకటములతో కూడిన మతము యొక్కజాడలు మనకు గోచరించును; ఏ వరుణదేవుని ఎదుటనో, మఱొకదేవుని ఎదుటనో, గజగజ లాడుచుండెడి అర్చకుడు మనకు కానవచ్చును. పాపభావము వారినొక్కొక్క సారి అపారముగా సంక్షోభింపజేయుటయు కానవచ్చును. కాని ఉపనిషత్తులలో ఇట్టి విషయముల ప్రస్తావనయే కాన

రాదు. ఉపనిషత్తులలో కానవచ్చు మతభావమున భయము నకు స్థానమే లేదు. అందలి మతము భక్తిమయము, జ్ఞాన మయము!

ఈ ఉపనిషత్తులే మనకు శాస్త్రగ్రంథములు. వానికి వేఱువేఱు రీతుల అర్థము చెప్పబడును. అర్వాచీనములగు పురాణములకును, ప్రాచీనములగు వేదములకును వైరుధ్యము సంభవించినప్పుడెల్ల, నేనిదివఱకే తెలిపియున్నటుల పురాణ ములే తలవంపవలసియుండును. అయినప్పటికిని, యథార్థ మునకు మనము నూటికి తొంబదిపాళ్లు పౌరాణికులమును, పదిపాళ్లు మాత్రమే వైదికులమును అయితిమి. ఈ పది పాళ్లయినను పూర్తిగ వైదికులమో కాదో! హిందూ శాస్త్రాధారము బొత్తిగాలేని అనేక విరుద్ధాచారములు మనలో కాన్పించుచున్నవి! అట్టి విరుద్ధ మతభావములు సైతము మన సంఘములో పరిపాటియై పాదుకొని పోయినవి! వేదములలోగాని, స్మృతులలోగాని, పురాణములలోగాని, ఎట్టిప్రమాణములును లేక కేవలము స్థానికములైవచ్చు దేశాచారములను చూచినచో మనకు ఆశ్చర్యము కలుగును. పామరుడగు ప్రతి పల్లెటూరివాడును, ఏ చిన్న గ్రామాచారమో నశించిపోయిన యెడల, తానిక హిందువై నిలువజాలక భ్రష్టుడై పోవలసినదే యని తలంచుచున్నాడు! వాని మనస్సులో వేదాంతమతమును, ఈ స్థానిక క్షుద్రా చారములును పెనవేసికొని, ఏకరూపమై పోయినవి! అట్టి వాడు ధర్మశాస్త్రములను చదివిననుకూడ, తాను చేయు వాదనకు యథార్థముగా శాస్త్రాధారము లేదనియు, ఈ ఆచా

రములను వదలిన యెడల తనకు ఏమాత్రము హాని లేక పోగా, తాను ఉత్తమమానవుడుగా కూడ పరిగణింపబడగల డనియు గ్రహించుట చాల కష్టము. రెండవది ఇంకొక కష్ట మున్నది. ఈ మన శాస్త్రగ్రంథములు బహువిస్తృతములై యున్నవి. ఉత్తమ వేదాంత గ్రంథములలో నొకటి యగు పతంజలి మహాభాష్యమున, సామవేదమునకు వేయిశాఖలు కలనని చెప్పబడియున్నది! అవి యన్నియు ఇప్పుడు ఎక్కడ నున్నవి? ఎవనికిని తెలియదు! ప్రతి వేదము సంగతియు ఇట్లే అయినది. ఈ గ్రంథములు చాలభాగము అదృశ్యమై పోయినవి; కొద్దిభాగములు మాత్రమే మనకు మిగిలియున్నవి. అవియు కొన్నికొన్ని ప్రత్యేకకుటుంబములవారి అధీనమందే యుండెడివి. ఆ కుటుంబములవా రిప్పుడు అంతరించియుందురు; లేదా పరదేశీయులచేతి క్రూరముగ నిధింపబడియుందురు; మొత్తముమీద ఏదో విధముగ వారందఱును రూపుమాసి పోయిరి. వారితోపాటు వారు తమ అధీనమందుంచుకొనిన వేదశాఖాపాండిత్యముకూడ నాశమైపోయినది. ఏదేని క్రొత్త విషయమును బోధించుటకో, ఏదేని వేదవిరుద్ధమగు ధర్మమును ప్రచారము చేయుటకో పూనుకొనిన వారెల్లరు దీని నొక మిషగా పెట్టుకొనుచుందురని మనము జ్ఞప్తి నుంచుకొనవలయును. స్థానికాచారమునకును శ్రుతికిని వివాదము సంభవించినప్పుడెల్ల, ఆ స్థానికాచారము శాస్త్ర విరుద్ధమని చూపబడినప్పుడెల్ల, ఈ వాదనను వారు బయటికి తీయుదురు. ఆ స్థానికాచారము శ్రుతి విరుద్ధము కాదనియు, అది అంతరించిపోయిన యొక శ్రుతిశాఖయందలి ఆచారమే

యనియు, కావున దానికి వేదముయొక్క అంగీకారము కలదనియు నక్కాణింతురు! భిన్నభిన్నములగు పాఠాంతరములమధ్య, శాస్త్రములకు అర్థములు చెప్పుచో అవలంబింపబడు భిన్నభిన్నమార్గముల నడుమ, అన్నింటికిని సామరస్యమునుగూర్చు సూత్రమును కనుగొనుట చాల కష్టము. ఏలయందురా? భిన్నభిన్నములై చూపట్టు ఈ శాఖాంతరముల కన్నింటికిని అడుగున మూలాధారము ఒకటి ఉండితీరవలయునియు. ఈ చిన్నచిన్న భననములన్నిటికిని పరస్పరానురూప్యమునుగూర్చు సామాన్యమగు పదకము ఏదో యొకటి ఉండితీరవలయుననియు, 'మన మతము' అని మనము చెప్పుకొనునట్టి ఈ కలగూరగంపకు అంతకు ఒక ఆరంభము ఉండితీరవలయుననియు, మనము విశ్వసించుచున్నాము. అటుల లేకున్నచో మన మతము ఇన్నిదినములు నిలిచియుండెడిదే కాదు; ఇంతకాలము సజీవమై యుండగలిగెడిదే కాదు.

మరల మన భాష్యకర్తల విషయము ఎత్తుకొన్నచో, ఇంకొక చిక్కు కానిపించుచున్నది. అద్వైతీయగు భాష్యకారుడు తనకు అద్వైతపరమగు శాస్త్రవాక్యము దొరకినప్పుడు, దానిని ఉన్నది ఉన్నటుల కాపాడును. కాని ఆ భాష్యకారునకే ద్వైతపరమగు వాక్యము కండ్లపడగనే, తనకు చేతనైనంతవఱకు దానికి ఏదో ఒక వికృతార్థమును కల్పనచేయును. ఒక్కొకప్పుడు 'బ్రహ్మదేవుడు' 'ఆడు మేక' యైపోవును! ఆ భాష్యకర్తలు తమకు అనుకూలించు కొఱకై 'అజుడు' అనగా పుట్టువు లేనివాడు (బ్రహ్మదేవుడు) అను అర్థమున్నచోట 'అజా' అనగా ఆడుమేక అని అర్థము

చెప్పివేయుదురు. ఇదేతీరున—ఇంతకన్న అధ్వానముగ కూడ—ద్వైతభాష్యకారులు సైతము శాస్త్రవాక్యముల యర్థమును కొన్ని చోటుల తారుమారుచేసిరి. ద్వైతపర మగు ప్రతి వాక్యమును సురక్షితముగ నుంపబడును. అద్వైతసిద్ధాంతమును తెలుపు ప్రతివాక్యమును తమ యిచ్చ నచ్చినతీరున మెలికలుత్రిప్పి హింసింపవలసినదే! ఈ సంస్కృత భాష మిక్కిలి క్లిష్టమగుటచేతను, వేదములందలి సంస్కృత భాష అత్యంతము పురాతనమైనదగుటచేతను, 'భాషోత్పత్తి శాస్త్రము' అతి సమగ్రమైయుండుటచేతను, ఒక్కమాట యొక్క అర్థమును గుఱించి యుగయుగములుగా ఎంతెంత వివాదమునైనను సాగింపవచ్చును. ఒక పండితుని పుట్టిలో బుద్ధి పుట్టినా, ఏ పిచ్చిప్రలాపమునైనను తన వాదబలము చేతను, శాస్త్రప్రమాణములను సూత్రములను క్రోడీకరించుటచేతను, శుద్ధమగు సంస్కృతముగ నిరూపింపగల్గును! ఉపనిషత్తులను అర్థముచేసికొనుటలో మనకు గల చిక్కులిట్లున్నవి. నాకొక అవతారపురుషుని పాదసమీపమున జీవించు నదృష్టము కలిగినది. అయన ఎంతటి అద్వైతియో అంతటి ద్వైతియు! ఎంతటి జ్ఞానియో అంతటి భక్తుడును! మున్నుందుగా ఈ పురుషుని సాహచర్యము లభించుటవలన, భాష్యకర్తలను గ్రుడ్డిగా అనుసరించుటకంటె స్వతంత్రముగా ఉపనిషత్తులకును శాస్త్రగ్రంథములకును అకృత్రిమాధారము గల అర్థము చెప్పుకోవలయునను సంకల్పము నాకు కలిగినది. నా పరిశోధనలవలన నాకు కలిగిన అభిప్రాయ మిది: ఈ శాస్త్రగ్రంథములు ఎంతమాత్రమును పరస్పరవిరుద్ధములు

కావు. కాబట్టి మూలగ్రంథములను పెడత్రిప్పనలసిన భయము మనకు లేదు. ఈ శాస్త్రగ్రంథములు రమ్యమైనవి; మహాద్భుతమైనవి. అవి పరస్పర విరుద్ధములు కానే కావు. ఒక భావముననుండి మఱొక భావమునకు తిన్నని దారిని చూపుచు, అన్ని భావములకు అద్భుతసామరస్యమును సాధించి నవి. నే నొక సత్యమును కనిపట్టినాను. అన్ని ఉపనిషత్తు లును ద్వైతభావములతోడను పూజాపురస్కారముల తోడను ప్రారంభమై చివరకు అద్వైతభావములతో ముగియుచున్నవి!

నా గురుదేవుని జీవితమునుబట్టి విచారింపగా ద్వైతియు అద్వైతియు ఒకరితో నొకరు పోట్లాడ నవసరము లేదని నేను గ్రహించితిని. జాతీయజీవితమున ఇరువురకును స్థానము—గొప్ప స్థానమే—కలదు. ద్వైతి ఉండవలసిన వాడే! ఏలయన, ద్వైతియు అద్వైతివలెనే, జాతి యొక్క అధ్యాత్మజీవితమున ప్రాధాన్యమువహించియే యున్నాడు. ఒకడు రెండవ యతడు లేనిది బ్రతుకే జాలడు. ఒకడు రెండవ వాని ప్రయోజనమును సఫలము చేయును. ఒకడు దేవళమువంటివాడు, రెండవ యతడు దాని శిఖరము వంటి వాడు. ఒకడు వేరువంటివాడు, రెండవ యతడు పండువంటి వాడు. ఇట్లే పోల్చుకొనవచ్చును. కాబట్టి ఉపనిషత్తుల వాక్యములను విఱిచి, తికమకలు చేయబూనుట అసహ్య ముగ కాన్పించును. ఉపనిషత్తులభాష నాకు మహాద్భుత మైనదిగా కనిపించుచున్నది. గొప్ప తత్త్వశాస్త్రముగా దానికి గల యోగ్యతకంటెను, మానవజాతికి తరణో

వాయము చూపు భాగవతసిద్ధాంతముగా దానికిగల అద్భుత మహత్త్వముకంటెను, ఈ ఉపనిషద్భాషలోని గంభీరతా వర్ణనచిత్రణము ప్రపంచమం దసమానమై చిత్రాతిచిత్రమై యున్నది! మానవహృదయముయొక్క విశిష్టమహిమయు, సూక్ష్మదృష్టి, అంతరంగిక ప్రబోధముగల భారతీయుని బుద్ధి కుశలతయు, బహు విస్పష్టముగా ఇంకు ప్రకటితమగు చున్నవి! అన్యజాతి భాషలయందు గంభీరమగు చిత్రరచనలు ఇతర సందర్భములందు కనబడుచుండును. కాని ఒక్క మిసహాయింపును లేకుండ వాని అన్నిటియందును, భాహాబల మహత్త్వమును ప్రకటించుటయే పరమావధిగా గోచరించు చున్నది. ఉదాహరణకు మిల్టన్, డాంటీ, హోమర్, లేక యే ఇతర పాశ్చాత్యకవుల రచనల నైనను చూడుము. వాని యందును అద్భుతములగు గంభీరవాక్యము లున్నవి. కాని పంచేంద్రియములును, కండరబలమును, అఖండ వికాసమును పొందుటవలననే అఖండతత్త్వము పట్టుబడునను సిద్ధాంతము అందు సర్వత్ర గోచరించుచుండును. ఇట్టి భావము లే సంహిత లందును కొన్నిచోటుల కలవు. సృష్టి వివరణముల దెలుపు కొన్ని అత్యద్భుత ఋక్కులను మీలో కొంద రెఱిగి యుందురు. విస్తృతియందు సూక్ష్మతత్త్వమును, ఆకాశము నందు అఖండతత్త్వమును, వివరించుటలో మహోన్నత భాషా చిత్రణము అందు కూర్పబడినది. కాని ఆవిధముగా అఖండ బ్రహ్మమును తాము చేరలేమని వారు త్వరలోనే కను గొనిరి! అనంతాకాశమును, విశాలావకాశమును, అంతులేని బాహ్యప్రకృతియుగూడ, వారి హృదయములనుండి వ్యక్త

ముల్లె వెలువడుటకు 'తనుకులాడు'చున్న భావరాజములను తగురీతిని ప్రకటింపజాలవని వారు తెలిసికొనిరి. కాబట్టి ఇతర విధములగు సమాధానములకొఱకై తమ దృష్టిని మరల్చిరి. ఉపనిషత్తులందు వారిభాష . మార్పు చెందినది. ఆ భాష నిషేధరూపము తాల్చినది. ఒక్కొక్కప్పు డది చిందఱ వందఱగ నుండును; ఒక్కొక్కప్పుడు అది మిమ్ము ఇంద్రియ ములకు అతీతముగా తీసికొనిపోయిపోయి సగములో వదలి, అక్కడనుండి మీరు గ్రహింప నలవికాని స్పష్టాస్పష్టమగు ఏదోయొక తత్త్వమును చూపును. అదేదో ఉన్నట్లు మాత్రము మీకుభావము కలుగును. కాని అదియేదో స్పష్టముగా తెలియదు. ''న తత్ర సూర్యో భాతి న చంద్ర తారకం నేమా విద్యుతో భాన్తి కుతోఽయమగ్నిః'' అను వాక్యముతో సరిపోలు వాక్యము ప్రపంచమున నింకొకటి కలదా? అక్కడ ''సూర్యుడు ప్రకాశింపడు; చంద్రుడు ప్రకాశింపడు; నక్షత్రములు ప్రకాశింపవు; మెఱుపులును అక్కడ ప్రకాశింపవు. ఇంక అగ్నిమాట చెప్పవలసిన దేముండును?'' అని దీనిఅర్థము!

''ద్వా సుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే।
తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్య
నశ్నన్నన్యో అభిచాకశీతి॥
సమానే వృక్షే పురుషోనిమగ్నో ఽ
నీశయాశోచతి ముహ్యమానః।

జుష్టం యదా పశ్యత్యన్య మీశమస్య
మహిమానమితి వీతశోకః''

ఈ శ్లోకమునందుకంటె, ఎక్కువ మనోహరతరమగు భాషలోగాని, ప్రపంచమునగల పారమార్థికజ్ఞాన రాశిని, హిందువుల వేదాంతతత్త్వసారమును, మానవజాతియొక్క అఖండమోక్షోదర్శమును, రమ్యతరమగు అలంకార రూపమునగాని, విశదము చేయజాలు వాక్యములు మీకు కెందు లభింపగలవు? ఒకే చెట్టుమీద రెండు సుందరమగు పక్షులు కలవట. అవి ఒకదానికొకటి మిత్రములు. ఒకటి పండ్లను తినుచుండగా రెండవది ఏమియుతినక శాంతముగను నిశ్చలముగను కూర్చుండెను. అటుగు కొమ్మమీద నున్న పక్షి తియ్యనిపండ్లను చేదుపండ్లను తినుచు సుఖమును కష్టమును పొందుచుండ, రెండవపక్షి శాంతముగ, గంభీరముగ, చెట్టుకొనయందు కూర్చుండి యుండెనట! అది తియ్యని పండ్లనుగాని చేదుపండ్లనుగాని తినదు. సుఖమునుగాని దుఃఖమునుగాని అనుభవింపదు. తన స్వస్వరూప మహిమ యందు లీనమై యుండును! ఇది మానవుని ఆత్మయొక్క రూపపటము! నరుడు ఐహిక జీవితముయొక్క మధురఫలములను విషఫలములను తినుచున్నాడు; ద్రవ్యములకై పరుగులు వెట్టుచున్నాడు; ఇంద్రియములవెంటబడి గంతులు వేయుచున్నాడు; జీవితాడంబరముల వెంబడి ఉరుకుచున్నాడు. నిరాశోపహతుడై వెఱ్ఱిగా ఇట్లు జీవితము గడపుచున్నాడు! వేఱుస్థలములయందు ఉపనిషత్తులు నరుని

జీవాత్మను రథికునకును, ఇంద్రియములను మదించి పట్టవశము గాక పరుగులు వెట్టు గుఱ్ఱములకును పోల్చినవి. లౌకికాడంబరములవెంట పరుగులు వెట్టు నరునియొక్క జీవనగతి ఇట్లున్నది. సువర్ణ స్వప్నములను కాంచు చిన్నలు, అవి అన్నియు చివరకు బూటకములే యని కనుగొనుచున్నారు. పెద్దలు తమ పూర్వచర్యలనుగుఱించి పశ్చాత్తాపము పొందుచున్నారు. ఐనను ఈ వలలోనుండి తప్పించుకొని బయట పడుమార్గము కానబడుటలేదు. ప్రపంచమనగా ఇట్టిది! కాని ప్రతివాని జీవితమునందును ఉత్తమాశాజనకములగు క్షణములు కొన్ని వచ్చుచుండును. మహా ఘోరదుఃఖముల నడుమ—అంతేకాదు, మహా నందముల నడుమ సైతము—సూర్యుని ప్రకాశమును కప్పివేయు ఈ నల్లని మబ్బులు కొన్నేని తొలగిపోవునిమేషములు రాగలవు. అప్పుడు ఇంద్రియానుభవముల దాటి, చాల దూరమున ఎక్కడనో, అతీతముగానుండు తత్త్వమునొక్క ఒక్కతళుకు హఠాత్తుగా, అప్రయత్నముగా, మన కన్నులను మిరుమిట్లు గొలుపును. ఈ జీవితాడంబరములకు అతీతముగా, ఈ సుఖములకు ఈ కష్టములకు దూరముగా, ఈ ప్రకృతిని—అనగా ఇహపరములందలి మన ఆనంద భ్రాంతులను—దాటి, ఐశ్వర్యముకొఱకు పేరుకొఱకు ప్రతిష్ఠకొఱకు వంశాభివృద్ధి కొఱకు మనము పొందు ఆరాటమునకు చాలదవ్వగా, అది మెఱయును. దాని తళుకునుచూచి నరుడు ఒక నిమిష కాలము చకితుడై పోవును. శాంతముగను గంభీరముగను కూర్చుండి, తీపి పండ్లనుగాని చేదు పండ్లనుగాని తినక, ఆత్మ

తృప్తి కలిగి, ఆత్మానందముతో, స్వకీయ తేజమున ప్రకాశించు ఆ రెండవ పక్షిని చూచును.

"యస్త్వాత్మరతిరేవ స్యాదాత్మ తృప్తశ్చ మానవః।
ఆత్మన్యేవచ సంతుష్ట స్తస్య కార్యం నవిద్యతే॥"

అని గీతావచనము. "ఆత్మయందు అనురక్తుడై, ఆత్మను దప్ప మఱెద్దానిని కోరక, ఆత్మయందే సంతృప్తుడై యున్న వానికి తాను నిర్వహించుకొనవలసిన కార్య మేమియుండును?" కానిసవలె అతడేల పాటుపడవలయును? నరుడు తళుక్కు మను దాని జాడను చూచును; కాని మఱుల దానిని మఱచి పోవును. ఈ సంసారపు తియ్యని పండ్లను, చేదుపండ్లను అతడు తినుచునే యుండును. ఒకవేళ కొంతకాలమునకు, తళుక్కుమను వెలుగుజాడ ఇంకొకసారి కానరావచ్చును. ఇటుల క్రిందనున్నపక్షి దెబ్బలుతిని తిని, పైనున్నపక్షికి దగ్గఅదగ్గఅగా పోవుచుండును. గట్టి మొట్టికాయలను తిను నదృష్టము ఎంతబాగుగా పట్టిన అంతత్వరగా తన సహవాసియు ప్రాణమును మిత్రమును అగు రెండవపక్షి దాపునకు పోయి చేరును. దానిని సమీపించిన కొలది, దానితెక్కల కాంతులు దీనిని చుట్టుకొని, దీనితెక్కలుకూడ ప్రకాశించు చున్నటుల తోచును. ఈ పక్షి యింకను సమీపమునకు పోవునపుడు దానికొక విచిత్ర రూపాంతరము చేకూరును! అది దాపునకు చేరిన కొలది, తన స్వరూపము కరగి పోవు చున్నదా యన్నట్లు దానికి తోచుచుండును. తుదకది పూర్తిగా అదృశ్యమై పోవును. సత్యమున కీ పక్షి అసలు

లేనే లేదు. ఇటు నటు కదలియాడుచుండు ఆకుల మధ్య నిశ్చలముగను, గంభీరముగను కూర్చుండియున్న ఆ రెండవ పక్షి ప్రతిబింబమే యిది! అంతయు పైదాని ప్రకాశమే! పైనున్న పక్షియొక్క ప్రభలే! దానిని కలిసికొన్నంతనే వీని భయము అణగి పోవును; పూర్ణతృప్తి లభించును; నిశ్చలశాంతి దొరకును. ఇట్టి ఆలంకారిక భాషతో, ఉపనిషత్తులు మనలను ద్వైతభావమునుండి అద్వైతభావము నకు తోడ్కొని పోవుచున్నవి!

ఇట్టి ఉదాహరణలను అనంతముగా చూపవచ్చును. కాని ఈ ఉపన్యాసములో అటుల చేయుటకు వ్యవధిచాలదు. ఉపనిషత్తులలోని ఉదాత్త కవితావైభవమును, ఉత్కృష్ట భావ సంపదను, చూపుటకు ఇది యదనుకాదు. ఐనను ఇంకొక్క విషయమును మాత్రము తెలుపవలసి యున్నది. ఉపనిషత్తులలోని భాషయు, భావమును అతినిశితముగా, నిరా ఘాట వేగముతో సాగివచ్చును. కత్తి విసరినటుల మీద పడును; పెద్ద సమ్మెటపోటులవలె పైని పడును. వాని అర్థ మును గుఱించి పొరపడుటకు వీలులేదు. ఆ గానములోని స్వరములెల్ల స్పష్టమధురములై సంపూర్ణముగా రక్తికట్టును. తిరుగుళ్ళుండవు; పిచ్చి పిచ్చి ప్రసంగములు లేవు. పతనపు జాడలు అందు కాన్పింపవు. మితి మీరిన ఉపమాలంకార ములుగాని, విశేషణ పరంపరలుగాని, క్లిష్టాన్వయములుగాని అందులేవు. మొదలు తిరుగుళ్లుపడి, చెదరి అందులోనుండి బయటపడు మార్గముతోపక గిజగిజలాడవలసిన యవసరము లేదు. అటువంటిచిక్కు ఎంతమాత్రమును లేదు. అది మానవ

రచితమైన వాఙ్మయమే అగునెడల, జాతీయమేధాసంపద ఎంతమాత్రమును పొలివోవని ఒక మహాజాతి దానిని రచించి యుండునని చెప్పవలెను.

'బలము', 'బలము' అని ప్రతి పుటనుండియు ఉపనిషత్తులు నన్ను ఉద్బోధించుచున్నవి! మనము జ్ఞప్తినుంచుకొనవలసిన గొప్పవిషయములలో ఇది యొకటి. నా జన్మలో నేను నేర్చుకొనిన గొప్పగుణపాఠము ఇదిఒక్కటే. ''బలము, బలము!'' అని ఉపనిషత్తులు ఉద్బోధించుచున్నవి; ''ఓయి మానవుడా, దుర్బలుడవుగా నుండుటతగదు, తగదు!'' అని హెచ్చరించు చున్నవి. మానవునందు లోపములుండకుండునా? అని నరుడు శంకించుచున్నాడు. ''సరే యున్నవి; ఇంకను ఎక్కువ లోపములువచ్చి వానిని సవరించునా? ముతకితో ముతకిని కడిగివేయ ప్రయత్నింతువా?'' అని ఉపనిషత్తులు అడుగుచున్నవి. పాపమును పాపము హరించునా? దోషమును దోషము తొలగించునా? ''**బలమును**, ఓ మనుజుడా, **బలమునే** సంపాదింపుము! లేచి నిలబడుము. బలముగలిగి దృఢముగా నిలబడుము'' అని ఉపనిషత్తులు ఘోషించుచున్నవి. ఓహో! ప్రపంచవాఙ్మయములలోనెల్ల ఈ వాఙ్మయమునందు మాత్రమే 'అభీః' అనగా జంకులేకుండుట, అనుశబ్దము మఱల మఱల ప్రయోగింపబడినది! ప్రపంచములో మఱే మతగ్రంథమునందును దేవునకుగాని మానవునకుగాని ఈ 'అభీః' విశేషణము ప్రయోగింపబడి యుండలేదు. ''అభీః'' అను పదము వినగనే అలగ్జాండరనెడు గొప్ప పాశ్చాత్యచక్రవర్తి స్వరూపము

నాకిప్పుడు మనోగోచరమగుచున్నది. ఆ మహాచక్రవర్తి అడవియందు మన సన్న్యాసులలో ఒకనితో మాటలాడుచు సింధూనదియొడ్డున నిలిచియున్నట్టుల ఒక రూపపటము నాకండ్లకు మెదుట గోచరించు చున్నది. ఆతనితో మాట్లాడు చుండిన వృద్ధుడు దిగంబరియై, ఒక రాతి బండమీద కాబోలు కూర్చుండియున్నాడు! ఆ చక్రవర్తి భాగ్యగౌరవములపై ఆసలుగొలిపి, తన గ్రీసుదేశమునకు రమ్మని ఆయనను అడుగుచున్నాడు. ఆయన అఖండజ్ఞానమునకు ఆశ్చర్యపడి అట్లే నిలుచుండి యున్నాడు. ఈ సన్న్యాసి వాని ఐశ్వర్యమును చూచి నవ్వుచున్నాడు; అతడు పురిగొల్పుచున్న భ్రమలనుచూచి మందహాసము చేయుచున్నాడు; అన్నిటిని నిరాకరించుచున్నాడు! అప్పుడు రాజ్యాధికారమదాంధుడగు చక్రవర్తి 'నీవు నాతోడ రానియెడల నిన్ను చంపివేసెదను' అని భయపెట్టగా, ఆ పురుషశ్రేష్ఠుడు పకపక నవ్వి "నీ విప్పుడు పలికినంత అసత్యము నీ జన్మలో నెన్నడును పలికి యుండవు! నన్నెవరు చంపగలరు? జడమయ ప్రపంచమునకు నీవు చక్రవర్తివే; ఐననేమి? నీవా? నన్నా? చంపుటయా? ఎన్నడును పొసగదు! ఏలయందువా, నేను జననమరణములు లేని ఆత్మస్వరూపిని. నే నెన్నడును పుట్టియుండ లేదు; ఎన్నడును చచ్చువాడను కాను. నేను శాశ్వతుడను; సర్వవ్యాపిని; సర్వజ్ఞుడను; నీవా? నన్ను చంపుటయా? నీవు ఏమియు నెఱుగని పసివాని వలెనున్నావే!" అని పలుకుచున్నాడు. బలమనగా అట్టిది! నేను ఉపనిషత్తులను చదివిన కొలది, ఓ నా స్నేహితులారా,

నా దేశీయులారా! మిమ్ము చూచిన నాకు విచారము కలుగు చున్నది. ఆ చరణయోగ్యమగు మహాసాధన ఉపనిషత్తు లందు గోచరించుచున్నది. ఓహో! బలము! బలము మనకు కావలసియున్నది! బలము, బలమే మనకు కొఱవడియున్నది! మనకు బలమును ప్రసాదించువారేరి? దుర్బలురను చేయు వారు వేలకొలదిగ కాన్పించుచున్నారు. తలతోకలేని వెట్టి కథలు మనకు కావలసినన్ని యున్నవి. ఎక్కడ నున్నవని మీరు ప్రశ్నింతురేమో, మన పురాణములలో ప్రతి దాని యందును—ప్రపంచ గ్రంథాలయములలో ముప్పాతిక భాగము నింపగలిగినన్ని కథలు—గలవు. జాతిత్వేన మనలను దుర్బలురను చేసివేయు విషయములెన్నో గడచిన వేయి సంవత్సరములనుండి మనలను వెంటాడుచున్నవి. మన జాతీయ జీవితములో, ఈ వేయి సంవత్సరములుగా నానాటికి మనము దుర్బలురమై నిర్వీర్యులమై పోయితిమి. మనపై పాదమునిడ సాహసించు ప్రతివాని కాలిక్రిందను వానపాముల వలె గిలగిల తన్నుకొనుచు ప్రాకులాడు దుర్గతి మనకు పట్టినది. కావున సోదరులారా! మీ రక్తబాంధవులలో నొక్కడనగు నేను, మీతోడ జీవించి మీతోడ మరణింప నున్న నేను, "మనకు **బలము** కావలసియున్నది; సదా **బలమే** మనకు కావలసియున్నది" అని ఘోషించుచున్నాను. మన ఉపనిషత్తులు **బలమునకు** అపార నిధులై యున్నవి. ఈ ప్రపంచమంతటికిని ఉజ్జీవము నొసంగజాలునంతటి బలము వానియందున్నది. ఆ ఉపనిషత్తుల ద్వారమున లోక మంతయు సజీవము కాగల్గును; బలస్త్వములను పొంద

గల్గును. అన్ని జాతులందును, అన్ని మతములందును, అన్ని సంప్రదాయములందును గల దుర్బలురను, దుఃఖితులను, పీడితులను, శంఖధ్వనివంటి ముక్తకంఠముతో ఆహ్వానించి "మీ పాదములపై మీరు నిలువబడుడు; స్వతంత్రులై నడువుడు" అని ఉపనిషత్తులు హెచ్చరించుచున్నవి. స్వాతంత్ర్యము! శారీరక స్వాతంత్ర్యము, మానసిక స్వాతంత్ర్యము, ఆధ్యాత్మిక స్వాతంత్ర్యము అనునవియే ఉపనిషత్తులలోని ప్రధానసూత్రములు!

ప్రపంచమందలి ధర్మగ్రంథము లన్నిటిలోను ఇవి మాత్రమే మోక్షమును గుఱించిగాక స్వాతంత్ర్యమును గుఱించి ఉద్బోధించుచున్నవి. "ప్రకృతి బంధములనుండి స్వతంత్రులు కండు; దౌర్బల్యబంధములను త్రెంచివేయుడు!" అని హెచ్చరించుచున్నవి. అంతేకాదు; ఈ స్వాతంత్ర్యము ఇదివఱకే మీలో నున్నదనికూడ అవి మీకు తెలుపుచున్నవి. ఉపనిషత్తుల బోధలకు ఇది మఱొక విశిష్టమైన లక్షణము. నీవు ద్వైతివే అనుకొనుము. ఐననేమి? జీవాత్మ స్వాభావికముగనే పరిపూర్ణమైనదని నీవు అంగీకరింప వలయునుగదా! కాని ఆ జీవాత్మ కొన్ని కర్మలమూలమున 'సంకోచము' పొందియున్నది. (శ్రీ) రామానుజాచార్యుల వారి 'సంకోచవికాస' సిద్ధాంతమునే ఇప్పటి ఆధునిక శాస్త్రజ్ఞులు 'ఎవల్యూషన్' (Evolution) అనియు, 'ఆటవిజం' (Atavism) అనియు పేరొక్కనుచున్నారు. జీవాత్మ క్రిందికి పోయిపోయి సంకోచముపొందును, దాని శక్తులు అవ్యక్తములగును. సత్కర్మలమూలమునను సత్సంకల్పముల మూల

మునను అది తిరిగి వికాసముపొంది, తనకు స్వభావసిద్ధమగు పరిపూర్ణతను గాంచును. అద్వైతి అభిప్రాయము దీనికి కొంత భేదమైయున్నది. అతడు ప్రకృతిపరిణామమును అంగీకరించును కాని, ఆత్మపరిణామమును అంగీకరింపడు! ఒక తెర ఉన్నదనుకొనుడు. ఆ తెరలో ఒక చిన్న బెజ్జ మున్నది. ఆ తెర వెనుక నిలుచుండి నేనీ మహాసభవంక చూచుచున్నాను. ఇచ్చటనున్న ఏ కొలది ముఖములు మాత్రమో నాకు కనబడును. ఇప్పుడు ఆ బెజ్జము పెద్దదగు చున్నదనుకొనుడు. అది పెద్దదైనకొలది, అధికాధికముగ ఈ సభ నాకు సువ్యక్త మగుచు వచ్చును. ఇక ఆ బెజ్జము తెరంతటిదై దానితో ఏకీభవించునప్పుడు, నాకీ సభయం తయు పూర్ణముగ గోచరించును. అప్పుడు మీకును నాకును నడుమ అడ్డమేమియునుండదు. మీరు మారినది లేదు, నేను మారినది లేదు. మార్పంతయు ఈ తెరలోనే సంభవించినది. మొదటినుండి తుదివఱకు, మీరు ఏకరీతినే యున్నారు. తెరమాత్రము మారినది. పరిణామ సిద్ధాంతమును గుఱించి అద్వైతియొక్క భావము ఈ తీరుగ నున్నది. ప్రకృతి యందు పరిణామము జరుగుచున్నకొలది, లోనున్న ఆత్మ వ్యక్తమగుచుండును. అంతేగాని, ఆత్మ ఏతీరునైనను 'సంకోచము' పొందునని అద్వైతి ఒప్పుకొనడు. ఆత్మ నిర్వికారము, అఖండము. అది మాయ అనెడు ముసుగుచేత కప్పబడిన దనవచ్చును. ఈ మాయ అనెడు ముసుగు పలుచనైన కొలదిని, ఆత్మయొక్క స్వభావసిద్ధమైన సహజ తేజస్సు వెలువడి సువ్యక్తమగుచుండును. ఈ మహాసిద్ధాం

తము నొక్కడానిని భారతదేశమునుండి నేర్చుకొనుటకు లోకము వేయికన్నులతో ఎదురు చూచుచున్నది. ఏమేమి మాటలాడినను, ఎంతగా డంబములు పల్కినను, ఈ సిద్ధాంతమును ఒప్పుకొనక ఏ సంఘమును నిలువజాలదని కాలము జరుగుకొలది వారు తెలిసికొందురు. సమస్తమును ఋణ ఋణము పరివర్తించుచున్నది. మీ కీ పరివర్తన కాన్పించుటలేదా? ప్రతివిషయమును, మంచిదని రుజువగు వఱకును దానిని చెడ్డదిగనే భావించుట ఎట్లాచారముగ వచ్చుచున్నదో మీరు చూచుటలేదా? విద్యావిషయమునను, దోషుల దండించు విషయమునను, వెఱ్ఱివారికి చికిత్సచేయు విషయమునను, సామాన్య రోగములకు మందులిచ్చు విషయమున సైతము, ఇది ఒకటే తాతలనాటి పద్ధతి! ఇక నవీన పద్ధతి ఎట్లున్నది? ''శరీరము స్వభావముచేత ఆరోగ్యవంతమైనదే; అది తన స్వశక్తిచేతనే తన రోగములను మాన్పుకొన గలదు'' అని నూతన సిద్ధాంతము చెప్పుచున్నది. మందు చేయగల దంతయు శరీరమునందు గల అనుకూల పదార్థము నెల్ల ప్రోగు చేసి పెట్టగలదు, అంతయే అని చెప్పును. అది నేరగాండ్రను గుఱించి ఏమి చెప్పునో తెలియునా? ఒక నేరగాడు ఎంత పతితుడైనను, వానియందు దైవాంశ కలదు. ఆదైవాంశ మారునది కాదు. ఈ సిద్ధాంతమును ననుసరించి నేరగాండ్రకు శిక్షణ గఱపవలసియున్నది. ఈ మార్పులన్నియు ఇప్పుడు వచ్చుచునేయున్నవి. సంస్కరణ శాలలు, పశ్చాత్తాప భవనములు ఏర్పాటగుచున్నవి. ఇటులనే ప్రతివిషయమునను పరివర్తన జరుగుచున్నది. ప్రతి

వానియందును దైవాంశకలదనెడు భారతీయుల సిద్ధాంతము—తెలిసినను తెలియకున్నను—ఇతరదేశములందు సైతము మెలమెల్లగా తలసూపుచున్నది. దీనికి వివరణము మన గ్రంథములందుమాత్రమే కలదు. దానినే ఇతరజాతుల వారును అంగీకరింపవలసివచ్చుచున్నది. ఒకడు తనతోడి వానితో ఎట్లు ప్రవర్తింపవలెనను విషయమున అభిప్రాయ పరిణామములు కలుగుచున్నవి. మానవజాతియొక్క దుర్బలతనే చాటుచుండు తాతలనాటి ప్రాతభావములెల్ల తొలగిపోవలసి యున్నవి. ఈ శతాబ్దములోనే అవి వినాశమై పోగలవు. ఇప్పుడు ప్రజలు చెలరేగి మనలను ఆక్షేపింప వచ్చును. పాపమే లేదు అను రాక్షస తత్త్వమును బోధించుచున్నానని, ప్రపంచములో ఈ కొననుండి ఆ కొనవఱకు, నన్నాక్షేపించుచున్నారు. నేను పాపబోధచేయక పుణ్యబోధచేసితినని ఈ ప్రజల సంతానమే, నన్నుగుఱించి ధన్యవాదములుచేయు కాలము వచ్చును. నేను పుణ్యబోధచేయుదునుగాని పాపబోధచేయువాడను గాను. చీకటినిగాక లోకమునకు నేను వెలుగునే ప్రకటించుచున్నానని సగర్వముగా చెప్పుకొనుచున్నాను.

ఉపనిషత్తులనుండి ప్రపంచము గ్రహింపవలసిన రెండవ గొప్పసిద్ధాంతము ఈ 'విశ్వమంతయు ఏక'మనునది! హద్దులను, భేదములను చూపుచుండిన పూర్వకాలపు భావములన్నియు వేవేగముగా అంతరించిపోవుచున్నవి. విద్యుచ్ఛక్తియు, ఆవిరియంత్రములును, ప్రపంచపు నలుమూలలకు రాకపోకలద్వారా పరస్పర పరిచయము కూర్చి

నవి. ఇకమీదట మనము మన దేశమునకు ఆవలనున్న ప్రదేశములన్నియు రాక్షసులతో, దయ్యములతో, నిండి యుండునని కాకమ్మకబుర్లు చెప్పుకొనుటకు వీలులేదు. క్రైస్తవదేశ ప్రజలైనను 'భారతదేశములో అడవి జాతి వారును, మనుష్యులను చంపుకొని తిను ప్రజలును, నివసించు చుందు'రని ఇపుడు చెప్పుటకు వీలులేదు. మనము పర దేశములకేగినను అచ్చటకూడ, మనకు చేతినందించి ఆదుకొనువారు, సాయపడి ప్రోత్సహించి ఆశీర్వదించు వారు, వేలకొలది సోదరమానవోత్తములు కలరు. మన జన్మభూమియం దున్నవారికంటె. కొన్ని సందర్భములలో వారే యోగ్యతరులుగా కాన్పింతురు. వారు ఇక్కడికి వచ్చినప్పుడును అదేతీరున సోదరభావమును ప్రోత్సాహ మును దీవనలను మనమును ఇచ్చుచున్నాము. దుఃఖ మున కంతకును అజ్ఞానమే మూల మని మన ఉపనిషత్తులు బోధించుచున్నవి. సాంఘికమైనను, ఆధ్యాత్మికమైనను, ప్రతిజీవనదశయందును ఆ విషయము పూర్ణముగ సత్యమే యని ఉపనిషత్తులు తెల్పుచున్నవి. మనలో ఒకరిమీద నొకరికి ద్వేషము కలుగునట్లు చేయునది అజ్ఞానము. ఈ అజ్ఞానమువలననే మనము ఒకరినొకరము తెలిసికొనలేక, ఒకరినొకరము ప్రేమించుకొనలేక, దూరమైపోవుచున్నాము. మనము ఒకరినొకరము తెలిసికొనినతోడనే ప్రేమ పుట్టును. ప్రేమ పుట్టితీరవలయును. ఏలయన, మన మందఱమును నిజమునకు ఒక్కటియే కదా! ఈ విధముగా మనకు ఇష్టము లేకున్నను ఏకీభావము అమరుచున్నది. రాజకీయ సాంఘి

కాది విషయములయందు, ఇరువది సంవత్సరముల క్రిందట ప్రత్యేక జాతీయములుగా నుండిన సమస్యలు, ఇకమీదట అట్లు ప్రత్యేకజాతీయభావములనే ఆధారము చేసికొని పరిష్కారము కాజాలవు. అవి మిక్కుటముగ పెరిగిపోయి బ్రహ్మాండము నిండుచున్నవి. అవి ఇకమీదట నానాజాతి సంబంధమగు విశాలదృష్టితో పరిష్కారము కావలసి యుండును. "నానాజాతి వ్యవస్థలు, నానాజాతి సమ్మేళన ములు, నానాజాతి శాసనములు" అనుఘోష నేడు ఎల్లెడల వినవచ్చుచున్నది. ఇదంతయు ఏకత్వమును ప్రకటించునదే! ఇట్లే ప్రకృతిశాస్త్రమునందు భౌతికద్రవ్యరాశినిగూర్చిన విశాలతరభావములను అంగీకరించుచున్నారు. ద్రవ్యరాశిని గురించి యోచించునప్పుడు, ఈ జగమంతటిని ఒకేరాశిగను, ఒకే ద్రవ్యమహాసముద్రముగను భావనచేసినచో, అందులో మీరును నేనును సూర్యుడును చంద్రుడును సమస్తమును, వేఱువేఱు చిన్ని సుడులో, బుడగలో అని తేలును. మనఃపరముగా మాటలాడుకొనినను, ఇదంతయు సంకల్పమయ మగు ఒక్క భానమహాసముద్రముగా నున్నది. దీనియందు నీవు, నేను, అదేరీతిగా చిన్నసుడులుగ నున్నాము. ఆత్మ పరము చూచితిమా, అది కదలదు; మాఱదు. అదంతయు నిర్వికారమును అఖండమును నిరవయవమును నగు ఒకే ఆత్మ! నీతిధర్మావశ్యకతనుగూర్చియు మన గ్రంథములయందే కాననగును. నీతిధర్మముల వివరణమును, నీతిసూత్రముల ఆధారమునుకూడ, ప్రపంచము తెలియ గోరుచున్నది. అదియు ఇచటనే లభింప గలదు. భారతదేశమున మనకు

కావలసినదేమి? ఈ విషయములు విదేశీయులకు కావలసి యున్నచో, మనకు అవి ఇరువదిరెట్లు ఎక్కువగా ఆవశ్యకము! ఎందువలననో తెలియునా, ఉపనిషత్తులు ఎంత గొప్పవైనను, మన పూర్వ ఋషులను గుఱించి మనమెంతగా దంభములు కొట్టుకొనుచున్నను, ఇతర జాతులతో పోల్చిచూచినప్పుడు మనము దుర్బలురమై, నిర్వీర్యులమై, జీవచ్ఛవములవలె ఉన్నామని చెప్పక తప్పదు! మన శారీరక దౌర్బల్యమే మన దుఃఖములలో కనీసము మూడింట నొకభాగమునకు కారణ మగుచున్నది. పైగా మనము సోమరులము. మనము పని చేయజాలము; కలిసికట్టుగా ఒక సంఘముగా కూడ నుండజాలము. ఒకరినొకరు ప్రేమించుకొనుటలేదు. మిక్కిలి స్వార్థపరులమై పోయితిమి. ఒకరి నొకరు ద్వేషించు కొనకుండ, ఒకరిని గుఱించి యొకరు అసూయ చెందకుండ, ముగ్గురమేని కలిసి జీవింపజాలము. మన స్థితి ఇంత అధ్వాన ముగా నున్నది. గాలిలో చెల్లాచెదరైపోయిన దూది పింజల వలె నున్నవి మనబ్రదుకులు! దీనికితోడు కరుడుకట్టిన స్వార్థపరత! మన ముఖముమీద బొట్టును ఈ తీరున బెట్టు కొనవలయునా, ఆ తీరున బెట్టుకొనవలయునా, అనుచు శతాబ్దముల కొలది ఒకరితో నొకరము కొట్లాడుకొను చున్నాము. ఒక నరుని దృష్టి నా అన్నమును మైల పఱచునా లేదా, అను నిట్టి మహా సమస్యలను గుఱించి సంపుటముల మీద సంపుటములుగా గ్రంథములను వ్రాయుచున్నాము. కొలది శతాబ్దముల నుండి మనము చేయుచున్న పని ఇదియే! ఇంతచక్కని సమస్యల తోడను, పరిశోధనల తోడను,

మెదడుయొక్క బలము నంతను వినియోగము చేయుచున్న జాతి ఇంక ఏ ఘనకార్యము చేయగలదని మనము విశ్వసింప గలము? పోనీ యిప్పుడైనను మనలను గూర్చి మనము సిగ్గు పడుట లేదే! అవును, కొన్ని సమయములయందు సిగ్గుపడు చునే యున్నాము! కాని ఆ విషయములు తుచ్ఛము లని తెలిసియు, మనము వానిని వదలివేయజాలకున్నాము. మనము అనేక విషయములను గూర్చి చిలుకపలుకులు పలుకుచుందుము. కాని వానిని ఆచరణలో పెట్టము! ప్రలాపములుచేయుటయు, పని చేయకుండుటయు మనకు అభ్యాసమై పోయినది! దీనికి కారణము ఏమి? శారీరక దుర్బలతయే! దుర్బలమగు మెదడునకు ఏమి చేయుటకును శక్తి యుండదు. మనము దానిని బలిష్ఠముచేయవలెను. మొదట, మన యువకులు బలిష్ఠులుకావలెను. మతనిష్ఠ ఆ పిమ్మట తనంతటతానే వచ్చును. ముఖ్యముగా నాయువ సోద రులకు నేనుచేయు విజ్ఞప్తియిది: ముందుబలిష్ఠులుకండు. భగవ ద్గీతాపారాయణము కన్న 'ఫుట్‌బాల్' ఆటయే మిమ్ము శీఘ్ర ముగా మోక్షమార్గమున గొనిపోవును. ఇయ్యవి మహాసాహస వచనములు! అయినను నేను వానిని చెప్పవలసియున్నది. ఏలయన, నాకు మీ యందు గాఢాభిమానము కలదు. నా చెప్పు ఎక్కడ కఱచుచున్నదో, నాకు తెలియును. నేను కొంచెము అనుభవము సంపాదించినాను. మీ జబ్బలు, మీ కండరములు ఇంక కొంచెము బలపడినపుడు, మీ రింకను బాగుగ గీతను అర్థముచేసికొనగలుగుదురు. మీ లోపల ఇంక కొంచెము బలముగల రక్తము ప్రవహించుచో,

శ్రీకృష్ణుని మహాబలమును, ప్రతిభావిశేషమును చక్కగా అర్థముచేసికొనగలుగుదురు. మీ పాదములమీద మీ శరీరము దృఢముగా, సుస్థిరముగా నిలువజాలినపుడు, మీరు నిజమగు పురుషులమని భావింపగల్గినపుడు, ఉపనిషత్తులను, ఆత్మమహిమను సమగ్రముగా గ్రహింపజాలుదురు! ఈ విధముగా మనయొక్క అక్కఱలకొఱకై వీనిని ఉపయోగించుకొనవలయును.

నేను అద్వైతమతమును బోధించుటచూచి, అనేక పర్యాయములు ప్రజలు విసుగుజెందుచుందురు. అద్వైత మతమునో, ద్వైతమతమునో, లేక ప్రపంచములోని యే ఒక్కమతమునో బోధించుట నా అభిప్రాయమే కాదు. మనకు ఇప్పుడు కావలసియున్న ఏకైకమతము, అద్భుతమగు ఆత్మభావనయే! ఆత్మయొక్క అఖండశక్తిని, దాని అఖండ దార్ఢ్యమును, దాని అఖండ పవిత్రతను, దాని శాశ్వత పరిపూర్ణతను మనము అనుభూతమొనర్చుకోవలెను. నా కొక బిడ్డ యున్నయెడల, అది పుట్టినది మొదలు, 'నీవు శుద్ధబ్రహ్మమవు' అని నూరిపోసెదను. పురాణములలో నొకదానియందు రాణి మదాలసను గుఱించిన చక్కని కథను మీరు చదివియుందురు. తనకు శిశువు పుట్టినతోడనే, ఆమె స్వయముగా తనచేతులతో ఆ శిశువును తొట్టెలలో నుంచి, ఆ తొట్టెలను ఊపుచు, "నీవు శుద్ధబ్రహ్మమవు! నిష్కళంకుడవు! పాపరహితుడవు! మహాత్ముడవు! మహా పురుషుడవు!" అని జోలపాడెడిదట. ఓహో! అందులో అద్భుతమాహాత్మ్యమున్నది! మీరు మహాపురుషులమని

త్రుటికాలము భావనచేయుడు! వెంటనే మీరును మహా పురుషులగుదురు. ఈ ప్రపంచమంతయు తిరిగి తిరిగి నేను కొంత అనుభవమును సంపాదించితిని; ఆంగ్లేయులు ఎల్లప్పుడు పాపులనుగూర్చి పలుకుచుందురు. వారందఱును, తాము పాపులమనియే నిజముగ విశ్వసించునెడల ఈ ఆంగ్ల ప్రజలు మధ్యఆఫ్రికాలోని నీగ్రోల దుఃస్థితికి దిగుదురు. భగవదనుగ్రహమున వారటుల విశ్వసించుటలేదు! పైగా, ఆంగ్లేయుడు తాను లోకమునకు ప్రభువై పుట్టితినని విశ్వసించుచున్నాడు! తాను గొప్పవాడననియు, ప్రపంచములో తా నేమైనను చేయగలననియు అతని విశ్వాసము! తాను అనుకొన్నచో చంద్రునికడకుగాని, సూర్యునికడకుగాని పోగలడనియే అతని నమ్మకము! అదియే వానిని అంత గొప్పవానిగ చేయుచున్నది. తాను దీనుడగు మహాపాపియనియు, శాశ్వతనరకమున వేదనపాలు కావలసినవాడనియు బోధించు మతగురువులనే నమ్మినయెడల, అత డీనాడు ఇంతటి వాడు కాకయే పోయెడివాడు! ఈ విధముగ ప్రతి జాతి యందును మతాచార్యులును, మూఢవిశ్వాసములును, అడుగడుగున అడ్డుపడుచున్నను. ఆంతరమగు దైవాంశ సజీవమై నిలిచి, స్వయముగా వ్యక్తమగుచుండుట నాకు గోచరించుచున్నది. మనము 'శ్రద్ధ'ను పూర్తిగా కోలుపోయినాము. ఆంగ్లేయులకు గల శ్రద్ధలో సహస్రాంశముకూడ మనకు లేదు. నేను ఉన్నది ఉన్నట్లు నిష్కపటముగా చెప్పుచున్నాను. వీనిని చెప్పకతప్పని పరిస్థితి యేర్పడుటచేత చెప్పుచున్నాను. ఆంగ్లేయులకు మన ఆదర్శములు నచ్చి,

వానియందు గాఢవిశ్వాసము కుదిరెనా, ఇక ఉన్మత్తులవలె తదేకదీక్షతో, తమ దేశస్థులు అపహాస్యము చేయుచు గేలి కొట్టుచున్నను లక్ష్యముచేయక, తాము ప్రభుజాతికి చెందిన వారమనినవిషయమునే మఱచి, భారతదేశమునకు వచ్చి, మన మతాదర్శములను మనకే ఎటుల బోధించుచున్నారో మీరు చూచుటలేదా? మీలో నెంతమంది ఆవిధముగ చేయగలరో తెలుపుడు? మీరు ఆతీరుగ ఎందుకు చేయ లేరు? ఆవిషయములు మీకు తెలియనివా? వారికన్న మీకే ఎక్కువ తెలియునే! మీకు తెలివి మితిమీరి, 'అతి తెలివి'గా మాటినది. వచ్చిన చిక్కంతయు అక్కడనే యున్నది! మీరక్తము నీరై పోయినది; మీ మెదడు చవుడు పట్టియున్నది; మీ శరీరమున సత్తువ సున్న! మీరిక శరీర ములు మార్చుకొనవలయును. అన్నిటికిని శారీరకదుర్బల తయే కారణము; మతేమియు కాదు. నూఱు సంవత్సర ములనుండి సంస్కరణములు, ఆదర్శములు మున్నగు విషయ ముల నెన్నింటిని గుఱించియో మీరు ప్రసంగములు చేయుచునే యున్నారు. ఆచరణకు దిగవలసి వచ్చినప్పుడు మాత్రము మీరెక్కడను కాన్పింపరు! ప్రపంచమంతయు ఈకబుర్లతో విసువుచెంది పోయినది. సంస్కరణ మను పేరే అపహాస్యము పాలైనది. దీనికి హేతువేమి? మీకు తెలియదా? అబ్బో! మీకు బాగుగనే తెలియును. కారణ మంతయు మీ దౌర్బల్యమే! ముమ్మాటికిని మీ దౌర్బల్యమే! మీ శరీరము దుర్బలమైనది; మీ బుద్ధి దుర్బలమైనది; మీయందు మీకు విశ్వాసములేదు. శతాబ్దములకు శతాబ్ద

ములుగ, పీల్చి పిప్పిచేయు కులద్వేషముల పీడయు, రాజుల హింసయు, విదేశీయుల నిర్బంధములును, మీ స్వజనులను మీరు పెట్టు ఇక్కట్టులును, నా యన్నలారా! మీ బలము నంతను బలిగొన్నవి. మీ వెన్నెముక విరిగిపోయినది; మీరు కాలిక్రింద నలిపివేయబడు పురుగులై పోయినారు. మీకు బలమును ప్రసాదించునది ఎవరు? మనకు కావలసినది బలము—బలమే యని మీకు నేను స్పష్టముగ చెప్పుచున్నాను. అట్టి బలమును సంపాదించుకొనుటకు, మొట్ట మొదటి సాధనము ఉపనిషత్తులను సత్యములని గౌరవించి 'నేను ఆత్మను' అని విశ్వసించుటయే! "నన్ను ఖడ్గములు ఛేదింపజాలవు. తుపాకిగుండ్లు నాలో గ్రుచ్చుకోజాలవు. నన్ను అగ్ని దహింపజాలదు. గాలి శోషింపజాలదు. నేను సర్వశక్తి మంతుడను. నేను సర్వజ్ఞుడను" అను ధన్యవాక్కులను ఉచ్చరింపుడు! 'మేము దుర్బలురము' అని ఎన్నడును పలుకబోకుడు. మనము సర్వమును చేయజాలుదుము! మనము చేయజాలనిది ఏమున్నది? మనము సమస్తము చేయజాలుదుము. మనలో అందఱియందును ఆ దివ్యాత్మ కలదు. దానియందు మనము విశ్వాసము పూనుదుముగాక! నచికేతునివలె 'శ్రద్ధ' వహింపుము. నచికేతునకు, వాని తండ్రి యాగముచేయు సమయమున, 'శ్రద్ధ'ఉదయించినదట. అటులనే మీలో ప్రతివానికిని 'శ్రద్ధ' కలుగుగాక యని నేను కోరుచున్నాను. మీలో ప్రతివాడును మహావీరుడై నిలుచుగాక! అద్భుత ధీశక్తి గలిగి, అఖండ దివ్యాంశతో, లోకమును వ్రేలిపై త్రిప్పగలిగియుండునుగాక! నేను కోరునది మీరు

అట్టివారు కావలయుననియే. ఉపనిషత్తులవలన మీరు పడయగల బలము అటువంటిది! అందుండి మీకు లభింపగల 'శ్రద్ధ' అటువంటిది!

ఓహో! ఆ ఉపనిషత్తులు సన్న్యాసుల సొత్తట! రహస్యమైనవట! అవి సన్న్యాసి చేతులలో బడినవి; అతడు వానిని అడవులకు తీసికొనిపోయినాడు. శంకరాచార్యులు కొంచెము దయబూని, గృహస్థులుసైతము ఉపనిషత్తులు పఠింపవచ్చుననియు, అవి వారికి మేలు చేయునని యు, అందువలన వారికి అపాయము లేదనియు తెలిపినాడు. ఐనను, ఏకాంతవాసియై అడవులలోనుండువానిని గూర్చి మాత్రమే ఉపనిషత్తులు పలుకునను అభిప్రాయము ఒకటి కలదు. నేను మొన్న మీకు తెలిపినటుల, వేదములను గుఱించిన ప్రామాణికమగు వ్యాఖ్యానము—ఏకైక వ్యాఖ్యానము—ఆ వేదములను ప్రసాదించిన దివ్యపురుషుని వలననే— ఆ శ్రీకృష్ణభగవానుని వలననే—గీతయందు ప్రకటింపబడియున్నది. ఏ జీవనవృత్తియందున్నను ప్రతివానికి ఉపకరించు విధమున ఆ వ్యాఖ్యానము కలదు. వేదాంతభావములు విశ్వమంతటను ప్రచారముగాంచవలెను. అవి అడవులలోనే పడియుండరాదు. అడవులనుండి, గుహలనుండి, వెలువడివచ్చి న్యాయాధిపతికిని, న్యాయవాదికిని, గురువులకును, ఛాత్రులకును, సంపన్నునకును, దరిద్రునకును, చివరకు చేపలుపట్టు బెస్తవానికి సైతము అందుపాటులోనికి వచ్చి ఉపకరింపవలయును! ఉపనిషత్తుల ప్రబోధము ప్రతి పురుషునికి, స్త్రీకి, బిడ్డకు, వారెట్టి వృత్తిగలవారైనను.

వారెచ్చటి వారైనను, అందఱికును వర్తించును. భయపడుట కేమున్నది? ఉపనిషత్తుల ఆదర్శములను ఎల్లరు—బైస్త వాండ్రు సైతము—ఎటుల అనుసరింప వీలగునో ఆ మార్గము తెలుపబడియే యున్నది! ఆ మార్గము అనంతము. మతము అనంతము. ఎవరును దానిని దాటి పోజాలరు. నీవు నిష్కపటచిత్తముతో ఏమి చేసినను నీ కది మేలే. అత్యల్ప కార్యమైనను సవ్యముగ చేసినచో మహాద్భుత ఫలము నొసగును. కాబట్టి ప్రతివాడును, తానుచేయగల స్వల్ప కార్యమునైనను, శ్రద్ధతో నిర్వహించును గాక. బైస్తవాడు సైతము తాను ఆత్మస్వరూపి నని భావించు నెడల, తన బైస్తవ్వత్తియందు ఉత్తముడగును. విద్యార్థి తాను ఆత్మ రూపినని తలంచునెడల, శ్రేష్ఠతరుడగు విద్యార్థియగును. న్యాయవాది తాను ఆత్మయే అని భావనచేయు నెడల, శ్రేష్ఠతరుడగు న్యాయవాది యగును. ఇటులనే ఇతరులును కూడ. దీని ఫలితార్థముగా కులములు శాశ్వతముగ నిలిచి యుండును—వర్గములుగ నేర్పడుట సంఘస్వభావములోనే కలదు. అందుగల ప్రత్యేకాధికారములు మాత్రమే పోవలసి నవి. కుల మనునది సహజమగు వ్యవస్థ. సాంఘికజీవిత ములో నే నొక ధర్మమును నిర్వహింపగలను; నీవు మఱొక ధర్మమును నిర్వహింపగలవు: నీవు దేశమును పరిపాలింప గలవు; నేను పాతచెప్పులజోడును బాగుచేయగలను. అంతమాత్రముచేత నీవు నాకంటె గొప్పవాడవనుటకు కారణములేదు. ఏలన నీవు నావలె చెప్పులను మరమ్మతు చేయగలవా? నేను దేశమును ఏల గలనా? నేను చెప్పులను

బాగుచేయుటలో నేర్పరిని; నీవు వేదములు చదువుటలో నేర్పరివి. కాని అంతమాత్రముచేత నీవు నా నెత్తిమీద నెక్కి త్రొక్కుటకు కారణములేదే! ఒకడు నరహత్య చేసినచో వానిని స్తోత్రముచేయుటయు, మఱియొకడు ఒక రోగుపండును దొంగిలించినమాత్రాన వానిని ఉరిదీయుటయు ఏల! ఇట్టిది అంతరింపవలయును. కులవిభజన మంచిదే. జీవనసమస్యను పరిష్కారము చేయుటకు ఇదియొక్కటియే సహజమైన మార్గము! మానవులు సంఘములుగ నేర్పడ వలసినదే; దానిని మీరు మాన్పజాలరు. మీ రెచ్చటికి పోయినను, అచ్చట కులము ఉండియేతీరును. కాని అట్లమట చేత ఈ న్యూనాధిక్యతలు, ఈ ప్రత్యేకాధికారములు, ఉండ వలయునని అర్థముకాదు. వానిని తప్పక నిర్మూలింప వలయును. మీరు చేపలుపట్టు బెస్తవానికి వేదాంతము నేర్పినయెడల, అతడు ఇట్లనును: "నేను నీవలెనే మానవు డను. నీవు తత్త్వజ్ఞుడవు; నేను చేపలు పట్టువాడను. ఐన నేమి? నీలోనున్న ఆ బ్రహ్మమే నాలోనుగలడు." మనకు కావలసినది ఇదియే. ప్రత్యేకాధికారములు ఎవరికిని ఉండ రాదు; అందఱికిని సమానావకాశములే! ప్రతివానికిని, తన యందు భగవంతుడు గలడని బోధింపుడు. అప్పుడు ప్రతి వాడును తన ముక్తికై తానే పాటుపడును.

స్వాతంత్ర్యమే అభివృద్ధికి ముఖ్యమగు మూలము. 'ఈ స్త్రీకిగాని, ఈ బిడ్డకుగాని, నేను ముక్తిని సాధించి పెట్టెదను' అని ఎవడేని చెప్ప సాహసించినయెడల అది అప చారము—ఘోరాచారము! వితంతుసమస్యనుగుఱించి నా

అభిప్రాయ మేమనియు, స్త్రీసమస్యనుగుఱించి నా అభిప్రాయ మే మనియు, నన్ను అనేకపర్యాయములు అడుగుచుందురు. ఇందుకు ఒకేసారిగ ప్రత్యుత్తర మిచ్చివేసెదను : "ఆ పిచ్చి మాటలు నన్ను అడుగుటకు నేను వితంతువునా? నన్నా ప్రశ్న పదేపదే అడుగుటకు నేను ఆడుదాననా? ఆడువాండ్ర సమస్యలను పరిష్కరించుటకు నీ వెవడవు? ప్రతి వితంతువును, ప్రతిస్త్రీని, నీ అధికారములోనికి తెచ్చుకొని పరిపాలించు టకు నీవు దిగివచ్చిన దేవుడవా? దూరముగ నిలువుము. వారు తమ సమస్యలను తామే పరిష్కరించుకొందురు. లోక కంటకులారా! మీ రొకరి కొకసాహాయ్యము చేసిపెట్టగలమని తలప సాహసింతురా? చాలును, ఊరకుండుడు. భగవంతుడే సమస్తమును చూచుకొనును. నీకు సర్వము తెలియునని అహంకరించుటకు నీ వెవడవు? ఓ దైవదూషకులారా! భగ వంతునిపైనను మీకు అధికారము గలదని భావించుటకు మీ రెటుల సాహసించుచున్నారు? ప్రతిజీవాత్మయు పరమా త్మయే యని మీకు తెలియదా? మీ కర్మవిషయము మీరు చూచుకొనుడు! మీరు అనుభవింపవలసిన కర్మభారము మీ కున్నది! మీ జాతివారు మిమ్మొక గద్దెనెక్కింపవచ్చును. మీసంఘము మీచర్యలకు ఆమోదసూచకముగా తమ కరతాళధ్వనులు మిన్నందింపవచ్చును. బుద్ధిహీనులు మిమ్ము గూర్చి స్తోత్రపాఠములు చేయవచ్చును. కాని ఆ సమవర్తి నిదురపోవువాడుకాడు. మీకుతగిన దండన ఇక్కడనో, అక్కడనో మిమ్ము వెంటాడివచ్చుట తథ్యము!

ప్రతి స్త్రీని, ప్రతి పురుషుని, ప్రతివారిని బ్రహ్మముగ చూడుడు! మీరుచేయగలది సేవయే; సాహాయ్యముకాదు. భగవంతుని బిడ్డలకు సేవచేయుడు. ఆ భాగ్యము కలిగెనేని భగవంతునికే సేవచేయుడు. తన బిడ్డలలో ఎవనికేని నీవు తోడ్పడు అదృష్టమును పరమేశ్వరుడు నీకు ప్రసాదించినచో నీవు ధన్యుడవే! నిన్నుగుఱించి నీవు అతిశయముగ తలంచుకొనకుము. ఇతరులకు లభింపని ఆ అదృష్టము నీకు లభించుట వలన నీవు ధన్యుడవు. అర్చనరూపముగ నీ వా సేవాకార్యమును నిర్వహింపుము. దరిద్రులందు మనము భగవంతుని ప్రత్యక్షము చేసికొనవలయును. మనము పోయి వారిని పూజించుట మన ముక్తికొఱకే! వ్యాధితుని రూపమున, పిచ్చివాని రూపమున, కుష్ఠరోగిరూపమున, పాపాత్మునిరూపమున కానబడుచున్న భగవంతుని మనము సేవించుకొఱకే దరిద్రులును, దుఃఖితులును ఉద్దేశింపబడియున్నారు! ఈసాహాయ్యోక్తులను—ఈ స్వరూపములన్నింటను భగవంతుని సేవించునవకాశము మనకు లభించుట మహాప్రసాదము, పురాకృతసుకృతప్రాప్తము అనుమాటలను—నేనుమఱల చెప్పుదును. ఇతరులను పాలించుటవలన నీవు వారికి ఏ మాత్రముగానేని మేలు చేయగలుగుదువను అభిప్రాయము విడిచిపెట్టుము. మొక్క— విషయములో నీ వెంతచేయగలవో అంతమాత్రమే ఇచ్చటకూడ చేయగలవు. వికాశమొందుచున్న విత్తనము యొక్క— శరీరనిర్మాణమునకు అవసరములగు మృత్తికను, జలమును, వాయువును, సమకూర్చుట మాత్రమే నీవు చేయగలవని. తనకు కావలసినదాని నంతను అది తన

సహజశక్తిచేతనే తీసికొని, జీర్ణముచేసికొని, తన సహజశక్తి చేతనే పెరుగును.

ప్రపంచములోనికి తేజోరాశిని తీసికొని రండు! తేజస్సు! తేజస్సు! తేజస్సు ప్రతివానికిని లభించునట్లొనర్పుడు! ప్రతివాడును బ్రహ్మమును చేరువఱకు ఈ కర్తవ్యము ముగియదు. వేదవారి కీ తేజస్సును చేకూర్పుడు. భాగ్యవంతులకు ఇంకను ఎక్కువగా దానిని చేకూర్పుడు. ఏలయన వేదవారికన్న వీరికే ఎక్కువగా వెలుగు కావలసియున్నది! చదువురానివారికి వెలుగును సమకూర్పుడు. చదువుకొన్నవారికి ఇంకను ఎక్కువ వెలుగును సమకూర్పుడు. ఏలయన మనకాలపు చదువులచే గలుగు దురభిమానములు అపారములు. కావున అందఱికును తేజస్సును సమకూర్చి తక్కిన పనిని భగవంతునికి వదలివేయుడు.

"కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మఫలహేతుర్భూర్మా తే సంగోఽస్వకర్మణి"

(కర్మచేయుటకే నీకు అధికారము కలదు కాని, ఆ కర్మఫలమునందు నీకు అధికారము లేదు. ఆ కర్మలు నీకొఱకై ఫలము లొసగు నను ఆశ పెట్టుకొనదగదు. ఐనను నీవు కర్మను వదలగూడదు) అని భగవానుడే స్వయముగా సెలవిచ్చియున్నాడు గదా.

ఇట్టి మహోన్నతభావములను యుగాంతరములకు మునుపే మన పూర్వులకు బోధించిన ఆ పరమేశ్వరుడు

తన ఆజ్ఞలను ఆచరణలోపెట్టుటకు తగిన బలమును సంపాదించుకొనునటుల మనకు సాహాయ్యముచేసి అనుగ్రహించుగాక !

భారత సిద్ధపురుషులు

భారతసిద్ధపురుషులను గుఱించి మాటాడునపుడు, చరిత్ర రూపమగు సాక్ష్యములేనట్టి పురాతనకాలమునకు నా మనస్సు పరువులిడుచున్నది. ఆ ప్రాచీనకాలపు అంధకారములో దాగియున్న రహస్యములను వెలువరించుటకు జనశ్రుతి గాథలు వ్యర్థముగ ప్రయత్నించుచున్నవి. భారత సిద్ధపురుషులు లెక్కలేనంతమంది గలరు. వేలకొలది సంవత్సరములుగా భారతజాతి సిద్ధులను సృజించుటకన్న చేసిన మహత్తర కార్య మింకొకటిలేదు. యుగకర్తలై మహాతేజముతో వెలింగిన కొందఱి జీవితములను మాత్రమే కైకొని, వారిని గుఱించి నా పరిశోధనఫలములను మీకు తెలిపెదను.

మున్నుందుగ మన శాస్త్రగ్రంథములనుగూర్చి మన మొకింత తెలిసికొనవలసియున్నది. సత్యముయొక్క రెండు ఆదర్శములు మన శాస్త్రములందు గలవు. ఇం దొకదానిని సనాతనమనియు, రెండవదానిని అంత ప్రామాణిక మైనది కాదనియు, ఐనను కొన్ని దేశ కాల పరిస్థితులయందు అది

విధిగా అనుసరింపపలసినదే అనియు మన మనుచున్నాము. జీవునియొక్క ఈశ్వరునియొక్క స్వభావములను గూర్చియు, జీవాత్మలకును పరమాత్మకును గల సంబంధమునుగూర్చియు, శ్రుతులు లేక వేదములు అను వానియందు తెలుపబడి యున్నవి. రెండవరకపు సత్యములను మనము స్మృతులని పేర్కొనుచున్నాము. మనువు, యాజ్ఞవల్క్యుడు మొదలగువారి గ్రంథములందును, పురాణములు మొదలు తంత్రశాస్త్రముల వఱకునుగల గ్రంథములందును అవి తెలుపబడియున్నవి. ఈ రెండవ రకపు గ్రంథములును, సిద్ధాంతములును, శ్రుతులకు లోబడినవి. వీనిలో ఏదేని శ్రుతివిరుద్ధముగా నున్నయెడల, దానిని త్రోసివేసి శ్రుతిధర్మమునే పాటింపవలయును అని సిద్ధాంతము. నరునియొక్క గతిగమ్యముల బాహ్యరూపము మాత్రము వేదములందు సూచింపబడెననియు, వాని వివరములు స్మృతులలోను, పురాణములలోను, విశదముచేయబడెననియు దీని అభిప్రాయము. సామాన్యధర్మములను మాత్రము తెలిసికొనుటకు శ్రుతులు చాలును. పారమార్థిక జీవనమును గుఱించి అంతకుమించి తెలుపగలిగినది లేదు. తెలిసికొనుటయు సాధ్యముకాదు. జీవాత్మ అఖండత్వమును సాధించుకొనుటకు కావలసిన దంతయు పూర్తిగా శ్రుతులయందు బోధింపబడియున్నది. వివరములు మాత్రము లేవు. వీనిని స్మృతులు ఆయా కాలములందు పూరించుచు వచ్చినవి.

శ్రుతులను గుఱించిన మఱొక విశేష మేమనగా, వానియందలి సత్యములను ప్రోగుచేసినట్టి ఋషులు అనే

కులు—వారిలో పెక్కండ్రు పురుషులు, కొందఱు స్త్రీలు. వారెటువంటివారో, ఎప్పుడు పుట్టిరో, ఈ మొదలగు విషయములనుగూర్చి మనకు తెలిసినది బహుస్వల్పము. ఐనను వారి ఉత్తమభావములు, వారు కనిపట్టిన రహస్యములు, వేదములందు సురక్షితముగ కాపాడబడి యున్నవి. స్మృతులందు ఇందుకు మారుగా వ్యక్తులవిషయములే ఎక్కువ ప్రధానముగా గోచరించుచున్నవి. లోకమునే ఉజ్జీవితులూగింపగల పురుషసింహులు, అద్భుతావహులు, మహామహిమాఢ్యులు, సర్వజనాకర్షకులు పెక్కండ్రు మొట్ట మొదటిసారి మనయెదుట నిలువబడిరో యనునటుల సాక్షాత్కరింతురు. కొన్ని సందర్భములందు వారి బోధలకంటె వారి స్వరూపములే మహత్తరములై కాన్పించును.

మనము గ్రహింపవలసిన విచిత్రవిషయ మొకటి గలదు. మన మతము నిర్గుణమగు సగుణ బ్రహ్మమును బోధించుచున్నది! నిర్గుణధర్మములను ఎన్నింటినో బోధించుచు, అనేకుల మూర్తిమత్త్వములనుకూడ చేర్చుచుండును. కాని మన మతమునకు మూలాధారములగు శ్రుతులయందు పూర్తిగా నిర్గుణతత్త్వమేకలదు. గొప్ప అవతారములు, దైవము తాల్చు మానవస్వరూపములు, ప్రవక్తలు, మొదలగు పురుషభావములన్నియు స్మృతులందును, పురాణములందును గోచరించుచుండును. మన మత మొక్కటి తప్ప ప్రపంచములోని యితర మతములన్నియు, పురుషరూపుడగు ఒకానొక మతకర్త జీవితముపై ఆధారపడియున్నవి. క్రైస్తవమతము ఏసుక్రీస్తు మీదను, మహమ్మదీయ మతము

మహమ్మదుమీాదను, బౌద్ధమతము బుద్ధునిమీాదను, జైన మతము జినునిమీాదను, ఇట్లే ఇతర మతములు ఇతరుల మీాదను ఆధారపడి నిర్మాణమైయున్నవి. ఈ మతము లన్నియు, వానివాని మహాపురుషులనుగుఱించిన చారిత్రా త్మికములగు నిదర్శనముల విషయమై గొప్ప పోరాటములు జరిపియుండునని మనము ఊహింపవచ్చును. ఈ మహాపురుషుల జీవితముల గుఱించిన చారిత్రక నిదర్శన ముల బలము ఎన్నడైనను సడలినయెడల, వారి మతభవన మంతయు నేలకూలి, విచ్ఛిన్నమై పోవును. మన కీ దురవస్థ తప్పినది. ఏలయన, మన మతము మానవులపైగాక, ధర్మ సిద్ధాంతములపై ఆధారపడియున్నది. మీరు మీా మత ధర్మములకు లోబడి వర్తించుట, ఎవరో యొక ఋషియో, అవతారపురుషుఁడో ఆ ధర్మములను చెప్పెననుటచేత కాదు. వ్యక్తులపైగల ప్రామాణ్యబుద్ధివలనకాదు మనము ధర్మము నాచరించుట! వేదముల ప్రామాణ్యము కృష్ణునివలన వచ్చుటలేదు. కృష్ణునికే వేదములు పరమప్రమాణము లగుచున్నవి. వేదములను బోధించువారిలో ఆయన ఉత్త మోత్తము డగుటవలననే ఆయనకును పూజ్యత కలిగినది. ఇటులనే ఇతర అవతారముల సంగతియు! మన ఋషులందఱి విషయము అంతియే. నరుడు పరిపూర్ణు డగుటకును, మోక్షము పొందుటకును, కావలసినదంతయు వేదములందు కలదనుటయే మన ప్రాథమిక సిద్ధాంతము. అంతకు మించిన నూతనప్రమాణమును దేనినిగాని నీవు కనిపట్టజాలవు. సమస్త జ్ఞానమునకును పరమావధియగు పరిపూర్ణాద్వైతమును

దాటి నీవు పోజాలవు. ఆగమ్యము ఇప్పటికే అందు సాధింప బడియున్నది. దానిని దాటిపోవుట అసంభవము. ''తత్త్వమసి'' అను బోధను స్వానుభవమునకు తెచ్చికొనుటతో అధ్యాత్మజ్ఞానము పరిపూర్ణమగుచున్నది. అది వేదములందున్నది. ఇంక మిగిలినదంతయు భిన్నభిన్నములగు దేశకాలములను, పరిస్థితులను, సంబంధములను, అనుసరించి అప్పుడప్పుడు ప్రజలకు మార్గము చూపుచుండుట కొఱకేర్పడినదే! ప్రాచీన సనాతనమార్గము ననుసరించి ప్రజలను నడుపుటకొఱకే బోధకాగ్రగణ్యులగు ఈ మహాపురుషులు అవతరించు చుండిరి.

''యదా యదాహి ధర్మస్య గ్లాని ర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజా మ్యహం;
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే''

(ఎప్పుడెప్పుడు ధర్మమునకు హానియు, అధర్మమునకు వృద్ధియు గలుగుచుండునో, అప్పుడెల్ల నేను పుట్టుచుందును. సాధువుల రక్షించు కొఱకును, దుష్టుల సంహరించు కొఱకును, ధర్మమును సంస్థాపించు కొఱకును నేను ప్రతియుగమునందును పుట్టుచుందును). శ్రీకృష్ణభగవానుని ఈ సుప్రసిద్ధ గీతావచనముకంటె ఎక్కువ విశదముగ ఈ విషయమును మరేదియు రుజువుచేయ జాలదు. భారతీయులకుగల భావ మిదియే.

దీని ఫలితార్థ మేమి? తర్క-ముమ్మాదగాని, మహాపురు షులప్రామాణ్యముమ్మాదగాని, చివరకుఅవతారపురుషులమ్మాద గాని ఆధారపడక, తమ సొంతపునాదులమ్మాదనే స్వతంత్ర ముగా నిలిచియుండు ఈ నిత్య ధర్మములు ఒక వైపున నున్నవి. ఇది భారత దేశమునకుగల విశిష్టలక్షణమగుటచే, వేదాంత మత మొక్కటియే విశ్వజనీనమతము కాగల దనియు, అది మానవులను గుఱించిగాక ధర్మసిద్ధాంతములను గుఱించి బోధించునది గావున ప్రపంచములో ఇప్పటికి రూపొంది సిద్ధమైయున్న విశ్వజనీనమతము ఇది యొక్కటియే యనియు, మనము బాహాటముగా లోకమునకెల్ల చాటి చెప్పవచ్చును. ఒక పురుషునిపైని ఆధారపడి నిర్మింపబడిన ఏ మతమును గాని ప్రపంచమందలి అన్నిజాతుల ప్రజలును ఆదర్శముగా అంగీకరింపరు. మన దేశమునందే మహాపురుష లనేకులు వెలసియుండిరని మన మెఱుగుదుము. ఒక చిన్నపట్టణ ములో సైతము వేర్వేఱుచిత్తవృత్తులు గల ప్రజలు తమ తమ చిత్తవృత్తుల ననుసరించి, వేర్వేఱు వ్యక్తులను ఆదర్శ మూర్తులుగ వరించుచున్నారు. అట్టిచో, ఒక మహమ్మదో, ఒక బుద్ధుడో, ఒక క్రీస్తో ప్రపంచమంతటికిని అనన్యమగు ఆదర్శముగా స్వీకరింపబడుట ఎట్లు సాధ్యమగును? న్యాయ మంతయు, నీతి యంతయు, అధ్యాత్మధర్మ మంతయు, సిద్ధాంత మంతయు, ఆ ఒక్క-పురుషుని అంగీకార మున్నంత మాత్రమునసే సత్యమైనదిగా సమస్త ప్రజలును శిరసా వహించుట ఎట్లు పొసగును? ఇక వేదాంతమతమునకో, అటువంటి ఏ పురుషునియొక్క ప్రామాణ్యాధికారములును

అవసరము లేదు. దాని ప్రమాణము నరుని సనాతన ప్రకృతియే! అందలి సీతులు ఇదివఱకే సిద్ధమై యున్నట్టి సనాతనమగు మానవుని పారమార్థిక స్థైర్యముమీద ఆధార పడియున్నవి. ఐనను అతిప్రాచీన కాలమునుండియు, మానవజాతిలో అధికసంఖ్యాకులకు సగుణమూర్తి ఆవశ్యక మైయుండు ననుసంగతి మన మహాపురుషులు తెలిసికొనియే యుండిరి. ఏదో ఒక రూపమున సగుణదైవతము ప్రజలకు కావలసియేయుండును. సగుణదైవతము ఉండ కూడదని గట్టిగా వాదించిన బుద్ధుని నిర్వాణానంతరము, ఏబది సంవత్సరము లైనను గడవక మునుపే, వాని శిష్యులు వానినే ఒక సగుణదైవతముగా ఏర్పఱచి, ఆరాధించుట కారంభించిరి! ఈ సగుణ దైవతము అవసరమే! ఐనను నిజ మాలోచించిన, సగుణదైవతములుగా భావింపబడినవారిలో నూటికి తొంబది తొమ్మిదిమంది మానవ పూజకు అనర్హులుగనే యున్నారు. కాని ఊహాకల్పిత సగుణదైవతములకంటె శ్రేష్ఠతరమైన సజీవదైవతములు ఈ లోకములోనే అప్పుడప్పుడు మనమధ్య, మనతోపాటు నివసించుచు, మనతో కలిసిమెలసి తిరుగుచుండుట కలదు! మన ఊహాకల్పితమగు బూటకపు దైవమునకంటె, ఇట్టివారిని సేవించినచో మన జన్మలు ధన్యమగును! మన జీవితములు చరితార్థములగును! మీరు గాని నేను గాని కల్పించుకొన గలిగిన ఏ భగవద్భావనకన్నను శ్రీకృష్ణుడు గొప్పవాడు గదా! మన మనస్సులలో మీరు గాని నేను గాని కల్పన చేసికొనగలిగిన

ఆదర్శమూర్తికన్న, బుద్ధుడు ఎన్నో రెట్లు సజీవమును, పూజనీయమును నగు ఉత్తమ భావనామూర్తికాదా! అందువలననే ఇట్టి పురుషులు ఊహాకల్పిత దేవతల నందఱిని నెట్టివేసి, మానవ జాతివలన సతతము పూజల నందుచున్నారు!

ఈ సత్యము మన ఋషులకు తెలియును. కావుననే అట్టి మహాపురుషులను, అవతారమూర్తులను, భారత ప్రజలెల్లరు పూజించు నవకాశమును వారు కల్పించియున్నారు. ఇట్టి అవతారపురుషులలో ఉత్తమోత్తముడగు శ్రీకృష్ణుని పలుకు సర్వాతిశాయిగానున్నది :

"యద్య ద్విభూతి మత్సత్వం శ్రీమ దూర్జిత మేవ వా
తత్త దేవావ గచ్ఛ త్వం మమ తేజో ఽంశ సంభవం"

(ఎచ్చటెచ్చట నరుని వలన శాహాటముగ అసాధారణ విభూతి ప్రకటితమగునో అక్కడ నెల్ల నే నున్నా ననియు, ఆ ప్రకాశ మంతయు నా వలననే పుట్టుచున్న దనియు, తెలిసికొనుము.) ఈ ప్రవచనము, ప్రపంచములోని ఎల్ల దేశములందలి అవతారములను పూజించుటకు భారతీయునకు అవకాశము నొసగుచున్నది! హిందువు ఏ దేశమందలి ఏ ఋషి నైనను, ఏ సాధుపురుషునైనను, పూజింప గల్గును. యథార్థమునకు మనవారు అనేక పర్యాయములు క్రైస్తవుల చర్చిలలోనికిని, మహమ్మదీయుల మసీదులలోనికిని, పోయి పూజ లర్పించుచుండుట మనకు తెలిసిన విషయమే. అటుల చేయుట మంచిదే. ఎందులకు కాదు? నేను చెప్పినటుల మనది విశ్వజనీనమతము

సమస్తాదర్శములను తనలో ఇముడ్చు కొనగలిగినంత ఉదార మును, విశాలమును నైనది. ప్రపంచములో ఇంతవఱ కుండియున్న మతాదర్శముల నన్నింటిని వేదాంతమతము తనలో ఇప్పుడే ఇముడ్చుకొన గలదు; ఇట్లే ఆదరించి తన అనంత బాహువులతో ఆలింగనమును చేసికొనుటకు భవిష్య త్కాలమున రానున్న ఆదర్శముల కొఱకై ఓపికతో నిరీ క్షించుచుకూడ నుండగలదు.

భగవదవతారమూర్తులగు మహాపురుషులను గుఱించి, మన సిద్ధాంతము ఇంచుమించుగా ఇట్లున్నది. వారికన్న తక్కువప్రాధాన్యముగల పురుషవరులు గూడ కలరు. ఋషి యను మాట వేదములలో అనేక పర్యా యములు వాడియుండుట మనము ఎఱుగుదుము. ఇప్పటి కాలమునకూడ ఆ శబ్దము సామాన్యముగా వాడబడుచున్నది. 'ఋషి' అనగా ఒక గొప్ప ప్రమాణపురుషుడు. ఆ భావమును మనము గ్రహింపవలయును. 'ఋషి' యనగా 'మంత్రద్రష్ట', అనగా భావమును చూచువాడు అని నిర్వచనము. అధ్యాత్మ ధర్మమునకు రుజువేమి? అతిప్రాచీన కాలమునందే ఈ ప్రశ్న బయలుదేఱినది. దానికి ఇంద్రియానుభవ రూపమగు రుజువు లేదని ప్రవచింపబడెను. "యతో వాచో నివర్తన్తే అప్రాప్యమనసా సహ" (ఆ పరతత్త్వమును చేరలేక వాక్కులు మనస్సుతో సహా వెనుకకువచ్చుచున్నవి!) "న తత్ర చక్షుర్గచ్ఛతి, నవాగ్ గచ్ఛతి నో మనో"! (అక్కడికి కన్నులు చేరజాలవు, వాక్కు చేర జాలదు, మనస్సును చేరజాలదు) అని యుగయుగాంతరములనుండి ప్రవచింప

బడు చున్నది. ఆత్మయొక్క ఉనికిని గురించియు, భగవంతుని యొక్క ఉనికిని గుఱించియు, జీవితము యొక్క నిత్యత్వమును గుఱించియు, మానవుని పరమావధిని గురించియు, ఇంకను ఇట్టి విషయములనుగురించియు బాహ్యప్రకృతి మనకేమియు సమాధానము చెప్పజాలదు. మానవమనస్సు నిరంతరము మారునది, ఎప్పుడును చంచలము. దానికి పరిమితి గలదు. అది ఖండ ఖండములుగా తెగిపోవునది. అనంతమై, నిర్వికారమై, అఖండమై, అభేద్యమై, శాశ్వతమై, పరగు బ్రహ్మమును గురించి ప్రకృతి ఎట్లు తెలుపగలుగును? అది దాని కెన్నడును సాధ్యము కాదు. పైగా నిర్జీవమై, జడమై, పరగు ద్రవ్యరాశి నుండి ఆసమాధానమును పొందుటకై మానవుడు ప్రయత్నించి నప్పుడెల్ల, అతడు వ్యర్థసంకల్పు డగుటయే తటస్థించెనని చరిత్ర తెలుపుచున్నది. అయినచో వేదములు తెలుపు జ్ఞానము ఎట్లు లభించినది? 'ఋషి'త్వ మొందుట వలన అది లభించెను. ఆ జ్ఞానము ఇంద్రియములం దుండునది కాదు. ఈ ఇంద్రియములే నరుని ఆద్యంతములగునా? మానవు డన ఈ ఇంద్రియములే అని చెప్పగలవా డెవడు? మన యందఱి జీవితములలో అత్యంతనిశ్చలతను అనుభవించు క్షణములు అప్పుడప్పుడు ఘటిల్లు చుండును. మన కన్నుల యెదుట మనము ప్రేమించు నొకడు మరణించినప్పుడో, ఏదేని ఆకస్మికమగు ఆపద వచ్చినప్పుడో, అత్యంతమగు ఆనందము చేకూరినప్పుడో, అటుల తటస్థింప వచ్చును. మన మనస్సు నిశ్చలమై ఒక క్షణకాలము తన స్వస్వరూపమున నిలిచి, సర్వాతీతమగు అఖండబ్రహ్మము యొక్క జాడ

తళుక్కు మనెనో యన్నట్లు విశిష్టానుభవమును పొందు నట్టి క్షణములు ఇతరసమయములందు సైతము తటస్థింప వచ్చును! మాటల కందనిదియు, మనస్సునకు గోచరింప నిదియు, ఏదో మన కప్పుడు ప్రత్యక్ష మగును. ఇది సామాన్యజీవితమునకూడ సంభవించునదే. కాని దీనికి ఔన్నత్యముకల్పించి, సాధనా మూలమున పరిపూర్ణత కలిగింప వలెను. యుగాంతరములకు పూర్వమే ఆత్మ ఇంద్రియముల చేత పరిమితముగాక, ఇంద్రియములకు అతీతమై చైతన్య మునకుకూడ అందక, పరగునని మహాపురుషులు కనిపట్టి యున్నారు! అంతులేని ఒక పెద్దగొలుసులో, 'ఎఱుక' అనునది ఒక కడియము మాత్రమే అని మనము గ్రహింప వలయును. ఎఱుకయును, బ్రహ్మమును ఒకటికాదు. ఎఱుక బ్రహ్మము యొక్క ఒక అంశ మాత్రమే! ఈ ఎఱుకను దాటియు సాహసవంతమగు అన్వేషణము సాగవలసియున్నది. ఎఱుక ఇంద్రియములచేత పరిమిత మైనది. దానిని దాటి, ఇంద్రియములను దాటి, ఎగసి పోవలయును. అప్పుడు ఆధ్యాత్మికప్రపంచముయొక్క సత్యములు మనకు గోచరించును. ఈ ఇంద్రియముల హద్దు లను దాటి పోవుటలో సామర్థ్యమును గడించిన పురుషులు ఈ కాలము నందును కలరు. ఆధ్యాత్మికసత్యములను వారు ప్రత్యక్షముగా తెలిసి కొనుట వలన వారిని 'ఋషులు' అందుము.

'వేదములకు రుజువు, నా యెదుట నున్న యీబల్లకు రుజువు ఎట్టిదో అట్టిదే! అది ప్రత్యక్షప్రమాణమే; అనగా

స్వయముగా గోచరించుటయే. ఈ బల్లను నేను ఈ బాహ్యేం
ద్రియదృష్టితో చూచుచున్నాను. ఆధ్యాత్మిక సత్యములను
జీవాత్మయొక్క అతీంద్రియావస్థలో చూడ గలుగుదుము.
ఈ 'ఋషిత్వము' కాలము వలనగాని, స్థలము వలనగాని స్త్రీ
పురుష భేదము వలనగాని, జాతి భేదము వలన గాని, పరి
మితముకాదు. ఆర్యుడని, అనార్యుడని, మ్లేచ్ఛుడని, భేదము
లేక అందఱికును ఈ 'ఋషిత్వము' సామాన్య సంపదయని
వాత్స్యాయనఋషి ప్రకటించి యున్నాడు. వేదములలో
తెలుపబడిన 'ఋషిత్వము' ఇటువంటిది. భారతదేశములోని
ఈమతాదర్శమును నిరంతరము మనము స్మరించుకొనుచుండ
వలెను. దీనిని ప్రపంచములోని ఇతర జాతుల వారును
తెలిసికొని, జ్ఞప్తి నుంచుకొందురు గాక యని కోరు
చున్నాను. అప్పుడు పోట్లాటలు తగ్గిపోవును; వాగ్వాదములు
తఱిగిపోవును. ఆధ్యాత్మికధర్మము పుస్తకములందు లేదు;
సిద్ధాంతములందు లేదు; విధివాక్యములందు లేదు; ఉపన్యాము
లందు లేదు; తర్కము నందును లేదు. అది 'స్థితి' 'సిద్ధు'లందు
(Being and becoming) ఉన్నది. మిత్రులారా! మీలో
ప్రతివాడును ఋషియై, ఆధ్యాత్మికసత్యములను ప్రత్యక్షము
చేసికొను వఱకును, మీకు ఆధ్యాత్మికజీవనము ప్రారంభము
కానట్లే! అతీంద్రియదశ మీకు అబ్బువఱకును ఆధ్యాత్మికజీవ
నము అనునది వట్టి అర్థరహితమగు మాటయే. అదంతయు
సాధనవంటిదనవచ్చును. నీవు స్వయముగా ఎఱుగని విషయ
మునుగూర్చి ఎవరో చెప్పిన దానిని మఱెవరిమూలముగనో
విని నీవు ప్రసంగములు సాగించుచున్నావు. బుద్ధభగవానుడు

కొందఱు బ్రాహ్మణులతో వాదన సలిపినప్పుడు చెప్పిన మాట ఇక్కడ చక్కగా ప్రసక్తమై యొన్నది. వారు బ్రహ్మము యొక్క స్వరూపమును గురించి వివాదపడు చుండగా బుద్ధదేవుడు "నీవు బ్రహ్మమును చూచితివా?" అని ప్రశ్నించెను. "లేదు" అని బ్రాహ్మణు డనెను. "సరే, నీ తండ్రియో?" "ఆయనయు చూడలేదు." "మీ తాతయో?" "ఆయనయు చూచినట్లు నాకు తోపదు." "అటు లైన యెడల, మిత్రమా? మీతండ్రియు, మీ తాతయు, ఎన్నడునుచూచి యుండని పురుషుని గుఱించి మీరు వివాద పెట్టుకొని, ఒకరి నొకరు జయింప జూచుట ఎందులకు?" అని బుద్ధభగవానుడు పలెక్కను. ప్రపంచ మంతయు చేయుచున్న దిదియే. ఈ వేదాంత వాక్యమును మన మనువదింతముగాక ! "నాయమాత్మా ప్రవచనేన లభ్యః నమేధయా, బహునాశ్రుతేన!" (పాండిత్య మార్జించుట చేత ఈ ఆత్మను చేర లేము; మహత్తర బుద్ధి బలము చేతను చేర లేము; వేదముల నన్నిటిని పఠించుట మూలమున సైతము చేర లేము.)

కావున వేదప్రమాణము ననుసరించి ప్రపంచమందలి అన్ని జాతులవారికిని మనము ఇటుల చెప్పుదము గాక : "మీ పోరాటము లన్నియు మీ వాగ్వాదము లన్నియు, వ్యర్థములు ! మీరు బోధింప బూనిన దైవమును మీరు చూచితిరా ? చూచి యుండని యెడల, మీ బోధయంతయు వ్యర్థమే ! మీరు చెప్పున దేమో మీకే తెలియదు. మీరు అతనిని చూచియున్న యెడల వాదులాడరు; అప్పుడు మీ

ముఖములందే వర్చస్సు కానిపించును.'' ఉపనిషత్తులలో పేర్కొనబడిన ఒక ప్రాచీనఋషి తన కుమారుని బ్రహ్మ మునుగుఱించి తెలిసికొనిరమ్మని పంపెను. ఆ బాలుడు తిరిగి రాగా నీవేమి తెలిసికొంటివని తండ్రి యడిగినాడు. నేను చాల శాస్త్రములను నేర్చితినని పిల్లవాడు జవాబు చెప్పెను. కాని తండ్రి 'అది యంతయు నిష్ఫలము; తిరిగి పో'మ్మనెను. ఆ కొమరుడు మఱలిపోయి కొంతకాలమునకు మరల తిరిగి రాగా తండ్రి వెనుకటి ప్రశ్ననే అడిగెను. బాలుడు వెనుకటి జవాబునే చెప్పెను. ఇంకొక పర్యాయము ఆతడు వెడలి పోవలసి వచ్చెను. ఆ పిమ్మట ఆబాలుడు తిరిగి వచ్చినప్పుడు, వాని ముఖమంతయు ప్రకాశవంతమైయుండెను. అప్పు డతని తండ్రి దిగ్గున లేచి, ''ఓహో! కుమారా! ఈనాడు నీముఖము బ్రహ్మవిదుని ముఖమును బోలి ప్రకాశించుచున్నది'' అని పలికెను! మీరు భగవంతుని తెలిసికొనినప్పుడు మీ ముఖ వర్చస్సు మారును; మీ కంఠస్వరము మారును; మీ ఆకారమంతయు మారును. మీరు మానవజాతినే ఉద్ధరించు వారగుదురు. ''ఋషి''కి ఎవరును ఎదుర్నై నిలువ జాలరు. ఇట్టిది ఋషిత్వమనగా! ఇది మన మతమున పరమావధి! తక్కిన వన్నియు, ఈ ప్రసంగములు, తర్కములు, తత్త్వ సిద్ధాంతములు, ద్వైతములు, అద్వైతములు—చివరకు వేద ములుకూడ—యాత్రాసన్నాహములవంటివే! అప్రధాన మైనవే! ఋషిత్వము మాత్రమే ప్రధాన మైనది. వేదములు, వ్యాకరణము, జ్యోతిషము, మొదలగున వన్నియు అప్రధాన ములే. ఆ నిర్వికారబ్రహ్మసాక్షాత్కారమును చేకూర్చునది

పరావిద్య యొక్కటియే. వేదములలోని 'ఋషు'లు అట్టి సాక్షాత్కారముపొందినవారే. ఈ 'ఋషి' అనుపదము, ఒక తరగతికి, ఒక దశకు, పేరు. మన మెల్లరమును—సత్యమగు ప్రతి హిందువును—ఆ పదమునకు అర్హులమై, మన జీవితములో ఏదో ఒక కాలమున 'ఋషుల'ము కావలయును. ఋషి యగుట యనగా ముక్తి నార్జించుటనియే హిందువుల అభిప్రాయము. శాస్త్రధర్మములందలి విశ్వాసము ముక్తికాదు. వేల కొలది దేవస్థానములను దర్శించుటయు కాదు; లోకములోని నదు లన్నింటను స్నాన మాడుటయు కాదు. కాని మంత్ర ద్రష్టయై 'ఋషి' యగుటయే బంధవిమోచనము, మోక్షము!

వేదకాలమునకు తరువాతకూడ లోకమును సంచలింప జేయు సామర్థ్యముగల మహర్షులను అవతార పురుషులను ఎందఱో ఉదయించిరి. భాగవతప్రమాణము ననుసరించి అట్లుదయింపవలసినవారి సంఖ్య అనంతము. భారతదేశములో అత్యధికముగ పూజింప బడువారు రాముడును, కృష్ణుడును. త్రేతాయుగము నాటి ప్రాచీన దైవత మగు రాముడు సత్య ధర్మములకు నిలయము; ఆదర్శరూపుడగు కుమారుడు; ఆదర్శరూపుడగు భర్త; ఆదర్శరూపుడగు తండ్రి; అన్నిటిని మించి ఆదర్శరూపుడగు ప్రభువు. ఇట్టి రాముని వాల్మీకిమహర్షి మనకు ప్రదర్శించి యున్నాడు. ఈ మహాకవి శ్రీరాముని జీవితమును వర్ణించిన భాషకన్న స్వచ్ఛమును, నిర్దుష్టమును, మనోహరమును, సులభగ్రాహ్యమును అగు భాషయే ఉండజాలదు. ఇక సీతను

గుఱించి చెప్పనలవియా! ప్రపంచములోని పూర్వ గ్రంథ రాశి నంతను—భవిష్యత్కాలములో రచింపబడనున్న గ్రంథరాశిని సైతము—గాలించి చూచినగాని మీకింకొక సీత కనబడదు. సీత అసదృశయైనది. అంతకన్న సమగ్రత నూహించుట దుర్లభముగా నుండున ట్లామె చిత్రింప బడినది. అనేక రాము లుండిన నుండవచ్చును గాని, ఈ ఒక్క సీత కన్న మఱిసీత లుండబోరు. ఆమె నిష్కళంక భారతనారీ మణికి పరమాదర్శమై యున్నది. ఆ సీతయొక్క జీవితము నుండియే స్త్రీత్వపరమావధిని నిర్ణయించు భారతాదర్శము లన్నియు పుట్టుకొని వచ్చినవి. అనేక సహస్రాబ్దములనుండి, ఆర్యావర్తభూమిలో ఒక కొన నుండి మఱొక కొనవఱకు, సర్వత్ర, ప్రతి పురుషుని చేతను ప్రతి స్త్రీ చేతను ప్రతి శిశువు చేతను సైతము పూజల నందు కొనుచు, ఆ దివ్యమూర్తి వెలయుచున్నది. ఈ దివ్య స్వరూపిణి సీత, పావనత కంటెను పావనమై, అగాధ సహన శీలయై, పరమ శాంతి నిధానయై, సర్వకాలమును అసమానయై నిలిచియుండును. ఇసుమంతయు సణుగు కొనక, గొణుగు కొనక, ఆమె జీవనదుఃఖసముద్ర మును ఓపికతో నీదినది; నిత్యసత్యవ్రతయై, పతివ్రతా తిలకమై, మానవులకును దేవతలకును పరమాదర్శమై ఆమె ప్రకాశించుచున్నది. ఆ మహా తన్వి సీత మనజాతికి అధిష్ఠాన దేవతయై సదా సుస్థిరముగ నిలిచి యుండ వలసినదే! ఆమెను గుఱించి వర్ణనలు చేయుట ముంజేతి కంకణమునకు అద్దము చూపుటే! మన పురాణములన్నియు నశించి పోవచ్చును; మన వేదములే నీట గలియ వచ్చును; మన

సంస్కృత భాషయే ఊరు పేరు లేకుండ మాయమై పోవచ్చును; కాని పదిమంది భారతీయులైనను బ్రతికి యుండు నంత కాలము, నింద్యగ్రామ్యభాషలో నైనను ఒక్కడుగాని మాటాడువా డుండునంతవఱకు, ఈ సీతా మహాదేవి కథ ప్రస్తావనకు రాక తప్పదు. ఈ సీత మన జాతి యొక్క జీవస్థానము నాక్రమించినది. ప్రతి భారతీయ స్త్రీ యొక్క, పురుషునియొక్క రక్తము నందు ఆమె కలదు. మన మెల్లరము సీతామహాదేవి యొక్క సంతానమే! మన స్త్రీలయందు నవీన సంస్కరణముల ప్రవేశ పెట్టు ప్రయత్న ములో సీత యొక్క పరమాదర్శమునుండి వారిని దూరము చేయవలయు ననుసంకల్పము కలదేని, అది తత్క్షణము కొఱగానిదై పోవును. ఆ సంగతి ప్రతిదినము తెలియ వచ్చుచునే యున్నది. భారత దేశ స్త్రీలు ఈ సీతయొక్క అడుగుజాడల ననుసరించి వృద్ధి పొంది వికాసమును పడయ వలయును. వారి కది యొకటియే మార్గము.

అనంతరూపముల పూజింపబడుచు, స్త్రీ లకును పురుషులకును ఏకరీతిని ఇష్టదైవతమై, పిన్నలకును పెద్దల కునుగూడ పరమాదర్శమై, వెలుంగు తేజోమూర్తికడ కిప్పుడు వత్తము. భాగవతకర్త ఈ శ్రీకృష్ణుని అవతార మని పేర్కొనుటతో తృప్తినొందక, అవతారములన్నియు ఎవ్వాని అంశోద్భూతములో అట్టి శ్రీమహావిష్ణువే యని అభివర్ణించినాడు. ఈ మహనీయుని బహుముఖమూర్తి మత్త్వము మనల నాశ్చర్యనిమగ్నుల నొనర్చుచుండ, ఆతనిని ఈ విధముగా అభివర్ణించుట విచిత్రము కాదు.

అతడు విస్మయము కలిగించు సన్న్యాసియు, విస్మయము కలిగించు గృహస్థుడును! అతనియందు అగణితమగు మహా శక్తిస్వరూపమగు రజస్సు గోచరించుచుండుటే కాక, బహు విస్మయము గొలుపు వైరాగ్యముకూడ మూర్తీభవించి యుండును. మీరు గీతను బాగుగ పఠించినగాని, శ్రీకృష్ణుని మహత్త్వము మీకు తెలియనే తెలియదు. ఏలన ఆతని ఉపదేశమున కతడే మూర్తీభావము. ఈ అవతారములలో ప్రతివారును తాము ఏమి బోధింప వచ్చిరో ఆ ధర్మమునకు మూర్తరూపములై వెలసిరి. గీతను బోధించిన శ్రీకృష్ణ భగవానుని జీవిత మంతయు దివ్యగీతాస్వరూపమే. అనగా నిష్కామకర్మమునకు అతడు చక్కని దృష్టాంతము. తన సింహాసనమును పరిత్యజించి, మరల దానినిగూర్చి స్మరింప నైన లేదు. తన ఆజ్ఞానువర్తులై రాజులు గద్దెల దిగి వచ్చు, ఈ భారత నాయకాగ్రణి ఎన్నడును ప్రభువగుటకు సంకల్పింప డయ్యెను; గోపికలతో కలసి మెలసి ఆటలాడిన బాలకృష్ణుడు గనే, సర్వజనసులభుడగు ఆ కృష్ణుడుగనే యుండెను! ఆ బృందావన మనోజ్ఞలీలలో ప్రకటితమైన మహావిచిత్ర విశాల వికసిత విశుద్ధప్రేమయొక్క దివ్యతత్త్వమును గ్రహించుట అట్టి దివ్యమధురభావరసపానముచేసి, నిష్కళంకప్రేమోన్మత్తచిత్తుడైనవానికే సాధ్యమగును! అహో! గ్రహించుట బహుదుర్లభమగు ఆ అద్భుత జీవితఘట్టమును పరమ పవిత్రుడును, పూర్ణనిష్కళంకుడును అగు పర్యంతము ఏ వాడును గ్రహింప ప్రయత్నింపరాదు. ఆ గోపికలయొక్క ప్రేమస్పందనముల నెవరు గ్రహింపజాలుదురు? ఆదర్శ

రూపమగు ఆ ప్రేమ! ప్రతిఫలాపేక్ష ఏకోశమునను లేని ప్రేమ! స్వర్గమును సైతము లెక్కసేయని ప్రేమ! ఇహము నందు గాని పరమునందు గాని ఎద్దానిని స్మరణయందైనను నిలుపనోపని వినిర్మలప్రేమ! మిత్రులారా! ఈ గోపికాప్రేమ మందే సగుణ నిర్గుణ బ్రహ్మభావముల నడుమ గల విభేదమునకు పరిష్కారమార్గము లభించినది. నరజీవితమునందలి అత్యున్నత దశయే సగుణబ్రహ్మమని మన మెఱుగుదుము. ఎవడు ఈ విశ్వమున సర్వాంతర్యామియై యున్నాడో, ఈ సృష్టి సర్వమును ఎవని వ్యక్తరూపముగా నున్నదో, అట్టి నిర్గుణబ్రహ్మమునందు విశ్వాస ముంచుట తత్త్వశాస్త్రసమ్మతమని మనకు తెలియును. ఐనప్పటికిని మన హృదయములు ఏదేని వ్యక్తరూపము కొఱకై; ఏదేని సుగ్రాహ్యమగుదానికొఱకై; ఎవని పాదములచెంత మన ఆత్మలు శరణాగతి పొందజాలునో అట్టి తత్త్వస్వరూపముకొఱకై తహతహపడుచుండును. కావున మానవస్వభావము అందుకోగల మహోత్కృష్టభావన సగుణ బ్రహ్మరూపమైనది, కాని సగుణబ్రహ్మభావనము తర్కమునకు వెగటుగనే తోచును! ఇది బ్రహ్మసూత్రములలో వితర్కింప బడినట్టియు, ద్రౌపది యుధిష్ఠిరునితో అరణ్యవాసకాలమున తర్కించినట్టియు, తాతలనాటి ప్రాత ప్రశ్నయే! సగుణదైవతమే యుండినయెడల, ఆయన సర్వదయాళుడును, సర్వశక్తిమంతుడును అగునెడల, ఈ భూలోకనరకము ఏల సంఘటిలవలయును? అతడు ఇట్టిదానిని సృష్టిచేయనేల? ఆతడు పక్షపాతియై యుండవలెను! ఇందుకు సమాధాన మారయగా ఈ గోపికాప్రేమ మొక్కటియే తగు సమా

ధానముగా లభించినది. కృష్ణునకు ఆరోపింపబడిన ప్రతి విశేషణమును గోపికలకు వెగ్గలై తోచినది. అతడు జగన్నాథుడని, సర్వశక్తిమంతుడని, పరంధాముడని వినుట యందు వారి కాసక్తి లేదు. అతడు అఖండప్రేమమూర్తి యని మాత్రమే వారి భావము. వారి కంతియే చాలును! వారు శ్రీకృష్ణుని బృందావనకృష్ణునిగా మాత్రమే పరిగణించిరి. ఆ మహాసైన్యాధిపతి, ఆ రాజాధిరాజు వారి భావనలో గోపాలుడే! ఎల్లప్పుడు గొల్లవాడే! "నాకు ధన మక్కఱలేదు; జన మక్కఱలేదు; పాండిత్యము అక్కఱ లేదు; స్వర్గప్రాప్తికూడ అక్కఱలేదు. నేను ఎన్ని జన్మలనై నను ఎత్తుదునుగాక! ఓ దేవా, నాకు నీ యెడల భక్తి యుండు నటుల, అది నిష్కామభక్తిగ నుండునటుల, అనుగ్రహిం పుము!"

భక్తికొఱకే భక్తి; కర్మకొఱకే కర్మ; ధర్మము కొఱకే ధర్మము! అను ఈ భావము ఆ స్తికజీవనచరిత్రయం దొక ప్రధాన ఘట్టము. ఈ పరమార్థము అవతారములలో ఉత్తమోత్తముడగు శ్రీకృష్ణభగవానుని ముఖమునుండి ప్రప్రథమమున వెలువడినది. మానవజాతిచరిత్రయందు అయ్యది మొట్టమొదటిసారి భారతక్షేత్రమునే ప్రవచింప బడినది! భయలోభములతో గూడిన మతములు ఒక్క సారిగా ఎగిరిపోయినవి. నరకభీతిని నెట్టివేసి, స్వర్గభోగా పేక్షలను త్రోసిపుచ్చి, భక్తికొఱకే భక్తి, ధర్మముకొఱకే ధర్మము, కర్మకొఱకే కర్మ అను మహోత్కృష్టమగు ఆదర్శము ఉదయించినది.

ఓహో! ఎట్టి భక్తి! ఎట్టి ప్రేమ! గోపికల ప్రేమను అర్థము చేసికొనుట చాల దుష్కరమని ఇంతకు మునుపే చెప్పియుంటిని. అద్భుతమగు ఆ ప్రేమోదంతములోని గంభీరార్థమును గ్రహింపజాలని మూర్ఖులు మనయందు సైతము లేక పోలేదు. ఈ పవిత్రగాథకు నీచార్థములు కల్పించి ఏవగించుకొను మూర్ఖులు, కలుషమనస్కులు, అపవిత్ర హృదయులు పెక్కుమంది మన జాతియందే కలరు. "బిడ్డలారా, మున్ముందుగా మీ హృదయములను పవిత్రము చేసికొనుడు; ఈ గోపికల అనురాగ గాథను వివరించిన మహనీయుడు ఆ శ్రీ శుకదేవుడే గాని అన్యుడు కాడని మీరు జ్ఞప్తి నుంచుకొనుడు. అద్భుతావహమగు ఈ గోపికాప్రేమమును గుఱించి గానము చేసిన ఇతిహాసికుడు పరమపవిత్రుడై అవతరించిన ఆ నిత్య నిర్మల మూర్తి శ్రీ శుకమహాఋషి! శ్రీ వ్యాసమహాఋషితనయుడు!" అని మాత్రమే నేను వారికి చెప్పుదును. హృదయమునందు ఎక్కడేని ఇసుమంత స్వార్థచింత యున్నంత వఱకు భగవద్భక్తి కలుగ నేరదు. స్వార్థచింతతో భక్తినెఱపుట అంగడివ్యాపారము వంటిదే! "నేను ఇది నీకిచ్చెదను; ఓస్వామీ! దీనికి మారుగ నాకు వేఱొకటి యిమ్ము" అనుటే! అప్పుడు, ఆ స్వామి ఇట్లనును: "సరే, నీవు ఈ పనిచేయుము. చేయనిచో నీవు మరణించిన పిదప నీపని పట్టెదను; జన్మజన్మకు నిన్ను నిప్పులలో వేసి మలమల మాడ్చెదను; ఇంక ఏమేమో చేసెదను." ఇట్టి క్షుద్రభావములు మనలో నున్నంత కాలము, ఆ గోపికా ప్రేమోన్మాదస్థితి ఎట్లు అర్థమగును? "అహో! ఆ

పెదవులముద్దు, ఒక్కముద్దు చాలును! నీ ముద్దు నందుకొనిన వానికి నీ కొఱకై తపన, ఆరాటము, క్షణక్షణము పెరిగి పోవుచుండును! ఇతర వ్యసనములన్నియు రూపుమాసి పోవును! నిన్ను వినా మఱెద్దానిని అతడు ప్రేమించుటే మఱచును! నిన్ను మాత్రమే రాగముతో స్మరించుచుండును.'' ఔను! భోగములపై మీకున్న రాగమును, పేరుకొఱకై మీరు పడుచున్న ఆరాటమును, ప్రఖ్యాతిపై మీకున్న క్షుద్రాపేక్షను, ఈ జడప్రపంచపు నీచాడంబరములపై మీకున్న కాంక్షను పరిత్యజింపుము; పూర్తిగా పరిత్యజింపుడు. అప్పుడే, అప్పుడు మాత్రమే, గోపికల ప్రేమ యెట్టిదో మీకు అర్థము కాగలదు. సర్వార్పణము గావింపనిది అట్టి పవిత్రప్రేమకొఱకై ప్రయత్నించుట అతిసాహసమే యగును. అంతరంగము సంపూర్ణముగా పవిత్రమై వెలయు వఱకు, ఆ భక్తియొక్క మహత్త్వము మీకు ఎఱుకపడదు. కటకటా! స్త్రీపురుష విభేదభావములు, ధనకాంక్ష, కీర్తి కామము, అనుక్షణమును హృదయములో పొంగిపోవుచుండు ఈ క్షుద్ర మానవులు గోపికల విశుద్ధప్రేమను శ్రీకృష్ణావతార తత్త్వరహస్యములను అర్థము చేసికొనుటకును, అధిక్షేపించుటకును సాహసించుచున్నారే! ఉత్తమతత్త్వశాస్త్రమగు గీతసైతము ఈ భక్తిపారవశ్యమునకు సాటిగాదు! ఏలయన, గీతలోని సాధకుడు పరమావధి చేరుటకు ఎట్లు నడువ వలయునో, నెమ్మది నెమ్మదిగా నేర్చుకొనుచున్నాడు! కాని ఇక్కడనో, శిష్యులు, గురువులు, ఉపదేశములు, గ్రంథములు, —భయము, దేవుడు, స్వర్గము సహితము—ఏకమై

పోవునట్టి రాగోన్మాదము! అనుభూతి పారవశ్యము!! ఆ స్థితిలో సమస్తమును విసర్జింపబడినది. మిగిలినది భక్తి ప్రమత్తత ఒక్కటియే! సర్వమును విస్మరింపబడిన ఆ కాలమున భక్తున కీ ప్రపంచమున శ్రీకృష్ణుడుతప్ప మఱేమియు కాన్పింపదు. ఎచ్చట చూచినను శ్రీకృష్ణుడే! ప్రతివాని ముఖమును శ్రీకృష్ణవదనారవిందమే! తన ముఖముసై తము శ్రీకృష్ణునిదే! తన ఆత్మయు శ్రీకృష్ణమయమే! శ్రీకృష్ణ భగవానుని మహత్త్వము అటువంటిది!

నలుసుల వెదకుచు మీ కాలమును వృథ చేసికొనకుడు. జీవనసారమగు ప్రధానధర్మమును చేపట్టుడు. చారిత్రక వ్యత్యాసములు అనేకము లుండుగాక; శ్రీకృష్ణుని జీవితకథయందు అసంగతవిషయములు అనేకము చొప్పింపబడియుండవచ్చును. అయినను వానికి మూలాధారము ఏదో ఒకటి ఉండితీఱవలయును! లేనిచో ఈ అత్యద్భుతమగు వినూత్నాదర్శ మెట్లు ఉత్పన్నమైనది? ఇతర మహాపురుషులయొక్కయు, ప్రవక్తలయొక్కయు జీవితములను పరిశీలించినచో, ఆ మహాపురుషులు తమ పూర్వము జరిగియున్న జ్ఞానప్రచారముయొక్క పరిణామఫలమే యనియు, వారు చేయు ఉపదేశములుసై తము ఆ కాలమున దేశమందెల్లెడల వ్యాపించియున్న అజ్ఞాతభావములు తప్ప అన్యములు కావనియు మనకు స్పష్టపడును. "కర్మకొఱకే కర్మ; భక్తి కొఱకే భక్తి; ధర్మముకొఱకే ధర్మము!" అనెడు నవీనాదర్శములు శ్రీకృష్ణునివలన ప్రభవించినవి కావని ఎవ్వరును

నిరూపింపలేరని నేను ప్రతిజ్ఞ చేసి చెప్పుచున్నాను! ఈ భావ రత్నములు ఎవరో ఒకరివలన ప్రభవించినవే గదా! ఇంకెవరి నుండియో సంగ్రహింపబడినవి కావు. శ్రీకృష్ణ జనన కాలమునందు అవిలేవు. అవి వాతావరణమున ఎగురుచుండి యుండనేరవుగదా! శ్రీకృష్ణభగవానుడే ప్రప్రథమముగా వానిని ఉపదేశించిన గురువు! వాని శిష్యుడగు వ్యాస మహర్షి ఆ ఉపదేశమును స్వీకరించి మానవుల కెల్లరకును ప్రచారము గావించి యున్నాడు. ఇది మీ అంతఃకరణము లందు చిత్రించుకొనవలసిన పరమోత్కృష్టభావము! మనము హృదయములందు నిలుపుకొనదగిన అత్యుత్తమ ధ్యేయ మూర్తి గోపీజనవల్లభుడు! అనగా బృందావన గోపికలకు ప్రియుడు! నీకు ఆ అనురాగపారవశ్యము కలిగినప్పుడు, ఆ గోపికలహృదయము నీకు అర్థమైనప్పుడు, 'ప్రేమ' యన నేమో నీవు గ్రహింప గలుగుదువు! లోకమంతయు అదృ శ్యమై, తదితరాలోచనములన్నియు సమసిపోయి, నీ హృద యము విశుద్ధమైనప్పుడు మాత్రమే—చివరకు ధర్మాన్వేష ణముసైతము నిన్నువిడిచిపోయినప్పుడు మాత్రమే—ఆ ప్రేమపారవశ్యము, గోపికలకు లభించిన ఆ అఖండప్రేమ మహత్త్వము నీకు అలవడును. అదియే అహేతుకప్రేమ—"ప్రేమకొఱకగు ప్రేమ" యనగా! అదియే గమ్యములకెల్ల పరమ గమ్యము! అది నీకు దొరకినదా, సమస్తము లభించి నట్లే!

అంతకంటె క్రిందికి దిగి, గీతోపదేశకర్తయగు కృష్ణునికడకు వత్తము. అకటా! భారత దేశములో ఇప్పుడు,

గుట్టమునకుముందు బండినుంచుటవంటి వికట ప్రయత్న మొకటి సాగుచున్నది! గోపికాప్రియునిగ శ్రీకృష్ణుని భావన చేయుట ఏదో ఒక వికృతకార్యముగా మనవా రనేకులు భావించుచున్నారు! యురపియనులకు అది కొంచె మసహ్యముగ నుండునట! డాక్టరు బిరుదు సంపాదించిన ఎవడో ఒక పిచ్చిపుల్లయ్యకు అది రోతగానుండునట! కాబట్టి గోపికల గోల విసర్జించివేయవలసినదే! పాపము, యురపియనుల ఆమోదము లేకుండ కృష్ణుడు జీవించు టెట్లు? వానికి బ్రతుకు తెఱువు లేదు! మహాభారతమునందు ఒకటి రెండుచోట్ల తప్ప గోపికల ప్రస్తావనయే లేదు. ఆ సందర్భములును అంత ప్రధానమైనవి కావు. ద్రౌపదియొక్క ప్రార్థనయందు బృందావనలీలల ప్రస్తావన గలదు. శిశుపాలుని అధిక్షేపము నందును ఈ బృందావనప్రస్తావనగలదు. కాని ఇవన్నియు ప్రక్షిప్తములట! యురపియనులకు హితవుగాని దానిని దేని నైనను త్రోసివేయ వలసినదే! గోపికల ప్రస్తావన, గోపాల కృష్ణుని ప్రశంస సైతము, ప్రక్షిప్తములై పోవుచున్నవి! ఆహా, వ్యాపారసంరంభమున మునిగిపోయిన ఈ మహానుభావులు—మతధర్మమును సైతము వాణిజ్యమున కొక అంగముగా చేసికొనిన ఈ ఘనులు—ఇహమున నేదియో చేసి దానిని పట్టుకొని స్వర్గమునకు ఎగబ్రాక చూచుచుందురే! కోమటి చక్రవృద్ధి—అనగా వడ్డికివడ్డి—రావలసినదే! ఇహమున నిలువచేసికొనినదానిని అతడు పరమున అనుభవించుటకు పన్నుగడ పన్నుచున్నాడు. ఆహా! అటువంటి భావక్షేత్రమున పాపము గోపికలకు తావు లేకుండుట సత్యమే!

ఆ బృందావనగోపికాప్రియుని దివ్యరూపమును విడిచి మనము క్రిందికివచ్చి గీతాబోధకుడగు శ్రీకృష్ణుని క్షేత్ర మును చేరుదము. వేదములకు గీతను మించిన శ్రేష్ఠతర వ్యాఖ్యానము ఇంతవరకు రచింపబడి యుండలేదు; రచింప బడను జాలదు. భాష్యకారులు అనేకులుకలరు. ప్రతి వాడును తన మతమున కనుకూలించు మార్గమున అర్థమును కల్పన చేయుచువచ్చుటవలన శ్రుతులయొక్క, అనగా ఉపనిషత్తులయొక్క, తత్త్వసారమును గ్రహించుట అత్యంత దుర్లభమై పోయినది. కావున అప్పుడు శ్రుతులను ప్రసా దించిన ఆ దేవదేవుడే, ఆ శ్రీహరియే, గీతోపదేశకుడుగా వాని అర్థమును మనకు బోధపఱచుటకు మరల అవతరించి వచ్చినాడు. వాని వ్యాఖ్యానపద్ధతిని మించి, ఏదియు భార తీయుల కీనాడు అక్కఱలేదు. ప్రపంచమునకుకూడ అంతకు మించి ఆవశ్యకమైన దేదియు లేదు. అనంతరకాలమున మన శాస్త్రములకు అర్థముచెప్పబూనినవారు గీతకుసైతము వ్యాఖ్యానము చేయనెంచి, అనేక స్థలములయందు అర్థ మును గ్రహింపలేక తికమకపడిరి. అనేక సందర్భముల యందు భావసరణిని గుర్తింపజాలకపోయిరి. ఎట్లందురా? గీతయందు గోచరించునదేమి? ఈ నవీన భాష్యకర్తల యందు గోచరించున దేమి? ఒకానొక అద్వైత భాష్యకారుడు ఒక ఉపనిషత్తును తీసికొనును; అందు ద్వైత పరములగు వాక్యము లనేకము లుండును. అతడు వానిని మెలిపెట్టి, నలిపి, ఏదో అర్థమును తీయును. అన్ని వాక్యము లందును తనకు హితవగు అర్థమునే తీయుటకు బ్రహ్మ

ప్రయత్నము చేయును. ద్వైతియగు భాష్యకారుడు వచ్చు నెడల, వాని కన్నిటికిని ద్వైత పరముగా అర్థమును చెప్పుటకై అద్వైతభావముగల అనేక వాక్యములను నలిపి నలిపి హింసలపాలుచేయును. కాని గీతలోమాత్రము ఉపనిషద్వాక్యము నొక్కదానినైనను మెలిపెట్టి హింసించు ప్రయత్నము కానరాదు. ఆ వాక్యములన్నియు ఉత్తమములే. నెమ్మదిగా, క్రమక్రమముగా, స్థూలమునుండి సూక్ష్మమునకు, సూక్ష్మమునుండి సూక్ష్మతరమునకు, మెట్టుతర్వాత మెట్టుగా, జీవాత్మ తన పరమగమ్యమగు అఖండ బ్రహ్మమును చేరువఱకు పైపైకి ఎక్కిపోవుచుండును అని శ్రీకృష్ణభగవానుడు పలుకుచున్నాడు. గీతలో తెలుపబడిన దిదియే. మఱియు, కర్మకాండసైతము గీతయందంగీకరింపబడినది; అది ప్రత్యక్షఫలముగా మోక్షము నీయజాలకున్నను, పరోక్షసాధనము కాగలదు; కావున అదియు యోగ్యమైనదే అని తెలుపబడినది. విగ్రహములును పరోక్షముగ ఫలప్రదములే. చిత్తశుద్ధియుండెనేని, క్రతువులు, ఆచారములు అన్నియు ఉపకారకములే. అర్చనలు యోగ్యమైనవే; గమ్యమును చేర్చగలవే; హృదయము పవిత్రముగా, నిష్కపటముగా మాత్రముండవలయును. వివిధములగు పూజావిధానములు ఆవశ్యకములే. కావేని అవి పుట్టియుండవు. ఆధునికులలో కొందఱు భావించునట్లు, ఈ మతములును, సంప్రదాయములును ఏదో కొంత డబ్బు సంపాదించుకొను నిమిత్తమై కపటవర్తనులు, వంచకులు, సృష్టించిన తంత్రజాలముమాత్రము కాదు. వారి వాదము

ఎంత యుక్తియుక్తముగ కాన్పించినను, అందు సత్యము లేదు. ఇవి ఆ విధముగ కల్పన చేయబడినవి ఎంతమాత్రమును కావు. ఇవి నరుని ఆత్మయొక్క అవసరములనుబట్టి కలిగినవే! భిన్నదశాంతరములందున్న నరుని కాంక్షలను, పిపాసలను, తృప్తిపఱచుటకే ఇవి ఉద్భవమైనవి. వీనికి విరుద్ధముగా మీరు ప్రచారమును సాగింప నక్కఱలేదు. అవసరము తొలగిపోవునప్పుడు, దానితోపాటు ఇవికూడ తొలగిపోవును. కాని ఆ అనసర మున్నంతవఱకు, మీ రెంతగా ప్రచారము సాగించినను, ఎంతగా విమర్శలు చేసినను, ఇవి నిలిచి యుండవలసినదే. మీరు ఖడ్గములతో తెగవేయుడు; ఫిరంగులు ప్రయోగింపుడు; ప్రపంచమునంతను నరరక్తముతో ముంచివేయుడు. విగ్రహములు అవసరమగునంతవఱకు ఉండియే తీఱును. ఈ ప్రతిమలు, మతములోని ఈ అంతరార్థములు, అన్నియు నిలిచియే యుండును. అవి అటుల నిలిచి యుండవలసిన కారణము శ్రీకృష్ణభగవానుడు తెలిపియే యున్నాడు.

భారతదేశ చరిత్రలో, కొంచెము విషాదకరమగు ప్రకరణమున కిప్పుడు మనము రావలసియున్నది. వేర్వేఱు తెగల పోరాటముల అలజడి కొంతదూరమున గీతయందే మనకు వినవచ్చినది. వానికి సఖ్యతకూర్చుటకై సామరస్యము నుపదేశించు మహాగురువుగా, సౌహార్దమును ప్రచారము చేయు ప్రబోధకుడుగా, శ్రీకృష్ణభగవానుడు నిలబడుచున్నాడు. "మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ" (ఆయా తెగలన్నియు దారమునైని ముత్యములవలె

నాలో కూర్పబడియున్నవి) అని ప్రకటించుచున్నాడు. అవిగో మరల దూరమునుండి ధ్వనులు, వివాదముల కలకలములు, వినవచ్చుచున్నవి. కొంతకాలము శాంతిసామరస్యము లుండెను కాబోలు! ఆపిదప మతభేదములవలన నేగాక కుల భేదములవలనను వైరములు సాగుచున్నట్లున్నవి! మన సంఘములో రాజు లొకవైపున, బ్రాహ్మణు లొకవైపున యుద్ధసన్నద్ధులై నిలిచియున్నారు. చూచుచుండగనే వారికి పోరాటము సాగి తుణములో విజృంభించినది. దాదాపు వేయి సంవత్సరముల కాలము భారతదేశమును ముంచి వేసిన, ఒక ఉత్తుంగ సముద్రతరంగశిఖరమున దేదీప్యమాన ముగా వెలుంగుచు ఇంకొక మూర్తి ప్రత్యక్షమగుచున్నాడు. ఆయన ఎవరోకాదు, మన గౌతమశాక్యమునియే! ఆయన బోధలును, ఉపదేశములును మీరందఱు ఎఱిగినవే! ప్రపంచమున ఇంతవఱకు అవతరించిన ధర్మప్రచారకులలో అత్యుత్తముడును, అతిసాహసికుడును అగు ఈ కర్మయోగిని శ్రీహరి అవతారముగా మనము పూజించుచున్నాము. తనకు తానే శిష్యుడై అవతరించినట్లు ఆ శ్రీకృష్ణభగవానుడే తన సిద్ధాంతములను ఆచరణలో పెట్టుట ఎట్లో చూపుటకై మరల వచ్చినాడు! గీతలో ఇట్లు బోధించిన ఆ కంఠస్వరమే మరల వినవచ్చినది :

"స్వల్ప మప్యస్య ధర్మస్య
త్రాయతే మహతో భయాత్"

(ఈ ధర్మము ఎంత స్వల్పముగ నిర్వహించినను, అది గొప్ప భయమునుండి కాపాడును.)

"స్త్రియో వైశ్యా స్తథా శూద్రా
స్తేఽపి యాంతి పరాం గతిమ్"

(స్త్రీలు వైశ్యులు శూద్రులు సయితము పరమపదమును పొందగలరు.)

అందఱి బంధములను త్రెంచివేసి, ఎల్లర శృంఖలములను ఛేదించివేసి, సర్వజనులకును పరమపదమును చేరు స్వాతంత్ర్యము కలదని గీతావచనరూపమున ఇట్లు ప్రకటించిన శ్రీకృష్ణభగవానుని ఆ కంఠస్వరమే మేఘగంభీర ధ్వనులతో దశదిశల మరల మారుమ్రోగినది.

"ఇహైవ తైర్జిత స్సర్గో
యేషాం సామ్యే స్థితం మనః।
నిర్దోషం హి సమం బ్రహ్మ
తస్మా ద్బ్రహ్మణి తే స్థితాః."

(ఎవరి మనస్సు సమత్వమునందు సుస్థిరమైనదో, వారీ జన్మయందే సంసారమును జయించుచున్నారు; అనగా మోక్షమును బడయుచున్నారు. కారణమేమన, బ్రహ్మము నిష్కళంకమును సర్వసమమునైయున్నది. కావున వారు బ్రహ్మమునందే స్థిరపడుచున్నారు.)

"సమం పశ్యన్ హి సర్వత్ర సమవస్థిత మీశ్వరం।
న హి నస్త్యాత్మనాత్మానం తతో యాతి పరాంగతిమ్॥"

(ఎవడు ఈశ్వరుని సర్వత్ర సమభావమునందున్నట్లు చూచు చుండునో, అతడు ఆత్మను ఆత్మతో హింసింపడు. కావున పరమగతిని, అనగా మోక్షమును పొందుచున్నాడు.)

ఈ గీతాబోధకు సజీవనిదర్శనమును చూపుటకో యన, అందొక అంశమునైనను ఆచరించి చూపుటకోయన, ఆ ఉపదేశకుడే వేఱొక రూపమున మరల వచ్చియున్నాడు. దీనులను, పేదలను, దరిజేర్చి ధర్మోపదేశము చేసిన శాక్యముని ఆతడే! ప్రజల హృదయములను చూఱగొను టకై, ఈయన దేవభాషను విడిచి జనసామాన్యభాషలో బోధలు సలిపినాడు; బిచ్చగాండ్రతోడను, నిరుపేదలతోడను, దిక్కులేనివారితోడను, కలిసి జీవించుటకై తన సింహాసన మును త్యాగము చేసినాడు; పూర్వము శ్రీరామావతార మున చేసినట్లు ఇంకొకసారి పంచముని తన కౌగిట నిలుపు కొనినాడు!

ఆయన గావించిన ఘనకార్యములను, ఆయన ఉత్తమ శీలమును మీరందఱును ఎఱుగుదురు. కాని ఆ కార్యములందు ఒక గొప్ప లోపముకలదు. అందువలననే ఈ నాడు మనమిట్లు ఇడుమల గుడుచుచున్నాము. అందు బుద్ధభగవానుని దోషము లేదు. ఆయన పరమ పవిత్రుడు! మహిమోన్నతుడు! కాని అప్పుడు ఆర్యసంఘములోనికి చొరబారివచ్చిన అనాగరికులును మూఢులును అగు ఆయా జాతులవారు అట్టి ఉత్తమాదర్శములను జీర్ణముచేసికొన జాలరైరి! నానావిధములగు మూఢవిశ్వాసములుగల్గి, తుచ్ఛ

దేవతారాధనలను చేయు ఈ జాతులవారు ఆర్యసంఘము లోనికి రివ్వున చొరబారి వచ్చిరి. కొంత కాలమువఱకు వీరు నాగరికులవలెనే కాన్పించిరి. కాని ఒక శతాబ్దమైనను గడవకపూర్వమే, తమ పూర్వులు పూజించుచు వచ్చిన సర్పములు, భూతములు మున్నగు నితర వస్తువులను మత మున ప్రవేశ పెట్టిరి. అందువలన భారతదేశమంతయు అధో గతిని పడి మూర్ఖజనసంకీర్ణమై పోయెను! బౌద్ధులు జంతు వధలను జూచి ఆగ్రహము పూని వైదికయజ్ఞములను ఖండించిరి. ఈ యజ్ఞములు ప్రతియింటను జరిగెడివి. ఇంటిం టను ప్రజ్వలితాగ్ని యుండెడిది. వారి పూజాకలాప మంతయు ఇంతే. అట్టి యజ్ఞములు రూపు మాసినవి. మహా శోభాయమానములగు దేవళములు, వైభవోపేతములగు కర్మలు, భోగపరాయణులగు అర్చకులు, మఱియు ఈ కాల మున భారతదేశమున గోచరించు సర్వాడంబరములు వాని బదులుగా వచ్చి చేరినవే! బుద్ధుడు వైదిక సాంప్రదాయ కములగు విగ్రహములను ధ్వంసము చేసినాడని ఇటీవల కొందఱు వ్రాసిన గ్రంథములను చదువగా నాకు నవ్వు వచ్చినది. బౌద్ధమతమే బ్రాహ్మణసంప్రదాయమును విగ్ర హారాధనమునుగూడ భారతదేశమున సృష్టిచేసినదని పాపము వారికి తెలియదు?

ఒకటి రెండు సంవత్సరములక్రిందట రష్యాదేశీయు డొకడు ఒక గ్రంథము వ్రాసియున్నాడు. ఆయన ఏసుక్రీస్తు యొక్క అతివిచిత్రమగు జీవితకథ నొకదానిని తాను కని పట్టినటుల ఆ పుస్తకమున తెలుపుకొన్నాడు. ఆ గ్రంథమునం

దొక భాగమున క్రీస్తు బ్రాహ్మణులయొద్ద జ్ఞానార్జనము చేయుటకై జగన్నాథాలయమునకు వెళ్లినట్లును, బ్రాహ్మణులితరులయెడచూపు అసహనభావమును, వారి విగ్రహములను చూచి అసహ్యించుకొని, టిబెట్టు దేశములోని 'లామా'ల కడకు పోయి సిద్ధత్వమును సాధించి ఇంటికి మరలిపోయినట్లును ఆయన అందు వ్రాసెను! హిందూదేశచరిత్ర తెలిసిన యే బాలునికైనను ఈ విషయమంతయు వట్టి అబద్ధమేయని, ఆవ్రాతల వలననే తెలియును. ఏలయన, జగన్నాథము లోని ఆలయము ప్రాచీన బౌద్ధాలయమేకదా! ఈ ఆలయమును ఇంక కొన్నిటిని మనము అనంతరకాలమున మరల హిందూదేవాలయములుగా మార్చితిమి. ఇట్టి కార్యములను మనమింకను చాల చేయవలయును. జగన్నాథములో ఆ కాలమున ఒక్కబ్రాహ్మణుడైనను లేడు! అయినప్పటికిని, అచ్చటి బ్రాహ్మణులయొద్ద చదువుకొనుటకు ఏసుక్రీస్తు వచ్చెనని చరిత్రపరిశోధకుడగు ఈ ఘనుడు చెప్పుచున్నాడు!

జీవకారుణ్యము నెంతబోధించినను, మహోదాత్తమగు నీతిధర్మములను ఎంత ప్రకటించినను, నాశము లేని ఆత్మయొకటి కలదా లేదా యను సూక్ష్మ వివాదముల నెన్ని సాగించినను, బౌద్ధమతసౌధము ఈ తెఱగున నేలకూలి ముక్కలుముక్కలైపోయినది. ఆ జీర్ణావస్థ బహు బీభత్సరూపమైనది. బౌద్ధమతనాశమునాటి బీభత్స దశను వర్ణించుటకు ఇప్పుడు వ్యవధి గాని అభిలాష గాని నాకు లేదు. కాని ఒక్కమాట. అతి నీచములగు కర్మకలాపములు, అసహ్యములగు దురాచారములు ఎన్నో

బౌద్ధమతముపేరిట వెలసినవి. కొన్ని బౌద్ధగ్రంథములలో కానవచ్చుచున్నంతటి బూతులు ఇంతవఱకు ఏ మానవ బుద్ధియు ఊహించియుండదు; ఏమానవహస్తమును వ్రాసి యుండదు. అవి అంత దుర్భరముగా, ఘోరముగానున్నవి. భ్రష్టమైపోయిన బౌద్ధధర్మమునకు అవి మూర్తరూపములు.

అట్లయ్యును భారతదేశము బ్రతికి యుండవలసిన దగుటచేత, ఈశ్వరాంశ మఱొకసారి అవతరించి వచ్చెను. ధర్మము క్షీణించినప్పుడెల్ల అవతారము తాల్చివచ్చెదనని చాటి చెప్పిన భగవానుడు మరల వచ్చినాడు. ఈ పర్యాయము దక్షిణదేశమున అవతారము తాల్చినాడు. తన పదునారవ యేటనే గ్రంథములన్నిటిని వ్రాసి ప్రసిద్ధిగాంచిన ఆ బ్రాహ్మణ బాలుడు, బాల శంకరాచార్యులు ఉద్భవించినాడు! ఆ పదునారేండ్ల బాలుడు ఆనాడు వ్రాసిన గ్రంథములను ఈనాడు ప్రపంచమెల్ల, విస్మయ చకితమై, అద్భుతావిష్టమై చూచుచున్నది! ఆ బాలుడు నిజముగా అట్టివాడే! ఆతడు భారతదేశమును తొల్లింటి నిర్మలస్వచ్ఛదశకు తీసికొని రా బ్రయత్నించినాడు. ఆయన పూనిన ఈ మహోద్యమము ఎంతటిదో మీరే ఊహించు కొనుడు. ఆయన అవతరించునాటికి భారతదేశము ఎట్టి కల్లోల పరిస్థితులలో నుండెనో కొంతవఱకు మీకిప్పుడు తెలిపియున్నాను. మీరిప్పుడు సంస్కరింప బూనిన ఘోర దోషము లన్నియు ఆ పతనావస్థయొక్క ఫలితార్థములే! తార్తారులు, బెలూచీలు, మొదలగు ఘోరజాతులు భారత దేశమునకు వచ్చి బౌద్ధులై పోయినారు; మనలో కలిసి

పోయినాడు. వారి జాతీయాచారములను మనలో నెమ్మదిగా చొప్పించినాడు. అందువలన మన జాతీయజీవన మంతయు మహా ఘోర బీభత్స దురాచార భూయిష్ఠమై పోయినది. బౌద్ధులవలన ఆ బాలుడు సంపాదించుకొనిన పిత్రార్జితము ఇది! ఆ నాటినుండి ఈ నాటివఱకును భారత దేశమున జరుగుచున్న కృషియంతయు, వేదాంతధర్మ సాహాయ్యమున బౌద్ధపతనావస్థనుండి దేశమును మరల పునరుద్ధరించుటే. అది ఇంకను జరుగుచునే యున్నది. శ్రీ శంకరులు మహాతత్త్వవేత్తయై అవతరించి, బౌద్ధ వేదాంతమతముల సత్య తత్త్వార్థములు అంతగా భిన్నములు కావనియు, శిష్యులు గురువుయొక్క బోధను అర్థము చేసికొన జాలక పతితులైపోయి, జీవుడు లేడని, దేవుడు లేడని వాదించుచు, నాస్తికులై పోయిరనియు రుజువు చేసి లోక మునకు చాటి చెప్పినాడు. అప్పుడు బౌద్ధమతస్థులందఱును వెనుకటి మతములోనికి తిరిగి రా సాగిరి. కాని వా రప్పటికే ఈ దురాచారము లెన్నిటికో అలవాటుపడి యుండిరి. చేయగల దేమున్నది?

అంతట తేజోవైభవమూర్తియగు శ్రీ రామానుజుల వా రుద్భవించిరి. శంకరాచార్యులకు మహోజ్జ్వల బుద్ధి వైభవముతో తులదూగు హృదయవైశాల్యము లేదని నా భావము. రామానుజాచార్యుల హృదయము మహో దార మైనది. పీడితులకై ఆయన హృదయము వేదన నొందెను. వారియెడ ఆయనకు సానుభూతికలిగెను. అప్పటికి దేశాచారములలో కలిసిపోయి, ఎల్లెడల విజృంభించుచున్న

కర్మకలాపములను ఆయన సాధ్యమైనంతవఱకు సంస్కరించి పవిత్రీభూతము కావించినాడు. ప్రజలకు అత్యవసరములగు క్రొత్త కర్మలను, పూజా కలాపములను, ఏర్పఱచినాడు. ఇదికాక ఉత్తమాధ్యాత్మిక పూజావకాశమును—బ్రాహ్మణుడు మొదలు మాలవాని వఱకును ప్రతివానికిని—కల్పించినాడు. ఇదియే శ్రీ రామానుజులవారు కావించిన మహాకార్యము! ఆ ఉద్యమము ఉత్తరముఖముగా పురోగమింప సాగినది. క్రమ క్రమముగా ఉత్తర భారతమంతయు వ్యాపించినది. ఆతరువాత, మహమ్మదీయ పరిపాలన కాలమున అచ్చటి కొందఱు మహానాయకులు దానిని చేపట్టిరి. ఉత్తరదేశపు నవీనప్రవక్తలలో దీనిని చేపట్టిన మహనీయులలో మహోజ్జ్వల బుద్ధిసంపన్నుడు (శ్రీ) చైతన్యులవారు.

(శ్రీ) రామానుజులవారి కాలమునుండి ఒక విశేషము మీరు గుర్తింపవచ్చును. ప్రతివానికిని ఆధ్యాత్మిక సాధనకు అవకాశము కల్పింపబడినది. శంకరాచార్యులవారికి ముందున్న ప్రవక్తలందఱును ఈ ధర్మమునే పాటించిరి. రామానుజులకు తర్వాతవచ్చిన ప్రవక్తలకును అయ్యదియే ధర్మసూత్రమై వెలసినది! శంకరాచార్యులవారు ఈ విషయమున అంగీకారములేనివారను ప్రతీతికి హేతువేమో నేను గ్రహింప జాలకున్నాను. అట్టి ప్రాతికూల్యము వారి గ్రంథములలో ఎచ్చటను నాకు గోచరించుట లేదు. శంకరాచార్యులవారి బోధలయందు లోకమునకు ఇట్టి భావముండుటకు కారణము చాలవఱకు బుద్ధభగవానుని విషయమునందు వలెనే వారి శిష్యులయొక్క అసమర్థత యనియే

నా తలంపు. ఉత్తర భారత సిద్ధపురుష శేఖరులగు శ్రీ చైతన్యులవారు పురాణకాలమునాడు గోపికలందు చూపట్టినట్టి ప్రేమోన్మాదమునకు మూర్తిభావమై వెలసిరి. ఆయన బ్రాహ్మణుడు; ఆ కాలమున తర్కమునకు ప్రసిద్ధిగాంచిన సద్వంశమునందు జన్మించినవాడు; తర్కశాస్త్రము నందు మహావిద్వాంసుడు; తర్కశాస్త్రబోధకుడు; జగద్విజయము సాధించిన తార్కికాగ్రగణ్యుడు; తర్కజ్ఞానమే జీవితమునకు పరమ గమ్యమని బాల్యమునుండి నేర్చుకొని నాడు. అయినను ఒక మహాత్ముని కరుణవలన ఆయన జీవిత మంతయు మాఱిపోయినది. వాగ్వాదములను, తర్కవిద్యా గురుపదవులను పరిత్యజించినాడు! లోకమున భక్తిప్రబోధము సలిపిన గురువులలోనెల్ల అగ్రగణ్యుడైనాడు! వెల్లిచైతన్యు డను పేరు వడసినాడు! వానిభక్తి వంగభూమియం దంతటను వ్యాపించి ప్రతివానికిని భవక్లేశోపశాంతి కలిగించెను. వాని ప్రేమకు హద్దులు లేవు. పుణ్యపురుషుడు గాని పాతకి గాని, హిందువు గాని మహమ్మదీయుడు గాని, పవిత్రుడు గాని అప విత్రుడు గాని, వీథి కెక్కిన వెలయాలు గాని, అందఱును వానికి ప్రేమపాత్రులే; అనుగ్రహపాత్రులే. కాలక్రమమున అన్నియు భ్రష్టమైపోయినట్లే వీని సంప్రదాయము సైతము చాలవఱకు ఈనాడు భ్రష్టమైపోయినప్పటికి కూడ, పేద వారికి, పతితులకు, దుర్బలులకు, కులభ్రష్టులకు, సంఘబహిష్కృతులకు ఎల్లరకును శరణము నొసగుచున్నది.

కాని సత్యముకొఱకు ఒక్కవిషయమును నే నిచట చెప్పవలసియున్నది. వేదాంతమతావలంబులయందు అద్భుత

మగు భావవైశాల్యము గోచరించును. శంకరాచార్యులవారిని బాగుగా అర్థము చేసికొనినవా డెవ్వడును భారతదేశములోని వివిధ సంప్రదాయములన్నియు నిజముగా విభిన్నములని చెప్పడు. అట్లయ్యును శంకరులు కులతారతమ్యములను పాటించుటయందు గట్టి పట్టుదల గలవాడై యుండెను. ఇక వైష్ణవ గురువులో, కులవిషయక సమస్యలందు మహౌదార్య మును, మతవిషయక సమస్యలందు అసహనభావమును ప్రదర్శించిరి.

వీరిలో ఒకరికి అద్భుతబుద్ధిబలము, రెండవవారికి అద్భుత హృదయవైశాల్యము కలదు. అట్టి బుద్ధిని, అట్టి హృదయ మునుకూడ కలిగిన ఒక మహానుభావుడు జన్మింపవలసిన కాలము ఏతెంచెను. ధగద్ధగితమగు శంకరుని బుద్ధి విశేష మును, అద్భుతమగు చైతన్యుని అఖండ విశాలహృదయ మును, ఒకేశరీరములో కూర్చుకొని ఒకరు అవతరించుటకు కాలము పరిపక్వమయ్యెను. ప్రతి సంప్రదాయమును కల్పించి నది ఒకేఆత్మ, ఒకేదైవము అని కనుకొనగలిగినవాడు, ప్రతి జీవియందును భగవంతుని సాక్షాత్కరింపజేసికోగల వాడు; వేదవారలకొఱకు, దుర్బలురకొఱకు, పీడితుల కొఱకు, సంఘభ్రష్టులకొఱకు—ఒక్క భారతదేశములోనే కాదు, ప్రపంచమంతటను ప్రతివానికొఱకును—ఆరాటపడి సానుభూతితో తపించిపోవు హృదయముగలవాడు; ఒక్క భారతదేశమందే గాక, ప్రపంచమంతటను, నిరంతరము ఒకదానితో ఒకటి పోరాడుకొనుచున్న అన్ని మతసంప్ర దాయములకును అద్భుతసామరస్యముగూర్చు మహోత్కృష్ట

భావములను సంకల్పింపగల మహోజ్జ్వల బుద్ధివైభవము గలవాడు; బుద్ధి హృదయసమ్మేళనముగల సార్వలౌకిక మతమును కల్పించు శక్తిగలవాడు: అవతరించు తరుణ మేతెంచెను. అట్టి పురుషోత్తము డొక్కడు ఈ లోకమున నవతరించెను. అట్టివాని పాదారవిందములచెంత సంవత్సరముల తరబడి కూర్చుండు మహాభాగ్యము నాకబ్బినది. కాలము పరిపక్వమై, అట్టి మహాపురుషు డవతరింపవలసి వచ్చినది. కావున ఆయన అవతరించినాడు. ఇం దొక విశేషము కలదు. పాశ్చాత్యుల అభిప్రాయములతో, పాశ్చాత్యభావములతో, నిండి కైపెక్కిపోయిన ఒక మహానగరముదాపున ఆయన అవతరించెను. భారతదేశము నందలి ఇతర నగరములన్నింటిని మించి కరుడుకట్టిన యూరపియను సంప్రదాయములతో మదించిపోయిన ఆ మహానగర ప్రాంతమునసే, ఆయన జీవితకార్యము జరిగినది. పుస్తకజ్ఞాన మనునది ఎఱుగక, అచ్చోటున ఆయన నివసించినాడు. ఈ మహామేధావికి తన పేరును వ్రాయుటకూడ చేతకాదు. ఐనను మన విశ్వవిద్యాలయములనుండి వెలువడు అద్భుతధీమంతులగు పట్టభద్రులుసైతము ఆయనను మహామనీషాగ్రగణ్యునిగా తలదాల్చిరి! ఈ శ్రీరామకృష్ణపరమహంస అద్భుతచరిత్రుడు. ఆయననుగూర్చి చెప్పుటకు చాలకాలము పట్టును. అంత అవకాశము నాకిపుడు లేదు. హైందవమహాపురుషులలో సిద్ధమూర్తియై ఆధునికయుగప్రవక్తయై వెలసిన ఆ శ్రీరామకృష్ణుని నామమునుమాత్రము ఇప్పుడు సంస్మరింతును. ఆయన ప్రబోధము ప్రస్తుతకాలమున ఎంత

యేని శ్రేయస్కరము. ఆ మహాపురుషునిలో దాగియున్న దివ్యశక్తిని గుర్తింపుడు. ఒక వేద పురోహితుని కుమారుడు; ఏదో ఒక మారుమూలపల్లెలో పుట్టినవాడు; ఊరు పేరులు లేని ఈ వ్యక్తి ఈ నాడు యూరపునందును, అమెరికా యందును, వేలకొలది జనముచేత యథార్థముగ పూజింప బడుచున్నాడు! రే పింకను లక్షలాదిగా ఆయనను పూజిం తురు! భగవత్సంకల్పము ఎట్టిదో ఎవరికి ఎఱుక?

సోదరులారా! ఇప్పుడు ఈశ్వరసంకల్పప్రచారరీతిని మీరు చూడజాలకున్నచో, మీరు గ్రుడ్డివారే, జన్మాంధులే! ఇంకొక అవకాశము దొరకునేని, ఈ మహాపురుషుని గుఱించిన వివరములను పూర్తిగా తెలుపుదును. నే నిప్పుడు ఏ సత్య వచనమునైనను మీకు బోధించియుండినయెడల, అది ఆయనది, ఆయనదే యనియు; సత్యముకాని, సక్రమము కాని, లోకోపకారకరముకాని ఏ విషయము చెప్పియున్నను, అది నాదే యనియు, దాని బాధ్యత యంతయు నా పైననే గలదనియు మాత్రము ఇప్పుడు మనవి చేయుచున్నాను.

మన ప్రస్తుత కర్తవ్యము

(చెన్నపురి, తిరువల్లిక్కేణి సారస్వత సంఘమున నొసగిన ఉపన్యాసము.)

ప్రపంచము సాగిపోవుచున్న కొలది, జీవన సమస్య ప్రతిదినమును అతిగంభీరమును, విశాలమును, అగుచున్నది. వేదాంతధర్మము మొదట దర్శింపబడినప్పుడే—ఆ ప్రాచీన కాలమునందే—జీవమంతయు అభిన్నమనెడు మహాసత్యము ప్రబోధింపబడియున్నది. ప్రపంచమునంతను తనతోడ లాగి కొని పోకుండ, విశ్వములో ఒక్క అణువైనను కదలజాలదు. ప్రపంచమంతయు వెన్నంటి రాకుండ ఏదియు పురోగమనము సాగింపజాలదు. సంకుచితదృష్టితో—అది జాతీయము కానిండు, సాంఘికము కానిండు—ఏ సమస్యయు పరిష్కారము కాజాలదని అనుదినము మనకు విశదమగుచునే యున్నది. ప్రతి సంకల్పము, ప్రపంచమంతటను వ్యాపించునంతగా విశాలము కావలయును; ప్రతి ఉద్యమము, మానవ జాతినంతను—జీవకోటినంతనుకూడ—తనలో ఇముడ్చుకొన జాలునంతదనుక క్రమాధిక వికాసము పొందవలయును. మనదేశము ప్రాచీనకాలమునందువలె కొలది శతాబ్దముల నుండి పురోగమింపకుండుటకు కారణము ఇందువలన విశదమగుచున్నది. మన మిట్లు భ్రష్టులమగుటకు గల కారణములలో నొకటి, మన దృక్పథము సంకుచితమగుటచే మన కార్యములయొక్క ఫలవ్యాప్తి పరిమితమగుట!

ఒకే మహాజాతినుండి రెండు విచిత్రములగు ఉప జాతులు ఉద్భవించినవి. అవి వేర్వేఱుపరిస్థితులలో, వేర్వేఱు వాతావరణములలో, పడిపోయి, దేని కది తన ప్రత్యేక మార్గమున జీవిత సమస్యలను పరిష్కరించుటకు పూను కొనినది. ప్రాచీన హిందూజాతియు, ప్రాచీన గ్రీకుజాతియునే ఈ ఉపజాతులు. హైందవార్యుడు, ఉత్తరమున తుషార కిరీటములతో నొప్పారు హిమాలయ పర్వతములు, చుట్టును ప్రావాహిక సముద్రములం బోలు మధురజలపూరితములగు నదులు, ఎటుచూచినను దిగంతములవఱకు వ్యాపించినట్లున్న సాంద్రారణ్యములు తనకు అడ్డునిలువ, తన దృష్టిని అంత ర్ముఖము చేసినాడు. నిశితమేధాశాలియగు ఈతడు, తన్ను ఆవరించిన మనోహర ప్రకృతిదృశ్యముల ప్రేరణవలన ఆంతరదృష్టి గలవాడగుట స్వభావసిద్ధమే. ఈ విధముగా నిజమనఃపరిశోధనమే హైందవార్యునకు స్వాభావిక మై పోయినది. ఇక గ్రీకు ఆర్యుడన్ననో, సుందరములగు గ్రీకు ద్వీపరాశినడుమ ప్రవేశించినాడు. అతడాక్రమించిన భూ భాగములో గాంభీర్యమునకు మించిన సౌందర్యము కలదు. వానిచుట్టునున్న ప్రకృతి నిరాడంబరసుందరమై నేత్రపర్వ ముగా నుండెను. కావున వాని మనస్సు సహజముగ బహిర్ముఖమై, బాహ్యప్రపంచపరిశీలనకు పూనుకొనినది. తత్ఫలితముగ హిందూదేశమునందు పృథక్కరణశాస్త్రములు (Sciences of Analysis) అన్నియు, గ్రీసు దేశమునందు సమ్యక్కరణశాస్త్రము (Sciences of Generalisation) లన్నియు ఉద్భవమైనవి. హిందువుని బుద్ధి తన విశిష్టమార్గమున

నడచి, మహోద్భుత ఫలమును సాధించినది. ప్రస్తుతకాల మందుసైతము హైందవుని తార్కికశక్తియు, మేధాశక్తియు సాటిలేనివి. ఏ ఇతరదేశబాలురకును మనబాలురు తీసిపోరు. వారితో పోటీపడినప్పుడెల్ల మనవారే విజయము గాంచు చున్నారు. బహుశః భారతదేశమును మహమ్మదీయులు జయించుటకు ఒకటి రెండు శతాబ్దముల పూర్వమే మన జాతియొక్క శౌర్యము నష్టపడిపోయియుండును. తత్ఫలముగా మనజాతియొక్క విశిష్టత హద్దులు మీఱి పెరిగి పతితహేతు వయినది. ఆ పతనము భారతదేశమున నన్నిటియందును— చిత్రకళలందును, గానకళయందును, శాస్త్రములందును, ఇట్లు అన్నిటియందును—గోచరించుచు వచ్చినది. చిత్రకళ యందు విశాలమగు భావసంపద పోయినది; అంగసౌష్ఠవము అడుగంటినది; రూపకల్పనమున గాంభీర్యము తొలగినది; కేవలాలంకారదృష్టితో కూడిన జిలుగుకూర్పులు బయలు దేఱినవి; జాతియొక్క స్వతంత్రకల్పనాశక్తి విధ్వంసమైపోయి నట్లుండెను. గానమునందు ప్రాచీన సంస్కృతగానకళా లక్షణమగు ఆత్మోద్ధారకభావసంపద పోయినది. ప్రతి స్వరమును సుస్పష్టముగా స్వతంత్రమై నిలిచి అద్భుత సమరసభావమును కల్పనచేయుట అరుదైనది. ప్రతి స్వర మును, తన విశిష్టసౌందర్యమును కోల్పోయినది. ఆధునిక గానమంతయు అర్థవిహీనమగు స్వరసమ్మేళనము, గందర గోళమగు శబ్దవిన్యాసరాశి! గానకళయందలి భ్రష్టత్వమునకు ఇదియొక చిహ్నము. మీ ఆదర్శములందును స్వతంత్ర భావసంపద అడుగంటి, అలంకారికతయే ఎక్కువగా కాన్పిం

చును. మన అభిమానక్షేత్రమగు మతమునందు సైతము మహాభయంకరమగు పతనమే సంభవించినది. మనము నీరుత్రాగునప్పుడు, లోటాను కుడిచేతితో పట్టుకోవలయునా ఎడమచేతితోపట్టుకోవలయునా, అను నిట్టి ప్రధానసమస్యలను గూర్చి తర్కించుచు వందలకొలది సంవత్సరములు తమశక్తిని, బుద్ధిని, కాలమును బూడిదపోయుచున్న ఈ చచ్చుజాతి ఇంతకన్న ఏమిచేయగలదని మీ రాశింపగలరు? నేను మిమ్ము తాకవచ్చునా, మీరునన్ను తాకవచ్చునా? అటుల తాకినయెడల చేసికొనవలసిన ప్రాయశ్చిత్తమేమి? ఇట్టి వాదములతోడను, వంటయింటి విషయములను గూర్చిన చర్చలతోడను, దేశమునందలి మహామేధాసంపన్నులు శతాబ్దములకొలది కాలమును దుర్వ్యయము చేయుటకంటె మించిన భ్రష్టత్వము ఇంకేమి ఉండగలదు? జీవేశ్వరసంబంధమును గుఱించి ఎన్నడేని లోకమున ప్రచారముగాంచిన సిద్ధాంతములలోనెల్ల ఉత్తమోత్తమములు, సూక్ష్మాతి సూక్ష్ములు, మహామహిమాఢ్యములు, అగు మహాసిద్ధాంతములకు నిధి యనందగు వేదాంతము అడవుల పాలై సగము నష్టమైనది; కొలదిమంది సన్న్యాసులు అందు కొంతకాపాడిరి. ఈ మహాజాతిలోని తక్కినవారందఱు ఒకరినొకరు తాకుట, అన్న వస్త్రముల తీరు, మున్నగు మహా సమస్యలను గూర్చి నిర్విరామముగా తర్కించుచుండిరి. మహమ్మదీయ సామ్రాజ్యము మనకు చాల ఉపకారములను సమకూర్చినమాట సత్యమే. ప్రపంచములో అత్యంత నీచ మానవుడు సైతము అత్యుత్తమపురుషవరేణ్యునికైనను

ఎప్పుడో ఒకసారి, ఏదియో కొంత, తాను నేర్పగలిగియే యుండును. కాని అంతమాత్రముచేత . జాతికి సత్త్వము చేకూరదు. మహమ్మదీయ సామ్రాజ్యకాలమునకుపిమ్మట మేలునకో కీడునకో, ఆంగ్లేయుల భారతదేశాక్రమణము జరిగినది. ఏ ఆక్రమణమైనను అనర్థమే. ఏలయన ఒకరి వశమైపోవుటయే అనర్థముగదా! విదేశీయుల పరిపాలన అనర్థమనుటకు సంశయములేదు. కాని అనర్థమునుండికూడ ఒక్కొకప్పుడు మేలుచేకూరుచుండును. ఇంగ్లీషువారి విజయము వలన గొప్పమేలే చేకూరినది. ఇంగ్లాండేకాక యూరపుఖండమంతయు అసలు గ్రీసు నాగరికతకు ఋణపడియున్నది. యూరపునాగరికతయందును, సంస్కృతియందును గ్రీసుదేశప్రభావము ప్రకటితమగుచుండును. అచ్చటి ప్రతిభవనమును, ప్రతివస్తువును గ్రీసుసంప్రదాయముద్రను ధరించియే యుండును. యూరపియను శాస్త్రములును, కళలును గ్రీసుసాంప్రదాయకములేగాని వేఱుగాదు. నేడు ప్రాచీనగ్రీసుదేశీయుడు భారతభూమియందు ప్రాచీనహిందువును కలిసికొనవచ్చినాడు. ఈ విధముగా విజాతి ప్రభావము నెమ్మదిగను నిశ్శబ్దముగను మనలో చొరబడినది. ఇప్పటి మన విశాలదృక్పథమునకు, మన పున రుద్ధరణోద్యమములకు, పైవానిసమష్టిబలమే కారణము. జీవితమును గుఱించిన ఉదార విశాలభావములెన్నో మన యెదుట నిలిచినవి. మొట్టమొదట మనము కొంత దిగ్భ్రాంతి పొంది, సంకుచితమార్గము పట్టజూచినను, క్రమక్రమముగా కొంతకాలమునకు ఈ ఉదారప్రేరణలు, ఈ విశాల

జీవితోద్దేశ్యములు, మన ప్రాచీన గ్రంథములందే కల ననియు, అవియన్నియు హైందవమతానుసారముగా నున్నవే యనియు గ్రహించి, సరియైనత్రోవకు వచ్చితిమి. మన పూర్వుల ప్రధానోద్దేశ్యములగూర్చిన గాఢవిమర్శఫలిత మును ఆచరణలోనికి తెచ్చుటయే ఇప్పుడు జరుగుచున్నపని! విశాలభావముల వహించుట, బహిరంగప్రాంతములందు ప్రవేశించుట, ఇతరులతో సమ్మేళన మగుట, సర్వజనసమ్మత ముగా వర్తించుట, మనకు గమ్యార్థములు. ఇంతవఱకును మనము రానురాను సంకుచిత హృదయులమై, అన్యుల సహవాసమునకు దూరులమై, మన శాస్త్రములలో చెప్పబడిన విధానములకు భిన్నముగా ప్రవర్తించుచు వచ్చితిమి.

మన మార్గమున అపాయములు చాల గలవు. ప్రపంచములోనికెల్ల మనమే మానవులమని తలంచు అత్యంత మూఢ భావము అందొకటి. భారతదేశము నెడ నాకెంత ప్రేమయున్నను, నే నెంతటి దేశాభిమానినైనను, మన పూర్వులయెడ నాకెంతటి పూజ్యభావమున్నను కూడ, ఇతర జాతులవారివలన మనము అనేకవిషయములను నేర్చుకొన వలసి యున్నామని నేను చెప్పక తప్పదు. మనము అందఱి పాదముల చెంతను కూర్చుండుటకు సంసిద్ధముగా నుండ వలయును. ఏలయన, ప్రతివాడును మనకు గొప్ప పాఠము లను నేర్పగలిగియే యున్నాడు. "కడజాతివానివలన నైనను, నీచపు పుట్టువుగలవానివలన నైనను, సుజ్ఞానమును స్వీకరింపుము. వానికి శుశ్రూషచేసి పరమార్థమును గ్రహింపుము" అని మన స్మృతికర్తయగు మనువు తెలుపు

చున్నాడు. మనము నిజముగా మనువుయొక్క యోగ్య సంతాన మగుదుమేని, వాని ఆజ్ఞల ననుసరించి నడవ వలయును. ఐహికధర్మములనుగాని, పారమార్థికధర్మములను గాని, మనకు బోధచేయగల ఎవరినుండియైనను సరే, నేర్చు కొనుటకు సంసిద్ధముగా నుండవలయును. అట్లయ్యును మనము గూడ ప్రపంచమునకు ఒక మహాధర్మమును బోధింప వలసి యున్నామనుటను మఱవరాదు. బయటి ప్రపంచ ముతో సంబంధము లేకుండ మనకు జరుగదు. అటుల జరుగ గలదని ఇన్నాళ్లును మూఢులమై తలచియుంటిమి. అందుకు ప్రాయశ్చిత్తముగా వేయేండ్లు బానిసతనమును అనుభ వించితిమి. మనము వెలుపలికిపోయి మన అనుభవములను ఇతరుల అనుభవములతో పోల్చి చూచుకొనకుండుటయు, మనచుట్టును ఏమి జరుగుచున్నదో గుర్తింపకుండుటయు, మన బుద్ధి భ్రష్టమైపోవుటకు గొప్ప కారణము! అందుకు శిక్ష ననుభవించితిమి. ఇంక నెన్నడును అటుల చేయమని చెంపలువేసికొందము. భారతీయులు దేశమును దాటి పోగూడదను నిట్టి మూఢ విశ్వాసములు అజ్ఞాన బాల లక్షణములు! నెత్తిమీద మొట్టి అట్టి వానిని తొలగింప వలయును. మీరు ఎంతెంతగా దేశమును దాటిపోయి ప్రపంచమందలి ఇతరజాతుల మధ్య సంచారము చేయుదురో, అంతంతగా మీకును మీ దేశమునకును క్షేమముకలుగును. ఈ విధముగా కొన్ని శతాబ్దములకు పూర్వమే మీరు చేసి యుండిన యెడల, మీపై రాజ్యముచేయవలయునని ఉబ లాటపడు ప్రతిజాతికిని అడుగులకు మడుగులొత్తు దుర్గతి

మీకు తప్పియుండెడిదే! చైతన్యముయొక్క ప్రధాన చిహ్నము వికాసము. మీరు సజీవులై యుండదలచితిరేని వికాసమును పొందవలయును. వికాసముపొందుట మానిన మరుక్షణమునసే మృత్యువు మిమ్ము కబళించివేయును. మీరు ప్రేమతో ప్రస్తావించినట్లు, నేను అమెరికాకును యూరపునకును వెళ్లితిని; జాతీయజీవనపునరుద్ధరణమునకును వికాసమునకును అదియే మొదటి చిహ్నమగుటచేత, నేను వెళ్లవలసివచ్చినది. ఈ జాతీయజీవనపునర్వికాసమును, అంతరంగికవిలసనమును, నన్ను విదేశములకు నెట్టుకొని పోయినవి. ఇంకను ఇదేవిధముగ వేలకొలది మందిని నెట్టుకొనిపోవును. ఈ జాతి సజీవమై నిలుచుటకు అట్లుజరుగవలసినదే! ఈ నూతనచైతన్యము జాతీయజీవన పునరుద్ధరణ చిహ్నములలో అతిప్రధానమైనది. ఈ నూతనచైతన్య వికాసమువలననే మానవజాతి సమష్టిజ్ఞానరాశికి మనవంతుగా సొసగవలసియున్న భాగము, సామాన్యప్రపంచోద్ధారణకు మన మర్పింపవలసియున్న కానుక, చెల్లింపబడుచున్నవి, ఇదొక క్రొత్తసంఘటనముకాదు. యుగయుగాంతరముల నుండి భారతీయులు కూపస్థమండూకములవలె ఈ దేశపు నాలుగుహద్దులలోపలనే సదా ముడుచుకొని కూర్చుండి యుండిరని మీలో ఎవరైనను తలతురేని, అది చాలపొర పాటు. అటుల మీరు తలంచినయెడల, మీ ప్రాచీనగ్రంథములను మీరు చదువలేదన్నమాట. ఈ జాతిచరిత్రమును మీరు సరిగా పరిశీలింపలేదన్న మాట. ఏ జాతియైనను సజీవమై యుండవలెనన్నచో, తనకు కలదాని నితరులకిచ్చి

తీరవలయును. నీవు ప్రాణదానము చేసినప్పుడే, నీ ప్రాణము నిలుచును. నీవు కైకొంటివా, దానికి బదులుగా ఇతరులకు ఇచ్చి తీఱవలయును. తప్పదు. ఇన్ని వేల సంవత్సరములనుండి మనము ఎటుల సజీవులమై యుండగల్గితిమనగా—తెలియని వారు ఎటుల అభిప్రాయపడినను—మనము ప్రపంచమునకు ఎప్పుడును ఇచ్చుచుంటిమి గనుకనే.

భారతదేశము చేయునది మతదానము! తత్త్వ శాస్త్రదానము! జ్ఞానదానము! పారమార్థికదానము! యుద్ధభటులు తనకు ముందు నడచి, తన మార్గమును నిరాటంకము చేయవలసిన యావశ్యకత మతమునకు లేదు. జ్ఞానము, వేదాంతము, రక్తప్రవాహములపైని తేలుచు పోవు నగత్యము లేదు. జ్ఞానము, వేదాంతము నెత్తురోడ్చుచున్న నరశరీరములపై అయఃపాదములతో నడచునవికావు. దౌర్జన్యముతో అవి గమనమును సాగింపవు. అవి శాంతి ప్రేమల నెడు తెక్కలపై మెల్లగా, చల్లగా, తేలియాడుచు వచ్చును. ఎల్లప్పుడును అటులనే జరుగుచు వచ్చినది. కాబట్టి మనము మరల ఈయవలసియున్నాము. "హిందువులగు మీరు చేసిన దేమున్నది? ఒక్కజాతినైనను ఎన్నడుగాని జయించినదిలేదే!" అని లండను నగరమున ఒక తరుణీమణి నన్నడిగినది. శూరుడును, వీరుడును, క్షత్రియుడును అగు ఆంగ్లేయుని దృక్పథమునుండి చూచిన యెడల ఆ మాట నిజమే—ఒక నరుడు ఇంకొకనిమీద సాధించిన విజయము మహాఘనకార్యమే. వాని దృష్టికి అది సత్యమే! కాని మన దృష్టికి అది అందుకు వ్యతిరేకమై

కాన్పించును. హిందూదేశపు గొప్పతనమునకు కారణమేమి అని, నాలో నేను ప్రశ్నించుకొనినప్పుడు, మన మెన్నడును ఇతరులపైబడి జయింపకుండుటయే అని నాకు సమాధానము తోచును. అదియే మన ఘనత! మన మతము ఇతర మతములను ఎన్నడును లోబఱచుకొనలేదని 'వివేకవంతులు' సైతము మన మతమును నిరసించుచుండుట మీరు అనుదినమును వినుచుందురు. కాని ఇతరమతములకంటె మన మతమే శ్రేష్ఠతరమైనదనుటకు ఇదే కారణమని నా మనస్సునకు తోచుచున్నది. మన మతము ఇతరమతములను జయింపగోరదు; అది రక్తపాతము గావింపదు; అందఱకు దీవనలను, శాంతిని, ప్రేమను, సానుభూతిని తెలుపు వాక్కులే దాని ముఖమునుండి సదా వెలువడుచుండును! ఇచ్చట—ఇచ్చట మాత్రమే—అద్భుతపరసహనాదర్శము ప్రప్రథమమున బోధింపబడినది! ఇక్కడ—ఇక్కడ మాత్రమే—సహనము, సానుభూతి అను మహాధర్మములు ఆచరణలో పెట్టబడినవి. ఇతరదేశములలో అవి సిద్ధాంత రూపమున మాత్రమే నిలిచిపోయినవి. ఈ దేశమునసే, ఈ ఒక్కదేశమునసే, హిందువులు మహమ్మదీయులకొఱకు మసీదులను, క్రైస్తవుల కొఱకు చర్చీలను, నిర్మించి యిచ్చినారు! కావున మన సందేశము అనేక పర్యాయములు ప్రపంచమునకు ప్రకటితమై యున్నదని మీరు కనుగొన గలరు. కాని ఈ ప్రకటనము నెమ్మదిగను, నిశ్శబ్దముగను, నిరాడంబరముగను జరిగినది. మన స్వభావమునకు, యోగ్యతకు, తగినట్లే ఈ ధర్మప్రచారముకూడ సాగినది.

మన ప్రత్యేకలక్షణము శాంతత, మౌనము. వాని వెనుక మహోద్భుతశక్తి కలదు గాని, అది దౌర్జన్యరూపము తాల్పదు. అది సర్వత్ర, భారతీయ సంకల్పముయొక్క-వశీకరణశక్తిరూపమున, నిశ్శబ్దముగా వ్యాపించును. విదేశీయుడు మన వాఙ్మయమును చదువబూనినయెడల, మొట్టమొదట అతనికి వెగటు కలుగును. వానిని తత్క్షణమే ఉట్టూతలూచి ఉద్రేకమును కల్పించి నెట్టుకొనిపోవు లక్షణములు మన వాఙ్మయమున కాన్పింపవు. యూరపియనుల దుఃఖాంతనాటకములను మన దుఃఖాంతనాటకములతో పోల్చిచూడుడు. వారివి అతిప్రవృత్తిపూరితములై క్షణకాలములో ఉద్రేకము కలిగించును. కాని ఆ ఉద్రేకము అణగిపోవగనే ప్రతిక్రియ ప్రారంభమగును; మీ మనస్సుల నుండి అంతయు అదృశ్యమగును; కడిగివేసినట్లగును. భారతీయుల దుఃఖాంతనాటకములు వశీకరణ మాంత్రికుని ప్రభావమువలె నిశ్చలముగను, నిశ్శబ్దముగను, నిగూఢముగను పనిచేయును. అవి చదివినకొలది మిమ్ము సమ్మోహితుల నొనర్చును. మీరు కదలలేరు; బందీకృతులై పోవుదురు! మన వాఙ్మయమును తాకుటకు సాహసించిన వాడెల్ల దానికి వశమై పోవును; సదా బందీకృతుడై పడియుండును!

కంటికి కనరాక చెవులకు వినరాక, మెలమెల్లగా రాలుచు, అత్యంతసుందరములగు లేగులాబీలను పుష్పింప జేయు, కోమలనీహారవర్షమువలె ప్రపంచ విజ్ఞానమునకు భారతదేశము ఒసగిన ఈవి నిరాడంబరముగా పనిచేయును;

నిశ్శబ్దముగా, ఎవ్వరికి తెలియరాకుండ—కాని సర్వసమర్థముగా—లోకవిజ్ఞానము నంతను పరివర్తనము చేసినది. అది ఎప్పుడు అటులచేసెనో ఎవ్వరికిని తెలియదు. ''భారతదేశములో గ్రంథకర్తల పేళ్లను తెలిసికొనుట చాల కష్టము'' అని ఒకరు నాతో పలికిరి. ''అదియే భారతీయుని ఉద్దేశ్యము!'' అని నేనంటిని. ప్రాచీన భారతీయ గ్రంథకర్తలు ఆధునికులవలె, తాము ప్రకటించువిషయములలో నూటికి తొంబదివంతున ఇతరగ్రంథకర్తలనుండి దొంగిలించుచు, పైగా సిగ్గులేక 'ఈ భావములన్నియు నావే' అని ఉపోద్ఘాతములు వ్రాసికొనుచుండువారుకారు. ఆ మహామేధాసంపన్నులు మానవజాతి హృదయములలో అద్భుత పరివర్తనము కల్పించు గ్రంథములను వ్రాసి, తమ పేరు నైనను అందు ఉదాహరింపక, తమ పుస్తకములను మాత్రము భవిష్యత్సంతానమునకు సంక్రమింపజేసి నిరాడంబరముగా మరణించుటతో తృప్తిపడిరి. మన తత్త్వశాస్త్రములను రచించిన గ్రంథకర్తలెవ్వరో ఎవరెఱుగుదురు? మన పురాణముల వ్రాసిన వారెవ్వరో ఎవరికి ఎఱుక? వారందఱును వ్యాసుడనియో, కపిలుడనియో, ఏదో యొక సామాన్య నామముతో వ్యవహరించుకొనిరి! వారలు సత్యముగా శ్రీకృష్ణుని బిడ్డలు! వారు నిజముగా గీతానుష్ఠానపరులు! ''కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన!'' (కర్మచేయుటకే నీకు అధికారము కలదుగాని, దాని ఫలమునకు నీకు అధికారములేదు) అను సూత్రమును అనుసరించి వారు వర్తించిరి!

ఈ విధముగా, భారతదేశప్రభావము ప్రపంచముపై పనిచేయుచున్నది. కాని దాని కొకసదుపాయము అవసరము. వర్తకపు సంబారముల వలెనే, భావములును ఎవరో ఒకరు సిద్ధముచేసిన మార్గముల వెంట మాత్రమే వ్యాపింప గలవు. ఒక చోటినుండి మఱొక చోటికి ప్రయాణము చేయవలె నన్నచో భావములకుకూడ మార్గములు సిద్ధమై యుండ వలయును. ప్రపంచచరిత్రలో ఒక మహాజాతి విజృంభించి, దిగ్విజయముగాంచి, ప్రపంచమందలి వివిధప్రాంతములను ఒక్కచో జతగూర్చినప్పుడెల్ల, ఆ మార్గముల వెంట భారతీయతత్త్వవిద్య ప్రవహించి, ప్రతిజాతియొక్క రక్తనాళముల లోనికి చొరబాటుచు వచ్చినది. బౌద్ధమతము అవతరించుటకు పూర్వమే భారతతత్త్వవిద్య విశ్వవ్యాప్త మగుచుండి నట్లు అనేక నిదర్శనములు చూపట్టుచున్నవి. బౌద్ధమత వ్యాప్తికి పూర్వమే చీనాలోనికిని, పశ్చాలోనికిని, తూర్పు సముద్రమునందలి ద్వీపగణములలోనికిని వేదాంతము వ్యాపించినది. గ్రీకుల ధీశక్తి ప్రాక్ప్రపంచమునంతను ఒకటిగా సమ్మేళనము గావించినప్పుడు, భారతీయ వేదాంతము కూడ వ్యాపించినది. తమ నాగరికతను గూర్చి క్రైస్తవులు ఎంతగా డంబములు కొట్టుకొన్నను, వారి మతము భారతీయతత్త్వశాస్త్రములోని స్వల్పాంశముల సముదాయము మాత్రమే! బౌద్ధమతము మిక్కిలి మహనీయ మైనదేగాని, అది మన మతమున నుద్భవించి, దాని కెదురు తిరిగి విడివడిన బిడ్డయే! క్రైస్తవమతము మన మతము ననుకరించునట్టి ఒక అతుకులబొంత! ఈ చక్రగతి మరల ప్రారంభ

మైనది. ప్రపంచమునందలి ఆయా భాగములను సమ్మేళనము చేయుచు ఆంగ్లసామ్రాజ్యాధికారము ప్రబలుచున్నది. ఇంగ్లీషువారిబాటలు పూర్వపు రోమనులబాటలవలె నేల మీద ప్రాకులాడుటతో తృప్తిపడక, మహాసముద్రములందు సైతము అన్నివైపులకును నాగలిచాళ్లవలె అనుదినము వ్యాపించుచున్నవి. ఒక మహాసముద్రమునుండి మఱొక మహాసముద్రమునకు ఇంగ్లాండుబాటలు నిరాటంకముగా పరుగులిడుచున్నవి. ప్రపంచమందలి ప్రతిదేశము ప్రతిఇతర దేశముతోడను లంకెవేసికొనుచున్నది. నూతన వార్తా హరునివలె విద్యుచ్ఛక్తి మహాద్భుతవ్యాపారమును నడపుచున్నది. ఈ పరిస్థితులన్నింటివలనను, భారతదేశము పునర్జీవముగాంచి ప్రపంచ పురోభివృద్ధికిని, నాగరికతావ్యాప్తికిని, తనవంతు దోహదముచేయుటకు సిద్ధముగా నున్నది. ప్రకృతి నన్ను నెట్టుకొని పోయినదో అన్నట్లు, నేను ఇంగ్లాండు అమెరికాలకు పోయి మతప్రచారము సాగించుట దాని ఫలితమే! భారతదేశము ప్రపంచమునకు ఆధ్యాత్మిక నాయకత్వము వహించు తరుణము ఏతెంచిన దని మనలోని ప్రతివారును గ్రహించియుండవలెను. మిక్కిలి అనుకూలముగా నుండు ఈవాతావరణములో భారతీయభావరాశి, వైదాంతికముగను, పారమార్థికముగను మఱొకసారి బయలువెడలి ప్రపంచమును జయింపవలసియున్నది. కాబట్టి మన కిప్పు డేర్పడిన సమస్య దినములు గడచినకొలది బ్రహ్మాండాకృతి తాల్చుచున్నది. మనదేశమును మాత్రము పునరుద్ధరించుకొన్న చాలుననుకొనుట తగదు. అదొక స్వల్ప

విషయము. నా బుద్ధికి ఊహాగమనముచేయుట అలవాటు. హైందవజాతి ప్రపంచమునంతను జయింపవలయునని నా సంకల్పము!

ప్రపంచములో అనేక దిగ్విజయములు సాధించిన గొప్పగొప్ప జాతులుగలవు; మనముగూడ ఒకప్పుడు విజయశీలురమే! మన విజయచరిత్ర మతవిషయకమును, అధ్యాత్మవిషయకమును అని భారతీయమహాచక్రవర్తి అశోకుడు అభివర్ణించి యున్నాడు. మరల ఇంకొకసారి భారతభూమి ప్రపంచమును జయింపవలసియున్నది. ఇదియే నా జీవితస్వప్నము! మీరుకూడ మీ మనస్సులలో అదే స్వప్నమును గాంచుచు, ఆ స్వప్నమును ప్రత్యక్షానుభవమునకు తెచ్చుకొనుటకై అహోరాత్రములు నిర్విరామముగా కృషిసలుపుదురుగాక! "ముందు మీ ఇల్లు చక్కబెట్టుకొనుడు. ఆ పిమ్మట రచ్చలకెక్కి 'రాచకార్యములు' నిర్వహింపవచ్చును" అని ఎవరైనను మీతో అనవచ్చును. కాని ఒక్కవిషయము మీకు స్పష్టముగా చెప్పుచున్నాను. మీ మంచి మీరు చూచుకొనుటకంటె ఇతరుల మంచికై కృషిసలుపుట వేయిరెట్లు పవిత్రకార్యము. సముద్రములను సైతము దాటిపోయి, వేదాంతభావములను విదేశభాషలలో ప్రచారముచేయుచు, అచ్చటిప్రజలకు సేవచేయుటే, మీకు మీరు చేసికొనగల ఉత్తమోత్తమసాహాయ్యము! ఇతరదేశములను మీ తత్త్వవిద్యలతో విజ్ఞానవంతముగ చేయుటకై మీరు చేయుప్రయత్నము మీ దేశమునకు ఎంతటి ఉపకారముచేయగలదో ఈ సభయే రుజువుచేయుచున్నది.

నా బోధలు భారతదేశముకొఱకుమాత్రమే అని హద్దు పెట్టుకొని నేను ఇంట గూర్చున్నచో, నేను ఇంగ్లాండు అమెరికాలకు పోయివచ్చుటచేత ఈ దేశమునకు కలిగిన లాభములలో పాతిక భాగమైనను కలిగియుండెడిది కాదు! మన కిప్పుడు పరమగమ్యము ఇదియే! భారతదేశము ప్రపంచమునంతను జయింపవలయును! మీలో ప్రతివాడును అందుకొఱకై సిద్ధపడవలయును. ప్రపంచ విజయముతప్ప, అంతకుతక్కువ మఱెద్దియు మనకక్కఱలేదు. అందుకొఱకై మనమందఱమును సన్నద్ధులముకావలెను. నరములు తెగునట్లు పెనగులాడవలెను. విదేశీయులు వచ్చి తమసేనలతో మనదేశమును ముంచివేయుచుండగాక, మీరు లక్ష్యముచేయవలదు! భారతపుత్రులారా! లెండు! మీ అధ్యాత్మత త్వముతో ప్రపంచమును జయింప రండు! 'ద్వేషమును ప్రేమయే జయింపగలదు. ద్వేషమే ద్వేషమును జయింపజాలదు' అను నుడి ప్రప్రథమమున ఈ భారత భూమియందేకదా ప్రకటింపబడినది! నాస్తికతయు, దాని అనర్థములును నాస్తికవాదముచే ఎన్నడును జయింపబడజాలవు. సేనలను సేనలతో జయింపబూనినచో అవి పెరిగిపోయి మానవజాతులను పశువులమందలుగా మార్చివేయును! పాశ్చాత్యప్రపంచమును వేదాంతమే జయింపవలయును. తమ జాతులు సురక్షితముగా నుండుటకు తమకు కావలసినది పారమార్థికతయే అని వారు నెమ్మది నెమ్మదిగా గ్రహించుచున్నారు. వారు దానికొఱకై ఎదురు చూచుచున్నారు; ఆతురపడుచున్నారు. అది యెందుండి వచ్చును?

భారతిమహర్షుల సందేశములను చేకొని, ప్రపంచమందలి ప్రతిదేశమునకును వెడలుటకు సంసిద్ధులుగానున్న పురుషు లెక్కడనున్నారు? అట్టి ధీరహృదయులు ధర్మప్రచారమున తోడ్పడుటకు కావలయును! అట్టి సాహసవంతులగు ప్రచా రకులు పరదేశములకుపోయి, ఉత్తమవేదాంతధర్మములను వెదజల్లవలయును! ప్రపంచమునకు వేదాంతబోధ అత్యా వశ్యకముగానున్నది. అది లేదేని ప్రపంచము వినాశము చెందును. పాశ్చాత్య ప్రపంచమంతయు నేడో రేపో భగ్ను మని మంటలు వెలిగ్రక్కనున్న అగ్నిపర్వతముఖమున నున్నది. రేపైనను అది పటాపంచలై పోగలదు. వారు ప్రపంచపు మారుమూలలకు సైతము పోయి గాలించినారు. ఎక్కడను వారికి శాంతి చిక్కలేదు. సౌఖ్యములను భోగ ములను పరిపూర్ణముగ అనుభవించి చూచి, అంతయు బూటకమని చివరకు గ్రహించినారు. భారతీయ వేదాంత మును పాశ్చాత్యహృదయములందు గాఢముగా నాటుకొను నట్లు ప్రచారముచేయుటకు ఇదియే మంచితరుణము! కాబట్టి చెన్న పురియువకులారా! ఈ మాటను జ్ఞప్తియందుంచు కొనుడని మిమ్ము మఱిమఱి కోరుచున్నాను. మనము దేశాం తరములకు పోవలయును; మన వేదాంతముతోడను, తత్త్వ శాస్త్రముతోడను లోకమును జయించి వేయవలయును. ఇంక మార్గాంతరము లేదు. మనము ఆపని చేసితీర వలయును; లేదా చావవలయును. మన జాతీయజీవనము నిలుచుటకును, అది ఉజ్జీవమై సత్త్వమయమై విరాజిల్లుట

కును, భారతీయ వేదాంతముతో లోకమును జయించుటయే ఏకైక మార్గము!

వేదాంతవిద్యతో ప్రపంచమును జయించుట అనగా, ఉజ్జీవన హేతువులగు ధర్మములను ప్రచారము చేయుటయే నా అభిప్రాయముగాని, అనేక శతాబ్దములనుండి మనము పట్టుకొని ఊగులాడుచున్న మూఢాచారము లన్నిటిని ప్రచారము చేయుట అని కాదు. వీనిని ఇక్కడే పెట్టికివేసి, కట్ట కట్టి ఆవల పారవేయవలయును. అప్పుడుగాని వానికిశాశ్వత వినాశము చేకూరదు. ఇవియే మనజాతి పతనమునకు కారణములైనవి. ఇవియే మన మెదడును మొక్కపఱచినవి. అట్టి మెదడు ఉన్నతములగు గంభీరభావములను సంకల్పింపజాలదు; దానికి స్వతంత్రయోచనాశక్తి యుండదు. అది నిర్వీర్యమై, మతము పేరిట చెల్లుబడియగుచున్న నానావిధక్షుద్రమూఢ భావములతో కలుషితమైయుండును. ఈ మెదడును గుఱించి మనము కొంచెము జాగ్రత తీసికొనవలయును. ఇక్కడ, భారతదేశమున, అపాయము లనేకము మన కంటిఎదుట గోచరించుచున్నవి. శుద్ధనాస్తిక వాదము ఒకపక్కమున! క్షుద్రమూఢాచారనిరతి రెండవపక్కమున! ఈ రెండు తిరుగలిరాళ్ళమధ్యను పడకుండ మనము తప్పించుకొనవలసి యున్నది. పాశ్చాత్యవిజ్ఞాన మనెడు మద్యమును త్రావిన కైపుతో, తనకు సమస్తమును తెలిసి పోయిన దనెడు ఘనుడు నేడు బయలు దేఱినాడు! ప్రాచీనఋషుల పేరు విన్నంతనే ఆతనికి నవ్వువచ్చును! హిందూవిజ్ఞాన మంతయు వాని దృష్టిలో పనికిరాని చెత్త! తత్త్వసిద్ధాంతములు పసి

పిల్లల పిచ్చికూతలు! మతధర్మములు బుద్ధిహీనుల వెఱ్ఱి అలవాట్లు! ఇక రెండవపక్షమున, అతివాదము చేయుచు అన్యులపొడ గిట్టని పండితుడు గలడు! ఆయన ప్రతిశకున మునకును బండెడు వ్యాఖ్యానములు రచించుచు కూర్చుండును; తన శాఖాసంప్రదాయమునకును, తన ఇష్టదేవతలకును, తన గ్రామసంబంధమగు ప్రతి మూర్ఖాచారమునకును తత్త్వసిద్ధాంతములను, వేదాంత ధర్మములను ఇంకను ఏవేవియో క్రోడీకరించుచుండును. అదియంతయు దేవునికే ఎఱుక! ప్రతిక్షుద్ర గ్రామాచారమును వానికి వైదిక ధర్మముగనే గోచరింపను! వాని అభిప్రాయములో—దాని నిర్వహణము మీదనే జాతీయజీవనమంతయు ఆధారపడి యున్నట్లుండును! ఈ రెండుపక్షములనుగూర్చియు మీరు అతి జాగరూకతతో మెలగవలయును. మీ రందఱును నాస్తికవాదులై పోయినను నా కిష్టమేగాని, మూర్ఖాచారములతో వెఱ్ఱులై పోవుటమాత్రము తగదు. ఏల యన, నాస్తికుని యందు చైతన్యముండును. వాని నొకరీతిగా సవరింప వచ్చును. కాని మూర్ఖావేశము పట్టువడెనా, మెదడు ధ్వంసమైపోయినట్లే! అదిపోయెనా, జీవితము భ్రష్టమై పోయినట్లే! ఈ రెంటినుండి జాగ్రత్తగా తప్పించుకొనుడు. ధైర్యవంతులును సాహసవంతులును మనకు ఇప్పుడు అవసరము. రక్తమునందు జవము, నరములందు సత్త్వము కావలయును. ఇనుమునుబోలు కండరములు, ఉక్కువంటి నరములు కావలయునే గాని నిలుకడలేక ఊరక జారిపోవు పిచ్చిఊహ లెందుకు, తగులబెట్టనా? మర్మమనునది యుండ

గూడదు. సత్యమతమున మర్మము లేదు. వేదములందుగాని, వేదాంతమునందుగాని, సంహితలలోగాని, పురాణములలోగాని, ఏమైన గుప్తత గలదా! పూర్వకాలపు ఋషులు తమ మతమును ప్రచారము చేయుటకై ఏమేని రహస్య సంఘములను నెలకొల్పిరా! తమ మహాధర్మములను మానవ కోటికి అందించునపుడు ఏ లాటి హస్తలాఘవమర్మముల నుపయోగించినట్లు ఎందేని వ్రాయబడియున్నదా! రహస్య ప్రచారము, మూఢవిశ్వాసము, దుర్బలతకు చిహ్నములు! పతనమునకు, మరణమునకు చిహ్నములు! కాబట్టి వాని విషయమై జాగ్రత్తగా నుండుడు. ధీరులై మీ కాళ్లమీద మీరు నిలబడవలెను. మన వేదాంతమునందు అత్యద్భుత విషయములు కలవన్నమాట సత్యము. మన పరిమితభావ ప్రమాణమునుబట్టి వానిని అలౌకికవిషయములని మనము పలుకవచ్చును. కాని వానిలో ఒక్క దానియందును నిగూఢత, మర్మము, రహస్యముకలవని చెప్పజాలము. మతధర్మములు రహస్యమైనవనిగాని, హిమాలయపర్వతశిఖరములపై చేరిన రహస్యసంఘముల సొత్తనిగాని, ఈ దేశమున పూర్వమెన్నడును పలుకబడి యుండలేదు. నేను హిమాలయ పర్వతములకు పోయితిని. మీరు పోలేదు. అవి యిక్కడికి చాలవందలమైళ్ళదూరము. నేను సన్న్యసిని. గడచిన పదునాలుగు సంవత్సరములనుండి పాదచారినై తిరుగుచున్నాను. ఈ రహస్యకూటములు ఎక్కడను లేవు. ఈ పిచ్చినమ్మకములు పెట్టుకొనకుడు—అంతకన్న మీరు కేవల నాస్తికులై పోవుటే మీకును మీ జాతికిని శ్రేయము. అపుడు

మీ బలము నిలిచియుండును. కాని ఇట్టివానివలన మీకు లభించునది భ్రష్టత్వమును మరణమును మాత్రమే! బుద్ధి పాటవముగలవారు ఈ మూఢవిశ్వాసములతో కాలము గడపుటయు, అసహ్యములగు పిచ్చినమ్మకములను సమర్థించుటకై అంతరార్థములు కల్పించుచు వృథాకాలయాపన చేయుటయు మానవజాతికే అవమానకరము! ధైర్యము వహింపుడు. ప్రతిదానిని ఆవిధముగా సమర్థించుటకై ప్రయత్నింపకుడు. మనలో చాల మూఢాచారములున్న మాట నిజమే. మన శరీరముమీద పొడమచ్చలు పడినవి; పుండ్లును గలవు. వీనిని రూపుమాపుకొనవలయును; శస్త్ర చికిత్స చేసికొనవలయును. వానిని పూర్తిగా నిర్మూలము గావింపవలయును. కాని ఇవి మనమతమును, మనజాతీయ జీవనమును, మనఆధ్యాత్మికతను ధ్వంసముచేయునవి కావు. ప్రతి సత్యధర్మసూత్రమును సురక్షితముగానే యుండును. ఈ పొడమచ్చలు ఎంత త్వరగా తొలగింపబడునో అంత శీఘ్రముగా, సత్యధర్మసిద్ధాంతములు అధిక తేజముతో ప్రకాశింపగలవు! వానిని అంటిపట్టుకొని యుండుడు!

ప్రతి మతమువారును తమమతమే విశ్వజనీనమని వాదులాడుచుందురు. విశ్వజనీనమత మెన్నటికిని కలుగదని నా భావము. ఒకవేళ అట్టిమతము కలదనుచో, మన మత మొక్కటి మాత్రమే అట్టిదని చెప్పుటకు కొంతయేని వీలున్నది. మతైమతమునకును అటువంటి అవకాశము లేదు. ఏలయన, తక్కిన మతములన్నియు ఎవరో ఒకపురుషుని మీద గాని, పురుషులమీద గాని, ఆధారపడి పుట్టినవి.

అవన్నియు చారిత్రక పురుషుడని తన్మతస్థులు వక్కాణించు ఒకానొక పురుషుని జీవితము చుట్టును అల్లబడినవి. వారు తమ మతమునకు ఏది బలము నిచ్చునని భావించుచున్నారో, అది నిజముగా దాని దౌర్బల్యమే! ఏలయన, ఆ పురుషుని గుఱించిన చారిత్రకగాథ సత్యముకాదని మీరు రుజువు చేసితిరేని, ఆ మతనిర్మాణ మంతయు నేల గూలి పోవును. ఈ గొప్ప గొప్ప మతనిర్మాతల జీవితాంశములలో సగ మైనను చారిత్రకముగా సత్యముకావని రుజువైనది. తక్కిన సగపాలు సంశయగ్రస్తమై ఊగులాడుచున్నది. అందుచే ఆ మతకర్తల పలుకులే ఆధారముగా గల మతధర్మములెల్ల రూపుమాసి, గాలిలో కలిసి పోవుచున్నవి! మనకును పురుష వరేణ్యు లెందఱో ఉన్నప్పటికిని మన మతధర్మములు వారిపై ఆధారపడినవి కావు. శ్రీకృష్ణుని మహిమ ఆయన వేదాంతబోధ చేయుటలో గొప్పవా డగుటవలననే కలిగినది కాని, వ్యక్తిత్వేన శ్రీకృష్ణుడగుటవలన కాదు. లేనిచో, బుద్ధుని నామమువలెనే కృష్ణుని నామముకూడ ఈ దేశమున క్రమక్రమముగా మాసిపోయి యుండును. మనము భక్తి గౌరవములు చూపునది సదా ధర్మసిద్ధాంతములకే గాని, నరులకు గాదు. నరులు మూర్తిమంతములయిన సిద్ధాంత ములుగామాత్రమే, అనగా ఆ సిద్ధాంతములకు నిదర్శన ములుగా మాత్రమే, ఆదరింప బడుచున్నారు. సిద్ధాంతములు సుస్థిరముగ నుండినయెడల ఇట్టి నరులనేకులు వేలకొలది, లక్షలకొలది, రాగలరు! ధర్మసిద్ధాంతము సురక్షితమై నిలిచిన యెడల, బుద్ధునివంటిపురుషులు వందలకొలది, వేల

కొలది, పుట్టుకొని రాగలదు! కాని సిద్ధాంతము ధ్వంసమై మఱపున బడిపోయి, జాతీయ జీవితమంతయు ఎవరోయొక 'చారిత్రకపురుషు'ని చుట్టును అల్లుకొనియుండజూచుచో, ఆ మతమునకు వినాశము తప్పదు! నరులపై ఆధారపడక, సిద్ధాంతములపై మాత్రమే ఆధారపడియుండు మతము మనది ఒక్కటే! అట్లని పురుషుల కవకాశము లేకపోలేదు. లక్షల కొలంది పురుషులకు అవకాశము కలదు. కాని అట్టివారిలో ప్రతివాడును, ఆ ధర్మసూత్రములకు నిదర్శనరూపముగా నుండవలయును. ఈ విషయమును మనము మఱవరాదు. మన సిద్ధాంతము లన్నియు సురక్షితముగా నున్నవి. వానిలో ప్రతిదానిని చెక్కుచెదరకుండ కాపాడి, కాలగతిని వచ్చు దుమ్ము ధూళి చేరకుండ, శ్రద్ధతీసికొనుట మన కర్తవ్యము. మనజాతికి మరల మరల అధోగతి పట్టినను, వేదాంతధర్మములు ఎన్నడుగాని కళంకితములు కాకుండ అట్లే నిలిచియుండుట అబ్బురమగు విషయమే! ఎంతటి దుష్టుడును వాని మీద దుమ్మెత్తి పోయుటకు సాహసింపలేదు. ప్రపంచములోనికెల్ల, చక్కగా కాపాడబడిన ధర్మశాస్త్రములు మనవి మాత్రమే! ఇతరుల గ్రంథములతో పోల్చిచూచిన యెడల, మన గ్రంథములందలి ధర్మోపదేశములసారమును నాశము చేయుటగాని, క్రొత్తకల్పనలను తెచ్చి వీనిలో చొప్పించుటగాని, వాక్యములు తికమకలుచేయుటగాని తటస్థింపలేదనియే చెప్పవచ్చును. నరునిబుద్ధిని పరమప్రాప్యమగు ఆదర్శము వైపునకు నడపుచు ప్రథమమున ఎట్లుండెనో అవి నేటికిని అట్లే యున్నవి.

వైదికసూత్రములకు వేర్వేఱు భాష్యకర్తలు వేర్వేఱు అర్థములను వ్రాసిరి. ఆ అర్థములను గొప్ప గొప్ప ప్రబోధకులు ప్రచారముగావించిరి. వానిని ఆధారము చేసి కొని అనేక శాఖాసంప్రదాయములు సృజింపబడినవి. వేదము లలో పరస్పరము విరుద్ధములైచూపట్టు భావము లనేకము కాన్పించును. పూర్తిగా ద్వైతభావముగల వాక్యములు కొన్ని గలవు. పూర్తిగా అద్వైతబోధకములగు నవియు మఱికొన్ని గలవు. ద్వైతవాదియగు భాష్యకర్త, అంత కన్న నేమియు చేయలేకపోవుటచేత, అద్వైతపరములగు వాక్యములను చిదుకగొట్టజూచును. వానికి ద్వైతపరమగు అర్థమును కల్పనచేయును. అద్వైతపక్షము వహించు భాష్యకర్తయు ద్వైతపరములగు వాక్యములను అదే తీరున ఆదరించును. ఇది వేదములయొక్క దోషముగాదు. వేదము లన్నియు సంపూర్ణముగ ద్వైతపరముగనే యున్న వని రుజువుచేయబూనుట బుద్ధిలేనిపని. అవన్నియు పూర్తిగా అద్వైతబోధకములే అని రుజువు చేయబూను టయు, అందుకు సమమగు బుద్ధిమాలినపనియే! అవి ద్వైత పరములుగను, అద్వైతపరములుగను, కూడనున్నవి. నూత నముగా లభించిన భావముల మూలమున మనము ఈ నాడు వానిని మునుపటివారికన్న సరిగా అర్థముచేసికొనగల్గు చున్నాము. బుద్ధియొక్క పరిణామమునకు ద్వైతాద్వైతపర ములగు భావనావిశేషములు రెండును అవసరములే అనియు, అందువలననే ఆరెంటిని వేదములు ఆదరించి బోధించుచుండు ననియు, నా యభిప్రాయము. అవి మానవజాతిని కరుణించి,

ఉన్నతగమ్యమును చేర్చునట్టి సోపానముల నన్నిటిని చూపు చున్నవి. ఆ సోపానములు పరస్పరవిరుద్ధములు కానే కావు. అదంతయు పసివారిని విభ్రాంతుల చేయుటకై ప్రయోగింపబడిన వ్యర్థపదజాలము కాదు. పసివాండ్ర కొఱకేగాక, వయసు వచ్చినవారికికూడ అవి అవసరమే! మన కొక శరీరము ఉండునంతకాలము, శరీరమును మన మును ఏక మనెడు అధ్యాస మనను పట్టుకొని యుండునంత కాలము, ఐదు జ్ఞానేంద్రియములు గలిగి మనము బాహ్య ప్రపంచమును చూచుచుండు నంతకాలము, సగుణబ్రహ్మము మనకు తప్పక అవసరమే! ఇట్టి భావము లన్నియు మనకు కలిగియుండునంతవఱకు, (శ్రీ) రామానుజాచార్యులవారు నిరూపించినట్లు, భగవంతునిగూర్చిన, ప్రకృతినిగూర్చిన, జీవాత్మనుగూర్చిన భావములన్నింటిని మనము స్వీకరింపవలసినదే! ఈమాటిలో ఏఒక్కదానినితీసికొన్నను, తక్కినరెంటినికూడ తీసికొని తీఱవలయును. గత్యంతరము లేదు. కాబట్టి బాహ్య ప్రపంచము నీకు గోచరించుచున్నంతకాలము, సగుణదైవతము, సగుణజీవాత్మ లేవనుట కేవలము ఉన్మాదము. కాని, మానవబుద్ధి తన హద్దులనుదాటి, ప్రకృతినికూడ దాటి, 'అచ్చోటును చేరజాలక, వాక్కు మనస్సుతోసహా వెనుకకు తిరిగి వచ్చును" అని శ్రుతిలో వర్ణింపబడిన క్షేత్రములు చేరు తరుణములు మహాపురుషుల జీవితములం దొక్కొక్కసారి రావచ్చును. "అక్కడికి కన్నులు చేరజాలవు; వాక్కు చేర జాలదు; మనస్సును చేరజాలదు." "మనము దానిని ఎఱుగుదు మనిచెప్పజాలము; ఎఱుగ మనియు చెప్పజాలము".

నరుని ఆత్మ ఇట్లు పరిమితుల నన్నింటిని అతిక్రమించిన ఋణ ముననే ''నేనును ఈ విశ్వమును ఒక్కటే'', ''నేనును బ్రహ్మమును ఒక్కటే'' అనెడు అద్వైతభావము అతని ఆత్మయందు మెఱపువలె తళుక్కుమనును. ఈ ఎఱుక జ్ఞానమువలనను, తత్త్వవిచారమువలనను మాత్రమేగాక, ప్రేమమహిమవలన కూడ కొంతవఱకు లభించును. శ్రీకృష్ణుడు అదృశ్యుడు కాగా, గోపికలు అతనిం గాంచలేక, మిగుల దుఃఖితలై కొంతవడికి వారి మనస్సులలో శ్రీకృష్ణభావము బలీయముకాగా, ప్రతి గోపికయు తన తనువును మఱచి, తానే శ్రీకృష్ణుడని భావించి, అతనివలె అలంకరించుకొని అతనివలెనే లీలలు సలుప నారంభించినట్లు భాగవతమున వర్ణింపబడినది. కాబట్టి భక్తిద్వారమున కూడ ఇట్టి అద్వైత భావము లభ్యముకాగలదని మనము తెలిసికొనవలయును. సూఫీమతమునకు చెందిన పర్షియాదేశపు ప్రాచీనకవి యొకడు తన కావ్యమొకదానిలో ఇట్లు వ్రాసెను: ''నేను నా ప్రియు రాలికడకు పోయితిని. తలుపు మూసియుండెను. తలుపు తట్టితిని. 'ఎవరక్కడ' అను ధ్వని లోనుండి వినవచ్చెను. 'నేనే' అని మారుపల్కితిని. తలుపు తెఱవబడ లేదు. రెండవసారి తలుపు తట్టితిని. 'ఎవరక్కడ' అను వెనుకటి ధ్వనియే విన వచ్చినది. నేను ఫలానా వాడనని పల్కితిని. తలుపు తెఱవ బడలేదు. మూడవసారి తట్టితిని. 'ఎవరక్కడ' అనెడు ఆ ధ్వనియే వినవచ్చినది. 'ప్రేయసీ! నేను నీవే!' అంటిని. తలుపు తత్‌క్షణమే తెఱవబడినది!''

అనగా, పెక్కు అంతరువులు కలవు. కావున మనము వానిని గుఱించి వాదులాడ నవసరము లేదు. ప్రాచీన వ్యాఖ్యానకర్తలందు విభేదములున్నను మనమెల్లరము వారిని పూజించితీఱవలసినదే. ఏలయన, జ్ఞానమునకు పరిమితి లేదు. ప్రాచీనకాలమందుగాని, ఆధునికకాలమందు గాని, సర్వజ్ఞత్వము ప్రత్యేకముగా ఒకరి సొత్తుగాదు. పూర్వకాలమున జ్ఞానసిద్ధులును, ఋషులును ఉన్నట్లే ఇప్పుడును అట్టివారు చాలమంది యుందురనుట నిశ్చయము. పూర్వకాలమున వ్యాసులు, వాల్మీకులు, శంకరాచార్యులు ఉండినయెడల, మీలో ప్రతియొకరును ఒక శంకరాచార్యులు ఎందుకు కాకూడదు? మన మతములో మీరు సదా జ్ఞప్తి నుంచుకొనవలసిన మఱొక విశేషాంశము కలదు. తక్కిన మతగ్రంథములన్నింటిలో ఈశ్వరవాణి ప్రమాణముగా చెప్ప బడుచున్నది. ఆ వాణి ఏకొలదిమంది పురుషులకు మాత్రమే వినబడెను. వారినుండి ఆ ధర్మములు ప్రజాసామాన్యమునకు వచ్చినవి. మనమందఱమును వానిని శిరసావహింపవలెను. సత్యమును ఏసుక్రీస్తు దర్శించెను. కావున మనమందఱమును వానియెడల విధేయత చూపవలసినదే! మన మతమునం దట్లుగాక పూర్వకాలమున మంత్రద్రష్టలగు ఋషులకు లభించినట్లే అనంతరకాల ఋషులందఱకు కూడ సత్యజ్ఞానము లభింపగలదు. ఆ సత్యము ఊరక అదేపనిగ ప్రసంగములు చేయువారికిగాని, గ్రంథములకు గ్రంథములు కంఠస్థము చేయువారికిగాని, పండితులకుగాని, భాషాశాస్త్రవేత్తలకు గాని లభింపదు! అది మంత్రద్రష్టలకే లభించును. అత్యధిక

ప్రసంగములచేతను, అత్యున్నతబుద్ధివిశేషముచేతను, తుదకు నిరంతర శాస్త్రపఠనముచేతను గూడ ఆత్మను పొందలేము. శాస్త్రములే అటుల చెప్పుచున్నవి. వేదాధ్యయనమువలన కూడ మనము ఆత్మను చేరజాల మట! ఇట్టి సాహసవాక్కును ఏ ఇతరుల మతగ్రంథములందైనను మీరు కనుగొనగలరా? మీరు మీ హృదయములను వికసింపజేసికోవలయును! మత మనగా చర్చికిపోవుటగాదు; ముఖమున బొట్లు పెట్టుకొనుట గాదు; వేషములు వేసికొనుటయుకాదు. ఇంద్రధనస్సునందెన్ని వర్ణము లున్నవో అన్నింటితోను మీ శరీరములకు రంగులు పూసికొందురుగాక; మీ హృదయము వికసింపని యెడల, మీకు బ్రహ్మసాక్షాత్కారము కాని యెడల, సర్వమును వ్యర్థమే! హృదయమునకు సరియైన వర్ణము లభించినయెడల ఎట్టి బాహ్యవర్ణముతోడను అక్కఱ యుండదు. అదియే సత్యమగు పారమార్థికసిద్ధి. రంగులు మొదలగునవి అన్నియు, మనకు సహకారములుగా నుండునంతకాలము మంచివే! అంతవఱకు అన్నింటికిని స్వాగతము చెప్పుదము. కాని ఒకదశలో అవి భ్రష్టములై పోయి సహకారములగుటకు బదులు ప్రతిబంధకములుగా మాఱును. అప్పుడు నరుడు మతమును బాహ్యవిషయములతో అభిన్నముగా భ్రమించును; దేవాలయమును దర్శించుటే పరమార్థజీవనమై పోవును; పురోహితునకు దానము చేయుటే మతధర్మాచరణమై పోవును. ఇట్టివి అపాయకరములు, అనిష్టకరములు. ఇట్టివానిని తత్క్షణము త్యజింపవలెను—మన బాహ్యేంద్రియజ్ఞానము సైతము మతము కాదని శాస్త్ర

ములు పదేపదే ఘోషించుచున్నవి. ఆ నిర్వికారబ్రహ్మము సాక్షాత్కారమగునట్లు చేయునదియే మతము! దానినే ప్రతివాడును అనుసరింపవలెను. ఎవడు సర్వాతీతసత్పదార్థమును సాక్షాత్కరింపజేసికొనునో, ఎవడు స్వతత్త్వమునందే ఆత్మను ప్రత్యక్షము చేసికొనునో, ఎవడు భగవంతుని ముఖాముఖిని చూచునో, ఎవనికి సర్వమునందును బ్రహ్మము మాత్రమే కాన్పించునో, అట్టివాడే ఋషి. నీవు అట్టి ఋషివిగా మాఱువఱకును నీకు మతమనునది లేనట్లే! అప్పుడు మాత్రమే మతము ప్రారంభము కాగలదు. అంత వఱకు జరుగునది మతము కొఱకై సన్నాహము మాత్రమే. ఈ సన్నాహము పూర్తియైనగాని మతోదయముకాదు. ఇప్పుడు నీవు బుద్ధివ్యాయామమును, శారీరకవ్యాయామమును మాత్రము పొందుచున్నావని అర్థము.

"మోక్షమునుగోరు ప్రతివాడును ఋషిత్వదశను సాధింపవలయును; మంత్రద్రష్టకావలయును; ఈశ్వరసాక్షాత్కారము పొందవలయును" అని మన మతము వివరముగను సుస్పష్టముగను విధించుచున్నది. 'మోక్షము' అనగా అట్టిది! మనశాస్త్రములు విధించు ధర్మమదియే! మన శాస్త్రములను మనము స్వయముగా పరిశోధింపవలయును; స్వయముగా వాని అర్థమును గ్రహింపవలయును; మనకు కావలసిన దానిని విచక్షణచేసి మనంతట మనమే సత్యమును గ్రహింపవలయును. ఇదియే చేయవలసిన పని. ప్రాచీన ఋషివరులు సాధించిన మహాకార్యములను తలంచి వారియెడ మనము పూజ్యభావము చూపవలయును. ఈ పురాతన

ఋషులు చాలగొప్పవారు. కాని మనమువారికన్నను గొప్ప వారము కావలెను. వారు పూర్వకాలమున ఘన కార్యములను సాధించిరి. మనము వానిని మించిన ఘనతర కార్యములను సాధింతము. ప్రాచీనభారతదేశమున వందల కొలది ఋషులు ఉండెడివారు, మనకును లక్షలకొలది ఋషులు ఏర్పడుదురు—ఏర్పడి తీరుదురు. ఈ విషయమును మీలో ప్రతివాడును ఎంతత్వరగా, గాఢముగా విశ్వసించునో, భారత దేశమునకు అంత మేలుకలుగును! ప్రపంచమునకు అంత శ్రేయస్సుకలుగును! మీరు దేనిని విశ్వసింతురో అదిగా మీరు మారెదరు! మీరు ఋషులమని విశ్వసించినయెడల, రేపే మీరు ఋషులు అగుదురు! మిమ్ము అడ్డుపెట్టునది లేనేలేదు! చూచుటకు పరస్పరము విరుద్ధములుగా నుండి, ఒకదానితో నొకటి పోరాటములు సలుపుచుండు మన సంప్రదాయము లన్నింటికిని సమముగా వర్తించు సిద్ధాంత మేదేని కలదేని, అది 'సమస్త తేజోవైభవము, శక్తి, పవిత్రత, ఆత్మలో ఇదివఱకే కల'వనెడు సిద్ధాంత మొక్కటే! శ్రీరామానుజాచార్యుల సిద్ధాంతప్రకారము ఆ జీవాత్మ ఒక్కొక్కప్పుడు సంకోచము పొందుచు, ఒక్కొక్కప్పుడు వికాసముపొందుచుండును. శంకరాచార్యుల సిద్ధాంతము ప్రకారము అది భ్రాంతిలో పడును. ఇంతియే భేదము. ఈ భేదము లుండిన నుండనిండు. వ్యక్తరూపమున గాని, అవ్యక్తరూపమునగాని, జీవాత్మయందు శక్తి గలదనెడు సత్యమును అందఱును ఒప్పుకొనుచున్నారు. మీరు దీని యందు ఎంత త్వరలో నమ్మకము కుదురునో, మీ కంత

శ్రేయస్కరము! మీలో సర్వశక్తి యున్నది! మీరు చేయ లేనిది లేదు! లేనేలేదు. ఆత్మవిశ్వాసము వహింపుడు! దుర్బలురమని నమ్మబోకుడు! వెడగులమని భావింపకుడు. మీకు ఎవరును దారిజూపనక్కరలేదు. మీయంతట మీరే దేనినైనను చేయగలరు. మీయందు సర్వశక్తి యున్నది! లేచి నిలబడుడు! మీయందు నిగూఢమైయున్న దివ్య తేజమును ప్రకటింపుడు!!

తప్పొప్పుల పట్టి

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
9	8	సిద్ధాంతములే	సిద్ధాంతములే
16	22	చెప్పవలసి	చెప్పవలసి
24	4	భిన్నభిన్న	భిన్నభిన్న
135	16	కలిగిన్నుడు	కలిగినప్పుడు
137	24	Barrows)	(Barrows)
150	3	'ఒక్కరమే.' అని	'ఒక్కరమే' అని
151	22	దేవతలందును.	దేవతలందును,
173	18	త్రేత్రిమహారాజు	త్రేత్రీమహారాజు
246	10	వారికంటె.	వారికంటె,
261	1	పలసినదే	వలసినదే
289	4	యాంతి	యాన్తి
318	10	గోచరింనును	గోచరించును
,,	11	జీననమంతయు	జీవనమంతయు